
'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 49


SUNDAY Special

ఆదివారం 11-5-2025


8లో

వీరమాతకు వందనం

యుద్ధంలో బిడ్డను కోల్పోయిన దుఃఖం ఒకవైపు.. 'దేశమాత కోసం నా బిడ్డ ప్రాణత్యాగం చేశాడు' అనే గర్వం ఒకవైపు.. ఎంతో మంది వీరమాతలు.. అందరికీ వందనం. మదర్స్‌డే సందర్భంగా ప్రత్యేక కథనం.


12లో

'మే'లోనే ఐపీఎల్ ముగించాలని..!


భారత్, పాక్ యుద్ధానికి సంబంధించి తాజా పరిణామాల నేపథ్యంలో ఐపీఎల్ నిర్వహణకు బీసీసీఐ సిద్ధమవుతున్నట్లు సమాచారం. కేంద్రం అనుమతి ఇస్తే మే 15 నుంచే మ్యాచ్‌లు జరిగే అవకాశముందని తెలిసింది.

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

విరమణ.. ఉల్లంఘన

పాకిస్తాన్ రెండు నాల్కల ధోరణి

- కాల్పుల విరమణకు ఒప్పందం
- కోరి మరీ కుదుర్చుకున్న దాయాది
- డీజీఎంఓ స్థాయి చర్చల్లో అంగీకారం
- సాయంత్రం ఐదింటి నుంచే అమల్లోకి
- కాసేపటికే మళ్లీ దాడులకు దిగిన పాక్
- క్షిపణులు, డ్రోన్లు, సరిహద్దుల్లో కాల్పులు
- దుర్మార్గ వైఖరిపై మండిపడ్డ భారత్
- అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాం
- తక్షణం ఒప్పందానికి కట్టుబడండి
- విదేశాంగ కార్యదర్శి మిస్రీ హెచ్చరిక
- ఒప్పందం కుదిర్చింది అమెరికానే
- అంతకుముందు
- ట్రంప్ అనూహ్య ప్రకటన
- ద్వైపాక్షిక ఒప్పందమేనన్న కేంద్రం


శనివారం రాత్రి శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ ప్రాంతంలో పాకిస్తాన్ డ్రోన్లను నిర్వీర్యం చేస్తున్న భారత గగనతల రక్షణ వ్యవస్థ

న్యూఢిల్లీ/వాషింగ్టన్/ఇస్లామాబాద్

కయ్యానికి కాలుదువ్విన దాయాదికి నాలుగు రోజుల్లోనే తత్వం బోధపడింది. సాయుధ ఘర్షణకు తెర దించుదామంటూ భారత్‌తో కాళ్లబేరానికి వచ్చింది. దాంతో ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు ప్రభుత్వాలూ దాన్ని ధ్రువీకరించాయి. తమ మధ్యవర్తిత్వమే ఇందుకు కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా భారత్ దాన్ని తోసిపుచ్చింది. పాక్ విజ్ఞప్తి మేరకే ద్వైపాక్షిక చర్చల ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రకటించింది. ''శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్ర తలాల్లో పూర్తిస్థాయిలో కొనసాగుతుంది'' అని విదేశాంగ కార్యదర్శి విక్రం మీడియాకు వెల్లడించారు. కానీ కాసేపటికే పాక్ వంకర బుద్ధి ప్రదర్శించింది. శనివారం రాత్రి ఏడింటి నుంచీ మరోసారి దాడులకు దిగింది. సరిహద్దుల గుండా మళ్లీ డ్రోన్ ప్రయోగాలకు, కాల్పులకు తెగబడింది. కోరి కుదుర్చుకున్న విరమణ ఒప్పందానికి గంటల వ్యవధిలోనే తూట్లు పొడిచి తాను ధూర్తదేశాన్నేనని మరోసారి నిరూపించుకుంది. ఈ పరిణామంపై భారత్ మండిపడింది. రాత్రి 11 గంటలకు మిస్రీ మరోసారి మీడియా ముందుకొచ్చారు. ఓవైపు విరమణ అంటూనే మరోవైపు సరిహద్దుల వెంబడి పాక్ తిరిగి దాడులు, కాల్పులకు దిగిందంటూ ధ్వజమెత్తారు.

ఒప్పందం కుదిరిందన్న ట్రంప్

పాక్ దొంగ నాటకాల నడుమ శనివారం రోజంతా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి దాటేదాకా పాక్ సైన్యం క్షిపణి, డ్రోన్ దాడులు, సరిహద్దుల వెంబడి కాల్పులు కొనసాగించింది. వాటికి దీటుగా బదులిచ్చిన భారత్ శనివారం తెల్లవారుజాము నుంచీ తీవ్రస్థాయిలో ప్రతి దాడులకు దిగింది. ఆరు పాక్ వైమానిక, రెండు రాడార్ కేంద్రాలను నేలమట్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇరుదేశాల నడుమ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనూహ్య ప్రకటన చేశారు. సొంత సోషల్ మీడియా హ్యాండిల్

మిగతా 6వ పేజీలో ▶

కాల్పుల విరమణ ఒప్పందాన్ని గంటల్లోనే పాక్ ఉల్లంఘించింది. ఇది అత్యంత దుర్మార్గం. ఇందుకు పూర్తి బాధ్యత ఆ దేశానిదే. దీన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాం. మతిలేని చర్యలను ఇకనైనా కట్టిపెట్టి కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ పూర్తిస్థాయిలో కట్టుబడాలి. లేదంటే తీవ్రస్థాయిలో ప్రతి చర్య తప్పదు. దాడులను దీటుగా తిప్పికొట్టాల్సిందిగా సైన్యానికి పూర్తిస్థాయి ఆదేశాలిచ్చాం.



\- విదేశాంగ కార్యదర్శి మిస్రీ

6లో

ఇక ఏ ఉగ్రదాడైనా యుద్ధచర్యే..

భారత ప్రభుత్వం హెచ్చరిక

- ఇకపై దేశంలో ఎక్కడ ఉగ్ర దాడులు జరిగినా వాటిని భారతప్రభుత్వంపై యుద్ధంగా భావిస్తామని, అందుకు అనుగుణంగా దీటుగా స్పందిస్తామని కేంద్రం ప్రకటించింది.

మిగులుపై గుబులు!

ఉపాధ్యాయుల రేషనలైజేషన్‌లోనూ మెలికలు

బదిలీల్లో సీనియర్లకు తీవ్ర అన్యాయం

- స్టేషన్ పాయింట్ల కేటాయింపుపై ఆందోళన
- జీవో నంబర్ 47 ప్రకారం బదిలీలు చేపట్టాలని డిమాండ్
- పాత, కొత్త పాఠశాలల సర్వీసును పరిగణనలోకి తీసుకున్న గత ప్రభుత్వం
- ఇప్పుడూ అదే రీతిలో సర్వీసు పాయింట్లు ఇవ్వాలంటున్న మిగులు టీచర్లు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్దుబాటు గుబులు రేపుతోంది. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ మేరకు బదిలీల ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. అయితే, గత ప్రభుత్వంలో చేసిన జీవో 117ను రద్దు చేసే ప్రయత్నంలో భాగంగా విడుదల చేసిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ నిబంధనలతో రాష్ట్రంలో వేలాది మంది ఉపాధ్యాయులు మిగులు (సర్‌ప్లస్) ఏర్పడుతున్నట్లు ఆందోళన వ్యక్తమవుతోంది. నిబంధనల మేరకు ప్రస్తుతం ఉపాధ్యాయులు పని చేస్తున్న పాఠశాలలోనే ఎనిమిదేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వ నిలకడలేని కొత్త నిబంధనలతో మిగులు సమస్య ఏర్పడింది. 2023లో ఉపాధ్యాయ బదిలీల్లో ఈ సమస్య లేదని, జీవో నంబర్ 47 ప్రకారం మిగులు ఉపాధ్యాయులకు పాయింట్ల కేటాయింపులో సమన్యాయం పాటించి న్యాయం చేశారని

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

వీర సైనికా.. మా గుండెల్లోనే ఉంటావిక!



జమ్మూ కశ్మీర్‌లో పాక్ ముష్కరుల దాడిలో మరణించిన వీరజవాన్ మురళీ నాయక్ భౌతికకాయాన్ని శనివారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలో ఆయన స్వగ్రామమైన కల్లితండాకు తీసుకువచ్చారు. దారి పొడవునా వేలాది మంది ప్రజలు అమర వీరుడికి జోహార్లు అర్పించారు. గ్రామస్తులు కన్నీటితో స్వాగతం పలికారు.
వివరాలు 2లో ▸

గంగమ్మకు తిరుమల వెంకన్న సారె



శ్రీ వేంకటేశ్వరస్వామి చెల్లెలిగా పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మకు శనివారం తిరుమల శ్రీవారి సారె సమర్పించారు. వివిధ వేషధారణలు, కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యాల నడుమ శోభాయాత్రగా గంగమ్మతల్లి ఆలయానికి తీసుకెళ్లారు. గంగమ్మ జాతర ప్రారంభమైన నాలుగో రోజున శ్రీవారి సారె సమర్పించడం ఆనవాయితీ.
వివరాలు 13లో ▸

నేటి నుంచి మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఈనెల 11 నుంచి 3 రోజుల పాటు గిరిజనుల ఇలవేల్పు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాలు రాష్ట్ర గిరిజన జాతరగా గుర్తింపు పొందాయి.
వివరాలు 5లో ▸

భారత్ 'పాంచ్ పటాకా'



ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నమెంట్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్లు 2 స్వర్ణాలు, ఒక రజతం, 2 కాంస్యాలు కైవసం చేసుకున్నారు. ఏపీకి చెందిన జ్యోతి సురేఖతో కూడిన భారత మహిళల కాంపౌండ్ జట్టు రజత పతకం సాధించింది.
వివరాలు 12లో ▸



పేదల 'ఉపాధి'పై దెబ్బ

శ్రామికులకు కూలీ డబ్బుల్లేవ్.. ఉద్యోగులకు జీతాల్లేవ్

3 నెలలుగా జీతానికి నోచుకోని 15 వేల మంది ఉద్యోగులు, సిబ్బంది

- 27 లక్షల కుటుంబాలకు రూ.800 కోట్ల కూలీ డబ్బులు బకాయి
- కూటమి ప్రభుత్వ హయాంలో పెరిగిన రాజకీయ జోక్యం
- ఇష్టారాజ్యంగా సిబ్బంది తొలగింపు.. నియామకాలు
- అన్నీ కలిపి వేసవిలో పేదలకు పనుల కల్పనపై ప్రభావం
- గత ఏడాది ఒక్క ఏప్రిల్‌లోనే ఆరు కోట్ల పని దినాలు
- ఈ ఏడాది గత 40 రోజులుగా కల్పించింది 4.41 కోట్ల పని దినాలే

14లో

• రెడ్‌బుక్ అండతో 'ఖాకీ' కావరం

కారు లోంచి లాగి.. తోసేసి..

మాజీ మంత్రి, బీసీ నేత విడదల రజిని పట్ల అనుచిత ప్రవర్తన

రెచ్చిపోయిన చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు

మాట్లాడితే నీపైనా కేసు పెడతానని బెదిరింపు

- ఆమె అనుచరుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఏ కారణంతో అరెస్టు చేశారని అడిగినందుకు దౌర్జన్యం
- మొన్న రాత్రి కంతేరులో ఎస్సీ మహిళా ఎంపీటీసీ సభ్యురాలి అరెస్ట్
- 2 నిమిషాల్లో దుస్తులు మార్చుకొని వస్తానన్నా వినిపించుకోని వైనం
- నైటీలోనే బలవంతంగా జీపులోకి ఎక్కించిన పోలీసులు
- రెడ్‌బుక్ రాజ్యాంగానికి అద్దం పట్టిన ఘటనలు



మాజీ మంత్రి విడదల రజినితో అనుచితంగా ప్రవర్తిస్తున్న చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు

చిలకలూరిపేట: పాలకులు రెడ్‌బుక్ మంత్రం జపిస్తుంటే కొంత మంది పోలీసు అధికారులు అందుకు వంత పాడుతూ సభ్యత సంస్కారాలు మరచి నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు. మాజీ మంత్రి, బీసీ నేత, వైఎస్సార్‌సీపీ నాయకురాలు అని కూడా చూడకుండా విడదల రజిని పట్ల చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు రెచ్చిపోయి అనుచితంగా ప్రవర్తించారు. ఎక్కువగా మాట్లాడితే నీపైనా కేసు పెడతానంటూ బెదిరించారు. చెబుతుంటే అర్థం కావడం లేదా.. పక్కకు తప్పుకోండంటూ హూంకరించారు. ఓ దశలో రజినిని కారులోంచి పక్కకు లాగి తోసేసి.. ఆయన కారులోకి ఎక్కారు. నడిరోడ్డుపై సీఐ బరితెగింపు చూసి

మిగతా 3వ పేజీలో ▶

ఏడాది కావస్తున్నా ఉద్యోగులకు

చేసిందేమీ లేదు

- 'కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా ఉద్యోగులకు చేసిందేమీ లేదు. ఆర్థిక అంశాలు అటుంచితే ఆర్థికేతర పీఆర్సీని కూడా నియమించలేదు. పెండింగ్ డీఏల్లో ఒక్కటీ ఇవ్వలేదు. ఉద్యోగులకు నాయకులుగా సమాధానం చెప్పుకోలేని స్థితిలో ఉన్నాం' అని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.



- వివరాలు 2లో

27న కేరళకు నైరుతి

ఈసారి ముందుగానే పలకరించనున్న రుతుపవనాలు



భారత వాతావరణ శాఖ అంచనా

- 2009 తర్వాత తొలిసారి మేలోనే రుతుపవనాలు!
- ఈ ఏడాది నైరుతి సీజన్‌లో దేశంలో సాధారణం కంటే ఎక్కువగానే వర్షాలు కురుస్తాయని ఇప్పటికే పేర్కొన్న ఐఎండీ

2లో



సౌందర్యలహరి

- హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ వేడుకలు
- తమను తాము పరిచయం చేసుకున్న 109 దేశాల కంటెస్టెంట్లు
- గోకులంలో గోపిక వస్త్రధారణతో అలరించిన మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా

14లో


ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడే

సాక్షి మీడియాపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి: ఐజేయూ జాతీయ అధ్యక్షుడు వినోద్ కోహ్లి



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులను వేధించడం సరికాదని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) హితవు పలికింది. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఆయన ఇంట్లో సోదాలు చేయడం ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడే అని ఐజేయూ జాతీయ అధ్యక్షులు వినోద్ కోహ్లి పేర్కొన్నారు. సాక్షి మీడియాపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించారు. సాక్షాత్తు పత్రికా సంపాదకులను టార్గెట్ చేసుకుని దాడి చేయడం శోచనీయమన్న కోహ్లి... ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల విషయంలో వైఖరి మార్చుకోవాలని సూచించారు.

ఎన్నికల హామీల అమలెప్పుడు?



- కూటమి పార్టీలు గెలుపు కోసం అనేక హామీలిచ్చాయి
- అధికారంలోకి వచ్చాక వాటి గురించి ప్రస్తావనే లేదు
- ఏడాదైనా గత ప్రభుత్వంపై విమర్శలే తప్ప అభివృద్ధి లేదు
- పవన్ కళ్యాణ్ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు
- జర్నలిస్టులపై దాడులు, కేసులు పెట్టడం సరికాదు
- మీడియా స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు
- రాష్ట్రంలో ఫాసిస్టు పాలన.. విద్య, వైద్యం, సంక్షేమమే లేదు
- 'సాక్షి'తో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

2లో

ఇదండీ సంగతి



ఆల్‌రెడీ పాలన స్టార్ట్ అయినప్పటి నుంచి హామీలు అమలు చేయకుండా చాలా 'స్మార్ట్'గానే వ్యవహరిస్తున్నాం కదా సార్!

క్లుప్తంగా...

తిరుమలలో మాక్ డ్రిల్

ఎన్ఎస్‌జీతో కలిసి పాల్గొన్న ఆక్టోపస్



ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్

తిరుపతి క్రైమ్: తిరుమలలో శనివారం ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. శనివారం సాయంత్రం తిరుమలలోని పీఏసీ–3 (యాత్రికుల వసతి సముదాయం)తో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తుల భద్రత, ఆలయ భద్రత దృష్ట్యా ఆక్టోపస్ దళాలు మాక్ డ్రిల్ చేపట్టాయి. అత్యవసర పరిస్థితులు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్ఎస్‌జీ, ఏపీ ఆక్టోపస్ బృందంతో కలిసి తిరుమల క్షేత్రంలో మాక్ డ్రిల్ చేపట్టారు. ఏపీ స్టేట్ పోలీస్, టీటీడీ విజిలెన్స్ విభాగాలకు చెందిన 140 మంది మాక్ డ్రిల్‌లో పాల్గొని భక్తుల్లో భయం పోగొట్టేలా కార్యక్రమం నిర్వహించారు. భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో తిరుమలలో పలుమార్లు మాక్ డ్రిల్ నిర్వహించారు.

27న కేరళకు నైరుతి

ఐఎండీ అంచనా

న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే పలకరించనున్నాయి. సాధారణంగానే జూన్ ఒకటో తేదీన రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. అంతకంటే ముందుగా మే 27వ తేదీనే కేరళను తాకే అవకాశాలున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం తెలిపింది. అదే జరిగితే 2009 తర్వాత మొదటిసారిగా రుతు పవనాలు మేలోనే వచ్చినట్లవుతుందని పేర్కొంది. 2009లో చాలా ముందుగా అంటే మే 23వ తేదీనే భారత ప్రధాన భూభాగాన్ని తాకాయి. సాధారణంగా జూలై 8వ తేదీకల్లా దేశం మొత్తానికి రుతుపవనాలు వ్యాప్తి చెందుతాయి. తిరిగి సెప్టెంబర్ 17వ తేదీన వాయువ్య భారతదేశం నుంచి ఉపసంహరణ మొదలై అక్టోబర్ 15వ తేదీకల్లా ముగుస్తుంది. అయితే, రుతు పవనాలు ప్రవేశించడానికి, ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా నమోదయ్యే వర్షపాతానికి ఎటువంటి సంబంధం లేదని ఐఎండీ అధికారులు తెలిపారు. రుతుపవనాలు కేరళలోకి సాధారణం కంటే ముందుగా గానీ లేక ఆలస్యంగా గానీ తాకాయంటే దేశవ్యాప్తంగా అవి విస్తరిస్తాయని చెప్పలేమని అన్నారు. స్థానిక, ప్రాంతీయ, ప్రపంచ వ్యాప్తంగా ఉండే అనేక పరిస్థితులపై రుతు పవనాల వైఖరి ఆధారపడి ఉంటుందని వివరించారు. 2025 రుతుపవన సీజన్‌లో మొత్తంమ్మీద సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని ఏప్రిల్‌లో ఐఎండీ అంచనా వేసింది. దేశంలోని అత్యంత ప్రధానమైన వ్యవసాయరంగానికి రుతుపవనాలే కీలకం. దేశ జనాభాలో 42.3 శాతం వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తుండగా, జీడీపీలో 18.2 శాతం సాగు ద్వారానే సమకూరుతోంది.

మురళీ నాయక్ త్యాగం అందరికీ స్ఫూర్తి

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అమర జవాన్‌కు ఘన నివాళి



వీరజవాన్ మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: భారత్–పాకిస్తాన్ యుద్ధంలో అమరుడైన మురళీ నాయక్‌కు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ యుద్ధంలో మురళీ నాయక్ పోరాటం, తెగువ, త్యాగం దేశంలోని ప్రతి పౌరునికీ స్ఫూర్తినిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13న శ్రీ సత్యసాయి జిల్లాలోని కల్లి తండాకు వెళ్లి మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు దొంతిరెడ్డి వేమారెడ్డి, బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, నాయకులు కె.కనకారావు, కె.సుధాకర్‌రెడ్డి, ఎ.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విచారణకు హాజరుకాలేం

సిట్‌కు తెలియజేసిన కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్ రెడ్డి

సాక్షి, అమరావతి: తమ ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఈ నెల 13న సుప్రీంకోర్టులో విచారణ ఉన్నందున ఆదివారం విచారణకు హాజరు కాలేమని కె.ధనుంజయ్ రెడ్డి, పి.కృష్ణమోహన్ రెడ్డి సిట్‌కు చెప్పారు. ఈ మేరకు వారు వేర్వేరుగా సిట్‌కు ఈ మెయిల్ ద్వారా తెలియజేశారు. విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం విచారణకు హాజరు కావాలంటూ కేవలం రెండు రోజుల ముందు తాము లేని సమయంలో తమ కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చారని వారు పేర్కొన్నారు. తాము దర్యాప్తునకు పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సుప్రీంకోర్టు నిర్ణయం మేరకు తాము వ్యవహరిస్తామన్నారు.

జనరేషన్ జెడ్.. టెక్నాలజీలో అప్‌డేటెడ్

వేగంగా అందిపుచ్చుకుంటున్న వైనం

వారంలో 6 గంటలు మొబైల్ గేమ్స్ ఆడుతున్న 74% మంది

మూడింట ఒకరు జెన్-ఏఐ వాడుతున్నారు ■ ప్రపంచ జనాభాలో 30%, భారత్‌లో 27% వీళ్లే

సైబర్ మీడియా రీసెర్చ్ నివేదికలో వెల్లడి



కొత్త గేమ్స్ గురించి ఎలా తెలుసుకుంటున్నారంటే... (శాతం)

- స్నేహితుల ద్వారా 66%
- సోషల్ మీడియా ద్వారా 55%
- యాప్ స్టోర్స్ ద్వారా 51%

ఏ గేమ్స్.. ఎందుకు ఆడుతున్నారు?

- వినోదం కోసమే స్మార్ట్‌ఫోన్లలో గేమ్స్ 72%
- మానసిక చురుకుదనం కోసం 52%
- ఈ-స్పోర్ట్స్ ఆడేవారు 57%
- ప్రీమియం గేమ్స్ 30%

సాక్షి, స్పెషల్ డెస్క్: సాంకేతికతను వినియోగించడంలో, ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావడంలోనూ జెనరేషన్–జడ్ తరం ముందుంటోంది. 1997–2012 మధ్య జన్మించిన వాళ్లున్న ఈ తరం ప్రపంచ జనాభాలో దాదాపు 30% ఉన్నారు. భారత జనాభాలో వీరి వాటా దాదాపు 27%. మార్కెట్లోకి అడుగుపెట్టిన నూతన సాంకేతికతను 40% జెన్–జడ్ వాళ్లు వేగంగా అందిపుచ్చుకుంటున్నారు. కృత్రిమ మేధ (ఏఐ), జనరేటివ్ ఏఐని వినియోగించేందుకూ ఆసక్తి చూపుతున్నారని సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) నివేదిక వెల్లడించింది. దేశంలోని ప్రధాన ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఈ సంస్థ సర్వే నిర్వహించింది.

ప్రయోగాల్లో ముందు..

మార్కెట్లోకి కొత్త టెక్నాలజీ రావడమే ఆలస్యం.. జెన్–జడ్‌లోని ప్రతి 10 మందిలో నలుగురు దాన్ని వెంటనే అందిపుచ్చుకుంటున్నారు. వైరల్ ట్రెండ్స్ విషయంలో ప్రయోగాలు చేయడంలో జెన్–జడ్ తరం ముందుంటోంది. జిబ్లీ ఫిల్టర్‌ను కోట్లాది మంది వినియోగించడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని సీఎంఆర్ నివేదిక తెలిపింది. 'సాంకేతికతను, ట్రెండ్‌ను వేగంగా అందిపుచ్చుకునే విధానం.. వినియోగ వ్యవస్థ రూపురేఖలను మారుస్తోంది. జెన్ జడ్‌లో సగం మంది వినియోగదారులకు ఏఐ గురించి తెలుసు. ముగ్గురిలో ఒకరు దైనందిన జీవితంలో జనరేటివ్-ఏఐని భాగంగా చేసుకున్నారు. చరిత్రలో ఒక గొప్ప మలుపు వద్ద జెన్–జడ్ తరం ఉంది. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రపంచవ్యాప్తంగా అనుసంధానం అయిన మొదటి తరం ఇదే' అని ఆ నివేదిక వివరించింది. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, గౌహతి, జైపూర్, ఇండోర్, గ్వాలియర్‌కు చెందిన జెన్–జడ్, మిలీనియల్స్ (28–44 ఏళ్ల మధ్య వయసు), జెన్ ఆల్ఫా (13 ఏళ్ల లోపు వారు) తరం ఈ సర్వేలో పాలుపంచుకున్నారు.

పనితనం ఉండాల్సిందే..

జెన్–జడ్ తరానికి స్మార్ట్‌ఫోన్స్ కేవలం పరికరాలు మాత్రమే కాదు.. అవి గుర్తింపు వ్యక్తీకరణలు, అన్వేషణకు సాధనాలని నివేదిక వెల్లడించింది. పనితనం, బ్రాండ్ పట్ల నమ్మకం.. స్మార్ట్‌ఫోన్ల కొనుగోలును నిర్ణయిస్తున్నాయి. గేమింగ్, కంటెంట్ క్రియేషన్.. ఇన్ఫోటైన్‌మెంట్‌గా వారు భావించే ఈ వేదికలన్నీ కచ్చితమైన, అధిక పనితీరు కనబరచాల్సిందేనని ఈ తరం కోరుకుంటోంది. శక్తిమంతమైన చిప్‌సెట్స్ ఉండే స్మార్ట్‌ఫోన్లను జెన్ జెడ్ వాళ్లు ఎంపిక చేసుకుంటున్నారు. అంతేకాదు, మంచి బ్రాండ్లవీ, అద్భుతంగా పనిచేసేవీ వాళ్ల ప్రధాన ప్రాధామ్యాలుగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా, ఆటంకాలు లేని అనుభూతిని చిప్‌సెట్స్ అందిస్తున్నాయి. చిప్‌సెట్స్ పరంగా వినియోగదారుల సంతృప్తిలో మీడియాటెక్, ప్రీమియం బ్రాండ్ ఇమేజ్‌లో క్వాల్‌కామ్ ముందంజలో ఉన్నాయి.

ఆరు గంటలు గేమింగ్‌కు..

భారత్‌లో 74% మంది జెన్–జడ్ తరం స్మార్ట్‌ఫోన్లో గేమ్స్ కోసం వారంలో 6 గంటల సమయం వెచ్చిస్తున్నారు. తమ స్నేహితుల ద్వారా కొత్త గేమ్స్ గురించి తెలుసుకుంటున్న వారు ఎక్కువగా ఉన్నారు. గేమ్స్ ఆడటం అంటే ఏదో మామూలు గేమ్స్ కాదు... ప్రీమియం గేమ్స్ ఆడాలని అనుకుంటున్న వారు 30% మంది ఉండటం విశేషం. ఖర్చు కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తాము ఒక్కరమే ఆడటం కాకుండా.. పోటీ ఉండాలని కోరుకుని, ఆన్‌లైన్ పోటీల్లో (ఈ–స్పోర్ట్స్)లో కూడా పాల్గొంటున్నారు.

స్మార్ట్ కార్లు

డ్రైవింగ్ అనుభవాన్ని మరింత గొప్పగా చేయాలంటే కార్లను సాంకేతికతతో అనుసంధానించాల్సిందేనని 72 శాతం అభిప్రాయపడ్డారు. స్మార్ట్ కార్లు, రియల్ టైమ్ నేవిగేషన్, విద్యుత్ లేదా పర్యావరణ ప్రియ వాహనాలు.. ఇలాంటివి కావాలని వారు కోరుకుంటున్నారు. కింది అంశాలు ఉండే స్మార్ట్ కార్స్ కావాలంటున్నారు..

అంశం	శాతం
ఆధునిక భద్రతా ఫీచర్లు	59%
మెరుగైన ఇంధన వినియోగం	56%
అధిక బ్యాటరీ లైఫ్ (ఫాస్ట్ ఛార్జింగ్ కోసం)	52%

ఏడాది కావస్తున్నా ఉద్యోగులకు చేసిందేమీ లేదు

- పీఆర్సీ లేదు, ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు
- ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు



సాక్షి అమరావతి/అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా ఉద్యోగులకు చేసిందేమీ లేదని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్థిక అంశాలు అటుంచితే ఆర్థికేతర అంశమైన పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ని నియమించలేదని, మూడు పెండింగ్ డీఏల్లో ఒక్కటీ ఇవ్వలేదని, ఉద్యోగులకు నాయకులుగా సమాధానం చెప్పుకోలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శనివారం అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పీఆర్సీని నియమించకపోవడం, డీఏలు ప్రకటించకపోవడంతో ఉద్యోగులు అభద్రతాభావంలో ఉన్నారన్నారు. పీఆర్సీ ప్రక్రియ ఎంత ఆలస్యం అయితే ఉద్యోగులకు అంత నష్టమన్నారు. ఇక 2024 జనవరి, జూన్, 2025 జనవరికి సంబంధించి మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నెల దాటితే మరో డీఏ కలుస్తుందన్నారు. ఇప్పటికీ ఒక్క డీఏ కూడా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో రెవెన్యూ కార్యాలయాల నిర్వహణ భారాన్ని తహసీల్దార్లు భరించాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. ప్రొటోకాల్‌కు రూ.లక్షలు ఖర్చు అవుతున్నాయని, ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే ఎలాగని ప్రశ్నించారు. ప్రభుత్వం లీగల్ చార్జీలూ ఇవ్వకపోవడంతో కోర్టు కేసులకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు.

ప్రభుత్వం ఎందుకు ఇంప్లీడ్ కాలేదు?

ఆక్రమణల తొలగింపు, ఇసుక దందా, రేషన్ అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో తహసీల్దార్లు బలవుతున్నారని బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో గుంటూరులో ఆక్రమణల తొలగింపు అంశంలో అప్పటి తహసీల్దారు తాతా మోహన్‌రావుపై కోర్టు చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆయనకు తహసీల్దారుగా డిమోషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపు విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఆయన పనిచేశారన్నారు. అలాంటప్పుడు ఈ కేసులో ప్రభుత్వం ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు. పైవారు చెప్పిన పని చేసినందుకు ఆ అధికారి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక నిర్ణయాన్ని ఉన్నతాధికారులు నోటితో చెబితే కాకుండా లిఖితపూర్వంగా ఆదేశాలిస్తేనే అమలు చేయాలని తహసీల్దార్లకు చెబుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యూ ఉద్యోగులు సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజేష్, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. విజయవాడలోనూ విలేకరులతో మాట్లాడిన బొప్పరాజు ఇంతకాలమైనా సర్కారు పీఆర్సీని ఎందుకు నియమించలేకపోయిందని, ఒక్క డీఏ కూడా ఇవ్వలేదేమని ప్రశ్నించారు.

వీర సైనికా.. మా గుండెల్లోనే ఉంటావిక

- వీరజవాన్ మురళీ నాయక్ భౌతికకాయానికి దారి పొడవునా ప్రజల నివాళి
- కల్లి తండాకు పోటెత్తిన ప్రజలు, ప్రముఖులు.. మురళీ త్యాగాన్ని వేనోళ్ల కొనియాడిన వైనం
- నేడు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



రాష్ట్ర సరిహద్దు కొడికొండ చెక్‌పోస్టు వద్దకు మురళీ నాయక్ భౌతికకాయాన్ని చూసేందుకు తరలివచ్చిన జనం



మురళి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్. చిత్రంలో మంత్రి సవిత



మురళీ నాయక్ తల్లిదండ్రులను ఓదార్చుతున్న మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమంత్

గోరంట్ల: జమ్మూ కశ్మీర్‌లో పాక్‌తో పోరాటంలో మరణించిన వీరజవాన్ మురళీ నాయక్ భౌతికకాయం శనివారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలో ఆయన స్వగ్రామమైన కల్లి తండాకు చేరుకుంది. నాయక్ భౌతికకాయం శనివారం కశ్మీరు నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. ఎయిర్‌పోర్టులో సైనిక అధికారులు, సిబ్బంది ఘన నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి సవిత ప్రభుత్వం తరఫున నివాళులర్పించారు. అక్కడి నుంచి ఆర్మీ కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన స్వగ్రామానికి తీసుకొచ్చారు. దారి పొడవునా వేలాదిగా ప్రజలు తరలివచ్చి అమర వీరుడికి జోహార్లు అర్పించారు. దీంతో 44వ నంబరు జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. కర్ణాటకలోని బాగేపల్లి, చిక్కబళ్లాపురం, బాగేపల్లి టోల్‌ప్లాజా తదితర ప్రాంతాల్లోనూ ప్రజలు వేలాదిగా జాతీయ రహదారిపైకి చేరుకుని వీరజవాన్‌కు ఘన నివాళులర్పించారు. వందేమాతరం, జై జవాన్ నినాదాలు మిన్నంటాయి. భారీ జనం రావడంతో కాన్వాయ్ ముందుకు సాగడానికి చాలా సమయం పట్టింది. కర్ణాటక సరిహద్దు దాటి జిల్లాలోకి ప్రవేశించగానే.. చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద జవాన్ భౌతికకాయం ఉన్న వాహనంపైకి పూల వర్షం కురిపించారు. మురళి త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ జనం కంటతడి పెట్టారు. కోడూరు థామస్ మన్రో తోపు, గుమ్మయ్యగారిపల్లి క్రాస్ మీదుగా స్వగ్రామం కల్లి తండాకు భౌతిక కాయం చేరుకుంది.

స్వగ్రామంలో ఉద్వేగభరిత వాతావరణం

మురళీ నాయక్ భౌతిక కాయం చేరుకోవడంతో స్వగ్రామం కల్లితండాలో ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు సహా అక్కడ ఉన్న ప్రజలు జవాన్ భౌతికకాయానికి కన్నీటితో స్వాగతం పలికారు. వీరజవాన్‌కు నివాళులర్పించడానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, అధికారులు, నాయకులు భారీగా ఇంటి వద్దకు చేరుకున్నారు. మురళి అమర్ రహే అంటూ నినదించారు. వీరజవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సమంత్, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పరామర్శించారు.

నేడు అంత్యక్రియలు

వీరజవాన్ మురళీ నాయక్ అంత్యక్రియలు ఆదివారం సైనిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

■ తెలంగాణ

ఐడీబీఐ బ్యాంక్‌ని మోసగించిన కేసులో మరో ఐదుగురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: ఐడీబీఐ (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి శాఖలో జరిగిన రూ. 2.86 కోట్ల మోసం కేసులో తెలంగాణ సీఐడీ అధికారులు శుక్రవారం మరో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే సత్తుపల్లి ఐడీబీఐ మాజీ బిజినెస్ కరస్పాండెంట్ చెట్టిపోగు సురేశ్‌ను గురువారం అరెస్టు చేశారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన బొబ్బిలి వెంగళరావు, బొబ్బిలి జగన్నాథం, వెంకటాద్రి గూడేనికి చెందిన యలికే హరిబాబు, మందపల్లి గ్రామానికి చెందిన ముదగండ్ల రాజశేఖర్ అలియాస్ రాజు, సత్తుపల్లి గ్రామానికి చెందిన పిన్నెబోయిన కొండబాబును అరెస్టు చేసినట్లు సీఐడీ డీజీ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులు 2015 మార్చి 13వ తేదీ నుంచి 2016 వరకు నకిలీ పట్టాదార్ పాస్‌బుక్‌లు, నకిలీ డాక్యుమెంట్లతో బ్యాంకును మోసం చేసినట్లు తెలిపారు.

'నేషన్ ఫస్ట్' అందరి నినాదం కావాలి

గవర్నర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ ఫెయిత్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటిస్తున్న గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం

సాక్షి, అమరావతి: మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా 'నేషన్ ఫస్ట్' నినాదంతో దేశాన్ని కాపాడుకోవాలని.. అలాగే, ఏ సమస్య వచ్చినా అందరూ సంఘటితంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతిని ఉగ్రవాదం పట్టి పీడిస్తోందని, దేశంలో అనిశ్చిత పరిస్థితులకు, ఆర్థిక ఇబ్బందులకు ఇది కారణమవుతోందని అన్నారు. భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో రాజ్‌భవన్‌లో శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో ఇంటర్ ఫెయిత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'పహల్గాంలో ఉగ్రవాదులు మారణకాండ సృష్టించారు. ఆ తర్వాత.. సరిహద్దుల్లో ఐదారు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమయంలో మన త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయి. వారికి మద్దతుగా ఉందాం. ఈ పోరాటంలో కొందరు సైనికులు, పౌరులు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధంలో మన రాష్ట్రానికి చెందిన వీర సైనికుడు మురళీ నాయక్ కూడా ప్రాణాలు వదిలారు. 25 ఏళ్ల వయసులో ఈయన తన ప్రాణం పణంగా పెట్టి దేశ రక్షణ కోసం పాటుపడ్డారు. తన దేహంపై జాతీయ జెండా కప్పుకుని చనిపోతానని చెప్పి మరీ మురళీనాయక్ చనిపోయారు. ప్రజల్ని బాధపెట్టే తీవ్రవాదం, ఉగ్రవాదాన్ని ఎప్పటికీ ఉపేక్షించం. దేశ రక్షణలో ప్రాణాలు పోగొట్టుకున్న సైనికుల త్యాగాన్ని మనం గుర్తుచేసుకుని సంఘీభావంగా ఉండాలి. భారత్–పాక్ దేశాలు కాల్పుల విరమణకు నిర్ణయించడం శుభపరిణామం. యుద్ధంలో నష్టపోయిన వారందరికీ సంతాపం తెలుపుతూ తీర్మానం చేద్దాం. దేశ సమగ్రతకు ప్రధాని, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి, ఏపీ ప్రజలు అండగా ఉంటారు.' అని చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రులు, అధికారులు, వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు ఎప్పుడు?

కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా గత ప్రభుత్వంపై విమర్శలే తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదు

జర్నలిస్టులపై దాడులు, కేసులు పెట్టడం సరికాదు

'సాక్షి'తో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



తిరుపతి సిటీ: 'కూటమి పార్టీలు అధికార దాహంతో ఎన్నికల్లో గెలుపు కోసం హామీలను గుప్పించాయి. గత ప్రభుత్వంలోని సంక్షేమ పథకాలకే పేర్లు మార్చి ప్రజలకు అందిస్తామని చెప్పాయి. అధికారంలోకి వచ్చాక వాటి అమలుపై దృష్టిసారించడం లేదు. అసలు ఆ ప్రస్తావనే ఎత్తడం లేదు. సీఎం చంద్రబాబుకు హంగూ ఆర్భాటాలే తప్ప అభివృద్ధిపై దృష్టిలేదు' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఏడాది అయినా.. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కూటమి సర్కారు కాలయాపన చేస్తోందే కానీ, అభివృద్ధిపై దృష్టిసారించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఫాసిస్టు ధోరణి పాలన సాగుతోందని, కార్పొరేట్, ప్రైవేటు సంస్థలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. విద్య, వైద్యం తీరు మారిపోయిందని... ఈ రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో చిన్నచూపు తగదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పేదల విద్యకు నిలయాలుగా, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు సంపన్నుల విద్యకు కేంద్రం కావడం దారుణమని, వైద్యంలో సైతం ప్రభుత్వ ఆసుపత్రులు పేదలకు, కార్పొరేట్ ఆసుపత్రులు ధనికులకు అన్నట్లున్నాయని అన్నారు. తిరుపతిలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న రాఘవులు రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ పాలన, ప్రస్తుత పరిస్థితులపై 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..


- పత్రికలు, జర్నలిస్టులపైన దాడులు, బెదిరింపులు, నిరాధారమైన కేసులు పెట్టడం దారుణం. తప్పులను ఎత్తిచూపుతూ ప్రభుత్వాలను మేల్కొలిపే జర్నలిజంపై దాడులు చేయడం బాధాకరం. ప్రశ్నించే గళంపై కక్షసాధింపు చర్యలను సమాజం హర్షించదు. పత్రికా హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదు. న్యూస్ పోర్టల్‌ను బ్లాక్ చేయడం వంటివి ప్రజా వ్యతిరేక చర్యలు. ఇవి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.
- ఆర్థిక వనరుల మెరుగుదలకు సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టకపోవడం విచారకరం. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారన్న మాటే తప్ప నిధులు రాబట్టలేకపోతున్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, రాయితీలంటూ ఉత్త మాటలే తప్ప ఆచరణ లేదు. విద్య, వైద్యం ప్రైవేటీకరణతో పేదలు చదివే ప్రభుత్వ పాఠశాలలు, వైద్యం చేయించుకునే ఆస్పత్రులను పట్టించుకునే పరిస్థితి కరువైంది. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ ఇటీవల మత విద్వేషాలను రెచ్చగొట్టేలా దారుణంగా వ్యాఖ్యలు చేశారు.

భూసేకరణే తప్ప అమరావతి పూర్తిపై దృష్టి లేదు

మోదీ దగ్గర మెప్పు పొందడం, ప్రజలకు ఏదో చేసేస్తున్నామన్న ఆర్భాటం, హంగు తప్ప అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి దృష్టి లేదు. అమరావతి పునర్నిర్మాణం అంటూ మరో 40 వేల ఎకరాలు సేకరిస్తున్నారు. ప్రజల నుంచి భూ సేకరణే తప్ప అమరావతిని పూర్తి చేయడంపై ధ్యాస లేదు. అమరావతి రాజధానిగా పార్లమెంటులో చట్టం చేసేందుకు ప్రయత్నించడంతో నాలుగేళ్లలో అయినా పూర్తి చేస్తారో.. లేదోననే అనుమానం ప్రజలకు కలుగుతోంది. చంద్రబాబు తన పాలనకు హంగూ ఆర్భాటాలు చేసుకోవడమే తప్ప అభివృద్ధి సాధించే రీతిలో అడుగులు పడడం లేదు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- గాంధీస్మారక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదర గోపీచంద్



నరసరావుపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి నేతలు తమ తప్పులు, అరాచకాలను ఎత్తి చూపిస్తున్న సాక్షి దినపత్రిక ఎడిటర్ ఇంట్లోకి సెర్చ్ వారెంట్ లేకుండా ప్రవేశించి, సోదాలు నిర్వహించి, భీతావహ వాతావరణం సృష్టించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పత్రికా రచయిత, గాంధీస్మారక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పార్లమెంట్‌లో, పత్రికల్లోనూ విమర్శలను ఆహ్వానించే వారని, ఇందిరాగాంధీ మాత్రం విమర్శలు, ప్రజల ప్రతిఘటనను సహించలేక, నియంతృత్వ పోకడతో ఎమర్జెన్సీని విధించి ప్రజాగ్రహానికి గురై భంగపడ్డారని గోపీచంద్ గుర్తుచేశారు. ఎడిటర్ గృహంలో సోదా లాంటి దుశ్చర్యను పాత్రికేయ లోకంతోపాటు మేధావులు, ప్రజా సంఘాల నేతలు ఖండించడం అభినందనీయమని అన్నారు.

ఎడిటర్ ఇంట్లో అక్రమ సోదాలు తగదు



ప్రజాస్వామ్యంలో పత్రికలు ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుకగా ఉంటాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాశారని ఎడిటర్ల ఇళ్లలోకి అక్రమంగా చొరబడి సోదాలు చేయడం రాజ్యాంగ విరుద్ధం. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించినందుకు, అక్రమాలను వేలెత్తి చూపిస్తున్నందుకు తట్టుకోలేక జర్నలిస్టులను భయపెట్టే ధోరణిలో వ్యవహరించడం ప్రభుత్వానికి తగదు. భావప్రకటన స్వేచ్ఛ ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి లేదు.

– జి.శాంతమూర్తి,
ఇండియన్ ఇంటెలెక్చ్యువల్ ఫోరం, అధ్యక్షుడు, గుంటూరు

అప్పుల బాధతో దళిత రైతు ఆత్మహత్య

- పొలంలోనే పురుగుల మందు తాగిన వైనం
- అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం ఆమిద్యాలలో ఘటన


ఎర్రిస్వామి(ఫైల్)

ఉరవకొండ రూరల్: అప్పులబాధ తాళలేక ఓ దళిత రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం ఆమిద్యాలలో చోటు చేసుకుంది. వివరాలు.. ఎర్రిస్వామికి భార్య ఎర్రమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలకు పెళ్లిళ్లయ్యాయి. మూడేళ్ల కిందట భార్య ఎర్రమ్మ తీవ్ర అనారోగ్యంతో మంచాన పడింది. ఆమెకు వైద్యం కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. ఆమె ఇటీవల మరణించింది. దీనికి తోడు రెండున్నర ఎకరాల్లో వేరుశనగ వేశాడు. చికిత్స ఫలించక భార్య మృతి ఓవైపు..రెండేళ్ల నుంచి సాగుకోసం తెచ్చిన అప్పులు తీర్చేదారి కనిపించలేదు. ఈ నేపథ్యంలో శనివారం తన పొలంలోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు తెలపడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఉరవకొండ అర్బన్ సీఐ మహనంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాడిలోకి స్టార్టప్స్ ఫండింగ్!

రెండేళ్ల విరామం తర్వాత వృద్ధి బాటలో	2024లో రూ.1,24,184 కోట్ల ఫండింగ్	ఏడాదిలో 27.8% పెరిగిన నిధులు	అధిక మొత్తం ఈ-కామర్స్ కంపెనీల్లోకి..	ప్రారంభ దశ కంపెనీల హవా

2025 జనవరి–మార్చిలోనూ నిధుల వెల్లువ



దేశంలోని స్టార్టప్స్‌లోకి నిధుల రాక తిరిగి గాడిలో పడింది. ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిన భారత్‌లో రెండేళ్ల విరామం తర్వాత గత ఏడాదిలో ఫండింగ్‌లో వృద్ధి నమోదైంది. దేశీయ అంకుర సంస్థలు 2024లో మొత్తం రూ.1,24,184 కోట్ల ఫండింగ్ అందుకున్నాయి. 2023తో పోలిస్తే ఇది 27.78 శాతం ఎక్కువ. 2025 జనవరి–మార్చిలో నిధులు.. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 33.57 శాతం పెరిగి రూ.31,820 కోట్లుగా నమోదయ్యాయి.

సాక్షి, స్పెషల్ డెస్క్

అంకుర సంస్థల్లో పెట్టుబడులు 2017 నుంచి 2020 వరకు తగ్గుతూ వచ్చాయి. కరోనా మహమ్మారి రాకతో ప్రపంచవ్యాప్తంగా వ్యాపార తీరుతెన్నుల్లో అనూహ్యంగా సమూల మార్పులు వచ్చాయి. అన్ని రంగాల్లోనూ కంపెనీలు ఐటీపై భారీగా వెచ్చించాయి. దీంతో 2021లో రికార్డు స్థాయిలో భారత అంకుర సంస్థల్లోకి రూ.3,26,800 కోట్ల నిధులు వెల్లువెత్తాయి. ఏడాదిలో మూడింతలకుపైగా దూసుకెళ్లాయి. భారత స్టార్టప్స్ ప్రపంచ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించాయి. అక్కడి నుంచి ఇక తిరుగు ఉండదు అనుకున్నప్పటికీ అందుకు విరుద్ధంగా వరుసగా రెండు సంవత్సరాలు నిధుల రాక తగ్గింది. వడ్డీ రేట్లు పెరగడం; భౌగోళిక, రాజకీయ అనిశ్చితి; ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, కంపెనీల పనితీరు పట్ల ఆందోళనలు.. ఈ క్షీణతకు కారణమయ్యాయి.

'ఈ-కామర్స్' జోష్


2024లో ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్ కంపెనీలు ఏకంగా రూ.27,778 కోట్ల నిధులను ఆకర్షించడం గమనార్హం. 2024లో అధిక మొత్తం ఫండింగ్ ఈ-కామర్స్ కంపెనీల్లోకి వెళ్లింది. 2023లో దేశీయ అంకుర సంస్థలు రూ.97,180 కోట్ల నిధులు సమీకరించాయి.


2024లో టాప్ – 5 రంగాల వారీగా డీల్స్ చూసుకుంటే... ఈ కామర్స్‌లో 222 డీల్స్ జరిగాయి. ఫిన్‌టెక్‌లో 211, హెల్త్ టెక్‌లో 120, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ 112 డీల్స్ జరిగాయి. ఏఐకి సంబంధించి మాత్రం కేవలం 59 డీల్స్ జరగడం గమనార్హం.

2025 జనవరి–మార్చిలో నిధులు.. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 33.57 శాతం పెరిగి రూ.31,820 కోట్లుగా నమోదయ్యాయి.

ఈ మార్చి త్రైమాసికంలో ఇలా.. ఈ త్రైమాసికంలో 319 డీల్స్ జరిగాయి. నాలుగు సంస్థలు మూతపడ్డాయి. అయిదు స్టార్టప్స్ 1,300 పైచిలుకు ఉద్యోగులను ఇంటికి సాగనంపాయి. 2023లో 24,000 మందికి, 2022లో 20,000 మందికి స్టార్టప్ కంపెనీలు ఉద్వాసన పలికాయి. ఉద్యోగుల తీసివేతలు గత ఏడాది అతి తక్కువగా (సుమారు 4,700) నమోదయ్యాయి.

2024లో ఫండింగ్ పరంగా టాప్-10 కంపెనీలు	1	2	3	4	5	6	7	8	9	10
	జెప్టో	ఫ్లిప్ కార్ట్	డీఎంఐ ఫైనాన్స్	రెబెల్ ఫుడ్స్	లెన్స్ కార్ట్	ఫార్మ్ ఈజీ	ఫిజిక్స్ వాలా	రాపిడో	మింటిపై	పర్పుల్





కారు లోంచి లాగి.. తోసేసి..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలు విస్తుపోయారు. చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం జంగాలపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, గ్రామ సర్పంచ్ బత్తుల సీతారామిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన్ని పరామర్శించేందుకు శనివారం మధ్యాహ్నం విడదల రజిని ఆయన నివాసానికి వెళ్లారు. ఆయన ఇంట్లో నుంచి బయటకు రాగానే.. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు, నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు, పోలీసు సిబ్బంది ఆమె కారును చుట్టుముట్టారు. తన కారు వద్ద ఎందుకు హడావుడి చేస్తున్నారంటూ ఆమె రూరల్ సీఐని ప్రశ్నించారు. మీ అనుచరుడు మానుకొండ శ్రీకాంత్‌రెడ్డిపై కేసులు ఉన్నాయని, అతన్ని అరెస్టు చేయడానికి వచ్చామని సీఐ బదులిచ్చారు. ఎఫ్ఐఆర్ లేదా అరెస్టు వారంట్‌ను చూపాలని రజినీ కోరగా.. మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదంటూ సీఐ దురుసుగా మాట్లాడారు. దీంతో ఆమె తన కారులోకి ఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయే ప్రయత్నం చేయగా, సీఐ వెంటనే ఆమెను కారులో నుంచి


మాజీ మంత్రి విడదల రజినితో రూరల్ సీఐ సుబ్బనాయుడి వాగ్వాదం

దురుసుగా బయటకు లాగారు. కారులోకి ఎక్కి శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో.. 'సీఐ గారూ.. ఏమిటీ దురుసు ప్రవర్తన.. ఎఫ్ఐఆర్ లేదా ఇతర ఆధారాలు చూపి అరెస్టు చేయండి' అని విడదల రజినీ కోరగా.. సీఐ మరింత రెచ్చిపోయి పక్కకు తప్పుకోవాలని హూంకరించారు. 'చెబుతుంటే అర్థం కావడం లేదా.. ఎక్కువ మాట్లాడితే నా విధులకు ఆటంకం కలిగించినందుకు నీపై కూడా కేసు పెడతా' అని బెదిరించారు. ఆమెను పక్కకు నెట్టివేసి శ్రీకాంత్‌రెడ్డిని తీసుకెళ్లిపోయారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డిని ప్రకాశం జిల్లా వైపు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ ఘటనపై రూరల్ సీఐ సుబ్బనాయుడును వివరణ కోరేందుకు ఫోన్లో ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

సీఐ దౌర్జన్యం వీడియో కోసం ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

న్యాయస్థానాలు మొట్టికాయలు వేస్తున్నా..

రాష్ట్రంలో మహిళల పట్ల సభ్యతా సంస్కారాలు మరిచి పోలీసులు ప్రవర్తిస్తున్నారు. ఇటీవల గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరులో రాత్రిపూట నైటీలో ఉన్న ఎస్సీ మహిళా ఎంపీటీసీ సభ్యురాలు కల్పనను అరెస్ట్ చేశారు. 2 నిమిషాల్లో చీర కట్టుకుని వస్తానన్నా కూడా వినిపించుకోకుండా నైటీలో ఉండగానే జీప్ ఎక్కించారు. ఇలాంటి ఘటనలు టీడీపీ కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్న తీరుకు అద్దం పడుతున్నాయి.

మిగులుపై గుబులు!

▶ మొదటి పేజీ తరువాయి

ఉపాధ్యాయులు గుర్తు చేస్తున్నారు. జీవో నంబర్ 117 అమల్లో భాగంగా మిగులు ఉపాధ్యాయులకు పాత పాఠశాలలో పనిచేసిన కాలాన్ని, కొత్త పాఠశాలలో పనిచేసిన కాలాన్ని పరిగణనలోకి తీసుకొని (పాత, కొత్త స్టేషన్) రేషనలైజేషన్ పాయింట్లు కేటాయించారు. కానీ, ఇటీవల విద్యా శాఖ విడుదల చేసిన ఉపాధ్యాయ బదిలీ చట్టం–2025లో అనేక లోపాలు ఉన్నాయని ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం టీచర్లు పాత పాఠశాలలో పనిచేసిన కాలానికి ఇచ్చే పాయింట్లు కోరుకుంటే వారికి ప్రస్తుత రేషనలైజేషన్ పాయింట్లు ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతున్నట్టు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో చేసిన బదిలీలలో మిగులు ఉపాధ్యాయులకు పాత, కొత్త స్టేషన్ల (పాఠశాల)లో పని చేసిన సర్వీసును పరిగణనలోకి తీసుకుని గరిష్ఠంగా ఎనిమిదేళ్ల వరకు సర్వీసు పాయింట్లు కేటాయించారు. దీనికి అదనంగా రేషనలైజేషన్ పాయింట్లు కూడా ఇచ్చి న్యాయం చేశారు. సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు స్పెషల్ పాయింట్లు ఇచ్చి ప్రాధాన్యతిచ్చారు. దీంతో మిగులు ఉపాధ్యాయులకు నష్టం జరగలేదు.

ఇప్పుడంతా గందరగోళం

జీవో 117 రద్దులో భాగంగా చేపడుతున్న రేషనలైజేషన్ ప్రక్రియ గందరగోళంగా మారింది. పాఠశాలల మెర్జింగ్, సబ్జెక్టు టీచర్ల తొలగింపుతో పాటు ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని పెంచడంతో దాదాపు 10 వేల మంది స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఏర్పడుతున్నారు. విద్యాశాఖ కొత్త నిబంధనలతో సర్ ప్లస్ అయిన ఈ ఉపాధ్యాయులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.వారిని ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల కంటే మెరుగైన స్థానాలకు బదిలీ చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా ప్రక్రియ నడుస్తోందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత పాఠశాలలో పనిచేసిన కాలానికి ఇచ్చే స్టేషన్ పాయింట్లను కోరుకునే వారికి రేషనలైజేషన్ పాయింట్లు ఇచ్చేది లేదని ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించింది. కొత్త పాఠశాలలో పనిచేసిన కాలానికి స్టేషన్ పాయింట్లు కోరుకున్న వారికే రేషనలైజేషన్ పాయింట్లు ఇస్తామనడంతో మిగులు టీచర్లకు అన్యాయం జరుగుతోంది. కొత్త పాఠశాలల్లో రెండు నుంచి నాలుగేళ్ల సర్వీసు గలవారే మిగులుగా మారుతున్నారు. వీరు పాత పాఠశాలలో ఎనిమిది నుంచి పదేళ్ల కాలం పని చేశారు. ప్రస్తుత బదిలీల్లో వీరే నష్టపోతున్నట్టు తెలుస్తోంది. 2023లో ఇచ్చినట్టుగా పాత, కొత్త పాఠశాలల సర్వీసును పరిగణనలోకి తీసుకుని ఎనిమిదేళ్లకు స్టేషన్ పాయింట్లు ఇవ్వాలని టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయ చర్చల్లో కొందరికే ప్రాధాన్యం

బదిలీలు, పాఠశాలల పునర్ వ్యవస్థీకరణపై విద్యాశాఖ గత 8 నెలలుగా ప్రతివారం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరుపుతోంది. అయితే, ఇందులో కేవలం 9 గుర్తింపు సంఘాలకే ప్రాతినిధ్యం కల్పించారు. కీలకమైన 34 రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలను దూరం పెట్టారు. దీంతో రిజిస్టర్డ్ సంఘాలు భగ్గుమంటున్నాయి. మొత్తం సమావేశాల్లో 5 నెలల క్రితం ఒకసారి అవకాశం కల్పించారు. శనివారం నిర్వహించిన సమావేశానికి మాత్రమే గుర్తింపు సంఘాల ప్రతినిధులను ఆహ్వానించారు.

'పల్లా' ఓ అరాచకవాది... కబ్జాకోరు

తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్



ఏయూ క్యాంపస్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును తక్షణం ఆ పదవి నుంచి తొలగించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. శనివారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గాజువాక ప్రాంతంలో పల్లా తన అనుచరులతో కలిసి అరాచకాలు, భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నారా లోకేశ్ అండగా ఉన్నారని పల్లా శ్రీనివాస్, ఆయన అనుచరులు చెబుతున్నారని, లోకేశ్ ఇటువంటి అక్రమార్కులకు కొమ్ముకాస్తే తాను ఆయనపై కూడా యుద్ధం చేయడానికి సిద్ధమని స్పష్టం చేశారు. తెలుగు శక్తి ప్రజల పక్షాన ఉంటుందని, అక్రమాలను, అన్యాయాలను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. త్వరలో తన తండ్రి బీవీ రామారావు ఆశయ సాధన దిశగా బీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని ప్రకటించారు. ఎన్టీఆర్ జయంతిని విశాఖలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

ముగిసిన పండన్న అంత్యక్రియలు


వందలాది అభిమానుల మధ్య అంతిమయాత్ర

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): 30 ఏళ్లుగా మావోయిస్టుల ఉద్యమంలో కొనసాగిన ఏఓబీ ఎస్‌జెడ్‌సీ (స్పెషల్ జోనల్ కమిటీ) సభ్యుడు కాకూరి పండన్న అలియాస్ జగన్ అంత్యక్రియలు శనివారం స్వగ్రామమైన కొమ్ములవాడలో జరిగాయి. వై.రామవరం మండలం శేషరాయి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టులు పండన్న, రమేష్ మృతిచెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని శనివారం తెల్లవారుజామున గ్రామానికి తీసుకొచ్చారు. పండన్న మృతదేహాన్ని చూసేందుకు వందలాదిగా అభిమానులు, మాజీ మావోయిస్టుల సహచరులు వచ్చారు. విప్లవ గేయాలు ఆలపిస్తూ అంతిమయాత్ర చేపట్టగా.. కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మావోయిస్టుల ఉద్యమం ఆగదు..

దండకారణ్యంలో మావోయిస్టుల ఉద్యమం ఎప్పటికీ ఆగదని పండన్నకు నివాళులర్పించేందుకు వచ్చిన మాజీ మావోయిస్టులు అన్నారు. మృతదేహాన్ని భద్రపరచడంలో రంపచోడవరం వైద్య సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని, పోస్టుమార్టం పేరుతో నిర్లక్ష్యం చేసి 4 రోజుల తర్వాత పురుగులు పట్టిన శవాన్ని బంధువులకు అప్పగించడం దారుణమని వారు ఆరోపించారు.

చంద్రబాబు, పవన్, లోకేశ్ మెప్పు కోసమే..

సీఐ సుబ్బనాయుడు తీరుపై మాజీ మంత్రి పేర్ని నాని మండిపాటు

- మాజీ మంత్రిపై నోరు పారేసుకుంటారా?
- మీ ఇంట్లో మహిళలు లేరా?
- రాక్షస ఖాకీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



చిలకలూరిపేట: సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్‌ను సంతృప్తి పరిచేందుకు పోలీసులు కనీస విలువలు లేకుండా ప్రవర్తిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ మహిళా మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు విడదల రజిని అనుచరుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో ఆమె పట్ల చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడి ప్రవర్తన ఇదే కోవలోకి వస్తుందని మండిపడ్డారు. ఆమెను కారు నుంచి బయటకు లాగి దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. శనివారం రాత్రి ఆయన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులతో కలసి మంత్రి రజినీని ఆమె నివాసంలో పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. ప్రజా జీవితంలో భాగంగా మాజీ మంత్రి విడదల రజిని పార్టీ నాయకుడు సీతారామిరెడ్డిని పరామర్శించేందుకు జంగాలపల్లెకి అనుచరులతో కలసి వెళ్లారని తెలిపారు. ఈ క్రమంలో ఆమె అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు వచ్చిన చిలకలూరిపేట రూరల్ సీఐ సభ్యత, సంస్కారాలు మరచి రాక్షసత్వం ప్రదర్శించటం సిగ్గుచేటన్నారు. అరెస్టుకు కారణం చెప్పాలని అడిగితే మహిళ అని చూడకుండా నీ మీద కూడా కేసు పెడతా.. అంటూ ఆమెను కారులో నుంచి బయటకు లాగి వేయడం దుర్మార్గమన్నారు. సదరు సీఐ ఇంట్లో ఆడవారు లేరా.. తోబుట్టువులు లేరా.. అని ప్రశ్నించారు. ఈ కేసు విషయంలో తెలుసుకొనేందుకు ఫోన్ చేస్తే రూరల్ సీఐ, డీఎస్పీ, ఎస్పీ ఎవరూ ఫోన్లు ఎత్తే పరిస్థితులు లేవన్నారు. అనుచితంగా ప్రవర్తించిన రాక్షస ఖాకీపై పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారణం చెబితే సహకరిస్తామన్నా..

విడదల రజిని మాట్లాడుతూ శ్రీకాంత్ రెడ్డిని ఎందుకు అరెస్టు చేస్తున్నారో కారణం చెబితే సహకరిస్తామని చెప్పినా రూరల్ సీఐ సుబ్బనాయుడు వినిపించుకోలేదని చెప్పారు. ఏ కేసు అని అడిగితే ఏవో కేసులు ఉన్నాయి.. మీకు చెప్పాల్సిన అవసరం లేదని దురుసుగా మాట్లాడారన్నారు. మీదకు వస్తూ.. పరుష పదజాలం వాడారని చెప్పారు. యూనిఫాం ఉన్న ఒక సీఐ.. మహిళ అని కూడా చూడకుండా ప్రవర్తించిన తీరు బాధ కలిగించిందన్నారు. 80 ఏళ్లు నిండిన తన మామయ్య, జర్మనీలో ఉండే ఓ మరిదిపై కేసులు పెట్టారని, మరో మరిదిని అరెస్టు చేశారని వెల్లడించారు. కత్తితో బెదిరించారని తప్పుడు కేసులు పెట్టడం దారుణం అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఇలాంటి తప్పుడు కేసులు పెట్టించలేదని గుర్తు చేశారు.

పోలీసులకు 'సుప్రీం' నిబంధనలు తెలీవా!?

- కంతేరు మహిళా ఎంపీటీసీని రాత్రి అరెస్టు చేసి సూర్యోదయం తర్వాత చేసినట్లు నమోదు చేస్తారా?
- తాడికొండ సీఐపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాం
- మాజీమంత్రి అంబటి రాంబాబు


మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): రాష్ట్రంలోని మహిళలను అర్ధరాత్రి జైళ్లకు తరలించే పరిస్థితికి టీడీపీ కూటమి ప్రభుత్వం దిగజారిపోయిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. రెండ్రోజుల క్రితం అక్రమ అరెస్టుకు గురైన గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు ఎంపీటీసీ సభ్యురాలు కల్పన కుటుంబ సభ్యులు ఆయనతో కలిసి శనివారం గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి రెండు వినతిపత్రాలు అందించినట్లు అంబటి మీడియాకు చెప్పారు. కల్పనను రెండ్రోజుల క్రితం రాత్రిపూట బలవంతంగా అరెస్టుచేశారని.. కానీ, రిమాండ్ రిపోర్టులో మాత్రం సూర్యోదయం తర్వాత అరెస్టుచేసినట్లు నమోదు చేయడం దారుణమన్నారు. ఆమెపై 307 సెక్షన్ నమోదు చేశారని చెప్పారు. ఒక మహిళను అరెస్టుచేయాలంటే సుప్రీంకోర్టు నిబంధనలను పాటించాలని పోలీసులకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. తాడికొండ సీఐపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

వారిద్దరిపైనా చర్యలు తీసుకోలేదు..

సీమరాజు, కిరాక్ ఆర్పీ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు తనపైన.. ఇతర వైఎస్సార్‌సీపీ నేతలపైన అసభ్యకరమైన పోస్టులు, వీడియోలు పెడుతున్నట్లు ఐదు రోజుల క్రితం గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పీఎస్‌లో ఫిర్యాదు ఇచ్చానని అంబటి గుర్తుచేశారు. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. ఈ విషయంలో పట్టాభిపురం పీఎస్ సీఐకి తగు సూచనలివ్వాలని జిల్లా ఎస్పీని కోరానన్నారు. ఒకవేళ ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి వారిరువురిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. గతంలోనూ ఐదు ఫిర్యాదులు చేస్తే ఒక్కటి కూడా రిజిస్టర్ చేయలేదని.. దీంతో హైకోర్టును ఆశ్రయించగా, నాలుగింటిపై రిజిస్టర్ చేశారని అంబటి గుర్తుచేశారు.



కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు,
కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని
దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.చతుర్దశి రా.7.00 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: స్వాతి తె.5.28 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి విశాఖ, వర్జ్యం: ఉ.9.01 నుండి 10.48, దుర్ముహూర్తం: సా.4.38 నుండి 5.30 వరకు, అమృత ఘడియలు: రా.7.40 నుండి 9.27 వరకు, నిజకర్తరి ప్రారంభం.

సూర్యోదయం : 5.34
సూర్యాస్తమయం : 6.18
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

విరాట్ కోహ్లీ (స్టార్ క్రికెటర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఆట ఎన్ని పొరపాట్లనైనా క్షమించేస్తుంది. మళ్లీ మళ్లీ ఆడేందుకు అవకాశం ఇస్తూ ఉంటుంది.

కానీ పెళ్లయిన వాడి జీవితంలో ఒక్క పొరపాటుకైనా క్షమాపణ ఉండదు. పోన్లే పాపం, ఒక్క అవకాశం ఇచ్చి చూద్దాం అని జీవితం అనుకోదు. జీవితం దయ తలచినా, జీవిత భాగస్వామి క్షమాభిక్ష పెట్టదు!

ఎవరో తెలియనైనా తెలియని ఒక అమ్మాయికి ఇన్‌స్టాగ్రామ్‌లో పొరపాటున లైక్ కొట్టినందుకు అనుష్క నా వైపు చూడటమే మానేసింది! తెలియని అమ్మాయికి, తెలియకుండా లైక్ కొట్టడంలో ఉండేది పొరపాటే కానీ మరొకటి మరొకటి ఎందుకవుతుంది?!

నా నెత్తి మీద ఏ దేవతో ఆ క్షణంలో కూర్చొని ఉండాలి. ఊరికే ఫోన్ చూస్తూ ఉన్నప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ అమ్మాయి కనిపించింది. ప్రింటెడ్ ర్యాప్ స్కర్ట్, గ్రీన్ టాప్.

నా అంతట నేనే ఆ అమ్మాయి ఫొటోకి లైక్ కొట్టానా, లేక లైక్ తనంతటదే వెళ్లి ఆ అమ్మాయి ఫొటో కింద పడిందా తెలియటం లేదు. అసలు ఆ అమ్మాయే గుర్తు లేదు.

అమ్మాయి వేసుకున్న ర్యాప్ స్కర్ట్, గ్రీన్ టాప్ గుర్తుండీ, అమ్మాయి గుర్తు లేక పోవటం అనేది ఉంటుందా? ఉండొచ్చేమో!



నా నెత్తి మీద దేవతకు ఎంత మహిమ ఉందంటే... సరిగ్గా అనుష్క పుట్టిన రోజుకు మర్నాడే ఇలా జరిగింది. తనదొక రేర్ ఫొటోను వెతికి తీసి, 'యూ ఆర్ మై లవ్' అని కవిత్వం రాసి, తనకు బర్త్ డే విషెస్ చెప్పిన కొద్ది గంటలకే... ఆ ఎవరో తెలియని అమ్మాయికి నేను లైక్ కొట్టిన స్క్రీన్ షాట్‌లను క్రికెట్ అభిమానులు గొప్పగా సెలబ్రేట్ చేశారు. ఆ సెలబ్రేషన్ అనుష్క వరకు వచ్చింది.

"ప్రేమించుకుని కదా పెళ్లి చేసుకున్నాం... ఈ తిక్క వేషాలేంటి?" అని అనుష్క నన్ను డైరెక్ట్‌గా అడిగినా బాగుండేది. తన ముందు ఆరార్లు ముప్ఫై ఆరు గుంజీళ్లు తీసేవాడిని. పాపభూయిష్ఠమైన నా పొరపాటుకు నివృత్తి, నిష్కృతి రెండూ లభించేవి. తనకు సిక్సర్లంటే ఇష్టం. అందుకే అన్ని గుంజీళ్లు.

సిక్సర్లంటే తనకు ఇష్టమే కానీ, నేనంటే ఉండేంత ఇష్టమేమీ కాదు. మిడ్ ఓవర్స్‌లో స్పిన్ బాల్స్‌ని ఫేస్ చెయ్యలేక ఔట్ అయి బయటికి వచ్చిన ప్రతిసారీ... "నాకోసం అదే పనిగా సిక్సర్‌లు కొట్టేయనవసరం లేదు" అని నవ్వేసేది. ఇప్పుడు తనే నా మీద బౌన్సర్లు వేస్తోంది... తన మౌనంతో!

అనుష్క మాట్లాడటం లేదు. వామిక నిద్రపోతోంది. అకాయ్‌కి మాటలు రావటానికి ఇంకా టైమ్ పడుతుంది. అకాయ్ ఒక్కడే ఇంట్లో ఇప్పుడు నా మేల్ ఫ్రెండ్. వాడు నా చెయ్యి పట్టుకుని నడవటానికి, బ్యాట్ పట్టుకుని నాతో ఆడటానికి, బైక్ మీద కాలేజీకి వెళ్లి రావటానికి, మళ్లీ ఎప్పుడైనా అనుష్క నాతో మాట్లాడటం మానేసినప్పుడు.. "ఏంటి డాడీ అలా ఉన్నారు?" అని నన్ను అడగటానికి వాడికి టైమ్ పడుతుంది.

రెస్టారెంట్ నుంచి రాగానే అనుష్క నేరుగా పిల్లల గదిలోకి వెళ్లిపోయింది. రెస్టారెంట్ ముందు కార్లోంచి దిగుతున్నప్పుడు ఎప్పటిలా తనకు చెయ్యందించినా, తను నా చెయ్యందుకోలేదు. కనీసం నాకోసం ఆగనైనా ఆగకుండా నన్ను దాటుకుని, నడుచుకుంటూ రెస్టారెంట్ లోపలికి వెళ్లిపోయింది.

ఒక్క లైక్ జీవితాన్ని ఎంత ఛిద్రం చేసింది!

బాల్కనీలోకి వెళ్లి నిలుచున్నాను. సిటీ అంతా వెలిగిపోతోంది. నాలో మాత్రం చీకటి. ఎందుకు నేనలా చేశాను?!

ఆకాశంలో చుక్కలు మిణుకు మిణుకుమంటున్నాయి. ఒక చుక్క అమితాబ్ బచ్చన్. ఒక చుక్క బిల్ క్లింటన్. ఒక చుక్క బరాక్ ఒబామా. ఒక చుక్క బిల్ గేట్స్. ఆ చుక్కల్లో నేనూ ఒక చుక్కనయ్యానా? అనుష్కకు తీవ్రమైన ఆవేదన మిగిల్చినందుకు!

రాత్రి రెండు దాటేసినట్లుంది. మెల్లిగా అడుగులు వేసుకుంటూ పిల్లల గదిలోకి వెళ్లాను. వామిక నిద్ర పోతోంది. అకాయ్ నిద్ర పోతున్నాడు. అనుష్క నిద్ర పోతున్నట్లుగా ఉంది.

తను పడుకుని ఉన్న వైపు వెళ్లి, తన తల పక్కనే నేల పైన మోకాలి మీద కూర్చున్నాను.

విరమణ సరే, విధానం సంగతి!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

భారత్ – పాకిస్తాన్‌ల మధ్య వివాదాలన్నీ ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలనేది చాలా కాలంగా భారత్ అనుసరిస్తున్న స్థిరమైన విధానం. కశ్మీర్ అంశాన్ని తొలి రోజుల్లో ఐక్యరాజ్యసమితి వద్దకు తీసుకుపోవడం వలన నష్టం జరిగిందనే అభిప్రాయం ఇండియాకు ఏర్పడింది. పాక్, భారత్‌ల మధ్య రెండు కీలకమైన ఒప్పందాలున్నాయి. 1972 నాటి సిమ్లా ఒప్పందం, 1999లో ప్రకటించిన లాహోర్ డిక్లరేషన్. రెండు దేశాల నడుమ ఏ వివాదం తలెత్తినా ఈ రెండు ఒప్పందాల పరిధిలో, ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ చాలా కాలంగా దృఢమైన వైఖరితో ఉండేది. మూడో పక్షం మధ్యవర్తిత్వాన్ని భారత్ ఏనాడూ అంగీకరించలేదు.

ఇందుకు భిన్నంగా రెండు దేశాల వివాదంలో ఇప్పుడు మూడో పక్షం తలదూర్చిందా? కాల్పుల విరమణకు భారత్, పాకిస్తాన్ దేశాలు అంగీకరించాయనీ, ఇది వెంటనే అమల్లోకి వస్తుందనీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా సాయంత్రం 5.30కి ప్రకటించారు. అమెరికా మధ్యవర్తిత్వం వహించి, రాత్రంతా చర్చలు జరిపిన ఫలితంగా ఈ ఒప్పందం సాధ్యమైందని కూడా ఆయన వెల్లడించారు. కామన్ సెన్స్‌నూ, తెలివిడినీ ఉపయోగించినందుకు రెండు దేశాలనూ ఆయన అభినందించారు.

ఆ తర్వాత అరగంటకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణకు రెండు దేశాలూ అంగీకరించాయని ఆయన ధ్రువీకరించారు. సాయంత్రం ఐదు గంటలకే అమల్లోకి వచ్చినట్టు చెప్పారు. అయితే ఆయన ట్రంప్ ట్వీట్ ప్రస్తావన గానీ, అమెరికా మధ్యవర్తిత్వం గురించి గానీ మాట్లాడలేదు. ఈరోజు మధ్యాహ్నం 3:30కు పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో), ఇండియా డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ప్రతిపాదించారు. ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరిందని మిస్రీ చెప్పారు.

మూడో పక్షం జోక్యం లేకుండానే ఇరు దేశాలూ ఒప్పందానికి వచ్చాయనే విధంగానే ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత ట్వీట్ చేసిన విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంగానే దీన్ని అభివర్ణించారు. రేపు సోమవారం నాడు రెండు దేశాల మధ్య చర్చలు జరగబోతున్నాయని అధికారిక ప్రకటన వెలువడింది. రెండు దేశాల డీజీఎంవోలు మాట్లాడుకోవడానికి ముందు నుంచే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో రెండు దేశాల ముఖ్య నేతలతో మాట్లాడుతున్నట్టుగా వార్తలు వెలువడ్డాయి.

ఈ మొత్తం వ్యవహారంలో అమెరికా నిర్వహించిన పాత్రే మిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఉద్రిక్తతల సడలింపునకు కాల్పులు విరమణ పాటించాలని స్నేహపూర్వక సలహా మాత్రమే రెండు దేశాలకు ఇచ్చిందా? లేక చర్చల ప్రాతిపదికను తయారు చేసే మధ్యవర్తిత్వ పాత్ర పోషించిందా? ఒకవేళ మధ్యవర్తిగానే చర్చల ప్రాతిపదికను కూడా సిద్ధం చేసి ఉంటే దక్షిణాసియా భౌగోళిక రాజకీయాల్లో ఒక కీలకమైన మార్పు వచ్చినట్టే భావించాలి.

యుద్ధం అమానుషమైనది. అనాగరికమైనది. యుద్ధం కారణంగా దేశాలు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. యుద్ధ ప్రమాదాన్ని నివారించడం వివేకవంతమైన చర్యే! కాల్పుల విరమణ ఆహ్వానించదగ్గదే!

> యుద్ధం అమానుషమైనది. అనాగరికమైనది. యుద్ధం కారణంగా దేశాలు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. యుద్ధ ప్రమాదాన్ని నివారించడం వివేకవంతమైన చర్యే! కాల్పుల విరమణ ఆహ్వానించదగ్గదే! అయితే ఈ విరమణ వల్ల దేశం సాధించేది ఏమిటి? పోగొట్టు కునేదేమిటనే విశ్లేషణ కూడా అవసరం. యుద్ధం భారత్ ప్రారంభించలేదు. ఉగ్రవాదాన్ని ప్రయోగించి పాకిస్తానే కయ్యానికి కాలు దువ్వింది. బదులుగా పాక్‌లోని ఉగ్రవాద స్థావరాల మీద మాత్రమే భారత్ దాడులు చేసింది. నూరు శాతం కచ్చితత్వంతో చేసిన ఈ దాడులు పదును దేలిన భారత రణ వ్యూహానికీ, అద్భుతమైన సైనిక పాటవానికీ అద్దం పట్టాయి.

అయితే ఈ విరమణ వల్ల దేశం సాధించేది ఏమిటి? పోగొట్టుకునేదేమిటనే విశ్లేషణ కూడా అవసరం. యుద్ధం భారత్ ప్రారంభించలేదు. ఉగ్రవాదాన్ని ప్రయోగించి పాకిస్తానే కయ్యానికి కాలు దువ్వింది. బదులుగా పాక్‌లోని ఉగ్రవాద స్థావరాల మీద మాత్రమే భారత్ దాడులు చేసింది. నూరు శాతం కచ్చితత్వంతో చేసిన ఈ దాడులు పదును దేలిన భారత రణ వ్యూహానికీ, అద్భుతమైన సైనిక పాటవానికీ అద్దం పట్టాయి.

భారత దాడులకు పాక్ నివ్వెరపోయింది. అధీన రేఖ వెంబడి విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడింది. జనావాసాలను టార్గెట్‌గా చేసుకొని దాడులకు దిగింది. ప్రాణనష్టం, ఆస్తి నష్టం భారీగానే జరిగినట్టు కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పరోక్షంగా అంగీకరించారు. మిగిలిన సరిహద్దు రాష్ట్రాల కంటే జమ్మూకశ్మీర్ ఈ దారుణాన్ని ఎక్కువగా భరించవలసి వచ్చింది. పసిపిల్లలతో సహా సాధారణ ప్రజలను బలి తీసుకుంటున్న మహమ్మారి యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని కశ్మీర్ ప్రతిపక్ష నేత మెహబూబా ముఫ్తీ కన్నీళ్ళతో వేడుకున్నారు.

యుద్ధాలను వేగిరపడి ప్రారంభించడం కాకుండా పూర్తి ప్రణాళికను రచించుకొని మొదలుపెట్టాలనీ, వీలైనంత వేగంగా ముగించాలనీ, శత్రువు ప్రతిఘటనా శక్తిని దెబ్బకొట్టి పోరాడకుండానే యుద్ధాలను గెలిచే మార్గాలను అన్వేషించాలనీ సన్‌షూ తన యుద్ధతంత్ర గ్రంథమైన 'ఆర్ట్ ఆఫ్ వార్'లో చెబుతాడు. ఈ నాలుగు రోజుల భారత దాడుల్లో సన్‌షూ చెప్పిన 'ఆర్ట్ ఆఫ్ వార్' కనిపించింది. ఉగ్రవాద స్థావరాలపై గురి తప్పకుండా, సరిహద్దులు దాటకుండా దాడి చేయడం, పలువురిని మట్టు పెట్టడంతోనే భారత్ సగం యుద్ధాన్ని గెలిచింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేయడం, ఎనిమిది కీలకమైన ఎయిర్ బేస్‌లను దెబ్బతీయటం, బాలిస్టిక్ మిస్సైల్‌ను గాల్లోనే పేల్చేయడంతో పాకిస్తాన్ దాదాపుగా చేతులెత్తేసింది.

ఈ దశలోనే పాక్ నేతలు అమెరికా శరణు కోరి ఉంటారనీ, అవమానకరమైన ఓటమి నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేసి ఉంటారనీ అంచనాలు వెలువడుతున్నాయి. అమెరికా జోక్యం చేసుకున్న విషయం యథార్థం. అది ఏ మేరకు అన్నది తేలవలసి ఉన్నది. సాధారణ ప్రజలపై మారణ హోమం చేయడం తప్ప పాకిస్తాన్ సాధించిందేమీ లేదు. భారత్ సాధించిన ఈ వేగవంతమైన విజయం రేపు జరిగే చర్చల్లో ప్రభావవంతమైన పాత్రను పోషించాలి. భారత్ కోరుతున్న విధంగా ఉగ్ర హంతకులకు స్థావరం లేకుండా చేస్తామని అంగీకరించాలి. భారత్‌లో నేరాలకు పాల్పడిన ఉగ్రవాదులను అప్పగించడానికి అంగీకరించాలి. భారత కశ్మీర్‌లో వేలు పెట్టబోమని అంగీకరించే విధంగా పాక్‌పై ఒత్తిడి తేవాలి. సింధూనదీ జలాల ఒప్పందం నిలిపివేత విషయంలో పునఃసమీక్షకు అంగీకరించరాదు. అప్పుడే ఇది విజేత షరతుల మేరకు జరిగే ద్వైపాక్షిక చర్చలుగా పరిగణించవలసి ఉంటుంది. లేకుంటే మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోమన్న చారిత్రక విధానానికి వీడ్కోలు పలికినట్లవుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో కొసమెరుపు ఏమిటంటే... కాల్పుల విరమణ ప్రకటించిన మూడు గంటల తర్వాత సరిహద్దుల వెంబటి పాకిస్తాన్ ఆర్మీ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు వార్తలు వస్తున్నాయి. భారత భూభాగంపై కాల్పులు జరుపుతున్నాయి. ఇది పాకిస్తాన్ రాజకీయ నాయకత్వానికీ, ఆర్మీ నాయకత్వానికీ మధ్య సమన్వయ లోపమా? లేక రేపటి చర్చల్లో బేరమాడేందుకు తమ శక్తిని పెంచుకోవడానికి ఆ దేశం ఆడుతున్న నాటకమా? అదీ త్వరలోనే తేలుతుంది.

vardhelli1959@gmail.com

ఫేక్ న్యూస్‌తో జాగ్రత్త సుమా!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

దేశం యుద్ధ పరిస్థితుల్లో కూరుకుపోయిన సమయంలో శత్రువులు మన ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికీ, తమదే పైచేయి అని చెప్పడానికీ అనేక తప్పుడు వార్తలను ప్రచారం చేశారు. అదే సమయంలో కొందరు భారతీయులూ సోషల్ మీడియాలో నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఇష్టమొచ్చినట్లు రాశారు. ఇది మంచి పద్ధతి కాదు. రాజ్యాంగం ఇచ్చిన భావ వ్యక్తీకరణ హక్కును అనుసరించి ప్రతి పౌరుడు తన అభిప్రాయాలను, నమ్మకాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే స్వేచ్ఛ ఉంది. కానీ దాన్ని దుర్వినియోగపరచడం క్షంతవ్యం కాదు.

పహెల్‌గామ్‌లో పర్యాటకులను ఉగ్రవాదులు చంపిన నేపథ్యంలో భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాక్‌పై దౌత్యపరమైన చర్యలు తీసుకుంది. పాక్ ప్రభుత్వ అధికారిక ఎక్స్ అకౌంట్‌ను భారత్‌లో అందుబాటులో లేకుండా నిలిపివేసింది. పలువురు పాక్ జర్నలిస్టులకు చెందిన ఎక్స్ ఖాతాలను కూడా నిషేధించింది. తప్పుడు, రెచ్చ గొట్టే, సున్నితమైన మతపరమైన అంశాల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నాయని ఆరోపిస్తూ కేంద్రం 16 పాకిస్తాన్ యూట్యూబ్ చానళ్లపై కూడా నిషేధం విధించింది. ఇందులో పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అఖ్తర్‌కు చెందిన యూట్యూబ్ చానల్ కూడా ఉంది. హోం శాఖ సిఫారసు మేరకు డాన్ న్యూస్, జియో న్యూస్, సమా టీవీ, సునో న్యూస్, ద పాకిస్తాన్ రిఫరెన్స్ తదితర యూ ట్యూబ్ చానళ్లపై కేంద్రం నిషేధం విధించింది. ఆ తర్వాత పాక్ రక్షణ మంత్రి ఎక్స్ ఖాతాను కూడా నిలిపివేసింది. అలాగే పాక్ సినిమాల ప్రదర్శనపైనా నిషేధం అమలులోకి వచ్చింది.



అలాగే భారత్‌లోని అనేక వెబ్‌సైట్లనూ, యూట్యూబ్ చానళ్లనూ ప్రభుత్వం బ్లాక్ చేసింది. అందులో 'ద వైర్' న్యూస్ పోర్టల్ ఒకటి. ఇటువంటి వెబ్‌సైట్‌ను నిషేధిత జాబితాలో చేర్చడం న్యాయం కాదని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ డి.రాజా ఖండించారు. 'ద వైర్' వంటి వెబ్‌సైట్‌ను నిషేధించవలసిన అవసరం లేదు. ఆ పేరుమీద పత్రికా స్వేచ్ఛను నిలిపివేయడం న్యాయం కాదు. జాతీయ సమగ్రత కోసం పహెల్‌గామ్‌లో ఉగ్రవాదుల చర్యను ఖండించడం మంచిదే కాని, వైర్‌ను నిషేధించడం న్యాయం కాదని 'ఇంటర్నెట్ ఫ్రీడం ఫౌండేషన్' న్యాయవాదీ, ఫౌండర్ డైరెక్టర్ అయిన అపర్ గుప్తా అన్నారు. ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేయడం పరోక్ష యుద్ధంలో భాగం.

జమ్మూకశ్మీర్‌లోని రాజౌరిలో ఆర్మీ బ్రిగేడ్‌పై సూసైడ్ దాడి జరిగినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఏడు వీడియోలు పరిశీలించి అన్నీ అబద్ధాలే అని తేల్చింది. పంజాబ్‌లోని జలంధర్‌పై డ్రోన్ దాడి జరిగినట్లు వచ్చిన వార్త కూడా కల్పితమే అని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

ఓ పాత వీడియోపై కూడా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) వివరణ ఇచ్చింది. వాస్తవానికి ఆ క్షిపణి దాడి 2020లో లెబనాన్‌లోని బీరూట్‌లో జరిగిన పేలుడు ఘటన అని ప్రభుత్వం పేర్కొన్నది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ యూనిట్... ఆర్మీ కంటోన్మెంట్‌పై ఫిదాయీ సూసైడ్ దాడి జరగలేదని చాలా స్పష్టంగా వెల్లడించింది. ఇండియన్ ఆర్మీ పోస్టును పాకిస్తానీ దళాలు ధ్వంసం చేసినట్లు ప్రచారం అయిన మరో వీడియో కూడా ఫేక్ అని ప్రభుత్వం తేల్చింది. భారతీయ సైన్యంలో 20 రాజ్ బెటాలి యన్ అనే యూనిట్ లేనే లేదని ఫ్యాక్ట్ చెక్ పేర్కొన్నది.

పాకిస్తాన్‌లోని ప్రధాన మీడియాతో పాటు కొందరు సోషల్ మీడియాలో భారత ప్రజల్లో భయాందోళనలు కలిగించే లక్ష్యంతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేశారు. ఏది వాస్తవమో, ఏది కాదో తేల్చుకోవలసింది మనమే!

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ
'స్కూల్ ఆఫ్ లా' ప్రొఫెసర్

ప్లీజ్... అమ్మా మనిషే కదా!

సందర్భం



డా॥ సనా కౌసర్

ప్రతి సంవత్సరం మాతృదినోత్సవం వచ్చేసరికి, శుభాకాంక్షలు, పూల గుచ్ఛాలు, కేకులు, ప్రేమతో సోషల్ మీడియాలో 'మా అమ్మే దేవత' అనే సందేశాలు కనిపిస్తాయి. నిజమే, తల్లి ప్రేమ అనేది అంచనా వేయలేనిది. తల్లి అనగానే మనకు దయ, త్యాగం, సహనం గుర్తొస్తాయి. కానీ తల్లి కేవలం త్యాగమూర్తి కాదు; ఆమె కూడా మనిషే! ఆమెకు కూడా భావోద్వేగాలు, అవసరాలు, అలసట, వర్ణనాతీతమైన ఒత్తిళ్ళు ఉంటాయి.

అందుకే ఈ మాతృదినోత్సవం సందర్భంగా మనం గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, తల్లికి కేవలం బాధ్యతలు నిర్వర్తించడమే కాదు, ఆమెకు స్వతంత్రత, శారీరక, మానసికంగా ఆరోగ్యకరమైన జీవితం గడపడానికి అవసరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరికీ ఉంది.

తల్లికి బలం మాత్రమే కాదు, బలహీనతలూ ఉంటాయి. తల్లి కావడమనేది ఒక మానసిక విప్లవం. ఇది ఆమె శరీరాన్ని, జీవనశైలిని, భావజాలాన్ని పూర్తిగా మార్చేస్తుంది. తల్లితనంలో ఆనందం ఉంటుంది, కానీ అలసటను మిగిల్చే బాధ్యతలూ ఉంటాయి. తల్లిగా మారడం అనేది కేవలం శారీరక మార్పే కాదు, అది ఒక తీవ్రమైన న్యూరో–సైకలాజికల్ (నాడీ సంబంధిత–మానసిక) పరిణామం. గర్భధారణ, ప్రసవానంతర కాలంలో తల్లుల మెదడులో–అమిగ్డాలా, ప్రీఫ్రంటల్ కార్టెక్స్, హైపోథాలమస్ వంటి భాగాల్లో మార్పులు సంభవిస్తాయి. ఇవి తల్లిగా మారేందుకు సన్నద్ధతను కలిగిస్తాయి. అయితే అదే సమయంలో హార్మోనల్ మార్పుల కారణంగా మానసిక రుగ్మతలకు లోనయ్యే అవకాశాలు కూడా పెరుగుతాయి. తల్లుల మానసిక ఆరోగ్య సమస్యల్లో పోస్టుపార్టమ్ డిప్రెషన్ (ప్రసవానంతర మాంద్యం) అతి సాధారణం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి ఐదుగురి తల్లుల్లో ఒకరికి ప్రసవానంతర మాంద్యం వస్తోంది. దీంట్లో నిరాశ, అలసట, ఆసక్తి లేకపోవడం, కన్నీరు పెట్టుకోవడం, మనస్తాపం, ఆందోళన, శక్తి లోపం, ఆహారం తినకపోవడం, అధిక ఒత్తిడిని అనుభవించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు బిడ్డతో ఏర్పడే బంధాన్ని ప్రభావితం చేసి, వారి భావోద్వేగాలు, జ్ఞానాభివృద్ధిలో అడ్డంకులు కలిగిస్తాయి. తీవ్రమైన సందర్భాల్లో తల్లి ఆత్మహత్య ఆలోచనలకూ లోనవుతుంది. ప్రసవానంతర ఆందోళన (యాంగ్జయిటీ), ప్రసవానంతర 'వెర్రి ఆనందం' (బ్లూస్), అంతకంటే అరుదైన, అత్యవసర చికిత్స అవసరమయ్యే పోస్టుపార్టమ్ సైకోసిస్ కూడా తల్లుల్లో కనిపించవచ్చు. తగిన నిద్ర లేకపోవడం, కుటుంబ సహకారం లేకపోవడం, గతంలో ఏర్పడ్డ మానసిక గాయం, లేదా వ్యక్తిత్వ సంబంధమైన సమస్యలు ఈ రుగ్మతలను మరింత పెంచుతాయి.

తల్లుల మానసిక ఆరోగ్యం కేవలం ప్రసవానంతర దశకే పరిమితం కాదు. చాలామంది తల్లులు, ముఖ్యంగా మధ్య వయస్సులో ఉన్నవారు, పిల్లలు, భర్త, వృద్ధులైన తల్లితండ్రులు, ఆప్తుల బాధ్యతలు అన్నింటినీ భుజాలపై వేసుకుని జీవిస్తుంటారు. తామే చివరి వరకు ధైర్యంగా ఉండాల్సిన బాధ్యతను తీసుకుంటారు. కానీ దీన్ని వ్యాధి స్థాయికి చేర్చేలా తరచూ విసుగు, మానసిక అలసట, సానుభూతి లభించడం తగ్గడం, ఆరోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. ఇది బలహీనత కాదనీ, దీనికి వైద్యపరమైన గుర్తింపు అవసరమనీ మనం అంగీకరించాలి. అంతే కాకుండా ఆర్థిక ఒత్తిళ్ళు, దాంపత్య సమస్యలు, పెరుగుతున్న ఒంటరితనం, తల్లుల మానసిక స్థితిని ప్రభావితం చేస్తాయి. సైకియాట్రీలో ఇది సంచిత ఒత్తిడి (క్యుములేటివ్ స్ట్రెస్)గా పరిగణించబడుతుంది. ఒక తల్లి తాను చిన్నప్పటి నుంచి పొందిన అనుభవాలు, వ్యక్తిత్వ లక్షణాలు, సామాజిక మద్దతు ఆధారంగా తన మానసిక శక్తిని పెంపొందించుకుంటుంది. ప్రతీ దశలో తల్లుల మానసిక ఆరోగ్యం ప్రాధాన్యంగా చూడాల్సిన అంశం.

> తల్లిని సూపర్ ఉమన్‌గా చూడడం మంచిదే! కానీ, ఆమెను మనిషిగా చూడటం మరింత అవసరం. ప్రతి ఒక్కరికీ 'తల్లి కూడా తన కోసం తాను బతికే హక్కు ఉన్న వ్యక్తి' అనే అవగాహన పెరగాలి.




పిల్లలు పెద్దవాళ్లయి ఇంటిని విడిచి వెళ్ళిన తర్వాత తల్లులు బోలెడంత శూన్యత, నిరాసక్తతను అనుభవిస్తారు. 'నా అవసరం ఇంకెవరికీ లేదేమో' అనే భావన, 'ఇంక నేనెవరిని?' అనే ప్రశ్నకి సమాధానం వెతుకుతూ తల్లులు డిప్రెషన్, ఆందోళనలలోకి జారిపోతారు.

మన సమాజంలో తల్లిని 'అంతులేని త్యాగం చేసే దేవత'గా చూడటం వల్ల ఆమెకూ సమస్యలు వస్తాయి. దాన్ని అంగీకరించడంలో జంకుడు ఉంది. అందుకే, ప్రతి తల్లి మానసిక ఆరోగ్యం పట్ల మనం చైతన్యంతో ఉండాలి. కుటుంబ సభ్యులు, భర్త, సమాజం ఆమెకు మద్దతు ఇవ్వాలి. అవసరమైతే సైకియాట్రిక్ సలహా తీసుకోవడానికి సిగ్గుపడకుండా ప్రోత్సహించాలి. 'తల్లి కనుక ఏమన్నా తట్టుకుంటుంది' అనే అపోహను విడిచి పెట్టాలి. తల్లిని సూపర్ ఉమన్‌గా చూడడం మంచిదే! కానీ, ఆమెను మనిషిగా చూడటం మరింత అవసరం. తల్లి అలసినప్పుడు, ఏడుస్తున్నప్పుడు, అసహనంగా ఉన్నప్పుడు – ఆమెను విమర్శించకుండా అర్థం చేసుకోండి. ఆమెకు విశ్రాంతి, మద్దతు, గుర్తింపు అవసరం. ప్రతి ఒక్కరికీ 'తల్లి కూడా తన కోసం తాను బతికే హక్కు ఉన్న వ్యక్తి' అనే అవగాహన పెరగాలి.

ఈ మాతృదినోత్సవం, తల్లి ప్రేమను తిలకించే సందర్భం మాత్రమే కాదు – ఆమె మానసిక ఆరోగ్యాన్ని మనస్ఫూర్తిగా అర్థం చేసుకొని, దానిపై చైతన్యంతో స్పందించాల్సిన రోజు!

వ్యాసకర్త సైకియాట్రీ ఎమ్‌డీ విద్యార్థిని
(నేడు అంతర్జాతీయ మాతృ దినోత్సవం)

మోక్ష తత్త్వం



జ్యోతిర్మయం

కురుక్షేత్ర సంగ్రామంలో సమస్తాన్నీ పోగొట్టుకుని శోకంలో మునిగిన ధృతరాష్ట్రుడికి సముదాయింపుగా విదురుడు ఇలా చెప్పాడు: 'పూర్వం ఒక యాత్రికుల గుంపుకు ఒక దుర్గమారణ్యంలో కాలినడకన పోవలసి వచ్చింది. అధిక సంఖ్యలో క్రూరమృగాలకు తోడు... నరరూప రాక్షసులు కూడా సంచారం చేసే ఆ అరణ్యం జోలికి పోవడానికి యమభటులు కూడా భయపడేవారు. ఆ అరణ్యం మధ్యకు చేరగానే ఆ యాత్రికులకు భయం వేసి పరుగెత్తుతూ ఒక పాడు బడిన బావిలో పడ్డారు.

ఆ బావి గోడల నెరియలలోంచి మొలిచి ఎన్నో వందల ఏళ్ళుగా పెరిగిన లావుపాటి తీగలు చిక్కిరి బిక్కిరిగా వలలాగా అల్లుకుని ఉన్నాయి. ఆ వలలు వారిని బావి అడుగుకు పడకుండా అడ్డుకున్నాయి. అయితే ఆ తీగలలో కాళ్ళు ఇరుక్కుపోయి వాళ్ళు తలకిందులుగా వేలాడుతూ, ఊగుతూ భయంతో కేకలు వేశారు. తలక్రిందులుగా అలా బావిలో వేళ్ళాడుతూ అటూ ఇటూ ఊగుతున్న వాళ్ళ నోళ్ళకు ఆ చెట్ల మధ్య నుంచి ధారలుగా కారుతున్న తేనె కొద్ది కొద్దిగా అందుతూ ఆనందాన్ని కలిగించింది. అమృతంతో సమానమైనదిగా అనిపించిన ఆ తేనెను చప్పరిస్తూ వారు మైమరచిపోయారు. అలా చప్పరించడం అయిపోగానే తలకిందులుగా వేళాడుతూ ఆ తేనె ధార మళ్ళీ నోట్లో ఎప్పుడు పడుతుందా అని ఎదురు చూశారు.

ఈ భువిలో జన్మించడం ద్వారా సంసారమనే సాగరంలో పడే మనుష్యులు కూడా ఆ బావిలో పడిన మనుష్యుల వలెనే అన్ని భయాలలో, బాధలలో కూడా వైరాగ్య భావనను మాత్రం దగ్గరకు రానీయరు. ఇంకా ఏదో మధువు దొరుకుతుందని ఆశతో ఎదురు చూస్తూనే ఉంటార'ని కథ ముగించాడు విదురుడు.

ఉపమానమిదం రాజన్ మోక్షవిద్భిరుదాహృతమ్
సుకృతం విన్దతే యేన పరలోకేషు మానవః

అన్న వ్యాస మహాభారతంలోని శ్లోకం ద్వారా విదురుడు 'మోక్షతత్త్వం గురించి సమస్తమూ తెలిసిన పెద్దలు చెప్పిన పై కథలోని సంగతులను పూర్తిగా అర్థం చేసుకుని, వైరాగ్య భావనను ధారణ చేసిన మనుషులు పరలోకంలో పుణ్యఫలాన్ని పొందుతారు' అని సారాంశంగా చెప్పాడు.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

ప్రభుత్వాస్పత్రుల్లో జన్‌ఔషధి మందుల షాపులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో జన్‌ఔషధి మందుల షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వీటిని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. 16 జీజీహెచ్‌ల్లో 23 ప్రైవేట్ జనరిక్ మెడిసిన్ స్టోర్లు ఉన్నాయన్నారు. ప్రస్తుత విధానంలో లోపాలు ఉన్నాయని తెలిపారు. సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లోనూ జన్‌ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

గుండె నొప్పితో ఉపాధి కూలీ మృతి


మావుళ్లు (ఫైల్)

పెడన: ఉపాధి పనులు చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురై గుండె నొప్పితో కూలీ మృతి చెందిన ఘటన కృష్ణా జిల్లా పెడన మండలం మడక గ్రామంలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు..గ్రామానికి చెందిన అనగాని మావుళ్లు (49) రోజులాగే ఉదయం ఆరు గంటలకు చెరువు తవ్వకం పనులకు వెళ్లాడు. తోటి కూలీలతో కలసి పని చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గుండెల్లో నొప్పి వస్తోందని చెప్పాడు. గట్టుమీద కూర్చుని విశ్రాంతి తీసుకోవాలని తోటి కూలీలు సూచించారు. విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో మావుళ్లు ఆరోగ్యం విషమించడంతో హుటాహుటిన నందమూరు ఆరోగ్య ఉపకేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మావుళ్లు మృతి చెందాడు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతంలో సరైన సంరక్షణ చర్యలు ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. మావుళ్లు మృతదేహం వద్ద సహచర కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు.

తిరుపతిలో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్

ఎంపీ గురుమూర్తి లేఖతో స్పందించిన కేంద్ర ఆరోగ్య శాఖ



వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటును అధికారికంగా ప్రకటిస్తూ కేంద్రం పంపిన లేఖ

తిరుపతి మంగళం: తిరుపతిలో సీజీహెచ్‌ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. దీనికి సంబంధించి ఏప్రిల్ 4న కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్టు పేర్కొన్నారు. దీనికి స్పందించిన కేంద్రం శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసిందని ఎంపీ తెలిపారు. కేవలం విజయవాడ, నెల్లూరు, విశాఖ, గుంటూరుకు మాత్రమే పరిమితమైన ఈ వెల్‌నెస్ సెంటర్ తిరుపతిలో కూడా ఏర్పాటు చేయడం ద్వారా 15 వేల మంది కేంద్ర ప్రభుత్వ సంస్థాగత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పదవీ విరమణ పొందిన వారికి సరైన వైద్యం, రిఫరల్ సౌకర్యాలు అందుతాయన్నారు.

సింహాచలం ఈవోగా సుజాతకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: విశాఖ దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాతకి సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. అలాగే, ద్వారక తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం జాయింట్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్‌వీఎస్ఎన్ మూర్తిని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవదాయ శాఖ మల్టీజోన్1 రీజనల్ జాయింట్ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి వినయ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాళీయమర్ధనుడిగా నృసింహుడు



యాదగిరిగుట్ట: యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం అభిషేకాలు, నవకల శస్నపనం, శ్రీస్వామి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పూజలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీస్వామిని కాళీయమర్ధనుడిగా.. శ్రీకృష్ణాలంకార సేవలో ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం హనుమంత వాహనంపై శ్రీరామావతారం అలంకార సేవలో శ్రీస్వామిని ఊరేగించారు. అనుబంధ ఆలయమైన పాతగుట్ట ఆలయంలో సైతం జయంతి ఉత్సవాలను వైభవంగా జరిపిస్తున్నారు. ఆదివారం సాయంత్రం నృసింహ ఆవిర్భావ వేడుకతో శ్రీస్వామి వారి జయంతి ఉత్సవాలు ముగుస్తాయి.

ఉగ్గుపాలతో దేశభక్తి.. మాధవరం వీరుల స్ఫూర్తి!

రెండు పాక్ యుద్ధాల్లో ఆ గ్రామం సైనికులు 1,850 మంది

- ప్రస్తుతం పనిచేస్తున్న వారు 500 మంది
- మిలటరీ మాధవరంగా ప్రశంసలు


కదన రంగంలో ఇతర సైనికులతో మాధవరం జవానులు

తాడేపల్లిగూడెం: ఇక్కడి మట్టిలో పోరాట స్ఫూర్తి ఉంది. తల్లుల ఆశీస్సుల్లో సడలని దేశభక్తి ఉంది. భారత్‌తో గతంలో పాక్ జరిపిన రెండు యుద్ధాల్లో ఈ గ్రామం నుంచి దాదాపు 1,850 మంది పాల్గొనగా, ఇప్పుడు కూడా 500 మంది సైనికులుగా దేశానికి సేవలు అందిస్తున్నారు. వీరిలో దాదాపు 300 మంది తాజా ఆపరేషన్ సిందూర్‌లో ప్రత్యక్షంగా కదన రంగంలో ఉండగా, మరో 200 మంది 'ఏ క్షణమైనా సరిహద్దులకు రెడీ' అంటూ వివిధ బెటాలియన్లలో సిద్ధంగా ఉన్నారు. ఈ గ్రామమే పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం. పేరుకు ముందు 'మిలటరీ'ని చేర్చుకుని, 'మిలటరీ మాధవరం'గా ప్రసిద్ధి చెందిందంటే, భారత సైన్యంలో ఈ పంచాయతీ ముద్ర ఏమిటన్నది తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి మాతృమూర్తులు ఉగ్గు పాలలోనే దేశభక్తిని రంగరిస్తారు. దేశభక్తి గీతాలే లాలిపాటలవుతాయి. సైనిక హోదాల పేర్లే ఆ పాటల్లో పదాలుగా వినిపిస్తాయి.

యుద్ధం ఏదైనా కావచ్చు...

వాఘా బోర్డర్ కావచ్చు.. శత్రువుతో పోరాడే మరేదైనా ప్రాంతం కావచ్చు.. ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా శత్రువు తోకముడిచేలా పోరాటం చేయడం ఈ సైనికుల చిరునామా. బ్రిటిష్ రెజిమెంట్లలో కూడా ఈ గ్రామస్తులు వివిధ హోదాల్లో పనిచేశారు. సిపాయి నుంచి కల్నల్ వరకు మాధవరం వాసులు దేశ సైన్యంలో సేవలు అందచేశారు. ఇప్పటికీ అందజేస్తున్నారు. వివిధ సేవా పతకాలను అందుకున్నారు. మొదటి, రెండో ప్రపంచ యుద్ధం, చైనా, పాకిస్తాన్ యుద్ధాల్లో ఇక్కడి వీర జవానులు పాల్గొన్నారు. తొలి ప్రపంచ యుద్ధంలో 90 మంది. రెండో ప్రపంచ యుద్ధంలో 1,110 మంది. శ్రీలంక పీస్ కీపింగ్ ఫోర్సులో 12 మంది, 1960లో గోవా లిబరేషన్‌లో 150 మంది, 1962లో చైనా యుద్ధంలో 850 మంది, 1965 ఇండో–పాక్ వార్‌లో 900 మంది, 1971 బంగ్లా విముక్తి పోరాటంలో 950 మంది పాల్గొన్నారు.

సైనిక సేవల్లో నా కుమారుడు, కోడలు..



నా కుమారుడు మేజర్ డొంకా ప్రవీణ్, కోడలు మేజర్ డాక్టర్ హరిణి. వీరిరువురూ తాజా ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్నారు. ప్రవీణ్ ఆఫీసర్ స్థాయిలో పనిచేస్తుండగా, మా కోడలు హరిణి డాక్టర్‌గా సైనికులకు సేవలందిస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ రెండు సంవత్సరాల కుమారుడిని ఇంట్లో వదిలిపెట్టి కదన రంగానికి వెళ్లారు. నా భర్త ఆర్మీలో 20 సంవత్సరాలు 'నాయక్'గా సేవచేసి మరణించారు. ఇవన్నీ నాకు గర్వకారణాలు.

– డొంకా రత్నకుమారి

మా అమ్మాయి, అబ్బాయిని పంపుతా..



నా భర్త రాంబాబు. అరుణాచల్ ప్రదేశ్, రాయ్‌బరేలీ, శ్రీనగర్, అంబాలా (హర్యానా) రాజస్థాన్, గంగానగర్ ప్రాంతాల్లో సైన్యంలో పనిచేశారు. ప్రస్తుతం జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌గా (జేసీఓ) విధులు నిర్వర్తిస్తున్నారు. మా మావయ్య వేదాల కృష్ణమూర్తి ఆర్మీలో పనిచేశారు. మా ఇద్దరు మరుదులు రామచంద్రరావు, వెంకటేశ్వరరావులు ఆర్మీలో పనిచేస్తున్నారు. దేశం అవకాశం ఇస్తే నా కుమారుడిని, కుమార్తెను కూడా సైన్యంలోకి పంపడానికి సిద్ధం.

– వేదాల అనూష

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

మృతుల్లో ముగ్గురు కూలీలు, ఇరువురు ఆశావర్కర్లు


దుర్గ (ఫైల్)


విజయలక్ష్మి (ఫైల్)


తిమ్మరాజుపాలెం వద్ద బోల్తా కొట్టిన గ్రానైట్ లారీ

పర్చూరు(చినగంజాం)/ పమిడిముక్కల(పామర్రు) /గూడూరు: రాష్ట్రంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా, పర్చూరు మండలం, తిమ్మరాజుపాలెం జాతీయ రహదారిపై మార్టూరు నుంచి గుంటూరుకు వెళుతున్న గ్రానైట్ లారీ బోల్తాపడిన ఘటనలో ముగ్గురు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మార్టూరుకు చెందిన పాలపర్తి శ్రీను (25), తాళ్ళూరి ప్రభుదాసు (43), పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన తమ్మలూరి సురేంద్ర బాబు (28) మృతిచెందగా, డ్రైవర్ మస్తాన్‌వలి, క్లీనర్ రమేష్ స్వల్పగాయాలతో బయటపడ్డారు.

సదస్సుకు వెళుతూ..

కాగా, కృష్ణా జిల్లా గూడూరు మండలం తరకటూరు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఆశావర్కర్లు మృతి చెందారు. మృతుల్లో తాడంకి గ్రామానికి చెందిన ఊటుకూరి దుర్గ (45), గోపువానిపాలెం గ్రామానికి చెందిన తాడేపల్లి విజయలక్ష్మి (50) ఉన్నారు. ఆశా వర్కర్ల యూనియన్‌ను స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మచిలీపట్నంలో జరుగుతున్న సదస్సుకు వీరు వెళుతున్న ఆటోను, ఒక కారు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆశావర్కర్లు.. తాడంకికి చెందిన వాణి, మాగంటి సుజాత, మర్రివాడకు చెందిన గుండే నాగమల్లేశ్వరి, గుండె నిర్మలజ్యోతి తీవ్రంగా గాయపడ్డారు.

పెళ్లి ఇంట మృత్యు గంట!

- కృష్ణాజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- నవ వరుడు, అతడి బావ మృతి
- కారుపై పడిన మరో కారు
- డివైడర్‌ను ఢీకొని, ఎగిరి మరో కారుపై బోల్తా


ఘటనాస్థలిలో ప్రమాదానికి గురైన కార్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్/గన్నవరం రూరల్: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పెళ్లింట తీవ్ర విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నవ వరుడు, అతడి బావ మృతి చెందగా, ముగ్గురు చిన్నారులుసహా ఆరుగురు గాయపడ్డారు. ప్రాణాలు కోల్పోయిన ఇరువురిలో ఒకరికి గత నెల 30వ తేదీన వివాహమయ్యింది. కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం, వీరవల్లి వద్ద శనివారం జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే, హనుమాన్‌జంక్షన్‌కు చెందిన మూడెడ్ల స్వామి వెంకట ధీరజ్ (37) సీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఆడిటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి చిన్న బావ చీరా నవీన్ (35) కెనరా బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. గత నెల 30న ధీరజ్‌కు వివాహమైంది. ధీరజ్ భార్య రూప (32)తో కలిసి శనివారం సాయంత్రం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు బయలుదేరారు. వీరితో పాటుగా ధీరజ్ అక్క అలేఖ్య, మరో సోదరి ప్రవల్లిక, ఆమె భర్త చీరా నవీన్‌తో పాటు ముగ్గురు చిన్నారులు కూడా విజయవాడకు కారులో పయనమయ్యారు.

ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి..

మార్గం మధ్యలో వీరవల్లి వద్ద ఎదురుగా అవతలి వైపు రోడ్డులో వేగంగా వస్తున్న కారు ఒకటి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, ఎగిరి వీరు ప్రయాణిస్తున్న కారుపై పడింది. అప్పటి వరకూ కారులో సరదాగా మాటలు చెప్పుకుంటూ వెళుతున్న వీరంతా తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. అంబులెన్స్, ట్రక్కు ఆటోలో క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన చిన్నవుటపల్లి పిన్నమనేని సిద్దార్థ ఆస్పత్రికి తరలించారు. ధీరజ్, నవీన్ చికిత్స పొందుతూ మృతి చెందారు. ధీరజ్ భార్య రూప అపస్మారక స్థితిలో ఉంది. మృతుడు నవీన్‌కు కూడా రెండేళ్ల క్రితమే ప్రవల్లికతో వివాహం కావడం గమనార్హం. అలేఖ్య, ఆమె మూడేళ్ల కుమార్తె హంస్విక (4), కుమారుడు తనుష్ సాయి (2), ప్రవల్లిక, ఆమె రెండేళ్ల కుమార్తె ఎస్.జాన్విక గాయత్రి (1) కూడా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు.

ఎదుటి కారు డ్రైవర్ నిర్లక్ష్యం

ఎదురుగా వస్తున్న కారు డ్రైవర్, వీడియోగ్రాఫర్ కోసూరు శ్రీనివాసరావు తీవ్ర నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని ఘటనను బట్టి స్పష్టమవుతోంది. విజయవాడకు చెందిన అతడు హనుమాన్‌జంక్షన్‌లో ఒక శుభ కార్యానికి వీడియోగ్రఫీ పని నిమిత్తం వస్తున్నాడు. శ్రీనివాసరావు కూడా గాయాలపాలై ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మానవత్వం చాటుకున్న వైద్యుడు

రోడ్డు ప్రమాదానికి గురై రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రులను గుర్తించిన డాక్టర్ బి.కిషోర్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. ఈ మార్గంలో కారులో వెళుతున్న హైదరాబాద్ ఎమ్మోర్ హస్పటల్స్ ఎండీ డాక్టర్ బి.కిషోర్‌రెడ్డి రోడ్డు ప్రమాదాన్ని గమనించి హుటాహుటిన కిందకు దిగారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు ప్రాథమిక చికిత్స అందించారు.

నేటి నుంచి పాడేరులో మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు

రాష్ట్ర గిరిజన జాతరగా గుర్తింపు



సాక్షి, పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఈ నెల 11వతేదీ నుంచి 3 రోజుల పాటు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, గిరిజనుల ఇలవేల్పు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాలు రాష్ట్ర గిరిజన జాతరగా గుర్తింపు పొందాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సమ్మక్క, సారలమ్మ వనదేవతల గిరిజన జాతర తరువాత పాడేరు మోదకొండమ్మ జాతర రెండవ గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందింది. రాష్ట్ర విభజన అనంతరం మోదకొండమ్మ తల్లి ఉత్సవాలను రాష్ట్ర గిరిజన జాతరగా ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మోదకొండమ్మ తల్లి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, పాడేరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, కమిటీ ప్రతినిధులు చర్యలు తీసుకున్నారు. పట్టణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అచ్చం బుమ్రాలా..


సాత్విక్

ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడి పేరు భారతాల సాత్విక్. అన్నమయ్య జిల్లా నందలూరు సెయింట్ జోసఫ్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. తండ్రి శేషయ్య జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లగా.. సాత్విక్ తల్లి సుజాత, సోదరితో కలిసి అరవపల్లెలో నివసిస్తున్నాడు. ఓ రోజు వైఎస్సార్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందలూరు క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ సబ్ సెంటర్‌కు వచ్చాడు. తానూ బౌలింగ్ చేస్తానని అక్కడే ఉన్న కోచ్ ఫిరోజ్‌ఖాన్‌ను అడిగాడు. బాల్ చేతికివ్వగా.. అచ్చం బుమ్రా మాదిరిగానే సాత్విక్ కూడా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. దీంతో ఆశ్చర్యపోయిన కోచ్ ఫిరోజ్, అసిస్టెంట్ కోచ్‌లు.. సాత్విక్‌కు సబ్‌సెంటర్‌లో కోచింగ్ ఇస్తున్నారు. బుమ్రాను చూసి బౌలింగ్ నేర్చుకున్నట్లు సాత్విక్ తెలిపాడు. క్రికెట్‌లో రాణించాలనుకుంటున్నానని, అందుకు తగిన ప్రాక్టీస్ చేస్తున్నట్లు వెల్లడించాడు.

– రాజంపేట

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

మధ్య తరగతి ఉద్యోగుల రాష్ట్ర సదస్సులో వక్తల డిమాండ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అజయ్‌కుమార్ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని మధ్య తరగతి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. విజయవాడలో శనివారం ఈ సదస్సు జరిగింది. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని సదస్సు డిమాండ్ చేసింది. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాల రద్దుతో పాటు ఇతర డిమాండ్లతో ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సంఘం నేతలు పిలుపునిచ్చారు. సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కార్పొరేట్‌కు వత్తాసు పలికేందుకే లేబర్ కోడ్..

మధ్యతరగతి ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఆర్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ జరపకుండా కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను దొడ్డిదారిన తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్ అమల్లోకి వస్తే ఇప్పుడున్న అనేక హక్కులను కార్మికులు, ఉద్యోగులు, కోల్పోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ.. బ్యాంకుల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.కిశోర్‌కుమార్, బెఫీ నాయకుడు ఎస్.వి.రమణ, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు ఎల్.కృష్ణబాలాజీ, విద్యుత్ సంఘం రాష్ట్ర నాయకుడు ఎల్.రాజు, బ్యాంక్ అధికారుల సంఘం రాష్ట్ర నాయకుడు నర్సింహం, బీమా ఉద్యోగ సంఘం నాయకుడు కళాధర్ తదితరులు సదస్సులో పాల్గొన్నారు.








ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌లోని వైమానిక స్థావరాలే లక్ష్యంగా చేపట్టిన దాడులకు సంబంధించి భారత ఆర్మీ శనివారం విడుదల చేసిన వీడియోలోని దృశ్యాలివీ..

పాక్ రెక్కలు కత్తిరించాం



మన లాస్ట్ పంచ్ అదిరింది • వైమానిక, రాడార్ కేంద్రాలు నేలమట్టం

యుద్ధ విరమణకు కొద్ది గంటల ముందు దాయాదికి మన సైన్యం ఘనంగా లాస్ట్ పంచ్ ఇచ్చింది. ఏకంగా ఆరు కీలక పాకిస్తానీ వైమానిక స్థావరాలను నేలమట్టం చేసింది. వాటితో పాటు మరో రెండుచోట్ల రాడార్ వ్యవస్థలను కూడా ధ్వంసం చేసింది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక వాటిపై అత్యంత కచ్చితత్వంతో కూడిన వైమానిక దాడులతో పాక్‌కు కోలుకోలేని నష్టం మిగిల్చింది. అత్యాధునిక వైమానిక స్థావరాలతో సహా పాక్‌లో ఏ ప్రాంతమూ సురక్షితం కాదని మరోసారి రుజువు చేసింది. ఎనిమిది కీలక సైనిక స్థావరాలపై జరిగిన దాడుల్లో ఏ ఒక్కదాన్నీ పాక్ సైన్యం కనీస స్థాయిలో కూడా అడ్డుకోలేకపోయింది. దీనిపై సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. తమ దేశ భద్రత అక్షరాలా గాల్లో దీపమేనని మరోసారి తేలిపోయిందని పాక్ పౌరులు కూడా వాపోతున్నారు. సామాన్యులను వేధించడానికే తప్ప యుద్ధానికి తమ సైన్యం పనికిరాదంటూ అక్కడి నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సైన్యం కదలికలను అడ్డుకునేందుకే?

పాక్‌కు చెందిన కీలక వైమానిక స్థావరాలపై భారత్ భారీ స్థాయిలో దాడికి వెనక ప్రబల కారణాలే ఉన్నట్టు చెబుతున్నారు. శనివారం ఉదయం నుంచే తన సైన్యాన్ని వీలైనంతగా భారత సరిహద్దులకు తరలించేందుకు పాక్ సిద్ధమైందని నిఘా వర్గాలు కేంద్రానికి సమాచారమిచ్చాయి. దాంతో ఉద్రిక్తతలను మరింత పెంచేందుకే పాక్ నిర్ణయించుకుందని స్పష్టమైపోయింది. దాంతో సైనిక తరలింపులను అడ్డుకోవడమే లక్ష్యంగా అప్పటికప్పుడు వైమానిక స్థావరాలను మన బలగాలు లక్ష్యంగా చేసుకున్నాయి. అత్యాధునిక దీర్ఘశ్రేణి క్షిపణులు వాటిని గురి తప్పకుండా ఢీకొట్టి శిథిలాల దిబ్బలుగా మార్చేశాయి. తద్వారా పదాతి దళానికి అతి కీలకమైన వైమానిక దన్ను అందకుండా చేశాయి. అంతేగాక పాక్ యుద్ధ సన్నద్ధతపైనే చావుదెబ్బ కొట్టాయి. ''ఈ పరిణామం వల్లే మరో గత్యంతరం లేక పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. సాయంత్రానికల్లా కాల్పుల విరమణకు ఒప్పుకుంది'' అని రక్షణ నిపుణులు చెబుతున్నారు.

రహీం యార్‌ఖాన్

దక్షిణ పంజాబ్‌లో రహీం యార్‌ఖాన్ నగరంలోని వైమానిక స్థావరం. రాజస్తాన్ సరిహద్దులకు సమీపంలో ఉంటుంది. తూర్పు పాకిస్తాన్ మీదుగా మన సరిహద్దులపై దాడులకు అత్యంత అనువుగా ఉంటుంది. రాజస్తాన్‌లోని శ్రీగంగానగర్, జైసల్మేర్ వంటి పట్టణాలపై వైమానిక దాడులు ఇక్కడినుంచే జరిగాయి. ఇక్కడినుంచి పౌర విమానాల రాకపోకలు కూడా జరుగుతుంటాయి. మన వైమానిక దాడులతో ఈ బేస్‌తో పాటు ఇక్కడి రన్‌వే కూడా పూర్తిగా ధ్వంసమైనట్టు తెలుస్తోంది.

సుక్కూర్

భోలారీ ఎయిర్‌బేస్‌గా పిలుస్తారు. సింధ్ ప్రావిన్స్‌లో కరాచీ, హైదరాబాద్ నడుమ జంషోరో జిల్లాలో ఉంటుంది. పాక్‌కు జీవనాడి వంటి కరాచీ నగర రక్షణను కట్టుదిట్టం చేసే లక్ష్యంతో 2017లో ఈ ఎయిర్‌బేస్‌ను ఏర్పాటు చేశారు. సదరన్ ఎయిర్ కమాండ్ పరిధిలోకి వస్తుంది. ఆపరేషనల్ కన్వర్షన్ యూనిట్ తాలూకు 19 స్క్వాడ్రన్‌కు కేంద్రం. ఎఫ్–15ఏ, ఎఫ్–16, కొన్ని జేఎఫ్–17లతో పాటు ఏడీఎఫ్ యుద్ధ విమానాలకు విడిది కేంద్రం. పాక్ సైన్యం ఉపరితల ఆపరేషన్లకు అత్యవసరమైన లాజిస్టిక్ సపోర్ట్ తదితరాల్లో దీనిది కీలకపాత్ర. పాక్ వైమానిక స్థావరాలన్నింట్లోనూ అత్యాధునికమైనదిగా దీనికి పేరు. ఇక్కడ ఎస్ఏఏబీ 2000 ఎయిర్‌బార్న్ అర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టం (ఏఈడబ్ల్యూసీఎస్) ఉంది.

వైమానిక స్థావరాలు

చకాలా

నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌గా పిలుస్తారు. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో రావల్పిండిలో ఆ దేశ సైనిక ప్రధాన కార్యాలయానికి ఆనుకుని ఉంటుంది. ఆ దేశానికి అత్యంత కీలకమైన వైమానిక స్థావరమిది. వాయుసేన కార్యకలాపాలతో పాటు వీఐపీల రవాణా తదితరాలు కూడా ఇక్కడినుంచే కొనసాగుతాయి. ప్రధాని తదితర అత్యున్నత స్థాయి రాజకీయ నాయకులు, అత్యున్నత సైనికాధికారుల ప్రయాణాలకు ఉపయోగించే ఆధునిక విమానాలకు ఇది విడిది కేంద్రం. సీ–130, ఐఎల్–78 విమానాలకు స్థావరం. పాక్ ఎయిర్ మొబిలిటీ కమాండ్‌కు ప్రధాన కేంద్రం కూడా. భారత్‌తో 1965, 1971 యుద్ధాల్లో ఈ బేస్ అత్యంత కీలక పాత్ర పోషించింది. భారత్‌పై జరిపిన డ్రోన్ దాడులను ఇక్కడినుంచే పర్యవేక్షించారు. సైనిక విమానాల ఏరియల్ రీ ఫ్యూయలింగ్, రవాణా తదితర కార్యకలాపాలకు ఇది ప్రధాన బేస్. పాక్ వైమానిక దళానికి చెందిన ఆరు అత్యాధునిక ట్రాన్స్‌పోర్ట్ స్క్వాడ్రన్లకు అడ్డా. అంతేగాక ఎయిర్‌ఫోర్స్‌లో చేరేవారికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చే పాక్ వైమానిక దళ (పీఏఎఫ్) కాలేజీ కూడా ఇక్కడే ఉంది. అంతేగాక పాక్ వైమానిక దళానికి అతి కీలకమైన ఎయిర్‌బార్న్ అర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ (ఏఈడబ్ల్యూఈ) 'సాబ్ ఎరీఐ' వ్యవస్థకు కేంద్రం. కనుక చకాలా బేస్ అత్యాధునిక రక్షణ వలయం నడుమ ఉంటుంది. అంత కీలకమైన ఎయిర్‌బేస్‌పైనే మన వైమానిక దళం భారీ ఎత్తున దాడి చేసి ధ్వంసం చేసింది. తద్వారా పాక్‌లో ఏ సైనిక స్థావరం కూడా సురక్షితం కాదని దాయాదికి స్పష్టమైన సందేశమిచ్చింది.

రఫీకీ

పంజాబ్ ప్రావిన్స్‌లో జాంగ్ జిల్లాలోని షోర్‌కోట్‌లో ఇస్లామాబాద్‌కు 330 కి.మీ. దూరంలో ఉంటుంది. తొలుత షోర్‌కోట్ బేస్‌గా పిలిచేవారు. తర్వాత 1965 యుద్ధంలో మరణించిన స్క్వాడ్రన్ లీడర్ సర్ఫరాజ్ అహ్మద్ రఫీకీ పేరు పెట్టారు. చైనా నుంచి పాక్ కొనుగోలు చేసిన జేఎఫ్–17, మిరాజ్ వంటి అత్యాధునిక ఫైటర్ జెట్లు ఉండేదిక్కడే. వీటితోపాటు రవాణా తదితర అవసరాలకు వాడే సైనిక హెలికాప్టర్లకు కూడా రఫీకీ ఎయిర్‌బేస్ ప్రధాన కేంద్రం. ఇది సెంట్రల్ పంజాబ్‌లో అత్యంత వ్యూహాత్మక ప్రాంతంలో ఉంది. 10 వేల అడుగుల పొడవైన రన్‌వే, దానికి సమాంతరంగా ట్యాక్సీవే దీని ప్రత్యేకతలు. దాంతో ఇక్కడి యుద్ధ విమానాలు భారత సరిహద్దులపై దాడులకు అతి తక్కువ సమయంలో సన్నద్ధం కాగలవు. పాకిస్తాన్ రక్షణ నెట్‌వర్క్‌లో అతి కీలకమైన భాగమిది.

మురీద్

చక్వాల్ జిల్లాలో ఉన్న వైమానిక స్థావరం. పలు వైమానిక స్క్వాడ్రన్లకు కూడా నిలయం. దేశీయ షాపర్–1, తుర్కియే నుంచి తెచ్చుకున్న బైరక్తర్ టీబీ2, అకిన్సీ డ్రోన్లతో పాటు మానవ రహిత విమానాలు/యుద్ధ విమానాలు (యూఏవీ/యూసీఏవీ) తదితరాలకు కూడా ఇదే కేంద్రం. మూడు రోజులుగా భారత్‌పై జరిగిన దాడుల్లో కీలక పాత్ర పోషించింది. మనపైకి దూసుకొచ్చిన డ్రోన్లను ఇక్కడినుంచే ప్రయోగించారు. పాక్ డ్రోన్ వార్‌ఫేర్‌కు చక్వాల్ ప్రధాన కేంద్రంగా మారింది. డ్రోన్ల పర్యవేక్షణ, నిఘా సమాచార సేకరణతో పాటు దాడుల వంటివాటికి కూడా బేస్ ఇదే. డ్రోన్ల వాడకంలో సైనిక శిక్షణ కూడా ఇక్కడే ఇస్తుంటారు. మనపై డ్రోన్ దాడులకు ప్రతి చర్యగా మురీద్ ఎయిర్ బేస్‌ను సైన్యం లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేసింది. మతిలేని దాడులకు గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది.

రాడార్ కేంద్రాలు

సియాల్‌కోట్

పంజాబ్‌లోని సియాల్‌కోట్ వైమానిక కేంద్రంలో ఉంది. ఇక్కడ ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, మరో సైనిక విమానాశ్రయం ఉన్నాయి. ఇక్కడి రాడార్ కేంద్రం వైమానికంగా పాక్‌కు అతి కీలకమైనది. దాన్ని ధ్వంసం చేసిన నేపథ్యంలో ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పౌర విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది.

పస్రూర్

ఇది కూడా పంజాబ్‌లోనే సియాల్‌కోట్ జిల్లాలో ఉంది. ఇక్కడి రాడార్ కేంద్రాన్ని కూడా మన వైమానిక దళం నేలమట్టం చేసింది.

చునియన్

పంజాబ్ ప్రావిన్స్‌లో లాహోర్‌కు 70 కి.మీ. దూరంలో చునియన్ వద్ద ఉంటుంది. పాక్‌లోని ప్రాథమిక వైమానిక స్థావరాల్లో ఒకటి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎలాంటి ఉగ్రదాడినైనా

యుద్ధచర్యగా పరిగణిస్తాం

భారత ప్రభుత్వం హెచ్చరిక

న్యూఢిల్లీ: పహల్గాం ఉదంతం తర్వాత పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లపై క్షిపణుల వర్షం కురిపించిన భారత ప్రభుత్వం శనివారం ఉగ్రవాదం పట్ల తన వైఖరిని స్పష్టంచేసింది. ఇకపై దేశంలో ఎక్కడ ఉగ్రదాడులు జరిగినా వాటిని భారత ప్రభుత్వంపై యుద్ధంగా భావిస్తామని, అందుకు అనుగుణంగా దీటుగా స్పందిస్తామని కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. పహల్గాం తరహా దాడులకు పాల్పడేందుకు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం మరోసారి దుస్సాహసం చేయొద్దని భారత్ ఈ రకంగా హెచ్చరించింది. ఉగ్రదాడులకు పాల్పడి పాకిస్తాన్ పరోక్షంగా కవ్వింపు చర్యలకు దిగితే ఇకపై తాము ప్రత్యక్షంగా యుద్ధ చర్యలు చేపట్టేందుకు ఏమాత్రం వెనకాడబోమని భారత సర్కార్ హెచ్చరించింది. దీంతో భవిష్యత్తులో బైసారన్ తరహా హేయమైన దాడులకు దిగితే అసాధారణ పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఉగ్రమూకలకు భారత్ హెచ్చరికలు పంపింది. లక్షణరేఖ దాటొద్దని స్పష్టంచేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, త్రిదళాధిపతులతోపాటు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్‌తో ప్రధాని మోదీ శనివారం భద్రతా పరిస్థితులపై సమీక్ష జరిపిన వేళ భారత ప్రభుత్వం నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. అంతర్జాతీయచట్టాల ప్రకారం ఏదైనా దేశం ఇతర దేశంపై శత్రుభావన చూపితే ఆ బాధిత దేశం ఎలాంటి యుద్ధచర్యలు తీసుకునేందుకైనా నైతిక హక్కు ఉంటుంది.

పాక్ ఫేక్ ప్రచారం నమ్మొద్దు

- భారత సైనిక స్థావరాలు, క్షిపణి వ్యవస్థలు సురక్షితం
- మతం పేరిట చిచ్చు పెట్టడానికి పాక్ కుట్రలు
- విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ మండిపాటు



సోఫియా ఖురేషీ



విక్రం మిస్రీ



వ్యోమికా సింగ్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్, పంజాబ్‌లో సాధారణ ప్రజలు, జనావాసాలు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్తాన్ సైన్యం శనివారం దాడులకు పాల్పడినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ చెప్పారు. భారత్‌లో పలు సైనిక స్థావరాలను, ఎస్–400 క్షిపణి వ్యవస్థలను ధ్వంసం చేశామంటూ పాకిస్తాన్ చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తేల్చిచెప్పారు. పాక్ తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. మిస్రీ శనివారం సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను ఏమార్చడం పాక్ ప్రభుత్వానికి అలవాటేనని మండిపడ్డారు. ఇండియా వైమానిక, సైనిక స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని, ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఉద్ఘాటించారు. దేశంలో కీలక మౌలిక సదుపాయాలు, విద్యుత్, సైబర్ వ్యవస్థలపై దాడి చేశామంటూ పాక్ చేస్తున్న ప్రచారాన్ని విక్రం మిస్రీ తిప్పికొట్టారు. వాటిపై దాడిచేసే సత్తా పాక్ సైన్యానికి లేదని పేర్కొన్నారు. దుష్ప్రచారంతో మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి కుట్రలు సాగిస్తోందని దాయాది దేశంపై ధ్వజమెత్తారు. అమృత్‌సర్ సాహిబ్ వైపు భారత సైన్యం క్షిపణులు ప్రయోగించిందని పాక్ ప్రకటించడం పట్ల మిస్రీ ఆగ్రహం వ్యక్తంచేశారు. భారతదేశాన్ని విభజించే కుట్రలు సాగవని తేల్చిచెప్పారు. భారత సైన్యం అఫ్గానిస్తాన్‌పై ఎలాంటి దాడి చేయలేదని అన్నారు. భారత ప్రభుత్వాన్ని సొంత ప్రజలే విమర్శిస్తున్నారంటూ పాక్ మరో తప్పుడు ప్రచారానికి తెరతీసిందని విమర్శించారు. పాక్ ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలే దూషిస్తున్న సంగతి ప్రపంచం మొత్తానికి తెలుసని విక్రం మిస్రీ స్పష్టంచేశారు. జమ్మూకశ్మీర్‌లో పాక్ దాడుల్లో ఆరుగురు మరణించారని చెప్పారు. పాక్ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యాఖ్యానించారు. వాటిని సైన్యం ఎప్పటికప్పుడు దీటుగా ఎదుర్కొంటోందని వివరించారు.

26 ప్రాంతాలపై దాడులకు పాక్ యత్నం

పాక్ సైన్యం శుక్రవారం రాత్రి ఎయిర్‌బేస్‌లు, రవాణా కేంద్రాలు సహా 26 కీలక ప్రాంతాలపై దాడులకు ప్రయత్నించిందని కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. పంజాబ్‌లోని ఎయిర్ బేస్‌పై హైస్పీడ్ మిస్సైల్ ప్రయోగించిందని అన్నారు. శ్రీనగర్, అవంతిపుర, ఉదంపూర్ సమీపంలో ఆసుపత్రులు, పాఠశాలల సమీపంలో దాడులు జరిగాయని తెలిపారు. పాక్ సైన్యం డ్రోన్లు, ఫైటర్ జెట్లు, లాంగ్ రేంజ్ మిస్సైళ్లు ప్రయోగించినట్లు వెల్లడించారు. భారత సైన్యం మాత్రం ముందుగా గుర్తించిన టార్గెట్లపైనే దాడికి దిగినట్లు స్పష్టం చేశారు. ప్రధానంగా పాక్ సైన్యానికి సంబంధించిన టెక్నికల్ సదుపాయాలు, కమాండ్, కంట్రోల్ సెంటర్లు, రాడార్ కేంద్రాలు, ఆయుధాగారాలపై దాడి చేసినట్లు వెల్లడించారు. భారత సైనిక దళాలు పూర్తి అప్రమత్తంగా ఉన్నట్లు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వివరించారు. పాక్ దాడులను గట్టిగా తిప్పికొట్టినట్లు స్పష్టంచేశారు. భారత్‌కు భారీ నష్టం కలిగించామంటూ పాక్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. పాక్ ప్రచారాన్ని తిప్పికొట్టడానికి, వాస్తవాలు బహిర్గతం చేయడానికి ప్రభుత్వం సిర్సా, సూరత్‌గఢ్, అజంగఢ్ ఎయిర్ బేస్‌ల ఫొటోలు, వీడియోలు విడుదల చేసింది. ఈ ఫొటోలపై తేదీ, సమయం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

8 పాక్ సైనిక స్థావరాలు ధ్వంసం

నాలుగు భారత వైమానిక స్థావరాలపై దాడికి పాక్ విఫలయత్నం చేసినట్టు ఖురేషీ తెలిపారు. ''ఉదంపూర్, పఠాన్‌కోట్, అదంపూర్, భుజ్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్లపై దాడులకు పాక్ ప్రయత్నించింది. క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లకు స్వల్పనష్టం వాటిల్లింది. ఆ దాడులను మన సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. బదులుగా ఆరు పాక్ వైమానిక స్థావరాలు, రెండు రాడార్ కేంద్రాలపై దాడులు చేసింది. వాటిని చాలావరకు ధ్వంసం చేసి భారీ నష్టం మిగిల్చింది. కేవలం పాక్ ఎయిర్‌బేస్‌లపైనే దాడి చేశాం. సామాన్య జనావాసాలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం'' అని వివరించారు. హరియాణాలోని సిర్సాలో పాక్ క్షిపణి ఫతే–2ను భారత సైన్యం విజయవంతంగా నేలమట్టం చేసిందన్నారు.

అఫీషియల్ బెగ్గర్

పాక్‌పై ఒవైసీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: పాకిస్తాన్ మానవజాతికే ముప్పుగా తయారైందని ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఆ దేశం వద్ద అణ్వాయుధాలను లేకుండా చేయాలని అగ్ర రాజ్యాలను ఆయన కోరారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్)నుంచి అతికష్టమ్మీద ఉద్దీపన ప్యాకేజీ పొందిన పాకిస్తాన్‌ను అధికారిక బిచ్చగాడు (అఫీషియల్ బెగ్గర్)అంటూ ఒవైసీ అభివర్ణించారు. శనివారం ఆయన ఏఎన్ఐకిచ్చిన ఇంటర్వ్యూలో పాకిస్తాన్ నిర్వాకాలను ఎండగట్టారు. 'ఒసామా బిన్ లాడెన్ పాకిస్తాన్‌లోని సైనిక ప్రాంతంలో ఆశ్రయం పొందుతూ దొరికిపోయాడు. పాక్ విఫల దేశమనే విషయాన్ని పశ్చిమ దేశాలు గుర్తించాలి. ఆ దేశం వద్ద అణ్వాయుధాలనేవీ లేకుండా చేసేందుకు అనువైన సమయమిదే. ఈ విషయాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాలి. మానవాళికే ఆ దేశం ముప్పుగా మారింది'అంటూ ఒవైసీ నిప్పులు చెరిగారు. 'ఐఎంఎఫ్ నుంచి 100 కోట్ల డాలర్ల రుణంగా తీసుకున్న పాక్ నేతలు అఫీషియల్ బెగ్గర్స్. పాక్‌కు అప్పిచ్చేందుకు అమెరికా, జర్మనీ, జపాన్ ఎలా అంగీకరించాయి? ఈ డబ్బును పేదరికాన్ని నిర్మూలించేందుకు గానీ పోలియో తగ్గించేందుకు గానీ వాడరు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్ర కార్యకలాపాలకే ఈ సొమ్మును పాక్ వాడుతుంది'అని ఒవైసీ ఆరోపించారు. అదేవిధంగా ఆయన, పాకిస్తాన్ తన సైనిక ఆపరేషన్‌కు బున్యన్–అల్–మర్సూస్'అని పేరుపెట్టడంపైనా ఆయన మండిపడ్డారు. పవిత్ర ఖురాన్‌లోని వాక్కులను పాక్ దుర్వినియోగం చేసిందన్నారు.

విరమణ.. ఉల్లంఘన

▶ మొదటి పేజీ తరువాయి

ట్రూత్ సోషల్‌లో సాయంత్రం ఐదింటి ప్రాంతంలో ఈ మేరకు పోస్ట్ చేశారు. ''అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చోపచర్చల అనంతరం ఎట్టకేలకు ఇరు దేశాలూ తక్షణం పూర్తిస్థాయి కాల్పుల విరమణకు అంగీకరించాయి'' అని పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా అవే వ్యాఖ్యలు చేశారు. ప్రధానులు నరేంద్ర మోదీ, షహబాజ్ షరీఫ్‌లకు అభినందనలు తెలిపారు. ట్రంప్ బృందం ఈ దిశగా అద్భుతంగా పని చేసిందని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చెప్పుకొచ్చారు. సాయంత్రం ఆరింటికి విదేశాంగ కార్యదర్శి మిస్రీ మీడియా ముందుకొచ్చారు. ''పాక్ విజ్ఞప్తి మేరకే విరమణకు ఒప్పుకున్నాం. శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు పాక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ భారత డీజీఎంఓకు ఫోన్ చేశారు. వారి నడుమ చర్చల ఫలితంగా ఈ మేరకు ఒప్పందం కుదిరింది'' అని స్పష్టం చేశారు. దీనిపై డీజీఎంఓల నడుమ సోమవారం పూర్తిస్థాయి చర్చలు జరుగుతాయని వెల్లడించారు. ''శాంతి సాధనకు ఇది నూతన ప్రారంభం. కాల్పుల విరమణకు చొరవ చూపినందుకు ట్రంప్, వాన్స్, రూబియోలకు కృతజ్ఞతలు'' అంటూ పాక్ ప్రధాని షహబాజ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) అధినేత బిలావల్ భుట్టో, ప్రజాప్రతినిధులు తదితరులు ఒప్పందాన్ని స్వాగతించారు. అనంతరం తన గగనతలాన్ని తెరుస్తున్నట్టు పాక్ ప్రకటించింది.

బయటపడ్డ పాక్ నైజం

కొద్ది గంటలైనా గడవకుండానే పాక్ తన బుద్ధి బయటపెట్టుకుంది. విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ శనివారం రాత్రి ఏడింటి నుంచే మరోసారి సరిహద్దుల వెంబడి దాడులకు దిగింది. జమ్మూ కశ్మీర్ మొదలుకుని గుజరాత్ దాకా పలుచోట్ల డ్రోన్ దాడులు జరిగాయి. శ్రీనగర్‌లో భారీ పేలుడు శబ్దాలు విన్పించాయి. బారాముల్లా తదితర చోట్ల సైనిక స్థావరాల సమీపంలో డ్రోన్లు ఎగురుతూ కన్పించాయి. దీనిపై జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. ''శ్రీనగర్ అంతటా పేలుళ్ల శబ్దాలే. ఏమిటిది? విరమణకు అప్పుడే తూట్లా?'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు మొదలయ్యాయి. పాక్ దాడులకు మన సైన్యం దీటుగా బదులిచ్చింది. జమ్మూ, శ్రీనగర్, గుజరాత్‌లోని భుజ్ తదితర చోట్ల పాక్ డ్రోన్లను బలగాలు కూల్చేశాయి. కచ్ తదితర చోట్ల కూడా డ్రోన్లు కన్పించినట్టు రాష్ట్ర మంత్రి హర్ష్ సంఘవి ధ్రువీకరించారు. ముందుజాగ్రత్తగా సరిహద్దు రాష్ట్రాల్లో పలుచోట్ల కరెంటు సరఫరా నిలిపేసి బ్లాకౌట్ పాటించారు. అయితే శనివారం అర్ధరాత్రికల్లా పాక్ వెనక్కు తగ్గిందని, నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు దాదాపుగా ఆగిపోయాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఆ పేరు వెనక...

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'కు ప్రతిగా చేపట్టిన సైనిక దాడులకు పాకిస్తాన్ 'బునియాన్ అల్–మర్సూస్' అని పేరు పెట్టింది. ఇది పవిత్ర ఖురాన్‌లోని పదబంధం. శత్రు దుర్భేద్య కుడ్యం లేదా ఉక్కు గోడ అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఖురాన్ కోణంలో చూస్తే ధర్మబద్ధమైన కారణం కోసం పోరాడుతున్న విశ్వాసుల మధ్య ఐక్యత, బలానికి ప్రతిరూపంగా ఈ పదబంధాన్ని ఉపయోగిస్తారు. కోటను శత్రు దుర్భేద్యంగా ఎత్తయిన, అత్యంత పటిష్టమైన గోడలతో నిర్మిస్తారు. అలాగే సైనికులంతా ఐక్యంగా దేశాన్ని కాపాడుకోవాలన్న ఉద్దేశ్యంతో 'బునియాన్ అల్–మర్సూస్' ఆపరేషన్‌ను సైన్యం ప్రారంభించిందని రేడియో పాకిస్తాన్‌లో తొలుత వార్తలు వినిపించాయి. గోడ దాటి శత్రువులు చొరబడినట్లుగా సరిహద్దు దాటి భారత క్షిపణులు సైతం పాక్ గగనతలంలోకి చొరబడ్డాయని పాకిస్తాన్ ఆరోపించింది. ఆ ఆరోపణలకు బలం చేకూర్చేలా తమ 'ఉక్కు గోడ'ను కాపాడుకుందామని సైన్యానికి పాక్ ప్రభుత్వం పిలుపునిచ్చిందని 'రేడియో పాకిస్తాన్' పేర్కొంది.

పాక్ గగనతలంపై ఆంక్షల ఎత్తివేత

ఇస్లామాబాద్: తమ గగనతలంపై ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. అన్ని ఎయిర్‌పోర్టుల్లోనూ, అన్ని రకాల విమానాల రాకపోకలకు అనుమతిస్తున్నట్లు తెలిపింది. భారత్‌తో కాల్పుల విరమణకు అంగీకరించిన కొద్దిసేపటికే ఈ మేరకు ప్రకటించడం గమనార్హం. భారత్‌తో ఉద్రిక్తతలు సమసిపోవడంతో దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నట్లు భావిస్తున్నామని పాకిస్తాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. 'దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో సాధారణ విమాన సర్వీసుల కార్యకలాపాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికులు విమానయాన సంస్థలను సంప్రదించి తమ విమానాల షెడ్యూల్ వివరాలను తెలుసుకోవచ్చు'అని కోరింది.

పాకిస్తాన్‌కు మా మద్దతు కొనసాగుతుంది

చైనా విదేశాంగ మంత్రి యాంగ్ యీ స్పష్టీకరణ

బీజింగ్: పాకిస్తాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, జాతీయ స్వాతంత్ర్యం కోసం తమ మద్దతు కొనసాగుతుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టంచేశారు. పాక్‌కు అండగా ఉంటామని ఉద్ఘాటించారు. ఆయన శనివారం పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాఖ్ దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్–పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, తాజా పరిణామాలను ఇషాఖ్ దార్ వివరించారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లోనూ పాకిస్తాన్ నాయకత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని వాంగ్ యీ ప్రశంసించారు. పాక్ సంయమన ధోరణిని కొనియాడారు. మిత్రదేశమైన పాక్‌కు తమ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్, తుర్కియే విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్‌తోనూ ఇషాఖ్ దార్ ఫోన్‌లో మాట్లాడారు.









నియంత్రణ రేఖ వెంబడి శనివారం పాకిస్తాన్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో జమ్మూ, రాజౌరీ, పూంఛ్ జిల్లాల పరిధిలో దెబ్బతిన్న పలు నివాసాలు, వాహనాలు

సరిహద్దుల్లో కాల్పుల మోత

కశ్మీర్ నుంచి గుజరాత్ దాకా | జమ్మూకశ్మీర్‌లో ఆరుగురి మృతి

న్యూఢిల్లీ/జమ్మూ/శ్రీనగర్: సరిహద్దుల వెంబడి పాక్ సైన్యం కాల్పులు శనివారం వరుసగా పదహారో రోజు కూడా కొనసాగాయి. దాంతో పశ్చిమ సరిహద్దు ప్రాంతాలు దద్దరిల్లాయి. ఆపరేషన్ బున్యాన్ ఉల్ మర్సూస్ (పడగొట్టలేని దృఢమైన గోడ) పేరిట శుక్రవారం అర్ధరాత్రి నుంచి జమ్మూ కశ్మీర్ మొదలుకుని గుజరాత్ దాకా సైన్యం భారీ కాల్పులకు పాల్పడింది. సైనిక స్థావరాలతో పాటు సాధారణ జనావాసాలు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంది. పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్, హోషియార్‌పూర్, అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, తార్న్‌తరన్, హరియాణాలోని సిర్సాలో కాల్పులు, పేలుళ్ల శబ్దాలు విన్పించాయి. పాక్ కాల్పులను సైన్యం దీటుగా తిప్పికొట్టింది. మన ప్రతిదాడుల భయంతో శనివారం తెల్లవారుజాము 3.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా పాక్ తన గగనతలాన్ని పూర్తిగా మూసేసింది.

ప్రభుత్వాధికారి సహా ఆరుగురి మృతి

పాక్ కాల్పుల్లో జమ్మూలో ఆరుగురు మరణించారు. 8 మంది బీఎస్ఎఫ్ సిబ్బంది సహా 20 మంది గాయపడ్డారు. మృతుల్లో రాజౌరీ జిల్లా అభివృద్ధి విభాగం అదనపు కమిషనర్ రాజ్‌కుమార్ థాపా, ఓ సైనికాధికారితో పాటు రెండేళ్ల బాలిక ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక పాక్ సైన్యం సామాన్యులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడటమే గాక డ్రోన్లు ప్రయోగించిందని పేర్కొన్నారు. జమ్మూ సహా పలు పట్టణాలు, గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. సైరన్లు నిరంతరాయంగా మోగుతుండడంతో భయాందోళనలకు గురయ్యారు. శనివారం ఉదయం 5 గంటలకు భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. రాజ్‌కుమార్ థాపా అధికారిక నివాసంపై కాల్పుల్లో ఆయనతో పాటు ఇద్దరు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. థాపా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. దాంతో స్థానికంగా విషాదం అలుముకుంది. థాపా శుక్రవారం సైతం విధుల్లో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రితో కలిసి జిల్లావ్యాప్తంగా పర్యటించారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. పాక్ దాడుల్లో రాజౌరీ టౌన్‌లో ఐషా నూర్ (2), మొహమ్మద్ షోహిబ్(35) మృతిచెందారు. పూంఛ్ జిల్లాలో రషీదా బీ(55) ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు గాయాలపాలయ్యారు. జమ్మూ జిల్లా ఆర్.ఎస్.పురా సెక్టార్‌లో అశోక్ కుమార్ అనే పౌరుడు విగతజీవిగా మారాడు. పూంఛ్‌లోని కృష్ణఘాటీ సెక్టార్‌లో బాంబు పేలుడులో హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్ అమరుడయ్యాడు. జమ్మూ శివార్లలోని ఖేరీ కేరాన్ గ్రామంలో జకీర్ హుస్సేన్ (45) మరణించాడు.

శ్రీనగర్‌లో భారీ పేలుళ్లు

శ్రీనగర్ శనివారం పేలుళ్లతో దద్దరిల్లింది. ఉదయం 11.45 గంటల వేళ ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు శక్తిమంతమైన పేలుళ్లు సంభవించినట్లు అధికారులు చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అంతకుముందు నగరంలో పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. శ్రీనగర్‌లోని ఓల్డ్ ఎయిర్‌ఫీల్డ్ వైపు దూసుకొచ్చిన ఓ డ్రోన్‌ను సైన్యం కూల్చివేసింది.

సీఎం ఒమర్ సంతాపం

రాజ్‌కుమార్ థాపా మరణం పట్ల జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంతాపం ప్రకటించారు. అంకితభావం కలిగిన సీనియర్ అధికారిని కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. జమ్మూలో దాడులు జరిగిన ప్రాంతాల్లో ఒమర్ పర్యటించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి ప్రజలకు స్థైర్యం చెప్పే ప్రయత్నం చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు

కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

జమ్మూ: పాకిస్తాన్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన సరిహద్దు ప్రాంతాల్లోని వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. బారాముల్లా, పూంఛ్, రాజౌరీ, జమ్మూ సెక్టార్లపై నాలుగు రోజుల పాటు జరిగిన కాల్పుల్లో జిల్లా అదనపు అభివృద్ధి కమిషనర్ సహా 19 మంది చనిపోయారు. 'పాక్ వైపు నుంచి జరిగిన కాల్పుల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర వేదన కలిగించింది. మా ప్రజలకు కలిగిన నష్టాన్ని సాధ్యమైనంత మేర తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటాం. ఆప్తులను కోల్పోయిన వారి వేదనను తగ్గించలేకపోవచ్చు గానీ ఆ కుటుంబాలకు మా వంతు మద్దతుగా రూ.10 లక్షల చొప్పున అందజేస్తాం'అని సీఎం ఒమర్ పేర్కొన్నారు.

హిమాచల్‌లో డ్రోన్, క్షిపణుల శకలాలు

హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం ఉనా జిల్లాలోని బెహాద్ గ్రామంలో శనివారం క్షిపణి శకలాలు లభ్యమయ్యాయి. కాంగ్రా జిల్లా నూర్పూర్‌లో రెండుచోట్ల డ్రోన్, మిస్సైల్ విడిభాగాలను గుర్తించారు. అవి సైన్యం కూల్చివేసిన పాక్ డ్రోన్లు, క్షిపణుల విడిభాగాలని అంచనా వేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత అక్కడ భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

సైనిక పోస్టులు, ఉగ్ర లాంచ్‌ప్యాడ్‌లు ధ్వంసం

జమ్మూ సమీపంలో పాకిస్తాన్ భూభాగంలో సైనిక పోస్టులతో ఉగ్రవాదుల లాంచ్‌ప్యాడ్‌లను భారత సైన్యం ధ్వంసం చేసింది. ''భారత్‌పై డ్రోన్ దాడులకు ఈ లాంచ్‌ప్యాడ్‌లనే వాడారు. ఇవి పాక్‌లోని సియాల్‌కోట్ జిల్లా లూనీలో ఉన్నాయి'' అని బీఎస్ఎఫ్ వెల్లడించింది. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాక్ భూభాగం నుంచి జరిగిన కాల్పులకు గట్టిగా బదులిచ్చామని వెల్లడించింది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో బీఎస్ఎఫ్ పోస్టులే లక్ష్యంగా పాక్ సైన్యం దాడులకు దిగింది. దాంతో పాక్ రేంజర్ల క్యాంపులపై బీఎస్ఎఫ్ విరుచుకుపడింది.



హరియాణాలోని సిర్సాలో పడిన గుర్తు తెలియని శకలాన్ని, తిలకిస్తున్న ప్రజలు



అమృత్‌సర్‌లో పడిన పాక్ డ్రోన్ శకలాలు, పేలుడు సామగ్రి



అమృత్‌సర్‌లో పడిన కమికాజ్ శకలం

కమికాజ్ డ్రోన్లను ప్రయోగించిన పాక్

విజయవంతంగా ధ్వంసం చేసిన భారత్

న్యూఢిల్లీ: స్వార్మ్ డ్రోన్లతోపాటు కమికాజ్ డ్రోన్లను భారత్‌లో విధ్వంసానికి పాకిస్తాన్ ప్రయోగించగా భారత్ వాటిని విజయవంతంగా అడ్డుకుని ముక్కలుచెక్కలు చేసింది. పహల్గాం ఉదంతం తర్వాత భారత్, పాక్ మధ్య మొదలైన సైనిక చర్యల పర్వంలో పాకిస్తాన్ ఈ కామికాజి డ్రోన్లను ఉపయోగించడం ఇదే తొలిసారి అని రక్షణరంగ నిపుణులు శనివారం వెల్లడించారు. గతంలో అర్మేనియా–అజర్‌బైజాన్ సాయుధ సంఘర్షణలో, ప్రస్తుతం రష్యా–ఉక్రెయిన్ యద్ధంలో ఈ కమికాజ్ డ్రోన్ల వినియోగం ఎక్కువైంది. ఇప్పుడు భారత్ పైకి పాకిస్తాన్ కమికాజ్ డ్రోన్లను పెద్ద ఎత్తున ప్రయోగించడంతో ఈ తరహా డ్రోన్లపై చర్చ మొదలైంది. కమికాజ్ డ్రోన్‌ను ఆత్మాహుతి డ్రోన్‌గా పేర్కొంటారు. బాంబును లేదా క్షిపణిని మోసుకొస్తూ సంబంధిత లక్ష్యంగా బాంబు/క్షిపణిని జారవిడవడం లేదంటే స్వయంగా అదే కూలిపోయి, పేలిపోవడం ఈ కమికాజ్ డ్రోన్ ప్రత్యేకత.

విరుచుకుపడిన వందల కొద్దీ డ్రోన్లు

మే 8వ తేదీ అర్ధరాత్రి తర్వాత లేహ్ నుంచి సర్ క్రీక్ ఉప్పుకయ్య దాకా 36 వేర్వేరు ప్రదేశాల గుండా సరిహద్దు ఆవలి నుంచి దాదాపు 400 డ్రోన్లు దూసుకొచ్చాయి. దీంతో క్షణాల్లో అప్రమత్తమైన పలు రకాలైన భారత గగనతల రక్షణ వ్యవస్థలు ఈ డ్రోన్లను అడ్డుకుని కూల్చేశాయి. భారత్ ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన సాంకేతికతతో గగనతల రక్షణ వ్యవస్థను పటిష్టం చేసిన కారణంగానే ఈ డ్రోన్లను నిర్వీర్యం చేయగలిగిందని, లేదంటే తీవ్ర నష్టం చవిచూడాల్సి వచ్చేదని రక్షణ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి ఈ డ్రోన్లను కూల్చేశాక వీటి శకలాలను భారత మిలటరీ అధికారులు ల్యాబ్‌లకు తరలించి పరిశీలించడంతో ఇవి కమికాజ్ రకానికి చెందినవని నిర్ధారించారు. పంజాబ్, రాజస్తాన్‌లలో ఈ తరహా డ్రోన్ల శకలాలు లభించాయి.

తుర్కియే నుంచే తెప్పించారు

తుర్కియే దేశంలోని అసిస్‌గార్డ్ సోన్‌గర్ డ్రోన్ కంపెనీ ఈ కామికాజి డ్రోన్లను తయారుచేస్తుంది. దీంతో వీటిని పాకిస్తాన్ తుర్కియే నుంచే తెప్పించినట్లు స్పష్టమైంది. శనివారం తెల్లవారుజామున సైతం బైకర్ వైఐహెచ్ఏ–III కమికాజ్ డ్రోన్లు పంజాబ్, రాజస్తాన్ సరిహద్దుల గుండా భారత గగనతలంలోకి వచ్చాయి. వీటిని ఎయిర్ డిఫెన్స్ గన్స్‌తో నేలమట్టం చేశామని రక్షణ శాఖ అధికారులు ప్రకటించారు.

ఎందుకీ పేరు?

కమికాజ్ అనేది జపాన్ పేరు. జపాన్ వైమానిక దళంలోని ఎయిర్‌ఫోర్స్ ప్రత్యేక దళం ఇది. ఇది ఆత్మాహుతి ఫైటర్ పైలట్ల విభాగం. రెండో ప్రపంచ యుద్ధకాలంలో శత్రుదేశాల యుద్ధనౌకలను పేల్చేసేందుకు జపాన్ పైలట్లు తమ యుద్ధవిమానాలను వాటితో ఢీకొట్టించేవారు. అలా రెండో ప్రపంచ యుద్ధకాలంలో దాదాపు 3,800 మంది కమికాజ్ పైలట్లు ఆత్మాహుతి దాడులతో ఏకంగా 7,000 మంది శత్రుదేశాల నావికా సిబ్బందిని చంపేశారు. ఈ స్ఫూర్తితో తయారుచేసిన డ్రోన్లకు కమికాజ్ అని పేరుపెట్టారు.

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఐదుగురు హతం!

న్యూఢిల్లీ: పహల్గాం పాశవిక ఉగ్రదాడికి ప్రతిస్పందనగా లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్ ఉగ్ర స్థావరాలను భారత్ మే 7వ తేదీ అర్ధరాత్రి తర్వాత దాడిచేయడం తెల్సిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్తాన్ గడ్డపై జరిపిన ఈ క్షిపణి దాడుల్లో తొమ్మిది కీలకమైన ఉగ్ర స్థావరాలు నేలమట్టమై కనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు కేంద్రం గతంలో ప్రకటించింది. అయితే ఈ దాడుల్లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులైన ఐదుగురు సైతం చనిపోయినట్లు కేంద్రం సంబంధిత వివరాలను శనివారం వెల్లడించింది. జైషే మహమ్మద్ ఉగ్రసంస్థ చీఫ్ మసూద్ అజార్ ఇద్దరు బావమరుదులతో పాటు లష్కరే తోయిబా ఉగ్రసంస్థలో కీలక ఉగ్రవాది, మరో ఇద్దరు ముష్కరులను మట్టుబెట్టినట్లు భారత అధికారులు ప్రకటించారు. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్తాన్ ఆర్మీ సీనియర్ ఉన్నతాధికారులు, పోలీసులు సిబ్బంది హాజరయ్యారు. పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్సు మహిళా ముఖ్యమంత్రి మర్యం నవాజ్ తరఫున అధికారులు పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించిన ఫొటోలు మీడియాలో దర్శనమిచ్చాయి. దీంతో ఉగ్రసంస్థలతో పాక్ ప్రభుత్వ చెలిమి మరోసారి బహిరంగంగా బట్టబయలైంది. ఆ ఐదుగురు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల గురించి క్లుప్తంగా..

మొహమ్మద్ యూసుఫ్ అజార్

భారతసర్కార్ గతంలో తయారుచేసిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో 21వ నంబర్‌గా మొహమ్మద్ యూసుఫ్ అజార్ పేరు ఉంది. దాదాపు 50 ఏళ్లకుపైబడిన వయస్సుండే ఇతను జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు బావమరిది. 1999 డిసెంబర్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఐసీ–814 విమానం హైజాక్ ఉదంతంలో ఇతను కీలక సూత్రధారి. 1998లో అబ్దుల్ లతీఫ్ అనే వ్యక్తిద్వారా తప్పుడు పాస్‌పోర్ట్‌తో భారత్‌లోకి వచ్చాడు. జైషేకు చెందిన బహావల్పూర్ ప్రధాన స్థావరంలో కొత్త ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చే బాధ్యతలను యూసుఫ్ చూసుకునేవాడు. యూసుఫ్ కుటుంబం సైతం అదే స్థావరప్రాంగణంలో నివసిస్తోంది. ఇతనికి ఉస్తాద్ జీ, మొహమ్మద్ సలీమ్, ఘోసీ సాహెబ్ వంటి మారు పేర్లు ఉన్నాయి. ఆయుధాలను ఎలా వాడాలో యువతకు శిక్షణ ఇస్తాడు. జమ్మూకశ్మీర్‌లో పలు ఉగ్రదాడులకు పథకరచన చేశాడు. ఇతనికి వ్యతిరేకంగా ఇంటర్‌పోల్ గతంలోనే రెడ్‌నోటీస్ ఇచ్చింది. ఇతడిని తమకు అప్పగించాలని 2002లోనే భారత్ పాకిస్తాన్‌ను కోరింది. అజార్‌ను జమ్మూ జైలు నుంచి తప్పించేందుకు పలుమార్లు ప్లాన్‌లు వేసి విఫలమయ్యాడు. చివరకు భారత ఎయిర్‌పోర్టులో భద్రతావైఫల్యాలు ఉన్నట్లు పసిగట్టి హైజాక్ ప్లాన్‌ను అమలుచేశాడు. హైజాక్ జరిగిన 26 ఏళ్ల తర్వాత సూత్రధారిని భారత బలగాలు అంతం చేశాయి.

ఖలీద్ అలియాస్ అబూ అకాషా

లష్కరే తోయిబా ఉగ్రసంస్థ కమాండర్ అయిన ఖలీద్ అలియాస్ అబూ అకాషా సైతం ఈ దాడుల్లో హతమయ్యాడు. జమ్మూకశ్మీర్‌లో పలు ఉగ్రదాడులతో ఇతని ప్రత్యక్ష సంబంధం ఉంది. అఫ్గానిస్తాన్ నుంచి లష్కరే తోయిబా కోసం ఆయుధాలను అక్రమంగా తీసుకొచ్చేవాడు. ఇతని అంత్యక్రియలు పాకిస్తాన్‌లోని ఫైసలాబాద్‌లో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. పాక్ ఆర్మీ సీనియర్ అధికారులు, పోలీస్‌విభాగం తరఫున ఫైసలాబాద్ డెప్యూటీ కమిషనర్ ఈ ఖనన క్రతువులో పాల్గొన్నారు.

హాఫీజ్ మొహమ్మద్ జమీల్

ఇతను కూడా జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు పెద్ద బావమరిది. యూసుఫ్‌కు ఇతను అన్నయ్య అవుతాడు. జైషేకు చెందిన మర్కాజ్ సుభాన్ అల్లాహ్‌లోని అతిపెద్ద శిక్షణా కేంద్రానికి ముహమ్మెద్ జమీల్ ఇన్‌చార్జ్‌గా ఉన్నాడు. యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షితులను చేసి, టెర్రరిస్ట్‌లుగా మార్చాల్సిన ప్రధాన బాధ్యత ఇతనిదే. జైషే ఉగ్రసంస్థలో కీలకమైన వ్యక్తి. జైషే సంస్థ కోసం నిధులను సేకరించడంలోనూ అత్యంత చురుగ్గా ఉంటాడు.

ముదస్సార్ ఖదియాన్ ఖాస్

లష్కరే తోయిబా ఉగ్రసంస్థలో ముదస్సార్ ఖదియాన్ ఖాస్ అత్యంత కీలకమైన వ్యక్తి. ఇతనికి అబూ జుందాల్ అనే మారుపేరు ఉంది. సరిహద్దు నుంచి కేవలం పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న మురిద్కేలోని మర్కాజ్ తైబా ఉగ్రస్థావరానికి ఇతనే సారథ్యం వహిస్తున్నాడు. ముంబైదాడుల్లో ప్రాణాలకు తెగించి పోలీసులు పట్టుకున్న ఉగ్రవాది అజ్మల్ కసబ్ ఈ స్థావరంలోనే శిక్షణ పొందాడు. మే 7 అర్ధరాత్రి తర్వాత భారత దాడుల్లో ఖదియాన్ హతమయ్యాడు. ఈ వార్త తెల్సి పాకిస్తాన్ సైన్యం ఉలిక్కిపడింది. వెంటనే ఇతని అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరిపించింది. లష్కరే ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ సారథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో అంత్యక్రియలు జరిగాయి. ఆర్మీ చీఫ్ మునీర్ తరఫున లెఫ్టినెంట్ జనరల్, పోలీస్‌విభాగం తరఫున పంజాబ్ ప్రావిన్సు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హాజరయ్యారు. పాకిస్తాన్ ఆర్మీ అధికారులు ఇతని మృతదేహం వద్ద సైనికవందనం చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. దీంతో పాక్ ఆర్మీ, ఉగ్రసంస్థలకు మధ్య ఉన్న సత్సంబంధాలు ఇతని అంత్యక్రియల వీడియోతో మరోసారి ప్రపంచానికి తెల్సివచ్చాయి.

మొహమ్మద్ హసన్ ఖాన్

జమ్మూకశ్మీర్‌లో వేర్వేరు ఉగ్రదాడులకు సమన్వయం చేయడంలో, సహాయ సహకారాలు అందించడంలో మొహమ్మద్ హసన్ ఖాన్ కీలక పాత్ర పోషించాడు. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని జైషే మొహమ్మద్ ఉగ్రస్థావర నిర్వహణ బాధ్యతలను చూసుకునే సీనియర్ ఉగ్రవాది ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ కుమారుడే ఈ హసన్ ఖాన్.

పాక్‌కు ఐఎంఎఫ్ రుణంపై విమర్శల వెల్లువ

రూ. 8,000 కోట్లకు పైగా నిధుల విడుదలకు ఐఎంఎఫ్ ఓకే

తీవ్రంగా తప్పుబట్టిన అంతర్జాతీయ సమాజం

న్యూయార్క్: పాకిస్తాన్ దన్నుతో ఉగ్రవాదులు పహల్గాంలో అనాగరిక దాడులకు తెగబడినందుకే సైనిక చర్య చేపట్టామని భారత్ ఓవైపు అంతర్జాతీయ సమాజానికి చెబుతుంటే మరోవైపు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) అదే దాయాదిదేశానికి భారీ సాయం చేయడం వివాదాస్పదమైంది. ఆపరేషన్ సిందూర్‌లో హతమైన ఉగ్రవాదులకు పాక్ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరపడంతో ఉగ్ర, పాక్ దోస్తీ బట్టబయలైన సమయంలోనే ఇంటర్నేషన్ మానిటరీ ఫండ్ ఇలా నిధులు ఇవ్వడమేంటని పలువురు అంతర్జాతీయ ఆర్థికరంగ నిపుణులు విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్‌కు మరో 1 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.8,540 కోట్లు వెంటనే ఇచ్చేందుకు ఐఎంఎఫ్ శుక్రవారం అంగీకరించడమే ఈ విమర్శలకు అసలు కారణం. ఇటీవలే మరో 1.1 బిలియన్ డాలర్ల విడుదలకు ఐఎంఎఫ్ పచ్చజెండా ఊపడంతో మొత్తంగా పాకిస్తాన్‌కు 2.1 బిలియన్ డాలర్ల నిధుల వరద పారనుందని తెలుస్తోంది. వాతావరణ సంబంధ ప్రాజెక్టులు, పనుల నిమిత్తం పాకిస్తాన్ ఈ నిధులను కోరగా రుణంగా అందజేసేందుకు ఐఎంఎఫ్ ఒప్పుకుంది. అయితే ప్రజాపనుల నిమిత్తం నిధులు ఇస్తున్నాసరే, ఉద్రిక్తతల వేళ నిధుల విడుదల సహేతుకంగా లేదని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే పరస్పర సైనిక చర్యల కారణంగా ఆయుధాల సేకరణ అనేది పాకిస్తాన్‌కు అత్యంత ప్రాధాన్యమైన అంశంగా మారింది. ఈ సమయంలో ఒకేసారి వేల కోట్ల రూపాయల నిధులు వచ్చిపడితే వాటిని సంబంధిత లక్ష్యం కోసం కాకుండా సైనిక సన్నద్ధత, ఆయుధాల కొనుగోలు కోసం దుర్వినియోగం చేసే ప్రమాదముందని నిపుణులు ఆందోళన వెలిబుచ్చారు. సమకాలీన పరిస్థితులను, కనీసం భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న తాజా పరిస్థితులను బేరీజు వేసుకుని అయినా నిధుల విడుదలపై ఐఎంఎఫ్ పునరాలోచన చేస్తే బాగుండేదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు.

అభ్యంతరం తెలిపిన భారత్

పాకిస్తాన్‌కు అదనపు నిధుల విడుదల (ఈఎఫ్ఎఫ్)పై శుక్రవారమే ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ సమావేశం జరిగింది. రెసీలెన్స్ అండ్ సస్టేనబిలిటీ ఫెసిలిటీ పథకంలో భాగంగా పాక్‌కు అదనపు నిధులు ఇవ్వడంపై సమావేశం నిర్వహించారు. ఇందులో సభ్యదేశంగా భారత్ పాల్గొని ఉద్రిక్తత వేళ పాక్‌కు రుణవితరణ ఆపాలని డిమాండ్‌చేసింది. అయితే ఇక్కడ ఐక్యరాజ్యసమితి, భద్రత మండలి తరహాలో ఓటింగ్‌లో గైర్హాజరు వంటి అవకాశం ఉండదు. కేవలం అభ్యంతరం మాత్రమే వ్యక్తంచేయగలం. దీంతో గతంలో ఒప్పుకున్న 7 బిలియన్ డాలర్ల రుణాల్లో భాగంగా కొంతమేర నిధుల విడుదల చేయాలని ఎగ్జిక్యూటివ్ బోర్డ్ నిర్ణయించింది. సైనిక చర్యలో మునిగిన దేశానికి నిధులెలా ఇస్తారని భారత మాజీ విదేశాంగ కార్యదర్శి కన్వాల్ సిబాల్ తప్పుబట్టారు. ఐఎంఎఫ్ తన చేతులకు అనవసరంగా రక్తం అంటించుకుంటోందని యశ్వంత్ దేశ్‌ముఖ్ విమర్శించారు. పాక్ తన ఆర్థిక సంస్కరణల ఊసే మర్చిపోయి మారణాయుధాల కొనుగోళ్లకు ఈ నిధులను కేటాయించడం ఖాయమని 'అబ్జర్వ్ రీసెర్చ్ ఫౌండేషన్'లో నిపుణుడు సుశాంత్ సరీన్ అన్నారు. గత 35 సంవత్సరాల్లో పాకిస్తాన్ ఇలా 28 రుణాలు, ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఐఎంఎఫ్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది. కానీ వాటిని సవ్యంగా అమలుచేసిన చరిత్ర ధూర్తదేశానికి లేదని భారత్ ప్రకటించింది. పాకిస్తాన్ భారత్‌పై బాంబులేస్తున్న వేళ ఈ రుణవితరణ ఏవిధంగా హేతుబద్ధం అనిపించుకుంటుందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. ''రుణగ్రస్త పాకిస్తాన్‌ను ఐఎంఎఫ్ నిధుల సాయంతో ఒడ్డున పడేయట్లేదు. మరింతగా నెత్తుటేర్లు పారించేందుకు సాయపడుతోంది. ఇలా హంతక పాకిస్తాన్‌కు అంతర్జాతీయ సంస్థలు ఇంకెన్నాళ్లు నిధులిస్తాయి?'అని ప్రవాసంలో గడుపుతున్న అఫ్గానిస్తాన్ మహిళా ఎంపీ మరియం సోలాయ్‌మన్‌ఖిల్ అన్నారు.

మదర్స్ డే ప్రత్యేకం



● కల్నల్ సంతోష్ బాబు తల్లి మంజుల



● వీర్‌చక్ర విజయంత్ థాపర్ తల్లి త్రిప్తా థాపర్



● లెఫ్టినెంట్ నవదీప్‌సింగ్ తల్లి కౌర్

వీరమాతకు వందనం

యుద్ధంలో బిడ్డను కోల్పోయిన దుఃఖం ఒకవైపు.
'దేశమాత కోసం నా బిడ్డ ప్రాణత్యాగం చేశాడు'...
అనే గర్వం ఒకవైపు...
ఎంతోమంది వీరమాతలు... అందరికీ వందనం...

యుద్ధ చరిత్రలోకి ఒకసారి...

నా కుమారుడు... వీరుడు

ఆ అమ్మ పేరు త్రిప్తా థాపర్... ఆమె కళ్లలో ఒకవైపు అంతులేని దుఃఖం, మరోవైపు గర్వం కనిపిస్తాయి.

కార్గిల్ యుద్ధంలో థాపర్ తన కుమారుడిని కోల్పోయింది. మధ్యప్రదేశ్‌లో మహూ పట్టణంలోని మిలిటరీ కంటోన్మెంట్ మ్యూజియంలో కార్గిల్ యుద్ధ దృశ్యాలను, కుమారుడి ఫోటోను చూస్తున్నప్పుడు ఆమెకు దుఃఖం ఆగలేదు.

ఇరవై రెండు సంవత్సరాల వయసులో దేశం కోసం ప్రాణాలు అర్పించిన విజయంత్ థాపర్ కార్గిల్ వార్ హీరో. తన దళంతో శత్రువుల బంకర్ ను చుట్టుముట్టే క్రమంలో విజయంత్ థాపర్ మరణించాడు.

'వీర్‌చక్ర విజయంత్ థాపర్ అమ్మగారు అని నన్ను పరిచయం చేస్తుంటారు. వీర్‌చక్ర అతడి పేరులో శాశ్వతంగా కలిసిపోయింది' అని విజయంత్ గురించి గర్వంగా చెబుతుంది త్రిప్తా థాపర్.

ఆమె దృష్టిలో అది మ్యూజియం కాదు. పవిత్ర స్థలం. 'ఈ మ్యూజియంలో ఉన్న ప్రతి వస్తువు, ప్రతి ఫోటో ఎన్నో జ్ఞాపకాలను కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది. దేశం కోసం చిన్న వయసులోనే జీవితాన్ని త్యాగం చేసిన వీరులను పదే పదే తలుచుకునేలా చేస్తుంది' అంటుంది థాపర్.

తన సన్నిహిత మిత్రురాలు పూనమ్ సైనీతో కలిసి తరచు ఈ మ్యూజియమ్‌కు వస్తుంటుంది త్రిప్తా థాపర్.

ఎప్పుడు వచ్చినా కుమారుడి దగ్గరికి వచ్చినట్లే ఉంటుంది ఆ తల్లికి.

బ్యాగులు సర్దుకొని ఇల్లు వదిలే ముందు...

'అమ్మా... ఆరోగ్యం జాగ్రత్త' అని చెప్పేవాడు. గంభీరంగా కనిపించే అతడి కళ్లలో అమ్మను విడిచి వెళ్లే ముందు సన్నని కన్నీటి పొర కనిపించేది. అయితే అమ్మకు ఆ కన్నీటి ఆనవాలు కనిపించకుండా తన చిరునవ్వు చాటున దాచేవాడు.

'అమ్మా, కొడుకుల అనుబంధం గురించి చెప్పడానికి మాటలు చాలవు' అని కన్నీళ్లు తుడుచుకుంటుంది త్రిప్తా థాపర్ స్నేహితురాలు పూనమ్.

గర్వంగా అనిపించింది...

కొన్ని సంవత్సరాల క్రితం... ఉగ్రవాదులతో జరిగిన పోరులో నలుగురిని చంపేశాడు లెఫ్టినెంట్ నవదీప్‌సింగ్. ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడుతూనే నేలకొరిగాడు 26 సంవత్సరాల ఆ యువకుడు.

'నేనంటే నవదీప్‌కు ఎంత ఇష్టమో చెప్పడానికి మాటలు చాలవు. ఫ్రెండులా ఎన్నో కబుర్లు చెబుతుండేవాడు. నవదీప్ లేడు అనే వాస్తవం జీర్ణించుకోవడం కష్టంగా ఉంది. ఇప్పటికీ కలలో ఏదో ఒక రూపంలో పలకరిస్తూనే ఉంటాడు. అమ్మా...నేను వస్తున్నాను అనే మాట వినబడితే సంతోషంగా అనిపించేది. ఇక ఆ మాట ఎప్పుడూ వినిపించదు. ఉగ్రవాదులను నవదీప్ దీటుగా ఎదుర్కోకపోతే ఎంతో నష్టం జరిగి ఉండేది... అని పై అధికారులు చెప్పినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది. నవదీప్ నా బిడ్డ.

అతడు చనిపోయినప్పుడు నేనే కాదు.. ఎంతోమంది తల్లులు సొంత బిడ్డను కోల్పోయినట్లు ఏడ్చారు. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ల ముందే ఉంది. దేశం కోసం పోరాడే వీరసైనికుడికి ఒక్కరే అమ్మ ఉండదు. దేశంలోని ప్రతి అమ్మ తన అమ్మే' అంటుంది పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌కు చెందిన నవదీప్‌సింగ్ తల్లి కౌర్.

కవాతు శబ్దాలు వినిపిస్తూనే ఉంటాయి!

జమ్మూ కశ్మీర్ దోడాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కెప్టెన్ బ్రిజేష్ థాప వీరమరణం పొందాడు.

'బ్రిజేష్ ఇక లేడు అనే వార్త విని కుప్పకూలిపోయాను. మా అబ్బాయి అని చెప్పడం కాదుగానీ చాలా క్రమశిక్షణ ఉన్న కుర్రాడు. ఇంజినీరింగ్ చదివే రోజుల్లోనే నేను సైన్యంలో చేరుతాను అనేవాడు. సైన్యంలో పనిచేయడం చాలా కష్టం అని చెబుతుండేదాన్ని. ఎంత కష్టమైనా సైన్యంలోకి వెళతాను అనేవాడు. బ్రిజేష్ లేడనే వాస్తవం కష్టంగా ఉన్నా సరే... దేశం కోసం నా కుమారుడు ప్రాణాలు అర్పించాడు అని చెప్పుకోవడానికి చాలా గర్వంగా ఉంది' అంటారు నీలిమ థాప.

సైనిక దుస్తుల్లో కుమారుడిని చూసిన తొలి క్షణం నీలిమ భావోద్వేగానికి గురయ్యారు.

ఎప్పటి కల అది!

నాన్న యూనిఫామ్ వేసుకొని చిన్నారి బ్రిజేష్ మార్చ్ చేస్తుండేవాడు (బ్రిజేష్ తండ్రి మిలిటరీలో పనిచేశారు) కుమారుడిని చూసి 'మేజర్ సాబ్ వచ్చేశారు' అని నవ్వేది.

ఇప్పుడిక ఆమెకు నవ్వే అవకాశమే లేకపోవచ్చు. కన్నీటి సముద్రంలో దిక్కుతోచకుండా ఉన్నట్లుగానే ఉండవచ్చు.

అయితే... కుమారుడి ధైర్యసాహసాల గురించి విన్నప్పుడు ఆ తల్లి హృదయం గర్వంతో ఉప్పొంగుతుంది. 'కెప్టెన్ బ్రిజేష్ థాప' అని కుమారుడి పేరు విన్నప్పుడల్లా... ఆర్మీ అధికారుల కవాతు శబ్దాలు ఆమెకు వినిపిస్తూనే ఉంటాయి.

ఇంటికి ఎప్పుడొస్తావు బిడ్డ?

ఆంధ్రప్రదేశ్‌లోని పెనుగొండ నియోజక వర్గం కల్లి తండాకు చెందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ పాక్‌తో జరిగిన యుద్ధంలో చనిపోయాడు.

ఆ తల్లి దుఃఖ భాషను అర్థం చేసుకోగలమా? కుమారుడు మురళీనాయక్ మరణం గురించి అడిగినప్పుడు 'ఏమని చెప్పాలి సామీ' అని ఆ తల్లి భోరున విలపించింది. మురళీనాయక్ పార్థివదేహాన్ని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో జనాలు తరలి వచ్చారు. వారు తనలాగే ఏడ్చారు.

అమ్మా... నీ కొడుకు ఎంత గొప్ప వీరుడో చూశావా! 'ఆర్మీ జవాన్ మురళీ నాయక్ తల్లి' అని తనను పరిచయం చేస్తున్న సమయంలో ఆ తల్లి హృదయం గర్వంతో పొంగిపోతుంది. మాతృదినోత్సవం సందర్భంగా ఆ వీరమాతలందరికీ వందనం.

ఆ తల్లి ఎలా తట్టుకుందో!

'పిల్లల పెంపకంలో తల్లి పాత్ర కీలకం' అంటుంది తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు చెందిన మంజుల. ఇండియా-చైనా యుద్ధంలో ఆమె కుమారుడు కల్నల్ సంతోష్‌బాబు కన్నుమూశాడు. చదువులోనే కాదు ఆటల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండే కొడుకును చూసి మంజుల గర్వించేది. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సంతోష్ మరణం గురించి మంజులకు తెలియజేశారు. ఆ తల్లి గుండె ఎలా తట్టుకుందో తెలియదు.

కుమారుడి బాల్యవిశేషాలు, క్రమశిక్షణ గురించి కళ్లకు కట్టినట్లు చెప్పే మంజుల కుమారుడి మరణం గురించి..

'మన దేశం కోసం మా అబ్బాయి వీర మరణం పొందాడు' అని గర్వంతో చెబుతుంది.

'ఒక్కడే బాబు నాకు...' అంటున్న ఆ తల్లి కంఠానికి కన్నీళ్లు అడ్డుపడి మాటలు రావు.

ఆమె మనసులో కనిపించని దుఃఖసముద్రాలు ఉండవచ్చుగాక... కానీ ఆమె పదే పదే చెబుతుంది...'నా బిడ్డ మన దేశం కోసం చనిపోయాడు'.

ఎక్కడ ఉన్నా అమ్మ గురించే

'కెప్టెన్ సౌరభ్ కాలియ బయట ఎలా ఉంటాడో తెలియదుగానీ ఇంట్లో మాత్రం చిలిపి' అంటుంది అతడి తల్లి విజయ కాలియ.

'మేరా పాస్ మా హై' అని తల్లి గురించి సరదాగానే సినిమా డైలాగు చెబుతుండేవాడు గానీ...

నిజంగా తల్లి సౌరభ్ ధైర్యం. సైన్యం.

'ఒకరోజు సౌరభ్ వంటగదిలోకి వచ్చి సైన్ చేసిన బ్లాంక్ చెక్ ఇచ్చాడు. ఎందుకు? అని అడిగితే 'నేను ఫీల్డ్‌లో ఉన్నప్పుడు మనీ విత్‌డ్రా చేసుకోవడానికి' అన్నాడు. తాను ఎక్కడ ఉన్నా నా గురించే ఆలోచించేవాడు' అంటుంది విజయ.

ఇప్పుడు 'కాలియ హోమ్'లో ఆ బ్లాంక్ చెక్ కనిపిస్తూనే ఉంటుంది. ఆ చెక్‌ను చూసినప్పుడల్లా కుమారుడిని చూసినట్లుగానే ఉంటుంది.

'డబ్బును డ్రా చేసుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు ఈ కాగితంపై నా బిడ్డ చేసిన సంతకం ఉంది. అది నాకోసం చేసింది. ఇది ఎప్పటికీ తీయటి జ్ఞాపకంగా ఉండిపోతుంది' అంటుంది విజయ. చివరిసారిగా తమ్ముడి పుట్టిన రోజు సందర్భంగా ఇంటికి ఫోన్ చేశాడు సౌరభ్.

'నా పుట్టిన రోజుకు తప్పకుండా ఇంటికి వస్తాను అన్నాడు. ఆ రోజు ఇప్పటికీ రాలేదు' అని కళ్లనీళ్ల పర్యంతం అవుతుంది విజయ.

23 ఏళ్లు నిండకుండానే కార్గిల్ యుద్ధంలో సౌరభ్ చనిపోయాడు.

హిమాచల్‌ప్రదేశ్‌లోని పలంపూర్ ఇంట్లో ఒక గది మొత్తాన్ని సౌరభ్ మ్యూజియంగా మార్చారు.

'ఈ మ్యూజియంలోకి వస్తే మా అబ్బాయి దగ్గరకి వచ్చినట్లే ఉంటుంది' అంటుంది విజయ.

పిల్లలూ... అమ్మంటే ఎందుకు ఇష్టమో ఎప్పుడైనా అమ్మకు చెప్పారా? ప్రేమతో హగ్ చేసుకుని 'అమ్మా... నువ్వంటే ప్రాణం' అని చెప్పారా? అమ్మ అదే మాట మనతో ఎన్నిసార్లు అనుంటుంది. అమ్మ మీద ఇష్టం అమ్మకు చెబుతుండాలి. ఇవాళ 'మదర్స్ డే'. ఒక కాగితం మీద 'బెస్ట్ మామ్ ఇన్ ది వరల్డ్' హెడ్డింగ్ పెట్టి అమ్మ ఎందుకు గొప్పదో రాసి గిఫ్ట్‌గా ప్రెజెంట్ చేయండి.

అమ్మంటే బలే ఇష్టం... ఎందుకో చెప్పనా?

పిల్లలూ... మీకు 'గమ్' తెలుసు కదా. అది తనకూ మీకూ పూసి మీతో అంటుకుపోవడం తప్ప అమ్మ మీ కోసం అన్నీ చేస్తుంది. మీ ఆకలే తన ఆకలి. మీ నిద్రే తన నిద్ర. మీ నవ్వే తన నవ్వు. మీరు ఎక్కడకు అడుగులు వేసినా ఆమె కళ్లు వెనుకే వస్తుంటాయి. మీరు బయట ఆడుకుంటుంటే ఆమె ఇంట్లో నుంచే మీ ఆటను ఇమాజిన్ చేస్తుంది. మీకు దెబ్బ తగలగానే మీరు వచ్చి చెప్పే ముందే ఆమెకు తెలిసిపోతుంది. మీరంటే అంత ఇష్టం అమ్మకు. మరి మీక్కూడా ఇష్టమేగా. మే 11 'మదర్స్ డే' సందర్భంగా పేపర్ మీద ఆ ఇష్టాన్నంతా పెట్టి అమ్మకు ప్రెజెంట్ చేద్దామా. కొందరు పిల్లలు మదర్స్ డేకు అమ్మకు ఎలాంటి లెటర్స్ రాశారో చూడండి. మీరు ఇంకా డిఫరెంట్‌గా ట్రై చేయండి.

గుడ్ మార్నింగ్ అమ్మా...

మదర్స్ డే రోజు నీ కోసం రాస్తున్న లెటర్ ఇది. ఇలా రాయడం నాకు వెరీ న్యూ. ఏం రాయాలి? నీకు పెట్స్ అంటే ఇష్టం లేదు. నాకు ఇష్టం. రాకీ గాణ్ణి తెచ్చుకుంటానని అన్నప్పుడు గట్టిగట్టిగా వద్దన్నావ్. నేను హర్ట్ అయ్యి రాత్రంతా ఏడ్చానని ఓన్లీ ఫర్ మీ ఓకే చేశావ్. అదిప్పుడు నాకు మాత్రమే కాదు నీక్కూడా బెస్ట్ ఫ్రెండే. అమ్మా... థ్యాంక్యూ ఫర్ యువర్ అన్‌కండీషనల్ లవ్.

- నీ నందు/ఎర్రపండు, క్లాస్ 9, వాల్తేర్

మై డియర్ మామ్...

నువ్వంటే నాకు చాలా ఇష్టం. ఎంత ఇష్టమంటే గాడ్ కంటే ఎక్కువ ఇష్టం. మా క్లాస్‌లో అందరూ సీక్రెట్స్ ఫ్రెండ్స్‌తో చెప్పుకుంటారు. నేను నీతో చెప్తా. ఎందుకంటే నువ్వే నా బెస్ట్ ఫ్రెండ్. ఇంగ్లిష్ మీడియమ్ స్కూల్లో సెకండ్ లాంగ్వేజ్ హిందీ తీసుకోవాల్సి వస్తే నువ్వే ఇంట్లో తెలుగు నేర్పించావు. ఎంత మంచి టీచర్‌వి నువ్వు. మా స్కూల్లో నీ లాంటి టీచర్ ఉంటే అందరూ ఫస్టే. అమ్మా.... నువ్వు సింగర్‌వా. అప్పుడప్పుడు హమ్ చేస్తుంటావు. నేను వింటుంటాలే. ఆ హమ్ చేసే అమ్మ ఇంకా ఇష్టం నాకు. నీకు మదర్స్ డే హగ్స్.

- శ్రావ్య, క్లాస్ 7, మదనపల్లి

డియర్ అమ్మా...

థ్యాంక్యూ... ఎప్పుడూ కారులో డాడీ పక్కన నన్ను కూచోబెట్టి నువ్వు వెనక కూచుంటావు. డాడీ నిన్ను ముందు కూచోమన్నా 'పాపకు అక్కడే ఇష్టం' అంటావు. దారిలో నువ్వే దిగి ఐస్‌క్రీమ్ కొనుక్కొని వస్తావు. నేను బ్యాడ్ కలర్స్‌తో డ్రస్ సెలెక్ట్ చేసుకుంటే మంచి డ్రస్ చూపించి ఇదే బాగుందని ఒప్పిస్తావు. ముందు కోపం వచ్చినా రాను రాను అది నా ఫేవరెట్ డ్రస్ అవుతుంది. అమ్మా... నాకేం కావాలో నీకు అన్నీ తెలుసు. నేను నీ కోసం బాగా చదువుకుని బెస్ట్‌గా ఉంటానని ఈ మదర్స్ డే రోజు ప్రామిస్ చేస్తున్నా. లవ్ యూ.

- మౌనిక, క్లాస్ 8, హైదరాబాద్

టు మై బెస్ట్ మామ్...

అమ్మా... ఫస్ట్ ఈ బ్యూటిఫుల్ వరల్డ్‌లోకి నన్ను తీసుకు వచ్చినందుకు థ్యాంక్స్. నా కోసం నువ్వు ఎంత హార్డ్ వర్క్ చేస్తున్నావో నాకు తెలుసు. ఇంట్లో నువ్వు, నేను మాత్రమే ఉంటాం. డాడీ మనతో లేకున్నా నేను ఆ ఆబ్సెన్స్ ఫీలవకుండా డబుల్ ఎనర్జీతో కష్టపడతావ్. నా ఆధార్ కార్డ్ కరెక్షన్ కోసం నువ్వు పరేషాన్‌గా తిరుగుతుంటే ఏడుపు వచ్చింది. నాకు కొంచెం బాగా లేకున్నా హాస్పిటల్‌కు పరిగెత్తుతావ్. రాత్రంతా నిద్ర పోకుండా చూస్తావ్. నీకు ఎవరూ లేరని అనుకోకు. నేనున్నాను. నాకు నువ్వే మమ్మీవి... డాడీవి. ఐ రెస్పెక్ట్ యూ. I cherish every moment we share, and I look forward to many more memories together. హ్యాపీ మదర్స్ డే.

- దివ్య, క్లాస్ 10, విజయవాడ



మామ్... మొమ్మ... మమ్మ... అమ్మ

'మామ్' అనే పదం పిల్లల నుంచే వచ్చింది! తల్లిని 'మామ్' 'మొమ్మ' 'మమ్మ' అని పిలిచే పేర్లు ప్రపంచంలోని వివిధ భాషల్లో ఉన్నాయి. పసిబిడ్డలు పూర్తిగా మాట్లాడలేని రోజుల్లో చేసే శబ్దాల నుంచే ఈ పేర్లు పుట్టాయి అంటారు భాషావేత్తలు.



మదర్నింగ్ సండేస్

'మదర్స్ డే' మూలాలు పురాతన గ్రీకు, రోమన్ సంప్రదాయాలలో ఉన్నాయి. 16వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో 'మదర్నింగ్ సండేస్' రోజు పిల్లలు ఎక్కడ ఉన్నా తమ తల్లి దగ్గరికి వచ్చి ఆమె కోసం కేక్ తయారుచేసేవారు.



మామ్స్ మెడల్!

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఎక్కువమంది పిల్లలు ఉన్న తల్లులకు ఫ్రాన్స్ ప్రభుత్వం మెడల్స్ ప్రధానం చేసేది. పతకాలు ఇచ్చే సంప్రదాయం ముగిసినా అమ్మలకు పూల ఆకారంలో కేకులు ఇచ్చే సంప్రదాయం నేటికీ కొనసాగుతుంది.



మదర్స్ డే స్టాంప్

తల్లుల గౌరవార్థం అమెరికాలో 1934లో మే 2న వయొలెట్ స్టాంప్‌ను విడుదల చేశారు. జేమ్స్ మెక్ నీల్ విస్లర్ ప్రసిద్ధ కళాఖండం 'పోర్ట్రెయిట్ ఆఫ్ మై మదర్' ఆధారంగా ఈ స్టాంప్‌ను రూపొందించారు.



మదర్ ఆఫ్ మదర్స్ డే

వర్జీనియా(అమెరికా)కు చెందిన కాపీరైటర్ అన్నా జార్విస్‌కు 'మదర్ ఆఫ్ మదర్స్ డే' అని పేరు. అమెరికా అంతర్యుద్ధ కాలంలో జార్విస్ అమ్మ ఆన్ ఇరువైపుల సైనికులను దృష్టిలో పెట్టుకొని 'మదర్స్ వర్క్ క్లబ్'లను నిర్వహించేది. యుద్ధ సమయంలో తన తల్లి సాగించిన శాంతి ప్రయత్నాలకు గుర్తుగా, గౌరవార్థంగా 'మదర్స్ డే'ను ప్రారంభించింది అన్నా జార్విస్. 1908లో వెస్ట్ వర్జీనియాలోని గ్రాఫ్టన్ నగరంలో, ఫిలడెల్ఫియాలో మొదటి అధికారిక 'మదర్స్ డే' వేడుకలు మే నెలలోని రెండో ఆదివారం జరిగాయి. మొదటి అధికారిక 'మదర్స్ డే' 1914 మే 10న జరిగింది.



మదర్స్ డే ప్రేయర్

వర్జీనియా(యూఎస్) టేలర్ కౌంటీలోని ఆండ్రూస్ మెథడిస్ట్ ఎపిస్కోపల్ చర్చిని అంతర్జాతీయ మాతృదినోత్సవ మందిరంగా పిలుస్తారు. 'మదర్స్ డే' గురించి అన్నా జార్విస్ ఆలోచించిన ప్రదేశంగా ఇది ప్రసిద్ధి చెందింది. ఈ మందిరంలో ప్రతి సంవత్సరం 'మదర్స్ డే' ప్రార్థన నిర్వహిస్తారు.

అమ్మ వల్లే డాక్టర్‌నయ్యా!

- డాక్టర్ దశరథరామారెడ్డి



తెలుగు రాష్ట్రాల్లోని అరుదైన ఆర్థోపెడిక్ నిపుణుల్లో డాక్టర్ తేతలి దశరాథరామారెడ్డి ఒకరు. తండ్రి నారాయణ రెడ్డి పేరు మీద సొంతూర్లో ఒక ట్రస్ట్ పెట్టి.. అవసరంలో ఉన్న వాళ్లకు వైద్యసహాయం అందిస్తున్నారు. అమ్మ సంకల్పబలం వల్లే తాను డాక్టర్‌నయ్యానని చెప్పే ఆయన ఇంటర్వ్యూ మదర్స్ డే సందర్భంగా..!



''మా సొంతూరు తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి. మా నాన్న నారాయణ రెడ్డి. ఆ రోజుల్లో బీఏ హానర్స్ చేశారు. అమ్మ అచ్చాయమ్మ.. పెద్దగా చదువుకోలేదు. నాకు రెండున్నరేళ్లున్నప్పుడు మా నాన్న రోడ్ యాక్సిడెంట్‌లో పోయారు. మేం మొత్తం ఆరుగురం. నాకు ముగ్గురు అక్కలు, ఒక అన్నయ్య, ఒక చెల్లి.

అమ్మ మోటివేషన్..

నేను చిన్నప్పుడు యావరేజ్ స్టూడెంట్‌ని. బాగా అల్లరిచేసే వాడిని కూడా! నేను డాక్టర్ అవడానికి స్ఫూర్తి మా చిన్నాన్న (కంటి డాక్టర్ సత్యనారాయణ రెడ్డి) అయితే మోటివేషన్ మాత్రం అమ్మదే! అమ్మ చాలా డిసిప్లిన్డ్.. కష్టపడే తత్వం.. చాలా ఫోకస్డ్.. డెడికేటెడ్. కమాండింగ్ నేచర్! మమ్మల్ని పొద్దున నాలుగింటికి లేపి చదువుకు కూర్చోబెట్టేది. మాతో పాటే తనూ కూర్చుని.. మేం చదువుకుంటుంటే ఆమె రామకోటి రాసేది. అమ్మ ఆశయమల్లా మాలో ఎవరినైనా డాక్టర్ చేయాలన్న నాన్న కోరికను నెరవేర్చడమే! ఏమాత్రం చదువును నిర్లక్ష్యం చేసినా.. మా చిన్నాన్నను ఉదాహరణగా చూపిస్తూ చక్కగా చదువుకుంటే అలా గౌరవం పొందుతారని చెప్పేది! మా బద్ధకాన్ని ఏమాత్రం సహించేది కాదు. తండ్రిలేని పిల్లలు కదా.. తనేమాత్రం అశ్రద్ధ చేసినా పాడైపోతారనే భయం అమ్మకు. అందుకే మమ్మల్ని పెంచడంలో ఎక్కడా రాజీ పడలేదు ఆవిడ. గారాబం గారాబమే. స్ట్రిక్ట్‌నెస్ స్ట్రిక్ట్‌నెసే! బద్ధకం అనేది ఆమె డిక్షనరీలో లేదు. ఎవరి పనులు వాళ్లు చేసుకోవాలి అనేవారు. మా అందరినీ సమర్థులైన ఇండివిడ్యువల్స్‌గా తయారు చేశారు. ఇటు మరుదులు.. అటు తమ్ముళ్లు అందరూ ఆమె మాటను గౌరవించేవారు. నిజానికి మా ఇంట్లో నానమ్మ తర్వాత మా మేనత్త మాణిక్యం. ఆ తర్వాత అమ్మే! నాన్న లేకపోయినా ఆ ఉమ్మడి కుటుంబాన్ని చెదరనివ్వలేదు అమ్మ. అందుకే చిన్నాన్నలకు అమ్మంటే చాలా గౌరవం. అలా అమ్మ మోటివేషన్, నాన్న కోరిక, చిన్నాన్న స్ఫూర్తితో నేను డాక్టర్‌ను అయ్యాను. మా మేనమామలకైతే ఆవిడ వాళ్లమ్మతో సమానం. మేమెప్పుడైనా అమ్మను చిన్నగా విసుక్కున్నా మా మేనమామలు మమ్మల్ని కేకలేసేవారు. ఆమె ఎప్పుడు హైదరాబాద్‌కి వచ్చినా.. ఇంట్లోకి రావడం రావడమే తిరుగు ప్రయాణానికి టికెట్ ఎప్పుడు రిజర్వ్ చేస్తావని అడిగేది. ఆ రావడం కూడా ఒంట్లో బాలేకపోతేనే వచ్చేది. ఆసుపత్రిలో చూపించుకుని వెంటనే వెళ్లిపోయేవారు. ఎంత అడిగినా ఉండేవారు కారు. ఎక్కువగా తన తమ్ముళ్లతో ఉండటానికి ఇష్టపడేవారు. మా అమ్మ విషయంలో నాకున్న ఒకే ఒక అసంతృప్తి.. మా ఇంట్లో ఇప్పుడు దాదాపు 17 మంది దాకా డాక్టర్లున్నారు. అమ్మ మా సక్సెస్ చూశారు కానీ.. మా పిల్లల సక్సెస్ చూడకుండానే పోయారు. 2016లో చనిపోయారావిడ.

మహాగొప్ప మేనమామలు..

మా నాన్నగారు పోయాక అమ్మ మానసికంగా కుంగిపోతే.. అమ్మమ్మ వాళ్లు తీసుకెళ్లి కొన్నాళ్లు అక్కడే పెట్టుకున్నారు. అప్పుడు అమ్మను కంటికి రెప్పలా కాచుకుంది మా మేనమామలే! ఆ కష్టకాలంలో మా ఫ్యామిలీ నిలబడ్డానికి ప్రధాన కారణం మా అమ్మమ్మ గారి కుటుంబమే! మా అమ్మాయి డాక్టర్. అమెరికాలో మాస్టర్స్ చేస్తోంది. అబ్బాయేమో ఆస్ట్రేలియాలో సప్లయ్ అండ్ చైన్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేస్తున్నారు. నా భార్య సింధు. హోమ్ మేకర్. ఆమె కూడా అమ్మలాగే మంచి డిసిప్లిన్. ఈ విషయంలో ఆమె మీద అమ్మ ఇన్‌ఫ్లుయెన్స్ చాలా ఉంది. గ్రేట్ మదర్. మా పెద్ద కుటుంబంలో చక్కగా ఇమిడిపోయింది. ఒకరకంగా చెప్పాలంటే సింధు.. స్వీట్ హార్ట్ ఆఫ్ అవర్ ఫ్యామిలీ.''

- సరస్వతి రమ

అమ్మ అంటేనే ఆనందం

గాఢ నిద్రలో ఉన్నప్పుడు కేరింతల శబ్దం... ఆ శబ్దం అమ్మకు ఓ ఆనందం... అన్నం తింటుంటే బుడి బుడి అడుగులతో అల్లరి... అమ్మకు ఇదీ ఆనందం... చిట్టి చేతులు చెంపను తాకుతుంటే... అదో ఆనందం... చిన్నారి నవ్వు... ఓ స్ట్రెస్ బస్టర్. "కొన్ని త్యాగాలు... ఎన్నో ఆనందాల మధ్య అమ్మ అనే ఈ ప్రయాణం చాలా ఆనందంగా ఉంది" అంటున్నారు ప్రణీత. అసలు 'అమ్మ అంటేనే ఆనందం' అని 'సాక్షి'తో మాట్లాడుతూ అన్నారామె. ఇంకా 'మదర్స్ డే సందర్భంగా' ఇద్దరు పిల్లల తల్లిగా తన జీవితం ఎలా ఉందో పంచుకున్నారు హీరోయిన్ ప్రణీత.



● భర్త నితిన్ రాజు, పాప అర్నా, బాబు జైకృష్ణలతో ప్రణీత

● పెళ్లి కాక ముందు, తల్లి కాక ముందు ఆర్టిస్ట్‌గా ఫుల్ బిజీగా ఉండేదాన్ని. ఇప్పుడు అదనంగా తల్లిగానూ ఫుల్ బిజీ. అయితే సరిగ్గా ప్లాన్ చేసుకుంటే ఇటు ఫ్యామిలీని చూసుకుంటూనే అటు కెరీర్‌ని కూడా కొనసాగించవచ్చు. నేనలానే చేస్తున్నాను. కానీ ఇంతకు ముందులా కాకుండా ఇప్పుడు సినిమాలు కాస్త తగ్గించుకున్నాను. అయితే టీవీ షో, యాడ్స్ చేస్తూ కెరీర్‌పరంగానూ బిజీగా ఉంటున్నాను. తల్లవగానే ఇంటికి పరిమితం అయిపోవాలన్నట్లుగా ఇప్పుడు ప్రపంచం లేదు. అమ్మాయిలకు కెరీర్ కూడా ముఖ్యమే. పిల్లలు స్కూల్‌కి వెళ్లేవరకూ కెరీర్‌ని పూర్తిగా మానేసుకోకుండా కాస్త స్లో చేసి, ఆ తర్వాత స్పీడప్ చేసుకోవచ్చు.

● మా పాప అర్నాకి ఇప్పుడు మూడేళ్లు... బాబు జైకృష్ణకి ఇంకా ఏడాది కూడా నిండలేదు. పాపని ప్లే స్కూల్‌కి పంపుతున్నాం. మార్నింగ్ తొమ్మిది గంటలకు వెళితే మధ్యాహ్నం ఒంటి గంటకు వస్తుంది. ఈలోపు బాబు పనులు పూర్తి చేసేసి, పాపకి ఫుడ్ తయారు చేసి, రాగానే తినిపించేస్తాను. ఆ తర్వాత ఇద్దర్నీ నిద్రపుచ్చుతాను. అప్పుడు నాకు కాస్త తీరిక దొరుకుతుంది. మళ్లీ ఇద్దరూ నిద్ర లేచే సమయానికి ఏదైనా తినిపించడానికి ప్రిపేర్ చేస్తాను. ఆ తర్వాత ఆటలు, డిన్నర్ టైమ్, నిద్రపుచ్చడం... ఇలా నా ఆలోచలన్నీ ఏం పెట్టాలి? ఎలా నిద్రపుచ్చాలి... అనేవాటి చుట్టూ తిరుగుతుంటాయి.

● సెలబ్రిటీ మదర్ అయినా, కామన్ మదర్ అయినా ఎవరైనా తల్లి తల్లే. పనులు చేసి పెట్టడానికి హెల్పర్స్‌ని పెట్టుకున్నప్పటికీ తల్లిగా పిల్లలకు చేయాల్సిన పనులు ఏ తల్లికైనా ఉంటాయి. ఉదాహరణగా చెప్పాలంటే... పిల్లల బట్టలు మడత పెట్టడానికి, వంట చేయడానికి మనుషులు ఉన్నప్పటికీ పిల్లలకు మాత్రం నేనే తినిపిస్తాను. 'అమ్మ తినిపిస్తుంది' అనేది వాళ్లకు అర్థం అవ్వాలి. తినిపించడం, ఆడించడం అన్నీ అమ్మే చేయాలి. పిల్లలకు అర్థమయ్యేవన్నీ అమ్మే చెయ్యాలి.

● ఒక నటిగా ఫిజిక్‌ని పర్ఫెక్ట్‌గా మెయిన్‌టైన్ చేయడం చాలా అవసరం. అయితే తల్లయ్యాక అది సరిగ్గా వీలుపడటం లేదు. ఎందుకంటే ఇంతకు ముందైతే ఓ గంట వర్కవుట్ చేసి, అలసట తీరేంతవరకూ రిలాక్స్ అయ్యేదాన్ని. ఇప్పుడు వర్కవుట్ పూర్తి కాగానే పిల్లల పనులు ఉంటాయి. ఇక, అలసట తీర్చుకునేది ఎప్పుడు? అందుకే ఒక్కోసారి వర్కవుట్స్ మానేస్తున్నాను. అయితే పిల్లల కోసం చేసేది ఏదైనా హ్యాపీగా ఉంటుంది. ఫిజిక్ గురించిన ఆలోచన పక్కకు వెళ్లిపోతుంది (నవ్వుతూ). అలాగే కెరీర్ బ్యాక్‌సీట్‌లోకి వెళ్లిపోవడం సహజం. ఈ ప్రపంచంలో 'మదర్‌హుడ్' అనేది బెస్ట్ జాబ్ అని నా ఫీలింగ్. ఆ అద్భుతమైన అనుభూతి కోసం చేసే చిన్ని త్యాగాలు ఆనందాన్నే ఇస్తాయి.

● పాప పుట్టాక ఏం చేసినా.. 'పాపకు సౌకర్యంగానే ఉందా? సరిగ్గా చూసుకుంటున్నామా?' అనిపించేది. బాబు పుట్టాక కూడా అది కంటిన్యూ అవుతోంది. పిల్లలు పెద్దయ్యాక కూడా తల్లికి ఈ డౌట్ ఉంటుందేమో! మొత్తం మీద నాకు అర్థమైందేంటంటే పిల్లలను ఎంత బాగా చూసుకున్నా తల్లికి తృప్తి ఉండదేమో.

● మావారు (నితిన్ రాజు) వీలు కుదిరినప్పుడల్లా పిల్లలను చూసుకుంటారు. ఇంటికి రాగానే పిల్లలను ప్లే ఏరియాకి తీసుకెళ్లడం, ఆడించడం చేస్తుంటారు. మా పాపను స్విమ్మింగ్‌లో చేర్పించాం. ఆ క్లాస్‌కి తీసుకెళతారు. ఇలా హెల్ప్‌ఫుల్‌గా ఉంటారు.

పిల్లలను పెంచే విషయంలో కాస్త ఒత్తిడికి గురవుతాం. ఆ ఒత్తిడి పోగొట్టుకోవడానికి కాసేపు స్విమ్మింగ్, వాకింగ్ ఏదో ఒకటి చేయాలి. అలాగే తల్లి కూడా పోషకాహారం తీసుకోవాలి. ఇంట్లో ఉన్నప్పుడు ఎలానూ తింటాం. నేను షూట్స్‌కి వెళ్లేటప్పుడు డ్రై ఫ్రూట్స్ వంటివి తీసుకెళతాను. ఎందుకంటే శారీరకంగా బలంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటేనే పిల్లలను సరిగ్గా చూసుకోగలుగుతాం. పిల్లల ఆలనా పాలనా చూసుకునే క్రమంలో మిమ్మల్ని (తల్లులను ఉద్దేశించి) మీరు పట్టించుకోవడం మానొద్దు.

- డి.జి. భవాని

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
ఆదివారం । 11 । మే । 2025



సుబ్రహ్మణ్యేశ్వరుడి సేవలో..

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సోషల్ వెల్ఫేర్ కమిషనర్ ప్రసన్న వెంకటేష్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు.



దుర్గమ్మకు నృత్యార్చన

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు శనివారం విజయవాడలో నర్తన డ్యాన్స్‌కు చెందిన నృత్య విద్యార్థులు కూచిపూడి నృత్యార్చన చేశారు.



బైక్ చోరీల ముఠా ఆటకట్టు

కంకిపాడు పోలీసులు మోటారు బైక్‌ల చోరీ ముఠా ఆటకట్టించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు కృష్ణా ఎస్పీ గంగాధరరావు తెలిపారు. -10లో..

న్యూస్‌రీల్

ఎన్టీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని రెండు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం ఒకటో యూనిట్ సాంకేతిక లోపంతో నిలిచింది. దీంతో 210 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఆ తర్వాత కొంతసేపటికి 8వ యూనిట్‌లోని బాయిలర్ ట్యూబ్ లీకవడంతో యూనిట్‌ను షట్‌డౌన్ చేయడానికి ఇంజినీర్లు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఎర్త్ అయ్యి ఒక్కసారిగా ప్లాంటు మొత్తం నిలిచిపోయింది. ఈ పరిణామాలతో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పతి ఆగిపోయింది. రెండు యూనిట్లో మొత్తం 1,010 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఇంజినీరింగ్ అధికారులు అర్ధరాత్రి ఒంటిగంట వరకు మరమ్మతులు చేసినా రెండు ప్లాంట్లు వినియోగంలోకి రాలేదని అధికారులు తెలిపారు.

విమానాశ్రయంలో భద్రత కట్టుదిట్టం



విమానాశ్రయం(గన్నవరం): ఇండియా–పాకిస్తాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ హెచ్చరికల మేరకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో భద్రతను కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయం ప్రవేశం వద్ద వాహనాలను క్షుణంగా తనిఖీ చేసిన తర్వాతే పోలీసులు లోపలికి అనుమతిస్తున్నారు. ప్రయాణికులను మాత్రమే ఎయిర్‌పోర్ట్‌లోకి పంపిస్తున్నారు. విమానాశ్రయ సందర్శనకు వచ్చే విజిటర్లను భద్రత కారణాల దృష్ట్యా లోపలికి అనుమతించడం లేదు. టెర్మినల్‌లో ప్రయాణికులు, వారి లగేజీని పూర్తిస్థాయిలో తనిఖీలు చేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో పోలీస్ భద్రతను పెంచడంతో పాటు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు.

13న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్–16 బాలుర క్రికెట్ జట్టును ఈ నెల 13వ తేదీ విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.రవీంద్ర చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, వైట్ డ్రస్, స్పోర్ట్స్ షూస్, సొంత కిట్‌తో ఆ రోజు ఉదయం ఏడు గంటలకు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలని సూచించారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

డ్రెస్ కోడ్ పాటించరే..!



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయ ఈఓ బి.హెచ్.వి.ఎస్.ఎన్.కిషోర్‌కుమార్ శనివారం డ్రెస్ కోడ్ పాటించకుండానే అమ్మవారిని దర్శించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణకు భిన్నంగా వన్‌థర్డ్ (షార్ట్), టీషర్టుతో అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు ఆలయ పరిసరాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆలయ ఉద్యోగులు అందరూ తెల్లని సంప్రదాయ దుస్తులు ధరించాల్సి ఉంది. ఉద్యోగులందరికీ మార్గదర్శకంగా ఉండాల్సిన ఆలయ కార్య నిర్వాహణాధికారే డ్రెస్ కోడ్ పాటించకపోవడంపై భక్తులు అభ్యంతరం తెలుపుతున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సమంత



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను హీరోయిన్ సమంత శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన సమంతను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి ప్రసాదాలు, రవికను అందజేశారు. ఆమెను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఆలయంలోకి రావడానికి అభిమానులు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు.

విద్యార్థులకు స్వేచ్ఛనిద్దాం

జగ్గయ్యపేటకు చెందిన హారికకు చిన్నప్పటి నుంచే లెక్కలు అంటే ఇష్టం. ఇంజినీరింగ్ చేయాలన్నది ఆమె కోరిక. తల్లిదండ్రులకు కుమార్తెను డాక్టరుగా చూడాలనుకున్నారు. ఆ తపనతో వారు ఆమెను బైపీసీలో బలవంతంగా చేర్పించారు. పాస్ మార్కులతో గట్టెక్కడంతో మెడిసిన్‌లో సీటు రాలేదు. అప్పటికిగానీ తల్లిదండ్రులు వారి తప్పును తెలుసు కోలేకపోయారు.

మచిలీపట్నానికి చెందిన కుమార్‌కు ఆర్ట్స్ గ్రూపు అంటే ఇష్టం. చిన్నతనం నుంచే సోషల్ సంబంధిత సబ్జెక్టులపై మంచి పట్టుసాధించాడు. గ్రూప్స్ రాయాలనేది అతని కోరిక. పది పూర్తయ్యాక ఆర్ట్స్ గ్రూపులో చేరాలనుకున్నాడు. ఇంట్లో పెద్దల బలవంతంతో ఎంపీసీలో చేరాడు. అతను చదవలేక ఫెయిలయ్యాడు.

గుడివాడకు చెందిన గణేష్‌కు చిన్నతనం నుంచే సీఏ చేయాలన్నది కోరిక. పది పూర్తయ్యాక ఎంఈసీలో చేరాలనుకున్నాడు. తల్లిదండ్రులేమో కొడుకును ఇంజినీరుగా చూడాలనుకున్నారు. అతన్ని బలవంతంగా ఎంపీసీలో చేర్పించారు. అయిష్టంతో చదివిన అతను ఎంపీసీని పాస్ మార్కులతో గట్టెక్కాడు. ఇంజినీరింగ్‌లో సీటు రాకపోవడంతో డిగ్రీలో ఆర్ట్స్ గ్రూప్ తీసుకున్నాడు.

విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన సురేష్ సాధారణ విద్యార్థి. పదో తరగతి పాస్ మార్కులతో గట్టెక్కాడు. గణితం, సైన్సు సబ్జెక్టులపై పట్టు లేదు. అయితే స్నేహితులు ఎంపీసీ, బైపీసీ తీసుకోవడంతో తాను గొప్పగా చెప్పుకోవడానికి ఎంపీసీని ఎంచుకున్నాడు. సబ్జెక్టులు కష్టం కావడంతో ఇంటర్ తప్పాడు. ఏం చేయాలో తెలియక చదువును పక్కనబెట్టాడు.

- పిల్లల భవిత.. పెద్దల బాధ్యత
- గ్రూపుల ఎంపికలో పిల్లలకు స్వేచ్ఛనివాలంటున్న విద్యావేత్తలు
- తల్లిదండ్రుల నిర్ణయాలతో పిల్లలకు కష్టాలు
- వారి ఇష్టాన్ని గుర్తించాలంటున్న విద్యావేత్తలు
- బలవంతం చేస్తే మొదటికే మోసం



పటమట(విజయవాడపశ్చిమ): ఇంటర్‌లో గ్రూపులు ఎంచుకునే స్వేచ్ఛను పిల్లలకివ్వాలి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అనేక మంది విద్యార్థులు తల్లిదండ్రుల ఒత్తిడితో మక్కువ లేని సబ్జెక్టులు తీసుకుని చదవలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇంటర్ ప్రవేశ సమయంలో తల్లిదండ్రుల బలవంతంతో కొందరు, గొప్పగా చెప్పుకోవాలనే ఆలోచనతో మరికొందరు ఇష్టం లేని గ్రూపుల వైపు అడుగులేసి చతికిలపడుతున్నారు.

ఇంటర్ కీలకం

విద్యార్థి దశలో ఇంటర్ కీలకం. ఈ దశలో పడిన అడుగు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే పది పరీక్షలు రాసి ఇంటర్ ప్రవేశాల కోసం వేలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. పిల్లల ఆసక్తి తెలుసుకుని ప్రోత్సహించాలి. అప్పుడే వారు రాణించగలుగుతారు.

ఇష్టాన్ని గుర్తించాలి

పిల్లల ఇష్టాలను పక్కనబెట్టి డాక్టర్, ఇంజినీర్ చేయాలని తల్లిదండ్రులు కలలుకంటున్నారు. తమ అభిప్రాయాలను పిల్లలపై రుద్దుతున్నారు. మేము చెప్పే కోర్సులను తీసుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. దీంతో విద్యార్థులు వారి ఆసక్తిని పక్కనబెట్టి తల్లిదండ్రులు చెప్పిన కోర్సులో చేరి రాణించలేకపోతున్నారు. పిల్లల ఇష్టాన్ని గుర్తించినప్పుడే రాణిస్తారన్న సత్యాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలని మానసిక శాస్త్రవేత్తలు హితవు పలుకుతున్నారు.

జిల్లాలో పది ఉత్తీర్ణులైనవారు 41,260 మంది

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 48,243 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 41,260 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో కొందరు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో చేరడానికి సన్నద్ధమవుతున్నారు. ఇంకొందరు ప్రభుత్వ కళాశాలల్లో చేరనున్నారు. మరికొందరు పాలిటెక్నిక్, ఏపీఆర్ జేసీ వంటి పోటీ పరీక్షలతో ఆయా కోర్సుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. పాస్ మార్కులతో గట్టెక్కిన విద్యార్థులు తక్కువ సమయంలో ఉపాధి లభించే ఐటీఐ, ఒకేషనల్ కోర్సులను ఎంచుకుంటున్నారు. సామర్థ్యాన్ని అంచనా వేసుకుని ఇప్పటికే విద్యార్థులు ప్రణాళిక రచించుకున్నారు. ఇలాంటి సమయంలో ఏది ఉత్తమం, ఏ కోర్సులు తీసుకోవాలి వంటి సలహాలు ఇవ్వడం వరకే తల్లిదండ్రులు తమ బాధ్యతగా భావించాలి. గ్రూపుల ఎంపికలో పిల్లలకు స్వేచ్ఛనివ్వాలని నిపుణులు చెబుతున్నారు.


బలవంతం చేయడం సరికాదు



విద్యార్థులను సాధ్యమైనంత వరకూ వారికి నచ్చిన గ్రూపులోనే చేర్పించాలి. పదో తర్వాత ఇంటర్ మీడియెట్ ప్రవేశంలో పిల్లల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి. వారికి నచ్చిన కోర్సుల్లో చేరేందుకు సహకరించాలి. తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను చెప్పడం వరకే సరి పెట్టుకోవాలి. వారి అభిప్రాయాలను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయకూడదు. ఇరుగుపొరుగు పిల్లలతో పోల్చకూడదు.

–డాక్టర్ డి. కైలాసరావు, విద్యావేత్త

ఒత్తిడి పెట్టడంతో ఇబ్బందులే



పిల్లల అభిప్రాయాలు తెలుసుకోకుండా చదవాలంటూ ఒత్తిడి పెట్టడితే ఇబ్బందులు తలెత్తుతాయి. పిల్లల సామర్థ్యాలను తెలుసుకోవాలి.

–డాక్టర్ ప్రసాద్‌బాబు, సైకాలజిస్ట్, అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్, ఇగ్నో

నరసింహస్వామికి వైభవంగా హనుమంతు సేవ



వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం హనుమంతు సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హనుమంతు వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అర్చకులు శ్రీధరాచార్యులు, వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో సురేష్‌బాబు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు స్వామి వారి కల్యాణం జరుగుతుండటంతో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీక్షా స్వాముల ఇరుముడి సమర్పణ, అమ్మ, స్వామి వారి ఎదురుకోలోత్సవానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిల్లకల్లు పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేశారు.

సీఎస్ఎస్ఎన్‌రెడ్డికి డీఐఈఓగా ఉద్యోగోన్నతి

పాయకాపురం(విజయవాడరూరల్): ఎన్టీఆర్ జిల్లా డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న సీఎస్ఎస్ఎన్ రెడ్డిని ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లా డీఐఈఓగా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేసింది. ఆయన పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జిల్లా ఒకేషనల్ ఆఫీసర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన స్థానంలో ఏలూరు నుంచి బి.ప్రభాకర్‌ను ప్రభుత్వం ఎఫ్ఏసీగా నియమించింది.

కొల్లగొట్టేస్తున్నారు

- యథేచ్ఛగా మట్టి, బుసక తవ్వకాలు
- రోజుకు రూ.కోటికి పైగా అక్రమ వ్యాపారం
- కూటమి నేతల అక్రమ దందా
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- రాత్రీ పగలు తేడా లేకుండా తవ్వకాలు



చిన్నయాదరలో మట్టి తవ్వకాలు జరుగుతున్న దృశ్యం

అవనిగడ్డ: కృష్ణా జిల్లాలో కూటమి నేతలు సహజ వనరులను కొల్లగొట్టేస్తున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా పలు ప్రాంతాల్లో మట్టి, బుసక, ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా జరిగే ఈ తవ్వకాలతో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. రోజుకు రూ.కోటికి పైగా అక్రమ రవాణా జరుగుతుందంటే ఏ స్థాయిలో దందా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

టిప్పర్ బుసక రూ.5 వేలు

జిల్లాలోని అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో పలుచోట్ల పెద్ద ఎత్తున మట్టి, బుసక అక్రమ రవాణా సాగుతోంది. ఈ ప్రాంతాల్లో రోజుకు కోటి రూపాయలకు పైగా అక్రమ రవాణా జరుగుతుందంటేనే ఏ స్థాయిలో దందా చేస్తున్నారో తెలుస్తోంది. చెరువులు పూడిక, పొలాల మెరక పేరుతో అనుమతులు తీసుకుని యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. ట్రక్కు ట్రాక్టర్ మట్టి రూ.1,200 నుంచి రూ.1,600, టిప్పర్ బుసక రూ.4 వేల నుంచి రూ.5 వేలకు అమ్ముతున్నారు.

నాగాయలంకలో టీడీపీ బడానేతదే దందా..

నాగాయలంక, కోడూరు, ఘంటసాల మండలాల్లో పెద్ద ఎత్తున మట్టి అక్రమ రవాణా సాగుతోంది. 'నాగాయలంక'లో టి.కొత్తపాలెం, పెదపాలెంలో పంట పొలాల మెరక తీసే పేరుతో మట్టి మాఫియాను అడ్డం పెట్టుకుని ఓ బడా టీడీపీ నేత గత పది రోజుల నుంచి మట్టి అక్రమ దందా సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'కోడూరు'లో స్వతంత్ర్యపురం, కృష్ణాపురం, కోడూరు, ఉల్లిపాలెం, 'ఘంటసాల'లో జోడిగూడెం, తాడేపల్లిలో మట్టి అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.



నాగాయలంక మండలం పెదపాలెం వద్ద మట్టి ట్రాక్టర్లు

పెడనలో ఎమ్మెల్యే అనుచరులే..

పెడన నియోజకవర్గంలో బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను, పెడన మండలాల్లో పెద్ద ఎత్తున మట్టి, బుసక తవ్వకాలు జరుగుతున్నాయి. పెడనలో ఎమ్మెల్యే అనుచరులే రాత్రి వేళలో బుసక, మట్టి తవ్వకాలు చేస్తున్నారు. గూడూరులో టీడీపీ నాయకులు సాగిస్తున్న అక్రమ తవ్వకాలపై జనసేన నేతలు ఫిర్యాదులపై ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకున్నవారే లేరు. బంటుమిల్లిలో అక్రమ తవ్వకాలు చేస్తున్న పార్టనర్స్ ఒకరినొకరు కొట్టుకునే పరిస్థితి నెలకొంది.

మంత్రి హెచ్చరికతో పెట్రేగి పోతున్నారు..

ఇటీవల చల్లపల్లిలో జరిగిన టీడీపీ సమావేశంలో మట్టితోలుతుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సుభాష్ దృష్టికి తీసుకురాగా ఆయన ఓ పోలీస్ బాస్‌కు ఫోన్ చేసి మా వాళ్ల జోలికి రావొద్దని హెచ్చరించినట్లు తెలిసింది. అప్పటి నుంచి దివిసీమలో మట్టి అక్రమ దందా మరింత పెరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టడం లేదు..

మట్టి, బుసక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్ల స్పీడుకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇష్టారాజ్యంగా స్పీడుగా వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకో కపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మచిలీపట్నం మండలం బుద్దాయిపాలెంలో మట్టి ట్రాక్టర్ కింద పడి ఇటీవల విద్యార్థి మరణించగా, నాగాయలంక మండలం టి.కొత్తపాలెంలో రెండు రోజుల వ్యవధిలో మట్టి ట్రాక్టర్లు ఢీ కొని ఇద్దరు గాయాలపాలయ్యారు. టిప్పర్లు, ట్రాక్టర్లపై ఎలాంటి పట్టాలు లేకుండా తోలడం వల్ల స్పీడ్ బ్రేకర్లు, గోతుల వద్ద మట్టిగడ్డలు, బుసక పడి వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

మచిలీపట్నంలో మంత్రి అనుచరులే..

మచిలీపట్నం నియోజకవర్గంలో మంత్రి అనుచరులే మట్టి, బుసక అక్రమ దందా సాగిస్తున్నారు. చిన్నాపురం, చినయాదర, పెద పట్నం, పోతేపల్లి, గూడూరు, మంగినపూడి పోర్టు భూముల్లో కొన్ని చోట్ల మట్టి, బుసక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ నుంచి ప్రతి రోజూ రాత్రి వేళల్లో వందలాది టిప్పర్లు మట్టి, బుసకను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. ట్రాక్టర్ల సంగతి చెప్పనక్కర లేదు. టీడీపీ నాయకులతో పాటు జనసేన నేతలు ఇక్కడ మట్టి, బుసక దందా సాగిస్తున్నారు.

గణపేశ్వరంలో ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అవనిగడ్డ: మట్టి అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్లు అధిక లోడుతో వెళ్లడంతో రహదారులు దెబ్బతింటున్నాయని, వీటిని వెంటనే ఆపాలని నాగాయలంక మండల పరిధిలోని గణపేశ్వరం గ్రామస్తులు శనివారం ఆందోళన చేశారు. పుల్లయ్య గారిదిబ్బ, దిండి, సొర్లగొంది, పెదగొడపాలెం నుంచి మూడురోజులుగా విచ్చలవిడిగా టిప్పర్లు వెళ్తున్నాయని దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని, వీటితో రోడ్లు దెబ్బతింటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నాగాయలంక తహసీల్దార్‌తో చెప్పినా ఫలితం లేదని, అక్రమ మట్టి తవ్వకాలను ఆపకపోతే తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

రేపు తిరువూరులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తిరువూరు డివిజన్‌లోని మండలాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం ఈ నెల 12వ తేదీ సోమవారం తిరువూరులో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరువూరు బస్టాండ్ వెనుక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి అర్జీల స్వీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో కూడా అర్జీలు సమర్పించడానికి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ జరుగుతుందని తెలిపారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి

- వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్
- వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి అండగా ఉంటాం



కొవ్వొత్తుల ప్రదర్శనలో అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి, వెలంపల్లి, మల్లాది, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పేర్కొన్నారు. వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన స్వరాజ్య మైదానంలోని అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం (సామాజిక న్యాయ మహా శిల్పం) వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి.. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన చేసి రెండు నిముషాలు మౌనం పాటించారు. వుయ్ స్టాండ్ విత్ ఇండియన్ ఆర్మీ, మురళీ నాయక్ అమర్ హై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ యుద్ధంలో మురళీనాయక్ మరణించాడన్న వార్త తెలిసిన వెంటనే మాజీ సీఎం వైఎస్ జగన్ స్పందించారని, ఆయన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారన్నారు. ఈనెల 13న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా మురళీనాయక్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదారుస్తారన్నారు. మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసుల దాడి దుర్మార్గమన్నారు.

రజనిపై పోలీసుల దాడి అమానుషం

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీ మహిళ, మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమన్నారు. సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుచర్యలకు పాల్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రవి చంద్ర, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి


ధర్నా చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. సమాన పనికి సమాన వేతనం , కార్మికులను పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. ధర్నాలో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు గౌడ్, గౌరవాధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరిరావు మాట్లాడుతూ.. అత్యవసర విభాగాలైన నీటి సరఫరా, వీధి దీపాలు, డ్రెయినేజీ, పార్క్‌లు, మెకానిక్‌లు, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న టెక్నికల్ సిబ్బందికి రూ.29,200లు, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 ఏళ్ల సర్వీసు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు.

ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి..

కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు, ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాట్యుటీ, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలి, ఆదివారాలు, దేశ, జాతీయ పండుగలకు సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో యూనియన్ సమన్వయ కార్యదర్శి బత్తుల శివశంకర్, నగర అధ్యక్షుడు పిట్టా మహేష్, కార్యదర్శి ఎండీ గౌస్, ఉపాధ్యక్షులు బుచ్చిబాబు, వి.జైపాల్, బి.నాగరాజు, నాయకులు సాంబశివరావు, విష్ణుప్రసాద్, శివాజీ, బి.విజయ్, ఎస్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అనారోగ్యంతో వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వేస్టేషన్‌లో అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటనపై ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం ప్లాట్‌ఫాం నంబర్ 1లోని దక్షిణ ప్రవేశ ద్వారం, బుకింగ్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని మగ వ్యక్తి చనిపోయి ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ పార్థసారథి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు ఫ్యాంటు, నలుపుపై తెలుపు గడుల చొక్కా ధరించి ఉన్నాడని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ స్టేషన్ లేదా 88971 56153 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

జల్లు స్నానాలకూ అవకాశం లేదు !

- నదీ తీరం పక్కనే ఉన్నా తాగేందుకు నీళ్లు లేవు
- దుర్గాఘాట్‌లో సమస్యలపై ఈవోకు భక్తుల ఏకరువు


దుర్గాఘాట్‌లో సమస్యలపై అధికారులకు సూచనలు చేస్తున్న ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సార్ కృష్ణా నదిలో నీళ్లు అడుగు ఎత్తు కూడా లేవు.. కనీసం జల్లు స్నానాలు చేసేందుకు కూడా అవకాశం లేకుండా ఉందని పలువురు భక్తులు దుర్గాఘాట్‌లో పుణ్య స్నానాల గురించి ఈవో వీకే శీనానాయక్ ఎదుట ఏకరువు పెట్టారు. నదీ తీరంలో ఉన్నా తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరకడం లేదు. కృష్ణమ్మ చెంతనే ఉన్నా భక్తులు నీళ్లు కొనుక్కోవాల్సి వస్తుందని మరో మహిళా భక్తురాలు ఆవేదన వ్యక్తం చేశారు. సార్ బట్టలు మార్చుకునేందుకు గదులు కట్టారు.. అందులో క్షణం కూడా ఉండలేని పరిస్థితి.. ఉక్కపోతతో అల్లాడుతున్నామని.. కనీసం గదులకు మరమ్మతులు చేయించాలని మరో భక్తురాలి విన్నపం ... దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ దుర్గాఘాట్, కేశ ఖండనశాల, హెడ్ వాటర్ వర్క్స్ వద్ద కొండ ప్రాంతం, శివాలయం, యాగశాల, నూతన పూజా మండపాలు, జమ్మిదొడ్డిలోని దేవస్థాన భవనాలను శనివారం పరిశీలించారు.

తాగేందుకు నీళ్లు లేవు

దుర్గాఘాట్‌కు చేరుకున్న ఈవో శీనా నాయక్‌కు పుణ్యస్నానాలు ఆచరించేందుకు విచ్చేసిన భక్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నదీ తీరం పక్కనే ఉన్నా తాగేందుకు నీళ్లు అందుబాటులో లేవని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈవో ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా స్నానఘాట్‌లో పూజా సామగ్రి విక్రయించే వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారని గుర్తించారు. దుస్తులు మార్చుకునే గదులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పూజా మండపం, యాగశాలలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఈవో శీనానాయక్ ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలోని నూతన నిర్మాణాలతో పాటు మరమ్మతులకు గురైన అర్చక క్వార్టర్స్, వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. వాటర్ ట్యాంక్‌లను ఎప్పుడు శుభ్రం చేసింది వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం దుర్గాఘాట్‌కు ఎదురుగా ఉన్న కేశ ఖండన శాలను పరిశీలించి ప్రతి నిత్యం ఎంత మంది భక్తులు తలనీలాలు సమర్పిస్తారు.. తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈవో వెంట ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు, ఏఈలు కుటుంబరావు, మస్తాన్‌రావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ టాపర్ల విమానయానం


గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో విద్యార్థులు

విమానాశ్రయం(గన్నవరం): పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడానికి అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఉత్తమ మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులను ఎంపిక చేసిన ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో వారిని కడప నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు విమానంలో తీసుకొచ్చారు. అనంతపురం జిల్లా కోనాపురం స్కూల్ హెచ్‌ఎం ఎస్.రమేష్‌బాబు, పెద్దవడుగూరు హైస్కూల్ ఉపాధ్యాయిని ఎస్.హేమలత పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన తొమ్మిది మంది విద్యార్థులకు విమాన ప్రయాణ అవకాశం కల్పించడానికి ముందుకొచ్చారు. పెదవడుగూరు మండలంలోని ఏడు హైస్కూల్స్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఎనిమిది మందిని, వికలాంగుల్లో ఒకరిని ఎంపిక చేశారు. మొత్తం తొమ్మిది మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు రూ.50 వేలు వెచ్చించి శనివారం కడప ఎయిర్‌పోర్ట్ నుంచి గన్నవరానికి ఇండిగో విమానంలో వెంట తీసుకువచ్చారు. మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్న విద్యార్థులు సంతోషంతో కేరింతలు కొట్టారు. పేద కుటుంబాలకు చెందిన తమను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చి విమాన ప్రయాణం చేయాలనే కలను నేరవేర్చిన హెచ్‌ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయిని హేమలతకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులను విజయవాడ సందర్శనార్థం ఉపాధ్యాయులు తీసుకెళ్లారు.

కీలక సమయాల్లో అప్రమత్తత అవసరం

పటమట(విజయవాడతూర్పు): ప్రస్తుతం ఇండియా – పాకిస్తాన్ బోర్డర్ వద్ద ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నగరంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫైర్ అధికారి శంకరరావు, ఫైర్ అధికారి నరేష్ చెప్పారు. పటమట పరిధిలోని ఎల్‌ఈపీఎల్ షాపింగ్ కాంప్లెక్స్, ఐనాక్స్ థియేటర్లలో శనివారం సిబ్బందితో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. అధికంగా జన సంచారం ఉండే ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. థియేటర్‌లో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎవరూ కంగారు పడకుండా రుమాలు లేదా అందుబాటులో ఉన్న వస్త్రాన్ని తడిపి ముక్కు, నోరుకు కలిపి కట్టుకుని బయటకు వచ్చే ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారంతా లిఫ్ట్‌ను వినియోగించకుండా మెట్ల మార్గంలోనే బయటకు రావాలన్నారు. ఓ వైపు మాల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తుండగా ఐనాక్స్ థియేటర్‌లో స్కీన్‌ల వద్ద, మాల్ సెల్లార్‌లో లైఫ్ స్టైల్ షోరూంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురిని ఫైర్ సిబ్బంది హుటాహుటిన సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ ప్రారంభం


క్యాన్సర్ క్లబ్ లోగోను ఆవిష్కరిస్తున్న గోయల్, డాక్టర్ సుబ్బారావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవడం ద్వారా తొలిదశలో గుర్తించి, పూర్తిగా నయం చేసేందుకు అవకాశం ఉంటుందని టెలికం రంగ దిగ్గజం ఎన్‌కే గోయల్ సూచించారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, క్యాన్సర్ రోగులకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో గోయల్ మాట్లాడుతూ.. ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో స్వచ్ఛంద సంస్థల కృషి ఎంతో కీలకమన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధి బారినపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోవడం ద్వారా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, అందుబాటులో ఉన్న చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిని జయించేందుకు అవసరమైన తోడ్పాటు అందించాలన్నారు.

క్యాన్సర్ విముక్త భారత నిర్మాణానికి కృషి..

ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్(ఐఆర్ఐఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వేమూరి వరప్రసాద్ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స ప్రభావవంతంగా ఉంటుందన్నారు. అందుబాటులో ఉన్న అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా క్యాన్సర్ విముక్త భారత నిర్మాణానికి సిటిజెన్ ఫోర్స్ కృషి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సిటిజెన్ ఫోర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ పిన్నంశెట్టి రమేష్‌బాబు మాట్లాడుతూ.. క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం కోసం సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ పని చేస్తుందన్నారు. ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్, సినీ నటి చంద్రానీదాస్ తదితరులు పాల్గొన్నారు.

దారి మళ్లుతున్న ఉచిత లడ్డూలు

- రూ.500 టికెట్ల భక్తులకు అందని వైనం
- పెరుగుతున్న ఫిర్యాదులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రూ.500 టికెట్లపై భక్తులకు ఇవ్వాల్సిన ఉచిత లడ్డూలు దారి మళ్లుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. భక్తులకు సర్వదర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్లకు క్యూ లైన్లు ఉన్నాయి. అంతరాలయంతో పాటు త్వరతిగతిన అమ్మవారి దర్శనం అవుతుందనే భావనతో భక్తులు రూ.500 టికెటు కొనుగోలు చేస్తుంటారు. అయితే రూ.500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు దేవస్థానం ఉచితంగా రెండు లడ్డూలను అందిస్తుంది. రూ.500 టికెటు కోసం మహా మండపం దిగువన ప్రత్యేక కౌంటర్‌తో పాటు ఘాట్‌రోడ్డులోని డోనర్ సెల్ ఎదుట, స్కానింగ్ పాయింట్ వద్ద కౌంటర్లను దేవస్థాన అధికారులు అందుబాటులో ఉంచారు.

సిబ్బందిని హెచ్చరించిన ప్రయోజనం లేదు..

అయితే శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో రూ.500 టికెట్లకు ఇవ్వాల్సిన లడ్డూలను ఇవ్వడం లేదనే ఫిర్యాదులు ఇటీవల అధికమయ్యాయి. రద్దీని ఆసరాగా చేసుకుని కౌంటర్‌లోని సిబ్బంది లడ్డూలను ఇవ్వకుండానే భక్తులను పంపేస్తున్నారు. దర్శనం క్యూలైన్లో కొంత మంది భక్తుల వద్ద లడ్డూలు ఉండటం చూసి ఆరా తీయడంతో ఉచిత లడ్డూల విషయం తెలుస్తుంది. అయితే రద్దీతో ఆలయ అధికారులకు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక, ఆలయ ప్రాంగణంలోని సిబ్బందిని ఆరా తీస్తున్నారు. టికెట్లను కొనుగోలు చేసిన కౌంటర్లలోనే ఉచిత లడ్డూలను ఇస్తారని చెబుతుండటంతో వారు తిరిగి ఆ కౌంటర్లకు చేరుకుని సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. అయితే కొంత మంది పెద్ద వారు తిరిగి కౌంటర్ల వరకు వెళ్లలేక ప్రసాదాల కౌంటర్లలో డబ్బులు ఇచ్చి తిరిగి లడ్డూలను కొనుగోలు చేసిన ఘటనలు ఇటీవల అధికమయ్యాయి. గతంలోనూ ఇదే తరహా ఫిర్యాదులు రాగా ఆలయ అధికారులు కౌంటర్లలోని సిబ్బందిని హెచ్చరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే తాజాగా శుక్ర, శనివారాల్లో ఇదే పరిస్థితి పునరావృతం కావడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. కౌంటర్లలో ఇలా మిగిలిన లడ్డూలు ఎక్కడకు వెళ్లుతున్నాయనేది దుర్గమ్మకే ఎరుక.

బైక్ చోరీల ముఠా ఆటకట్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కంకిపాడు: కంకిపాడు పోలీసులు మోటారు బైక్‌ల చోరీ ముఠా ఆటకట్టించారు. ఈ కేసులో నలుగురి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ మేరకు కంకిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు శనివారం కేసు వివరాలను వెల్లడించారు. గత నెల 25న గంగూరు గ్రామానికి చెందిన మహమ్మద్ జివుల్ రెహమాన్ ఈడుపుగల్లులోని మసీదు వద్ద నమాజ్ చేసుకునేందుకు తన స్నేహితుడి మోటారు బైక్‌పై వచ్చాడు. నమాజ్ చేసుకుని బయటకు వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్ కంకిపాడు పట్టణంలోని ఫ్లై ఓవర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా యువకులు రెండు మోటారు బైక్‌లపై వెళ్తూ పట్టుబడ్డారు. వారి వాహనాలకు రికార్డులు లేకపోవటంతో గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ద్విచక్ర వాహనాలను చోరీ చేసే ముఠాగా గుర్తించారు.


రూ.21.46 లక్షల విలువైన 50 బైక్‌ల రికవరీ

కృష్ణాజిల్లాలోని కంకిపాడు, పెనమలూరు, పెడన, మచిలీపట్నం, గుడ్లవల్లేరు, ఎన్టీఆర్ జిల్లాలోని భవానీపురం, మాచవరం, విజయవాడ టూ టౌన్, గుంటూరు జిల్లా కొత్తపేట, మంగళగిరి టౌన్, ఏలూరు జిల్లాలోని ఏలూరు టూ టౌన్, బాపట్ల జిల్లాలోని రేపల్లె పోలీసుస్టేషన్లలో మొత్తం ఐదు జిల్లాల పరిధిలో 17 పోలీసుస్టేషన్లలో రూ.21.46 లక్షల విలువైన 50 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు విచారణలో నేరం అంగీకరించారు. మచిలీపట్నం నిజాంపేటకు చెందిన మొహమ్మద్ రిజ్వాన్, కోడూరు మండలం గొడపాలెంకు చెందిన కేశన సురేష్, ఉల్లిపాలెం గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం, కోలా కృష్ణారావులను మోటారు బైక్‌ల చోరీ కేసులో నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. ముందుగానే చోరీ చేసేందుకు ఒక ప్రాంతాన్ని ఎంచుకుని సీసీ కెమెరాల్లో చిక్కకుండా ఉండేలా హెల్మెట్ ధరించి చోరీలకు పాల్పడటం ఈ ముఠా నైజమన్నారు. ఫంక్షన్ హాల్స్, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, హాస్పిటల్స్ వద్ద పార్కు చేసి ఉన్న వాహనాలే వీరి లక్ష్యంగా పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కేసు విచారణలో ప్రత్యేక చర్యలు తీసుకున్న సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్, హెచ్‌సీ కె.చంద్రబాబు, పీసీలు పీఎస్ఎన్ మూర్తి, ఎస్‌డి బాబీబాబులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని రేపు ధర్నా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ఇతర పాఠశాలల పునర్వ్యవస్థీకరణ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేయనున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.సుందరయ్య తెలిపారు. ఈ మేరకు జిల్లా డీఆర్వో లక్ష్మీనరసింహం, డీఈవో యువీ సుబ్బారావులను యూటీఎఫ్ నేతలు శనివారం కలిసి వారికి వినతిపత్రాలను అందజేశారు. సుందరయ్య మాట్లాడుతూ మే 10వ తేదీ వచ్చినా నేటికీ బదిలీల, పదోన్నతుల షెడ్యూలు విడుదల చేయకపోవడం పట్ల ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కన్నా ముందుగానే పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు తెరదింపాలని కోరారు. ఆయా అంశాలపై ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు మే 12న విజయవాడలోని ధర్నా చౌక్‌లో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సుందరయ్య, పి.లీల, జె.రామకృష్ణ, ఏ.అనంతకుమార్, ఎస్.చలపతిరావు సిటీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత మనోజ్‌పై పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ అమలు



సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): గంజాయి సరఫరా, పలు చోరీ కేసుల్లో నిందితుడైన నగరానికి చెందిన తుమ్మల మనోజ్‌పై నగర పోలీసులు పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ అమలు చేశారు. విజయవాడ నగరంతో పాటు పలు జిల్లాల్లోని విద్యాసంస్థల వద్ద గంజాయి విక్రయిస్తూ యువతను మత్తుకు బానిసలు చేయడమే లక్ష్యంగా పనులు నిర్వహించడం ఇతని నైజం. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్‌పీ రోడ్డులో నివాసముండే తుమ్మల మనోజ్‌పై 2011లో తొలిసారిగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసు నమోదైంది. ఆ తరువాత 2012లో మరో కేసు నమోదు కాగా అప్పటి నుంచి వరుసగా గంజాయి విక్రయిస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. సత్యనారాయణపురం, వన్‌టౌన్, కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, భవానీపురం, కృష్ణలంక, విశాఖపట్నంలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో 28 సార్లు గంజాయి అమ్ముతూ పట్టుబడి అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన తరువాత కూడా తన నేర ప్రవృత్తిని కొనసాగించేవాడు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగ జేస్తున్నందున అతనిపై పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్-1988 అమలు చేస్తూ పోలీసుశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో నగర ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వుల మేరకు శనివారం పశ్చిమ ఏడీసీపీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో నార్త్ ఏసీపీ స్రవంతి రాయ్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ మనోజ్‌ను అదుపులోనికి తీసుకున్నారు. న్యాయస్థానంలో హాజరుపర్చిన అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

చిన్నారి ఊపిరి తీసిన బియ్యం డబ్బా

కంచికచర్ల: ఓ బాలుడు ఆడుకునే సమయంలో ఇంటిపై ఉన్న బియ్యం డబ్బాలో దాక్కుని ఊపిరాడక మృతి చెందిన ఘటన కంచికచర్లలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ బి.రాజు కథనం మేరకు కంచికచర్ల అరుంధతీనగర్‌లో ఉలువలపూడి పవన్‌కుమార్, సరస్వతి దంపతులు నివసిస్తున్నారు. వారి పెద్ద కుమారుడు మూడో తరగతి, చిన్న కుమారుడు వినయ్‌కుమార్ ఒకటో తరగతి పూర్తి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం పిల్లలు ఇద్దరూ ఆడుకున్నారు. ఆ తరువాత వినయ్‌కుమార్ కనిపించకపోవటంతో తండ్రి పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వినయ్‌కుమార్ కోసం రెండు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి వెతుకులాట ప్రారంభించారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇంటిపైన ఉన్న బియ్యం డబ్బాను తెరిచి చూడగా వినయ్‌కుమార్ నిర్జీవంగా కనిపించాడు. ఆడుకునే క్రమంలో బాలుడు బియ్యం డబ్బాలో దాక్కుని ఉంటాడని, డబ్బా మూతపడిపోవడంతో ఊపిరాడక మృతిచెందాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధులకు పండ్లు పంపిణీ



పటమట(విజయవాడతూర్పు): ఉమెన్ వరల్డ్ ఆర్గనైజేషన్, శ్రీస్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటమట విజయ హాస్పిటల్ వద్ద ఉన్న అమ్మా ఓల్డేజ్ హోమ్‌లో శనివారం మాతృదినోత్సవం నిర్వహించారు. వృద్ధ మహిళలతో కేక్ కట్ చేయించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అవనిగడ్డ సునీత, యాదల శ్రీనివాసరావు, ప్రతినిధులు హెబ్సీ, లహరి, సునీతారెడ్డి, మీనా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి, సంగీత సామ్రాట్ సంగీత సంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళావేదిక ఆధ్వర్యంలో నెల వారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా భక్తి సంగీతం , సీతారామ కల్యాణం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గాయనీ గాయకులు మల్లీశ్వరి, శ్యాంప్రసాద్, స్వాతిమీరా కుమార్, అయ్యప్ప రాంమాంజీలు పలు భక్తి గీతాలను ఆలపించారు. సినీ నటి, విఖ్యాత హరికథా భాగవతారిణి పడాల కల్యాణి హరికథాగానం చేశారు. సాయిబాబు వైలెన్‌పై, మృదంగంపై పి.చైతన్య సహకరించారు. సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు మాట్లాడుతూ హరికథా సంప్రదాయాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు హరికథా భాగవతారిణి కల్యాణిని ఆత్మీయంగా సత్కరించారు.

ఆటోనగర్ యజమానులకు సమ్మె నోటీసు



పెనమలూరు: ఈ నెల 20న జరుగనున్న దేశ వ్యాప్త సమ్మెకు కానూరు ఆటోనగర్‌లోని యాజమానులు మద్దతు పలకాలని కృష్ణా జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. కానూరు ఆటోనగర్‌లో శనివారం యజమానులకు సమ్మె నోటీసు ఇచ్చి, కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్త సమ్మెను అన్నివర్గాల వారు విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల హక్కులకు భంగం కలుగకుండా ఉండాలంటే సమ్మెలో కార్మికులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, నేతలు రాజేశ్వరరావు, వెంకటరెడ్డి, సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మహిళపై దౌర్జన్యం చేసిన ముగ్గురిపై కేసు నమోదు

రామవరప్పాడు: మహిళపై దౌర్జన్యం చేసి అసభ్య ప్రవర్తనతో దుర్భాషలాడిన ఘటనపై ఫిర్యాదు అందడంతో పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి.. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు టయోటా షోరూమ్ పక్క వీధిలో బండి జయశ్రీ తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటోంది. ఇదే ప్రాంతానికి చెందిన రోషి బాబు బండి జయశ్రీని అసభ్య ప్రవర్తనతో వేధిస్తున్నాడు. తరుచూ మద్యం సేవించి వచ్చి బూతులు తిడుతూ గొడవకు దిగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 8న రోషి బాబుతో పాటు అతని భార్య తిరుపతమ్మ, సోదరి దుర్గా భవానీలు జయశ్రీ ఇంటిపైకి వచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ గొడవకు దిగారు. రోషి బాబు నిన్ను చంపేస్తానంటూ బెదిరించాడు. బాధితురాలు జయశ్రీ పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రోషి బాబు, తిరుపతమ్మ, దుర్గా భవానీలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

నిలిచిన షాదీఖానా నిర్మాణం

- నిధులు లేవంటూ సాకులు చెబుతున్న అధికారులు
- ముస్లింల సమస్యలపై కూటమి కక్ష
- తక్షణమే పనులు ప్రారంభించాలని వినతి



నిర్మాణం మధ్యలో నిలిచిన షాదీఖానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మైనార్టీల సమస్యల పరిష్కారంలో కూటమి సర్కారు మొండి చేయి చూపుతుంది. అభివృద్ధిని సైతం ఆపేసి కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. అదేమంటే నిధుల కొరత అనే సాకు చూపుతోంది. అందుకు లబ్బీపేటలోని షాదీఖానా నిదర్శనంగా నిలుస్తోంది. ఏడాది కిందట నిలిచిన షాదీఖానా నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. తూర్పు నియోజకవర్గంలోని దాదాపు 35 వేల మంది జనాభా ఉన్న ముస్లింలకు ఉపయోగపడే షాదీఖానా విషయంలో కూటమి సర్కారు మోసపూరితంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ముస్లింలకు మేలు చేయాలనే తలంపుతో....

తూర్పు నియోజకవర్గంలో షాదీఖానా నిర్మాణం చేపట్టాలనేది దశాబ్దాల నాటి కలగా ఉండేది. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా అక్కడ షాదీఖానా కట్టేందుకు పరిశీలన జరిపారు. స్థలాన్ని షాదీఖానాకు కేటాయించే విషయంలో చొరవ చూపకపోవడంతో నిలిచిపోయింది. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ విషయాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో స్థల కేటాయింపునకు లైన్ క్లియర్ కావడంతో పాటు రూ.2 కోట్లు అంచనాతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ఎన్నికల నాటికే రెండు శ్లాబులు పూర్తి....

షాదీఖానా నిర్మాణ పనులు తొలుత చాలా వేగంగా కొనసాగాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చే నాటికే రెండు శ్లాబులు పూర్తయ్యాయి. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పనులు కొనసాగించాలని ముస్లిం ప్రతినిధులు కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని చెబుతున్నారు. అదేమంటే నిధులు కొరత ఉందంటూ అధికారులు చెబుతున్నారని ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముస్లింలు అంటే ఈ ప్రభుత్వానికి ఎందుకీవివక్ష అంటూ ప్రశ్నిస్తున్నారు.

షాదీఖానా ఎంతో అవసరం....

ప్రస్తుతం ముస్లిం మైనార్టీలు వేడుకలు నిర్వహించుకునేందుకు షాదీఖానా అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పేద ముస్లింలు ఫంక్షన్ హాల్లో చేసుకునే స్తోమత లేక అవస్థలు పడుతున్నారు. అలాంటి వారికి ఇది పూర్తయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. మంచి ఉద్దేశంతో చేపట్టిన నిర్మాణ పనులను కొనసాగించాలని, రాజకీయాలకు అతీతంగా దానిని పూర్తి చేయాలని ముస్లింలు డిమాండ్ చేస్తున్నారు. ఒక మంచి కార్యక్రమానికి అడ్డు పడటం మంచిది కాందంటున్నారు.

వెంటనే పనులు ప్రారంభించాలి



లబ్బీపేటలో నిలిచిన షాదీఖానా నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి. తూర్పు నియోజకవర్గంలోని ముస్లింలందరికీ ఉపయోగపడేలా దాని నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి. అధికారులు నిధులు లేవనే సాకులు చెప్పకుండా వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలి.

– సయ్యద్ అలీం, కో ఆప్షన్ సభ్యులు, నగర పాలక సంస్థ

వెలగని విద్యుత్ లైట్లు



వెలగని విద్యుత్ లైటు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక సిద్ధార్థ నగర్‌లోని ప్రధాన, అంతర్గత రహదారుల్లో విద్యుత్ లైట్లు వెలడం లేదు. దీనివల్ల చీకట్లోనే వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. సిద్ధార్థ నగర్‌లో రాత్రి సమయంలో వీధి దీపాలు (విద్యుత్ లైట్లు) వెలగకపోవడంతో స్టేట్ బ్యాంక్ కాలనీ-1, 2లోకి వెళ్లేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కోచింగ్ సెంటర్లు, బ్యూటీ పార్లర్లు, లేడీస్ హాస్టల్స్, రెస్టారెంట్‌లు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల వాహనదారుల రాకపోకలు ఇటుగా అధికంగా ఉంటాయి. రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు వెలగక చీకటిగా ఉండటంతో బయటకు రావడానికి మహిళలు, హాస్టల్స్‌లో ఉండే యువతులు భయపడుతున్నారు. గత రెండు రోజులుగా విద్యుత్ లైట్లు వెలగడం లేదని స్థానికులు చెప్పారు. అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ లైట్లు వెలిగేలా మరమ్మత్తులు చేయాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపై ఆవులను వదిలితే రూ.10 వేల జరిమానా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ. 10వేలు జరిమానా విధిస్తామని కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది రోడ్లపై పశువులను వదిలి పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగటమే కాకుండా ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్ సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాటిల్ షెడ్‌లో గోవుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎ స్.ఎస్. రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయన్నారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టకుండా సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, పర్యావరణం పరిరక్షణే ఈ చర్యల ప్రధాన లక్ష్యమన్నారు.

సమ్మె జయప్రదం చేయాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహించి సమ్మెకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్మికులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర నాయకుడు వీ.బి.రాజు పిలుపునిచ్చారు. శిఖామణి సెంటర్‌లో గిరిపురం భవన నిర్మాణ రాడ్ బెండర్స్ కార్మికులు శనివారం ర్యాలీ నిర్వహించి సమ్మెకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక శక్తిని, కార్మికులను, 29 చట్టాలని తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల ఉనికిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తుందన్నారు. అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉన్న సంక్షేమం బోర్డుని పని చేయించి కార్మికులకి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి బెన ర్జీ, నాయకులు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమరులకు విద్యార్థుల చిత్ర నివాళి



పెనమలూరు: కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన పౌరుల చిత్రాలను విద్యార్థులు చిత్రీకరించి నివాళులర్పించారు. కృష్ణా జిల్లా సంస్కార భారతి శాఖ ఆధ్వర్యంలో వేసవి ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించామని విశ్రాంత డ్రాయింగ్ టీచర్ ఆరేపల్లి అప్పారావు తెలిపారు. ఉగ్రమూకల కాల్పుల్లో అమరులైన పౌరుల చిత్రాలను పది రోజుల శిక్షణలో విద్యార్థులు చిత్రీకరించారని చెప్పారు. పోరంకి పాఠశాలలో శనివారం జరిగిన శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థులు అమరులకు పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆరేపల్లి అప్పారావును సంస్కార భారతి నిర్వాహకులు సత్కరించారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.సుమలత, సంస్కార భారతి రాష్ట్ర, జిల్లా నాయకులు పీవీఎస్ కృష్ణ, డి.శ్రీనివాస్, సుహాసిని, విద్యాధరి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సోలార్ యూనిట్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా



లబ్ధిదారులకు మంజూరు పత్రం అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకంపై ప్రత్యేక సింగిల్ విండో డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం క్రింద సోలార్ యూనిట్‌లు మంజూరైన 12 మంది లబ్ధిదారులకు ఎంపీపీ వడ్లమూడి సరోజిని, మండల ప్రత్యేకాధికారి, డీఈఓ పీవీజే రామారావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, సర్పంచి బి. ఎస్తేరమ్మ చేతుల మీదుగా పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ పథకం వల్ల విద్యుత్ బిల్లులను గణనీయంగా ఆదా చేసుకోవచ్చన్నారు. సోలార్ యూనిట్లను ప్రభుత్వం రాయితీపై అందజేయడంతో పాటు బ్యాంక్‌ల నుంచి రుణ సదుపాయం కల్పిస్తోందని చెప్పారు. బ్యాంక్ రుణంపై సోలార్ యూనిట్ల కోసం 83 మంది గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాస్, పలువురు అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అమర జవాన్‌కు వైఎస్సార్ సీపీ నివాళి



మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: భారతదేశం కోసం ప్రాణాలు అర్పించి అమరుడైన వీర జవాన్ మురళీనాయక్‌కు వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త దేవభక్తుని చక్రవర్తి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ కానూరు కార్యాలయంలో శనివారం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి అమాయక ప్రజల ప్రాణాలు బలికొంటోందన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ అమరుడని కొనియాడారు. పార్టీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు పి.రాఘవరావు, అష్రఫ్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేడియంలో సమ్మర్ క్యాంప్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం రైల్వే స్టేడియంలో సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి రైల్వే ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు సీనియర్ డీఎస్‌సీ, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర బి.టితో కలసి క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడంతో వారిలో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ఈ నెల 10 నుంచి జూన్ 7 వరకు జరిగే ఈ క్యాంప్‌లో పదహారేళ్లలోపు పిల్లలకు పలు క్రీడల్లో శిక్షన అందించనున్నట్లు తెలిపారు. క్యాంప్‌లో అనుభవజ్ఞులైన ట్రైనీల సమక్షంలో అథ్లెటిక్స్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్‌తో పాటు పలు క్రీడల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇటువంటి క్యాప్‌లతో పిల్లల్లో పట్టుదల, క్రీడా స్ఫూర్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళి



వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో పాక్ సైనికుల పాశవిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ మురళీనాయక్‌కు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఘన నివాళులర్పించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మురళీనాయక్ చిత్రపటానికి యూనియన్ నాయకులు నివాళులర్పించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా చెందిన మురళీ నాయక్ దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ పాక్ సైనికుల పాశవిక దాడిలో గురువారం వీర మరణం చెందడం యావత్ జాతి గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. భారత్, పాక్ దేశాల మధ్య యుద్ధాన్ని నిలువరించి శాంతిని నెలకొల్పేందుకు ప్రపంచ దేశాలు చొరవ చూపాలని కోరారు. తొలుత ఐజేయు కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచల జయరాజ్, విజయవాడ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, విజయవాడ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, యూనియన్ నేతలు జి.రఘురాం, శివరామకృష్ణ, అహ్మద్ హుస్సేన్, జీవన్ కుమార్, రూపాని రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో వసంత వేణుగోపాలస్వామి

పెనమలూరు: పోరంకి గ్రామంలోని వసంత వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి వారి ఆలయంలో కల్యాణ మహోత్సవం శనివారం ప్రారంభమైంది. రుక్మిణి, సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణం మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు స్వామివార్లను పెళ్లి కుమారుడిని చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో పార్థనా సూక్తం, విశ్వక్సేన పూజ, అంకురారోహణ, వాస్తు హోమం, ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 11న ఉదయం 8 గంటలకు నిత్యహోమం, 9 గంటలకు శ్రీకృష్ణ మండలిచే పారాయణం, సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, రాత్రి 7.30 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణోత్సవం జరుగుతుందని ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారి తిరునాళ్ల



విద్యుద్దీపాలంకరణలో లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి ఆలయం

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి ఆలయం తిరునాళ్ల మహోత్సవాలకు ముస్తాబైంది. విద్యుద్దీప కాంతులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు తిరునాళ్ల మహోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహ మూర్తి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, మూలమంత్ర హోమాది క్రతువులు, అమ్మవారి దీక్షాదారుల ఇరుముడి సమర్పణ, ఆలయ ధర్మకర్త చిరుమామిళ్ల లక్ష్మీసాయిబాబు అమ్మవారికి పసుపు కుంకుమలు, పట్టువస్త్రాలు సమర్పించడం, రాత్రికి అమ్మవారి రథోత్సవం జరుగుతుందన్నారు. అదేవిధంగా 12న అమ్మవారికి ఊంజల్ సేవ, 13న నాభిశిల బోనాలు, 14న గ్రామ బోనాలు, 15న దీవెన బండారు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా రోజూ రాత్రివేళల్లో సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరునాళ్ల మహోత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వృద్ధురాలు అదృశ్యమైంది. పెనమలూరు సీఐ వెంకట రమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి కరణంగారి బజార్‌కు చెందిన దావు భాగ్యలక్ష్మి (68) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటోంది. కొన్ని రోజుల కిందట ఆమె పోరంకిలోని స్టేట్ బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరింది. ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. ప్రసాదంపాడులోని బంధువులు ఇంటికి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. ఆమె బంధువుల ఇంటికి వెళ్లలేదని తెలియడంతో ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద విచారణ చేసినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు భాగ్యలక్ష్మి కుమార్తె పుష్పరాణి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

• చెట్ల నీడ కింద సేద



భగ్గుమంటున్న ఎండలకు ఇళ్లలో ఉండే వాళ్లే నానా అవస్థలు పడుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వినియోగించుకొని వేడి నుంచి రక్షణ పొందుతున్నారు. సొంత నివాసం లేని పేదలు పిల్లలతో సహా పెద్దలు కలిసి రోడ్డు పక్కన చెట్ల కింద నీడలో సేద తీరుతున్న దృశ్యం విజయవాడ సమీపంలోని ఫెర్రి పవిత్ర సంగమం వద్ద శనివారం కన్పించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మహ్మద్ రఫీ(ఫైల్)

కంచికచర్ల: హైదరాబాద్ నుంచి విజయవాడకు బైక్‌పై వస్తుండగా శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ బి.రాజు కథనం మేరకు విజయవాడ సున్నపుబట్టీల సెంటర్‌కు చెందిన మహ్మద్ రఫీ ఉజ్ జమాన్(45) అనే వ్యక్తి హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతని కుటుంబ సభ్యులు విజయవాడలో నివాసం ఉంటున్నారు. రఫీ పెద్ద కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుందని భార్య ఫోన్ చేసి చెప్పింది. దీంతో రఫీ హైదరాబాద్ నుంచి బైక్‌పై విజయవాడ బయలుదేరారు. కంచికచర్ల సమీపంలోకి రాగానే ఫ్లై ఓవర్‌పై గోడకు బైక్ తగిలి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలవటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. రఫీ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మిక చట్టాలు లేకుండా చేసేందుకే లేబర్ కోడ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న పోలినాయుడు

గన్నవరం: కార్మిక చట్టాలు లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. పోలినాయుడు అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల గడిచినా పంచాయతీ కార్మికులకు ఏ చట్టం అమలు చేయకుండా పాలకులు దగా చేస్తున్నారని మండిపడ్డారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు బెజవాడ తాతబ్బాయి, యూనియన్ నేతలు గణేష్, దానియేలు, నాగమణి, లక్ష్మీకోటేశ్వరరావు, నాగరాజు, లవరాజు తదితరులు పాల్గొన్నారు.



‘మే’లోనే ఐపీఎల్ ముగించాలని...

- బీసీసీఐ కొత్త ప్రణాళికలు
- హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో మిగిలిన మ్యాచ్‌లు!
- నేడు కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: ఐపీఎల్‌కు వారం రోజుల పాటు విరామం ఇచ్చిన బీసీసీఐ భారత్, పాక్ యుద్ధానికి సంబంధించి తాజా పరిణామాల తర్వాత మళ్లీ కొత్త ప్రణాళికలతో సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాల్పుల విరమణ నేపథ్యంలో పరిస్థితులు మెరుగవుతాయి కాబట్టి వీలైనంత తొందరగా మిగిలిన ఐపీఎల్ మ్యాచ్‌లను ముగించాలని గవర్నింగ్ కౌన్సిల్ ఆలోచనతో ఉంది. ఈ వారాంతంలో టోర్నీ మళ్లీ మొదలు కావచ్చని వినిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే మే 15 నుంచే మ్యాచ్‌లు జరగవచ్చు. అసలు షెడ్యూల్ ప్రకారం మే 25లోపే లీగ్‌ను ముగించాలని బోర్డు పట్టుదలగా ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ కొనసాగింపుపై నేడు ప్రత్యేక సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు.

మూడు వేదికల్లో మ్యాచ్‌లు...

ఐపీఎల్–2025 లీగ్ దశలో మొత్తం 57 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. పంజాబ్, ఢిల్లీ మధ్య జరుగుతున్న 58వ మ్యాచ్‌ను అర్ధాంతరంగా నిలిపివేయాల్సి వచ్చింది. దీనిని ‘రద్దు’గా పరిగణించి ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించాలా లేక మళ్లీ నిర్వహించాలా అనే అంశంపై ఇంకా గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోలేదు. లీగ్ దశలో మరో 12 మ్యాచ్‌లతో పాటు 4 ప్లే ఆఫ్స్ కలిపి మొత్తం 16 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. ముందుగా ఊహించినట్లుగానే దక్షిణాదిలో ఉన్న వేదికలను ఎంచుకొని మ్యాచ్‌లు జరపాలని బీసీసీఐ ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఇందు కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలను ఎంపిక చేశారు. అసలు షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్ ఎలాగూ రెండు ప్లే ఆఫ్స్‌కు ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది.

ఆటగాళ్లు వెనక్కి వస్తారా...

ఐపీఎల్ ఫ్రాంచైజీలు, నిర్వాహకులకు మిగిలిన మ్యాచ్‌ల కోసం విదేశీ ఆటగాళ్లను వెనక్కి రప్పించడమే ఇప్పుడు పెద్ద సమస్య. ఐపీఎల్ వాయిదా గురించి తెలిసిన వెంటనే శుక్ర, శనివారాల్లో పలువురు విదేశీ క్రికెటర్లు, సహాయక సిబ్బంది తమ స్వస్థలాలను బయల్దేరి వెళ్లిపోయారు. వీరందరికీ ఐపీఎల్ ఇప్పట్లో మళ్లీ జరగదని, ఏడాది చివర్లో మళ్లీ నిర్వహించవచ్చనే సమాచారమే ఉంది. దాంతో వారంతా వెనక్కి వెళ్లిపోయారు. ఇప్పటికే ఫ్రాంచైజీలు తమ జట్లకు చెందిన ఆటగాళ్లకు, ఇతర సిబ్బందికి తాజా సమాచారాన్ని అందించాయని, మళ్లీ వెంటనే వెనక్కి వచ్చే ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా కూడా చెప్పినట్లు సమాచారం. కొందరు ఆదివారం బయల్దేరేందుకు సిద్ధమవుతుండగా వారిని ఆగిపోవాలని ఒక ఫ్రాంచైజీ చెప్పగా... మరికొందరు సగం దూరం ప్రయాణించగా, ఎక్కడ ఉన్నారో అక్కడినుంచే వెనక్కి రావాలని కూడా కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వెళ్లిపోయిన బట్లర్, కొయెట్జీలను వెనక్కి రమ్మని గుజరాత్ టైటాన్స్ కోరింది. అయితే అందరు విదేశీ ఆటగాళ్లు దాదాపు ఒకే మాట మీద ఉన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మే 25 తర్వాత లీగ్ కొనసాగితే తాము ఉండలేమని తేల్చేశారు. జూన్ 11 నుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ ఉండటంతో ఈ రెండు టీమ్‌ల ప్లేయర్లు మాత్రం అందుబాటులో ఉండే అవకాశాలు పూర్తిగా లేనట్లే.

నేనూ టెస్టులు ఆడను!

రిటైర్మెంట్ యోచనలో విరాట్ కోహ్లి

బీసీసీఐకి సమాచారమిచ్చిన స్టార్ బ్యాటర్



న్యూఢిల్లీ: సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ టెస్టులకు గుడ్‌బై చెప్పిన మూడు రోజుల్లోపే భారత క్రికెట్ అభిమానులను ఆశ్చర్యపరిచే మరో వార్త శనివారం వచ్చింది. స్టార్ ఆటగాడు, జట్టులో అత్యంత అనుభవజ్ఞుడైన విరాట్ కోహ్లి కూడా టెస్టులనుంచి రిటైర్ కావాలని భావిస్తున్నట్లు తెలిసింది. అధికారికంగా తన రిటైర్మెంట్‌పై కోహ్లి ఎలాంటి ప్రకటన చేయకపోయినా... తాను టెస్టులనుంచి తప్పుకోవాలనే ఆలోచనతో ఉన్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి అతను సమాచారం అందించాడు. కీలకమైన ఇంగ్లండ్ సిరీస్ కోసం త్వరలోనే జట్టును ఎంపిక చేయనున్న నేపథ్యంలో దానికంటే ముందే తన మనసులో మాటను అతను బోర్డుకు తెలియజేశాడు. అయితే కోహ్లి రిటైర్మెంట్ ప్రకటన చేయకుండా బీసీసీఐ ఒప్పించే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే రోహిత్ రిటైర్ కాగా, శుబ్‌మన్ గిల్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌లాంటి పటిష్ట జట్టుతో సమరంలో జట్టులో అనుభవలేమి సమస్య కావచ్చు. అందుకే కనీసం ఈ సిరీస్ వరకైనా అతను జట్టులో కొనసాగాలని బోర్డు కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్‌లో అత్యంత ప్రభావశీలుడైన వ్యక్తి ఒకరితో కోహ్లిని ఒప్పించేందుకు బోర్డు సిద్ధమైంది. అతనితో మాట్లాడిన తర్వాతే కోహ్లి తన టెస్టు రిటైర్మెంట్‌పై అధికారిక ప్రకటన చేయవచ్చు. గత ఏడాది టి20 వరల్డ్ కప్‌ను గెలుచుకున్న తర్వాత ఈ ఫార్మాట్‌నుంచి కోహ్లి తప్పుకున్నాడు.

విరాట్ కోహ్లి వన్డే రికార్డులు చాలా గొప్పగా, ఘనంగా ఉన్నాయి. అందరి దృష్టిలో అతను గొప్ప వన్డే ఆటగాడే కావచ్చు. అయితే టెస్టు క్రికెట్‌లో తనకంటూ కోహ్లి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. వ్యక్తిగత ప్రదర్శనలతో కాకుండా ఈతరం క్రికెటర్లలో టెస్టులను బతికించేందుకు సిద్ధపడిన ఏకైక బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. ఈ ఫార్మాట్‌కు ఒక ‘దిక్సూచి’లా నిలబడి పునరుత్తేజం నింపేందుకు కోహ్లి ప్రయత్నించాడు. టెస్టుల్లో గతంలో కనిపించని దూకుడు, వ్యూహాలతో అత్యుత్తమ కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. అయితే టెస్టుల్లో అతని బ్యాటింగ్ ప్రదర్శన ఇటీవల అంత గొప్పగా లేదు. దాదాపు ఏడాదిన్నర తర్వాత ఆస్ట్రేలియాపై పెర్త్‌లో అతను సెంచరీ చేశాడు. అయితే సిరీస్‌లోని మిగతా టెస్టుల్లో అతను ఘోరంగా విఫలమయ్యాడు. గత రెండేళ్లలో కోహ్లి సగటు 32.56 మాత్రమే. ఇదే ఫామ్‌తో ఇంగ్లండ్‌కు వెళితే అతను ఎంత బాగా ఆడతాడనేది సందేహమే. పైగా రోహిత్ కూడా లేకపోవడంతో అందరి దృష్టీ తనపైనే ఉండటంతో తీవ్ర ఒత్తిడి ఖాయం. జట్టు సంధి దశలో తానూ తప్పుకుంటే మెరుగని అతను ఆలోచిస్తుండవచ్చు. కెరీర్‌లో 123 టెస్టులు ఆడిన కోహ్లి 46.85 సగటుతో 9230 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. మరో 770 పరుగులు చేస్తే అతను 10 వేల పరుగుల మైలురాయిని అందుకుంటాడు.

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భారత్ ‘పాంచ్ పటాకా’

ఆర్చరీ ప్రపంచకప్‌లో 5 పతకాలు కైవసం

- రజతం నెగ్గిన జట్టులో సురేఖ, చికిత



షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నమెంట్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్లు 5 పతకాలతో సత్తాచాటారు. వ్యక్తిగత విభాగంలో మధుర స్వర్ణ పతకంతో మెరిసింది. దీంతో ఈ టోర్నీలో భారత ఆర్చర్లకు మొత్తంగా 2 స్వర్ణాలు, ఒక రజతం, 2 కాంస్యాలు దక్కాయి. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఫైనల్లో మధుర 139–138తో కార్సన్ (అమెరికా)పై గెలుపొందింది. మహారాష్ట్రకు చెందిన 24 ఏళ్ల మధుర ఈ టోర్నీలో ఓవరాల్‌గా మూడు పతకాలు గెలుచుకుంది. వ్యక్తిగత విభాగంలో పసిడి నెగ్గిన మధుర... టీమ్ ఈవెంట్‌లో రజతం, మిక్స్‌డ్ విభాగంలో కాంస్యం గెలిచిన జట్లలో కూడా సభ్యురాలు. ఫైనల్లో మొదట ‘పర్‌ఫెక్ట్ 30’ పాయింట్లు సాధించిన మధుర ఆ తర్వాత ఆకట్టుకోలేకపోయింది. ఒక దశలో వరుసగా రెండు సార్లు 8 పాయింట్లతో పాటు ఒకసారి 7 పాయింట్లు ఖాతాలో వేసుకొని 81–85తో వెనుకంజలో పడింది. తర్వాతి రౌండ్‌లో మెరుగైన ప్రదర్శనతో స్కోరును 110–110తో సమం చేసి... అదే జోరు కొనసాగిస్తూ పసిడి ఖాతాలో వేసుకుంది. అంతకుముందు కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు స్వర్ణం గెలుచుకుంది. అభిషేక్ వర్మ, రిషబ్ యాదవ్, ఓజస్ ప్రవీణ దేవ్‌తలేలతో కూడిన భారత పురుషుల జట్టు ఆదివారం జరిగిన ఫైనల్లో 232–228 పాయింట్ల తేడాతో మెక్సికో జట్టుపై గెలుపొందింది. ఇక పురుషుల వ్యక్తిగత విభాగంలో 22 ఏళ్ల రిషబ్ యాదవ్ కాంస్య పతకంతో మెరిశాడు. షూటాఫ్‌లో అతడు దక్షిణ కొరియా ఆర్చర్‌పై విజయం సాధించాడు. వెన్నం జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్), తనిపర్తి చికిత (తెలంగాణ), మధుర (మహారాష్ట్ర) లతో కూడిన భారత మహిళల కాంపౌండ్ జట్టు రజత పతకం చేజిక్కించుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో సురేఖ, చికిత, మధుర త్రయం. 221–234తో మెక్సికో జట్టు చేతిలో ఓడింది. ఇక మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మధుర–అభిషేక్ వర్మ జంట కాంస్యం గెలుచుకుంది. కాంస్య పతక పోరులో భారత జోడీ 144–142 పాయింట్ల తేడాతో ఫాటిన్ నూర్‌ఫతే–మొహమ్మద్ జువైదీ (అమెరికా)పై గెలుపొందింది. తాజా ప్రదర్శనతో భారత కాంపౌండ్ జట్టు భవిష్యత్తుపై మరిన్ని అంచనాలు పెరుగుతున్నాయి. తొలిసారి 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌ను ప్రవేశపెడుతున్నారు. ఇదే జోరు కొనసాగిస్తే మనకు ఒలింపిక్స్‌కు పతకం సాధించేందుకు మంచి అవకాశం ఉంది.

సాక్షి సినిమా

ఆపరేషన్ సిందూర్ సినిమాను ప్రకటించినందుకు క్షమాపణలు

– ఉత్తమ్ మహేశ్వరి



ఉత్తమ్



‘ఆపరేషన్ సిందూర్’ పోస్టర్

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత్ ‘ఆపరేషన్ సిందూర్’ను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ‘ఆపరేషన్ సిందూర్’ ఘటనల సమాహారంగా సినిమా తీసేందుకు కొందరు బాలీవుడ్ దర్శక–నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. ‘ఆపరేషన్ సిందూర్, మిషన్ సిందూర్, సిందూర్: ది రివెంజ్’ వంటి టైటిల్స్‌ని రిజిస్టర్ చేయడానికి బాలీవుడ్ దర్శక–నిర్మాతలు ఉత్సాహం చూపిస్తున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ క్రమంలోనే ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో ఓ సినిమా టైటిల్ పోస్టర్ విడుదలైంది. ఉత్తమ్ – నితిన్ ద్వయం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని, నిక్కీ విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ – ది కంటెంట్ ఇంజనీర్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించనున్నట్లుగా ఆ పోస్టర్‌పై ఉంది. అయితే ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో ‘ఆపరేషన్ సిందూర్’ అంటూ సినిమాని ప్రకటించడం సరి కాదని, పైగా ఏఐ (కృత్రిమ మేధ) పోస్టర్‌ను రిలీజ్ చేశారని నెటిజన్లు పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. దీంతో దర్శకుల్లో ఒకరైన ఉత్తమ్ మహేశ్వరి క్షమాపణలు చెబుతూ... ఓ నోట్‌ను రిలీజ్ చేశారు. ‘‘ఆపరేషన్ సిందూర్’ సినిమా ప్రకటించినందుకు క్షమాపణలు చెబుతున్నాను. ఇతరుల మనోభావాలను దెబ్బతీయడం లేదా రెచ్చగొట్టడం నా ఉద్దేశ్యం కాదు. మన సైనికుల ధైర్య సాహసాలను, త్యాగాలను, నాయకత్వాన్ని ఓ పవర్‌ఫుల్ కథగా చెప్పాలనుకున్నాను. అంతేకానీ... డబ్బు కోసమో లేదా పాపులారిటీ కోసమో కాదు. అయితే నేను ఈ సినిమా ప్రకటించిన సమయం–సందర్భం కొందరికి అభ్యంతరకరంగా అనిపించవచ్చు. వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఇది కేవలం సినిమా మాత్రమే కాదు... దేశ ప్రజల ఎమోషన్’’ అంటూ ఉత్తమ్ మహేశ్వరి సోషల్ మీడియాలో స్పందించారు. మరోవైపు ఈ ‘ఆపరేషన్ సిందూర్’ సినిమా గురించి పూజా ఫిల్మ్స్ ప్రతినిధులు కూడా ఓ నోట్‌ను రిలీజ్ చేశారు. ‘‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో ఓ సినిమా రాబోతోందని, ఈ సినిమాకు నిర్మాతలుగా వసు భగ్నానీ, జాకీ భగ్నానీ అసోసియేట్ అయ్యారనీ వార్తలు వస్తున్నాయి. కానీ ఈ సినిమాతో ఆ ఇద్దరికీ ఏ మాత్రం సంబంధం లేదు’’ అంటూ పూజా ఫిల్మ్స్ సంస్థ ఇన్‌స్టా వేదికగా ఓ నోట్‌ను షేర్ చేసింది. కాగా.. వసు, జాకీ భగ్నానీల పేర్లు ఈ సినిమాతో ముడిపెట్టడానికి కారణం ఉంది. ఈ చిత్రాన్ని నిక్కీ, విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ నిర్మించనున్నట్లు పోస్టర్‌లో ఉంది. ఈ ఇద్దరూ వసు భగ్నానీకి బంధువులు. దాంతో వసు–జాకీ కూడా ఈ చిత్రానికి అసోసియేట్ అయ్యారనే ఊహాగానాలు నెల కొన్నాయి. కానీ.. వీరికి ఎలాంటి సంబంధం లేదని పూజా ఫిల్మ్స్ (వసు–జాకీ భగ్నానీకి సంబంధించిన బేనర్) స్పష్టం చేసింది.



మైనపు విగ్రహం (ఎడమ)తో రామ్‌చరణ్

లండన్‌లో రామ్‌చరణ్ మైనపు విగ్రహం

హీరో రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం దక్కింది. లండన్‌లో ప్రతిష్ఠాత్మక మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో ఆయన మైనపు విగ్రహం లాంచ్ చేశారు. అంతర్జాతీయంగా వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖుల మైనపు విగ్రహాలను లండన్‌లోని తుస్సాడ్స్ మ్యూజియంలో ఏర్పాటు చేస్తుంటారు. ఈ కోవలోనే రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయగా... ఆయనే స్వయంగా ఆవిష్కరించారు. ఈ విగ్రహంలో చరణ్‌తో పాటు అతడి పెట్ డాగ్ కూడా ఉండటం విశేషం. ఈ మైనపు విగ్రహావిష్కరణ వేడుకలో పాల్గొనేందుకు చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ, రామ్‌చరణ్, ఉపాసన దంపతులు నాలుగు రోజుల క్రితమే లండన్ చేరుకున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే... రామ్‌చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో ‘పెద్ది’ సినిమా చేస్తున్నారు.

ఈ స్థాయి విజయాన్ని ఊహించలేదు

– నాని



శ్రీనిధీ శెట్టి, నాని, అడివి శేష్, శైలేష్ కొలను

‘‘హిట్ 3’ సినిమా సక్సెస్ అవుతుందనుకున్నాను. కానీ... ఈ స్థాయిలో విజయం సాధిస్తుందని ఊహించలేదు. ఒక క్రైమ్ థ్రిల్లర్‌ని పెద్ద మాస్ కమర్షియల్ సినిమాలా సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది. ప్రేక్షకుల స్పందన చూస్తే అద్భుతంగా అనిపించింది. మాకు ఇంతటి విజయాన్నిచ్చిన వారికి ధన్యవాదాలు’’ అని నాని తెలిపారు. శైలేష్ కొలను దర్శకత్వంలో నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం ‘హిట్: ది థర్డ్ కేస్’. యునానిమస్ ప్రొడక్షన్స్, వాల్ పోస్టర్ సినిమా బ్యానర్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 1న విడుదలైంది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో నాని మాట్లాడుతూ– ‘‘శైలేష్‌తో నేను చేయబోయే తర్వాతి సినిమా మంచి వినోదాత్మక చిత్రం అవ్వాలని కోరుకుంటున్నాను. ఓ ఆలోచన చెప్పాడు... చాలా బాగుంది’’ అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ– ‘‘మంచి కంటెంట్‌ని ఆదరిస్తారని ‘హిట్ 3’తో ప్రేక్షకులు మరోసారి నిరూపించినందుకు వారందరికీ థ్యాంక్స్’’ అని పేర్కొన్నారు. ‘‘హిట్ 3’లో నేను చేసిన అతిథి పాత్రకి ప్రశంసలు రావడం హ్యాపీగా ఉంది’’ అన్నారు అడివి శేష్. ‘‘నాని ఎప్పటికప్పుడు తనని కొత్తగా మలుచుకుంటున్నందుకు గర్వంగా ఉంది’’ అని నిర్మాత దీప్తి చెప్పారు. ‘‘ఈ చిత్రంలో మృదుల పాత్రకి నన్ను ఎంచుకున్నందుకు శైలేష్‌కి ధన్యవాదాలు’’ అని శ్రీనిధీ శెట్టి చెప్పారు.

వీర చంద్రహాస రెడీ



శివ రాజ్‌కుమార్, శిథిల్ శెట్టి

‘‘వీర చంద్రహాస’ టైటిల్‌తో పాటు ట్రైలర్ కూడా ఆసక్తిగా ఉంది. రవి బస్రూర్ ఇప్పటివరకు తనదైన సంగీతంతో అలరించగా, ఈ సినిమాతో డైరెక్టర్‌గానూ నిరూపించుకున్నారు. ఎమ్‌వీ రాధాకృష్ణ గారు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది’’ అని హీరో విశ్వక్ సేన్ చెప్పారు. ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ దర్శకత్వం వహించిన చిత్రం ‘వీర చంద్రహాస’. శివ రాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించగా, శిథిల్ శెట్టి, నాగశ్రీ జీఎస్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఏప్రిల్ 18న కన్నడలో విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ త్వరలో తెలుగులో విడుదల చేయనున్నారు. ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను విశ్వక్ సేన్ విడుదల చేశారు. ఎమ్‌వీ రాధాకృష్ణ మాట్లాడుతూ– ‘‘వీర చంద్రహాస’ చిత్రం కన్నడలో హిట్ టాక్ తెచ్చుకోవడంతో పాటు మంచి వసూళ్లను రాబడుతోంది. ఈ చిత్రానికి తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారని ఆశిస్తున్నాను’’ అన్నారు. ‘‘మా సినిమా తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని భావిస్తున్నాను’’ అని రవి బస్రూర్ తెలిపారు.

ఆగస్టులో శక్తిమతి



హెబ్బా పటేల్

హెబ్బా పటేల్, సుమన్, శ్రావణ్, శ్రీధర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘శక్తిమతి’. డి. రామకృష్ణ దర్శకత్వంలో హనీ బన్నీ క్రియేషన్స్ పతాకంపై వెంకటేశ్ గౌడ్ నిర్మించారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను డైరెక్టర్ వీవీ వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డి. రామకృష్ణ మాట్లాడుతూ– ‘‘మా గురువు వినాయక్‌గారి చేతుల మీదుగా ‘శక్తిమతి’ మోషన్ పోస్టర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో దాదాపు 30 నిమిషాలు వీఎఫ్‌ఎక్స్ ఉన్నాయి. దాని వల్ల పోస్ట్ ప్రొడక్షన్‌కు చాలా టైమ్ పట్టింది. ఆగస్టులో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం’’ అన్నారు. వెంకటేశ్ గౌడ్ మాట్లాడుతూ– ‘‘మా డైరెక్టర్ రామకృష్ణగారు చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా తీశాను. నేటితరం వాళ్లు తప్పకుండా చూడాల్సిన చిత్రమిది’’ అని చెప్పారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పి. రమణా రెడ్డి, సంగీతం: భీమ్స్, కెమేరా: కె. చిట్టిబాబు.

ఇప్పుడు అంతా బోనస్

– ‘వెన్నెల’ కిశోర్



‘‘నా కెరీర్‌లో కామెడీ పాత్రలు చాలా చేశాను. వీటిలో నా ఫేవరెట్ రోల్స్ చాలానే ఉన్నాయి. కానీ ‘వెన్నెల, బిందాస్, దూకుడు’ సినిమాల్లో చేసిన పాత్రలను జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను. నాకు డ్రీమ్ రోల్స్ అంటూ ఏవీ లేవు. ‘దూకుడు’ సినిమాలో నేను చేసిన రోల్ (ఎమ్మెస్. రామానుజమ్ శాస్త్రి)తోనే నా డ్రీమ్ నెరవేరిపోయింది. ఇప్పుడు అంతా బోనస్’’ అన్నారు ‘వెన్నెల’ కిశోర్. శ్రీవిష్ణు హీరోగా నటించిన తాజా చిత్రం ‘సింగిల్’లో ‘వెన్నెల’ కిశోర్ ఓ కీలక పాత్ర చేశారు. కార్తీక్ రాజు దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న (శుక్రవారం) విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో ‘వెన్నెల’ కిశోర్ మాట్లాడుతూ – ‘‘సింగిల్’లో నేను చేసిన అరవింద్ పాత్రకు మంచి స్పందన లభిస్తున్నందుకు సంతోషంగా ఉంది. నా సినిమాలను నేనెక్కువగా థియేటర్స్‌లో చూసుకోను. కానీ ఈ సినిమాను థియేటర్స్‌లో చూశాను. నా పాత్రను ఆడియన్స్ ఎంజాయ్ చేస్తున్న తీరు నాకు సంతోషాన్నిచ్చింది. నేను ఏ పాత్ర చేసినా ఆ పాత్ర వల్ల సినిమా కథ ముందుకెళితే చాలు. ప్రస్తుతం రచయితలకు సరైన గౌరవం, పారితోషికం లభించడం లేదు. అందుకే వాళ్లు డైరెక్టర్స్ అయిపోతున్నారు. ఇక హీరోగా ఒకట్రెండు సినిమాలు చేశాను. కానీ ఎక్కువగా లవ్‌స్టోరీ సినిమాలు వస్తున్నాయి. రొమాన్స్, సాంగ్స్ నాకు నప్పవు. అలాగే నా పాత్ర చనిపోయే కథలు కూడా వచ్చాయి. కానీ అలాంటి పాత్ర చేయడం నాకు ఇష్టం లేదు. ఇక మంచి కామెడీ కథ కుదిరితే హీరోగా చేస్తా. ‘జఫ్ఫా’ సినిమాతో దర్శకుడిగా ఫెయిల్ అయ్యాను. భవిష్యత్‌లో దర్శకత్వం చేస్తాను. థ్రిల్లర్ మూవీస్ చేయాలని ఉంది’’ అన్నారు.

క్రైమ్ థ్రిల్లర్ షురూ



మధు దామరాజు, బ్రహ్మాజీ, యశ్వంత్, నిహారిక

బ్రహ్మాజీ, యశ్వంత్ పెండ్యాల ప్రధాన పాత్రల్లో ‘కథకళి’ అనే సినిమా షురూ అయింది. ప్రసన్న కుమార్ నాని దర్శకత్వంలో రవికిరణ్ కలిదిండి నిర్మిస్తున్న ఈ చిత్రం శనివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హర్షిత్ రెడ్డి కెమేరా స్విచ్చాన్ చేయగా, నిహారిక కొణిదెల క్లాప్ ఇచ్చారు. ఫస్ట్ షాట్‌కి డైరెక్టర్ ప్రసన్నకుమార్ నాని దర్శకత్వం వహించగా, బ్రహ్మాజీ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. అనంతరం ప్రసన్న కుమార్ నాని మాట్లాడుతూ– ‘‘ఇంట్రెస్టింగ్ ఇన్వెస్టిగేషన్ క్రైమ్ థ్రిల్లర్‌గా ‘కథకళి’ ఉంటుంది’’ అని చెప్పారు. ‘‘ఈ సినిమాలో కథే హీరో’’ అన్నారు బ్రహ్మాజీ. ‘‘బ్రహ్మాజీగారు ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. మంచి టీమ్‌తో కలిసి ఈ సినిమా చేస్తున్నాం’’ అన్నారు రవికిరణ్ కలిదిండి. ‘‘ఈ సినిమాలో హీరో లంటూ ఎవరూ ఉండరు. కథను నడిపించే పాత్రలు ఉంటాయి’’ అని యశ్వంత్ పెండ్యాల చెప్పారు. మధు దామరాజు, మైమ్ మధు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: పవన్, కెమేరా: జితిన్ మోహన్.

దీపావళికి డ్యూడ్



ప్రదీప్ రంగనాథన్

‘లవ్ టుడే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్’ చిత్రాల ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న చిత్రానికి ‘డ్యూడ్’ టైటిల్ ఖరారైంది. ఇందులో మమితా బైజు హీరోయిన్. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ‘డ్యూడ్’ టైటిల్‌ను ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ‘‘మోడ్రన్ ట్విస్ట్‌తో కూడిన పూర్తి వినోదాత్మక చిత్రంగా ‘డ్యూడ్’ రూపొందుతోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ దీపావళికి సినిమాని విడుదల చేస్తాం’’ అని యూనిట్ పేర్కొంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.


గంగమ్మకు తిరుమల వెంకన్న సారె



అమ్మవారికి సారెను తీసుకువస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో దంపతులు

తిరుపతి కల్చరల్: వేంకటేశ్వరస్వామి చెల్లెలిగా పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మకు శనివారం తిరుమల శ్రీవారి సారె సమర్పించారు. గంగమ్మ జాతర ప్రారంభమైన నాలుగో రోజున శ్రీవారి సారె సమర్పించడం ఆనవాయితీ. టీటీడీ తరపున చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు సారెను శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీపుండరీకవల్లి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శేషవస్త్రాలు, పసుపు, కుంకుమ వంటి మంగళద్రవ్యాలతో కూడిన సారెను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు టీటీడీ చైర్మన్, ఈవో అందజేశారు. అనంతరం అక్కడ నుంచి సారెను వివిధ వేషధారణలు, కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యాల నడుమ శోభాయాత్రగా గంగమ్మతల్లి ఆలయానికి తీసుకెళ్లారు.

అమరేశ్వరుని సేవలో జస్టిస్ మల్లికార్జునరావు



జస్టిస్ మల్లికార్జునరావుకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

అమరావతి: అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుడిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమరేశ్వరునికి అభిషేకాలను, బాల చాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలను జరిపించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

అమ్మవారి వసంత ఉత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వసంతోత్సవాలకు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో 13 వరకు వార్షిక వసంతోత్సవాలను నిర్వహించనున్నారు. సోమవారం రథోత్సవం జరగనుంది.

ఒక్క మాటతో ఫొటోలు, వీడియోలు తీసిపెట్టే స్మార్ట్ గ్లాసెస్

- ఫోన్ అవసరం లేకుండానే కాల్స్ మాట్లాడే అవకాశం
- సంగీతం, పాడ్‌కాస్ట్‌లు వినేందుకు హెడ్‌ఫోన్లతో పనేలేదు
- ఇటీవల సంయుక్తంగా ఆవిష్కరించిన మెటా- రేబాన్
- అదే బాటలో మరికొన్ని దిగ్గజ మొబైల్ కంపెనీలు

ఇవి ఇప్పటికిప్పుడు స్మార్ట్‌ఫోన్‌కు ప్రత్యామ్నాయం కాబోవంటున్న నిపుణులు

మెటా గ్లాస్.. మొబైల్‌కి లాస్?



ఒక్క మాట చెబితే ఫొటో క్లిక్‌మనిపిస్తుంది.. వాయిస్ కమాండ్ వినగానే వీడియో రికార్డ్ అయిపోతుంది. ఏ భాషలోని అక్షరాలైనా క్షణాల్లో మన భాషలోకి మారిపోయి కనిపిస్తాయి. చేతిలో ఫోన్ లేకుండానే ఎవరితోనైనా ఫోన్ మాట్లాడేయొచ్చు.. త్వరలో అందుబాటులోకి రానున్న స్మార్ట్ కళ్లజోళ్లు చేసే పనులివన్నీ. స్టైలిష్ కళ్లజోళ్లకు పేరు గాంచిన రే-బాన్ కంపెనీ.. మార్క్ జుకర్‌బర్గ్‌కు చెందిన మెటా సంయుక్తంగా అత్యాధునిక స్మార్ట్ గ్లాసెస్‌ను విడుదల చేశాయి. ఇవి త్వరలోనే భారత్‌లోనూ విడుదల కానున్నాయి. అత్యాధునిక స్మార్ట్ ఫోన్లు చేసే పనులన్నీ ఈ స్మార్ట్ కళ్లద్దాలు చేసిపెడతాయి. కంటెంట్ క్రియేటర్లు, వ్యాపారవేత్తలు, వేగవంతమైన కమ్యూనికేషన్‌పై ఆధారపడే వారికి ఈ గ్లాసెస్ గేమ్-ఛేంజర్‌గా నిలుస్తాయని టెక్ నిపుణులు అంటున్నారు. 2024 నాటికి ప్రపంచ స్మార్ట్ గ్లాసెస్ మార్కెట్ విలువ 18.6 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. 2033 నాటికి అది 53.6 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఐఎమ్ఏఆర్‌సీ గ్రూప్ అంచనా వేస్తోంది. మెటా, ఆపిల్, గూగుల్, షావోమీ, సోనీ, అమెజాన్, లెన్స్‌కార్ట్ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే ఈ రంగంలో పెట్టుబడులు పెడుతున్నాయి. - సాక్షి, హైదరాబాద్

→ వాయిస్ అసిస్టెంట్: మెటా ఏఐతో సంభాషించి రియల్ టైమ్ సమాధానాలు పొందవచ్చు. → ఫొటో, వీడియో క్యాప్చర్: వాయిస్ కమాండ్‌తో ఫొటోలు తీయవచ్చు. వీడియోలు కూడా రికార్డ్ చేయవచ్చు. → లైవ్ స్ట్రీమింగ్: ఏదైనా కార్యక్రమానికి ఇన్‌స్టాగామ్ లేదా ఫేస్‌బుక్‌లో నేరుగా ప్రసారం చేయవచ్చు. → సంగీతం, పాడ్‌కాస్ట్‌లు: ఇయర్ బడ్స్ లేకుండానే సంగీతం లేదా పాడ్‌కాస్ట్‌లు వినవచ్చు.

→ ఫోన్ కాల్స్: బిల్ట్-ఇన్ మైక్రోఫోన్లు, స్పీకర్లు ఈ అద్దాల్లో ఉంటాయి కాబట్టి ఫోన్ కాల్స్ చేయవచ్చు. కాల్స్ స్వీకరించవచ్చు.

→ లైవ్ ట్రాన్స్‌లేషన్: విదేశీ భాషల సైన్‌బోర్డ్‌లను తక్షణం మనకు తెలిసిన భాషలోకి అనువదించగలవు.

→ ఆబ్జెక్ట్ రికగ్నిషన్: మనం చూసే వస్తువులను గుర్తించి, వాటికి సంబంధించిన సమాచారాన్ని అ అద్దాలు అందిస్తాయి.

→ ఈ కళ్లజోళ్లకు రోజువారీ ఫోన్ ఉపయోగాన్ని పూర్తిగా భర్తీ చేసే ఫీచర్లను జోడించే దిశగా మెటా పనిచేస్తోంది. వీటి ద్వారా యాప్‌లు, సేవలను నోటి మాటతో నియంత్రించవచ్చు.

→ స్క్రీన్ లేని అనుభవం: ఫోన్, ఇతర ఏ రకమైన డిజిటల్ తెర అవసరం లేకుండానే సమాచారం మన దృష్టి క్షేత్రంలో నేరుగా కనిపిస్తుంది.

స్మార్ట్‌ఫోన్ కంటే బెటర్..

త్వరలోనే ఈ గ్లాసెస్ స్మార్ట్‌ఫోన్లను భర్తీ చేయగలవు. కళ్ల ముందే డేటా కనిపించడం, వాయిస్ ఆధారంగా నడిచే విధానం వల్ల ఫోన్ అవసరం తగ్గుతుందనేది నా అంచనా. స్మార్ట్‌ఫోన్లతో మనం చేసే అన్ని పనులు ఇవి చేయగలవు. ఫోన్‌ను పట్టుకోవడం కంటే ముఖంపై గ్లాసెస్ ధరించడం సహజంగా అనిపిస్తుంది. టచ్, స్క్రోల్‌కు బదులుగా వాయిస్ కమాండ్స్, విజువల్స్‌తో టెక్నాలజీని ఉపయోగించే రోజు దగ్గరలోనే ఉంది.'

- మార్క్ జుకర్‌బర్గ్, మెటా సీఈఓ

స్మార్ట్ గ్లాసెస్ ప్రయోజనాలు..

→ సహజ కదలిక: స్క్రీన్ వైపు చూడాల్సిన అవసరం లేదు.
→ మల్టీ టాస్కింగ్: నడుస్తూ, వంట చేస్తూ లేదా ప్రయాణిస్తూనే స్మార్ట్ ఫోన్ ద్వారా చేసే అన్ని పనులు వీటితో చేసుకోవచ్చు.
→ తక్కువ స్క్రీన్ టైమ్: నిరంతర ఫోన్‌ను చూస్తూ స్క్రోలింగ్ చేయాల్సిన అవసరం లేదు.

ఎదురయ్యే సవాళ్లు..

→ బ్యాటరీ లైఫ్: రోజంతా గ్లాసెస్‌ను చార్జ్‌లో ఉంచడం కష్టం.
→ వ్యక్తిగత గోప్యత: ఎదుటివారికి తెలియకుండానే మనం వారి ఫొటోలు, వీడియోలను ఈ స్మార్ట్ గ్లాసెస్‌తో తీయొచ్చు. దీంతో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే ప్రమాదం ఉంది.
→ ధర: ఈ హై-టెక్ కళ్లద్దాల ధర సామాన్య ఫోన్ల కంటే చాలా ఎక్కువ.

అయితే, ఇవి ఇప్పటికిప్పుడు స్మార్ట్‌ఫోన్లకు పూర్తిగా ప్రత్యామ్నాయంగా మారే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు. స్మార్ట్ వాచ్‌ల మాదిరిగా మొదట ఫోన్లకు సహాయక పరికరాలుగా ఉపయోగపడతాయి. పూర్తి స్థాయిలో ఫోన్ స్థానాన్ని దక్కించుకోవాలంటే మరో 10-20 ఏళ్లు పట్టే అవకాశముందని చెబుతున్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో పవన్‌కు భూమి అమ్మేశారు

- పవన్‌కళ్యాణ్ న్యాయం చేయాలి
- మంగళగిరి మహిళ విజ్ఞప్తి



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): తనకు పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమికి నకిలీ పత్రాలు సృష్టించి అమ్మేశారని, తమ భూమిని తమకు అప్పగించి న్యాయం చేయాలని మంగళగిరికి చెందిన ఓ మహిళ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ని వేడుకున్నారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కనపర్తి సుధారాణి, ఆమె కుమార్తె ప్రశాంతి మీడియాతో మాట్లాడారు. సుధారాణి కథనం ప్రకారం.. మంగళగిరిలో తల్లి వరికూటి మరియమ్మ పేరిట 25 సెంట్ల భూమి ఉంది. వంశపారంపర్యంగా ఆ భూమి సుధారాణికి సంక్రమించింది. ఆ భూమికి కంచర్ల నాగేశ్వరరావు అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాన్ని కబ్జా చేశాడు. కోర్టులో కేసు నడుస్తుండగానే భూమిని ఇతరులకు విక్రయించాడు. జనసేన పార్టీ కార్యాలయానికి వెనుక ఉన్న ఆ భూమిని నాగేశ్వరరావు నుంచి కొనుగోలు చేసిన వ్యక్తి 2024 ఎన్నికల ముందు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు అమ్మేశారు. ఇటీవల ఆ స్థలంలో బోరు వేసేందుకు జనసేన పార్టీ సిద్ధపడగా.. సుధారాణి, మరికొందరు అడ్డుకున్నారు. ఈ స్థలాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు తెలిసి కొనుగోలు చేశారో, తెలియక చేశారో తమకు తెలియదని, తమ భూమిని తమకు అప్పగించి న్యాయం చేయాలని పవన్‌కళ్యాణ్‌కు సుధారాణి విజ్ఞప్తి చేశారు.

తగ్గనున్న వరి, గోధుమ, మొక్కజొన్న దిగుబడి

- వాతావరణ మార్పుల ప్రభావం
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో వాతావరణ మార్పులు వరి, గోధుమ, మొక్కజొన్న దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అధ్యయనంలో తేలింది. అధ్యయన వివరాలను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భూసారం, వర్షపాతం, పంట దిగుబడులపై వాతావరణ మార్పుల ప్రభావం అంచనా కోసం ఈ అధ్యయనాన్ని నిర్వహించినట్లు పేర్కొంది. అధ్యయనంలో కొన్ని ముఖ్యాంశాలు..

- వాతావారణ మార్పులతో ఖరీఫ్‌లో వర్షపాతం 2050 నాటికి 10.1 శాతం వరకు పెరగవచ్చు. 2080 నాటికి 18.9 శాతం పెరిగే అవకాశం ఉంది. రబీల్లో కూడా 2050 నాటికి 17 శాతం, 2080 నాటికి 26 శాతం మేర పెరిగే అవకాశం ఉంది. అసమాన, భారీ వర్షపాతాలు దిగుబడులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయి.



- లవణీయతకు (నీటిలో కరిగిన ఉప్పు శాతం) లోనయ్యే భూముల విస్తీర్ణం 2030 నాటికి 6.7 మిలియన్ హెక్టార్ల నుండి 11 మిలియన్ హెక్టార్ల మేర పెరుగుతుంది.
- వాతావరణ మార్పులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోకపోతే వర్షాధారిత వరి దిగుబడి 2050 నాటికి 20 శాతం, 2080కి 47 శాతం మేర తగ్గుతుంది. నీటి పారుదల ఆధారిత వరి దిగుబడి 2050 నాటికి 3.5 శాతం, 2080 నాటికి 5 శాతం మేర పడిపోతుంది. గోధుమ దిగుబడి కూడా 2050 నాటికి 19.3 శాతం, 2080 నాటికి ఏకంగా 40 శాతం మేర తగ్గుతుంది. ఖరీఫ్ మొక్కజొన్న దిగుబడి 2050 నాటికి 19 శాతం వరకు, 2080 నాటికి 20 శాతం వరకు తగ్గుతుంది.

తగిన చర్యలు తీసుకుంటున్నాం: వ్యవసాయ శాఖ

వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ రంగంపై పడే ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ సాంకేతికత అభివృద్ధి, పంట వైవిధ్య, భూసార పరిరక్షణ, సమగ్ర నీటి లభ్యతా చర్యలు చేపట్టినట్లు వివరించింది. 76 ప్రోటోటైప్ ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ నమూనాలను ఐసీఏఆర్ అభివృద్ధి చేసినట్లు కూడా కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది.

క్లోరిపైరిఫాస్ నిషేధం.. కానీ..!

- కొన్ని పంటలకు ఐదేళ్ల మినహాయింపు
- విషపూరిత పురుగు మందు నిషేధానికి ఆమోదం
- 'స్టాక్‌హోమ్ ఒడంబడిక'పై ప్రపంచ దేశాల సంతకం

(సాక్షి స్పెషల్ డెస్క్): అత్యంత విషపూరిత పురుగు మందు క్లోరిపైరిఫాస్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడానికి ప్రపంచ దేశాలు అంగీకరించాయి. అయితే, దీనికి ప్రత్యామ్నాయం సిద్ధంగా లేనందున.. మరో ఐదేళ్ల పాటు కొన్ని పంటలపై వాడుకోవటానికి.. భారత్ తదితర దేశాలు మినహాయింపు పొందాయి. నిషేధానికి ఒప్పుకుంటూనే ఐదేళ్ల మినహాయింపునివ్వటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత ప్రమాదకరమైన డర్టీ డజన్ పురుగు మందుల జాబితాలో ఒకటైన క్లోరిపైరిఫాస్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) 'మధ్యస్థంగా ప్రమాదకరమైన పురుగు మందు'గా గుర్తించింది. క్లోరిపైరిఫాస్ అవశేషాలు దీర్ఘకాలం పాటు ఆహార చక్రంలో కొనసాగి తీరని హాని కలిగిస్తాయి. గర్భస్థ శిశువుల్లో నాడీ వ్యవస్థ అభివృద్ధిని దెబ్బ తీయటం, ఊపిరితిత్తులు, ప్రొస్టేట్ కేన్సర్‌కు కారణమవుతోందని గుర్తించారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఏప్రిల్ 28 నుంచి ఈ నెల 9 వరకు జరిగిన 'స్టాక్‌హోమ్ ఒడంబడిక'పై సంతకం చేసిన దేశాల సమావేశంలో.. దీనిపై చర్చించి, నిషేధించడానికి వీలుగా దీన్ని జాబితా 'ఏ'లో చేర్చే తీర్మానాన్ని ఆమోదించారు. వరి, చిక్కుళ్లు, శనగ, చెరకు, పత్తి, వేరుశనగ, ఆవాలు, వంగ, క్యాబేజి, ఉల్లి, ఆపిల్, రేగు, బత్తాయి, నిమ్మ, పొగాకుతో పాటు గోధుమ, బార్లీ, చెరకు పంటల్లో చెదల నిర్మూలనకు భారత్ ఐదేళ్ల మినహాయింపు పొందింది. ఎడారి మిడతలు, పశువుల్లో పేల నిర్మూలన, నిల్వచేసే కలపలో పురుగుల నియంత్రణ, భవనాల్లో చెద పురుగుల నిర్మూలనకు మినహాయింపు ఇచ్చారు. దీనిపై పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ ఇండియా ముఖ్యప్రతినిధి ఎ.డి.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. నిషేధానికి అందరూ ఒప్పుకోవటం హర్షణీయమన్నారు. దీనికి ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ.. ఐదేళ్ల మినహాయింపులు ఇవ్వటం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. పంటలపై క్లోరిపైరిఫాస్ వాడకానికి బదులుగా రసాయనేతర ప్రత్యామ్నాయాలను అన్ని దేశాలూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

ట్రిపుల్ ఐటీలకు జూన్ 30 వరకు వేసవి సెలవులు



నూజివీడు: నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఈ నెల 15 నుంచి జూన్ 30 వరకు వేసవి సెలవులను ఉన్నతాధికారులు ప్రకటించారు. ఇప్పటికే పరీక్షలు ముగియడంతో పీయూసీ ద్వితీయ, ఇంజనీరింగ్ నాలుగు సంవత్సరాల విద్యార్థులు క్యాంపస్‌లను ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లిపోయారు. పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉండటంతో వారు మాత్రమే క్యాంపస్‌ల్లో ఉన్నారు. ట్రిపుల్ ఐటీల సిబ్బందికి ఈ నెల 18 నుంచి జూన్ 9 వరకు వేసవి సెలవులు ప్రకటించారు.

పాకిస్తాన్‌కు టమాటాలు పంపించం

- మదనపల్లె, తంబళ్లపల్లి, పలమనేరు ట్రేడర్ల నిర్ణయం

మదనపల్లె: పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడి, ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో పాకిస్తాన్‌కు టమాటాలు ఎగుమతి చేయకూడదని ట్రేడర్లు నిర్ణయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పలమనేరు ప్రాంతాల నుంచి కర్ణాటకలోని కోలార్ మార్కెట్ ద్వారా పాకిస్తాన్‌కు టమాటాలను ఎగుమతి చేస్తుంటారు. పాకిస్తాన్ వైఖరిని దృష్టిలో పెట్టుకుని ఇకపై ఆ దేశానికి టమాటా ఎగుమతి చేయకూడదని నిర్ణయించి.. కోలార్ మార్కెట్‌కు వెళ్లే 900 టన్నుల సరుకుని శనివారం నిలిపివేశారు. ప్రస్తుతం వెయ్యి టన్నుల కుపైగా పాకిస్తాన్‌కు టమాటాలు వెళ్తున్నాయి. జూన్, జూలై నెలల్లో భారీ ఎత్తున టమాటా ఎగుమతులు ఉంటాయి. ట్రేడర్ల నిర్ణయంతో మన టమాటాలపై ఆధారపడిన పాకిస్తాన్‌కు ఇకపై కష్టాలు తప్పవు.

మృతదేహాన్ని రప్పించండి

- ప్రధాని, ముఖ్యమంత్రులను వేడుకుంటున్న ఓకుటుంబం



నవీన్ మృతదేహం కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపులు

గురజాల రూరల్: తన కుమారుడి మృతదేహాన్ని గురజాలకు తీసుకువచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలంటూ పల్నాడు జిల్లా గురజాలకు చెందిన నల్లా పేరయ్య వేడుకుంటున్నాడు. పేరయ్య కొడుకు నవీన్. గురజాలకు చెందిన నవీన్ సైప్రస్ దేశంలో పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ చదువుకుంటున్నాడు.ఆ దేశంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కారు ప్రమాదంలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ దేశం వెళ్లి 18 నెలలు మాత్రమే అయిందని ఇంతలోనే మృతి వార్త వినాల్సి వచ్చిందంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.నవీన్ మృత దేహం గురజాల వచ్చేలా ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ చూడాలని వారంతా వేడుకుంటున్నారు.

తగ్గిన ప్రసూతి మరణాలు


- 2014లో చంద్రబాబు హయాంలో ప్రతి వెయ్యి జననాలకు 39 శిశు మరణాలు
- వైఎస్ జగన్ హయాంలో 2021లో 27కు తగ్గుదల
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గినట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం(ఎస్‌ఆర్‌ఎస్) నివేదిక ప్రకారం 2014లో చంద్రబాబు హయాంలో ప్రసవ సమయంలో ప్రతి వెయ్యి జననాలకు 39 శిశు మరణాలు ఉండగా.. వైఎస్ జగన్ హయాంలో 2021నాటికి 27కి తగ్గినట్లు పేర్కొంది. నాలుగు వారాలలోపు ఉన్న శిశువుల మరణాల రేటు 2014లో 26 ఉండగా, 2021లో 19కి తగ్గినట్లు తెలిపింది. ఇక ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు 2014లో వెయ్యికి 45 ఉండగా, 2021లో 31కి తగ్గిందని వివరించింది. 2021లో 2 శాతంగా నమోదైన సంతానోత్పత్తి రేటు సైతం సుస్థిరంగా ఉన్నట్లు పేర్కొంది. ఇలా అన్ని విభాగాల్లోనూ తగ్గుదల కనిపించినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనలో ఇదో ముందడుగంటూ వివరించింది. ఎస్‌ఆర్‌ఎస్ తెలిపిన నివేదిక ప్రకారం ఎనిమిది రాష్ట్రాలు 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనను సాధించాయి. ప్రసూతి మరణాల రేటు ప్రతి లక్ష మందిలో సగటున 70 మందికి తక్కువగా ఉన్న రాష్ట్రాలు దేశంలో 8 ఉండగా, ఆ జాబితాలో ఏపీ, తెలంగాణ ఉన్నాయి. ఏపీలో ప్రసూతి మరణాలు ప్రతి లక్ష మందికి 46గా నమోదయ్యాయి. ప్రసూతి మరణాల నివారణలో కేరళ మొదటి స్థానంలో ఉంది. శిశు మరణాల సంఖ్య సగటున 25 కన్నా తక్కువగా ఉన్న 12 రాష్ట్రాల్లోనూ ఏపీ ఉంది. ఏపీలో 24 నమోదు అయినట్లు కేంద్రం వివరించింది.

వావ్.. మైగ్రేట్ 'వే'

వలస పక్షుల కోసం గగనతలాన అద్భుత దారులు

సాక్షి, అమరావతి: గగనతలాన ఎగిరే పక్షులు సుదూర ప్రాంతాలకు వలస పోతుంటాయి. ఇవి వేల కిలోమీటర్లు ప్రయాణించడం ఓ అద్భుతం. అత్యంత కఠిన వాతావరణాల్లోనూ లెక్కలేనన్ని ముప్పులను తప్పించుకుంటూ ఇవి దేశాలు, ఖండాలను ఎలా దాటతాయో అందరికీ ఆశ్చర్యకరమే.. అయితే విమానాలు, వాహనాల పయనానికి నిర్దిష్ట మార్గాలున్నట్టే పక్షులకు వలస దారులు ఉంటాయని మీకు తెలుసా? అవును వాటికీ కచ్చితమైన దారులు ఉంటాయి. వాటిని ఫ్లైవేస్ అంటారు. ఆహారం, ఆశ్రయం, వాతావరణ పరిస్థితుల ఆధారంగా పక్షులు ఈ మార్గాలను నిర్దేశించుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వలస పక్షులకు సంబంధించి నాలుగు సూపర్ ఫ్లైవేస్ ఉన్నాయి. అవి ఏమిటీ? వాటి ప్రత్యేకతలేంటంటే..



1.ఆఫ్రికన్-యూరేషియన్ ఫ్లైవే

పక్షుల వలసకు ఉన్న ప్రధాన మార్గాల్లో ఆఫ్రికన్-యూరేషియన్ ఫ్లైవే ఒకటి. ప్రపంచంలోనే గొప్ప ఫ్లైవేగా దీన్ని అభివర్ణిస్తారు. ఆఫ్రికా, యూరప్, ఆసియా ఖండాల్లోని 50కిపైగా దేశాల మీదుగా ఈ ఫ్లైవే ఉంటుంది. ఆర్కిటిక్ నుంచి దక్షిణాఫ్రికా వరకు మూడు ప్రధాన మార్గాలు ఈ ఫ్లైవేకు అనుసంధానమై ఉంటాయి. గగనతలాన అత్యంత కఠిన పరిస్థితుల మధ్య లక్షల సంఖ్యలోని పక్షులు ఈ ఫ్లైవేలో ప్రయాణిస్తాయి. ఈ మార్గంలో ప్రయాణించే పక్షుల్లో పది శాతం అంతరించిపోయే దశలో ఉన్నాయి.

2.తూర్పు ఆసియా-ఆస్ట్రేలియన్ ఫ్లైవే..

ప్రపంచంలోనే ఎక్కువ సంఖ్యలో పక్షులు తిరిగే దారి ఇది. అలాస్కా నుంచి ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వరకు 37 దేశాల మీదుగా ఈ ఫ్లైవే ఉంటుంది. 600 పక్షి జాతులు ఈ దారిన ప్రయాణిస్తాయి.

3.సెంట్రల్ ఆసియా ఫ్లైవే..

ప్రపంచంలోనే అతిచిన్న ఫ్లైవే ఇది. అయినప్పటికీ ఈ మార్గాన్ని 600 కంటే ఎక్కువ వలస పక్షి జాతులు ఉపయోగిస్తున్నాయి. ఇది ఉత్తరాన శీతల సైబీరియా నుంచి ఉష్ణమండల మాల్దీవుల వరకు 30 దేశాల మీదుగా సాగుతుంది. ఈ ఫ్లైవేలో వెళ్ళే కొన్ని పక్షులు తమ జీవితకాలంలో అనేకసార్లు హిమాలయాలను దాటతాయి. ఈ మార్గంలో ప్రయాణించే పక్షి జాతుల్లో 48 శాతం ముప్పును ఎదుర్కొంటున్నాయి. బార్-హెడ్ గూస్ తన జీవితకాలంలో పలుమార్లు హిమాలయాలను (ఎవరెస్ట్ శిఖరంపై సహా) దాటతాయి. రోసీ స్టార్లింగ్స్, అమూర్ ఫాల్కన్స్, ఫ్లెమింగో వంటి పక్షులు సెంట్రల్ ఆసియా ఫ్లైవే ద్వారా శీతాకాలంలో భారతదేశానికి వస్తాయి. ఈ మార్గంలో ఎక్కువగా చిత్తడి నేలలు, సరస్సులు, అడవులు ఉండడంతో వాటికి స్టాప్‌ఓవర్ పాయింట్లు ఉన్నాయి. అక్కడ ఆగి ఆహార సేకరణ, విశ్రాంతి తీసుకోవడం చేస్తాయి.

4.అమెరికాస్ ఫ్లైవే..

ప్రపంచంలో ఎక్కువ పక్షి జాతులు తిరిగే ఫ్లైవే ఇది. 2 వేల కంటె ఎక్కువ విభిన్న పక్షి జాతులు ఈ మార్గంలో ప్రయాణిస్తాయి. దక్షిణ అర్జెంటీనాలోని టియెర్రా డెల్ ఫ్యూగో నుంచి ఉత్తరాన ఆర్కిటిక్ సర్కిల్ వరకు విస్తరించి ఉన్న ఈ ఫ్లైవేలో 35 దేశాలను దాటే మూడు వలస మార్గాలు ఉన్నాయి. ఈ రూటులో 3 అంగుళాల పొడవు ఉంటే రూఫస్ హమ్మింగ్‌బర్డ్ 3 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.

సహజసిద్ధ శక్తిసామర్థ్యాలు



- పక్షులు భూమ్మీదున్న అయస్కాంత క్షేత్రాలను గుర్తించడానికి తమ మెదడులోని ప్రత్యేక కణాలను ఉపయోగిస్తాయి. ఇవి వాటికి ఒక సహజ దిక్సూచిలా పనిచేస్తాయి. పగటి వేళల్లో సూర్యుడి స్థానం ఆధారంగా తమ దిశను నిర్ణయించుకుంటాయి. సూర్యుడి కదలికలను అనుసరిస్తూ మార్గాన్ని నిర్దేశించుకుంటాయి. రాత్రి సమయాల్లో నక్షత్రాల స్థానాలను బట్టి దిశను గుర్తిస్తాయి.
- పర్వతాలు, నదులు, తీరప్రాంతాలు వంటి భౌగోళిక లక్షణాలను పక్షులు గుర్తుపెట్టుకుని వాటి ఆధారంగా మార్గాన్ని నిర్ధారించుకుంటాయి. కొన్ని పక్షులు గాలి దిశ, ఉష్ణోగ్రత, వాతావరణ మార్పులను అనుసరించి ఎగురుతాయి. రోసీ స్టార్లింగ్స్ అనే పక్షిజాతి వాతావరణ సూచనలను ఆధారంగా తమ ప్రయాణ సమయాన్ని నిర్ణయించుకుంటుంది.
- బార్-హెడెడ్ గూస్ పక్షి జాతి హిమాలయాలను దాటేటప్పుడు 8 వేల మీటర్ల ఎత్తులో ఎగురుతాయి. అక్కడ ఆక్సిజన్ స్థాయిలు చాలా తక్కువ. వాటి శరీరం అంత తీవ్రమైన పరిస్థితులనూ తట్టుకునేందుకు అనువుగా ఉంటుంది.
- పక్షులు ప్రయాణ మార్గాలను జన్యుపరంగా లేదా అనుభవం ద్వారా గుర్తుంచుకుంటాయి. అమూర్ ఫాల్కన్స్ పక్షి జాతి సైబీరియా నుంచి ఆఫ్రికాకు 22 వేల నుంచి 30 వేల కిలోమీటర్లకుపైగా దూరం ప్రయాణించి కచ్చితమైన గమ్యస్థానాలకు చేరుకుంటాయి.
- ఆవాసాలు చెదిరిపోవడం, వాతావరణ మార్పులు, కాంతి కాలుష్యం, గాలి టర్బైన్లు, ఎత్తైన భవనాల వల్ల విహంగాలు అప్పుడప్పుడు గందరగోళానికి గురవుతాయి.

విహంగాలు ఎగిరే మార్గాల్లో ఇంకొన్ని

1. **ఆసియన్-ఈస్ట్ ఆఫ్రికన్ ఫ్లైవే:** దక్షిణ ఆసియా (ముఖ్యంగా భారత ఉపఖండం) నుంచి తూర్పు ఆఫ్రికా
2. **వెస్ట్ పసిఫిక్ ఫ్లైవే :** ఉత్తర ఆసియా (సైబీరియా, జపాన్) నుంచి దక్షిణ పసిఫిక్ ద్వీపాలు, ఆస్ట్రేలియా
3. **పసిఫిక్ అమెరికాస్ ఫ్లైవే :** ఉత్తర అమెరికా (అలాస్కా, కెనడా) నుంచి దక్షిణ అమెరికా (చిలీ, అర్జెంటీనా) పసిఫిక్ తీరం వెంబడి ఉంది
4. **సెంట్రల్ అమెరికాస్ ఫ్లైవే :** ఉత్తర అమెరికా (కెనడా, యుఎస్) నుంచి సెంట్రల్ అమెరికా,ఉత్తర దక్షిణ అమెరికా
5. **అట్లాంటిక్ అమెరికాస్ ఫ్లైవే :** తూర్పు ఉత్తర అమెరికా నుంచి కరేబియన్ దీవులు, దక్షిణ అమెరికా యొక్క అట్లాంటిక్ తీరం వరకు ఉంటుంది
6. **మిస్సిసిపి అమెరికాస్ ఫ్లైవే :** ఉత్తర అమెరికా మధ్య భాగం (మిస్సిసిపి నది లోయ) నుంచి సెంట్రల్, దక్షిణ అమెరికా వరకు మార్గాలున్నాయి.

సౌందర్యలహరి

అట్టహాసంగా ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ వేడుకలు



సాక్షి, హైదరాబాద్: శనివారం సాయంత్రం.. భాగ్యనగరం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం.. అందం.. ఆత్మవిశ్వాసం.. అభినయం.. కలిసి కవాతు చేశాయి.. ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ వేడుకలను సప్తవర్ణ శోభితం చేశాయి. మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీలు హైదరాబాద్ కేంద్రంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రపంచం నలుమూలల నుంచి 109 దేశాలకు ప్రాతినిథ్యం వహిస్తూ వచ్చిన పోటీదారులైన అందెగత్తెలు లయబద్ధమైన పాశ్చాత్య సంగీత హోరుకు తగ్గట్టుగా అభినయిస్తూ తమను తాము పరిచయం చేసుకోగా, ఆయా సుందరీమణుల బృందాన్ని తెలంగాణ సంప్రదాయ కళాకారుల బృందం నర్తిస్తూ వేదిక మీదకు స్వాగతించింది. ఒకవైపు పాశ్చాత్య సంగీతం.. మరోవైపు తెలంగాణ సంప్రదాయ కళా బృందాల విన్యాసం.. వెరసి ఓ జుగల్‌బందీగా ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశాయి. దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగిన ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ కార్యక్రమం ప్రేక్షకులను ఆసాంతం అలరించింది.

ఖండాల వారీగా 4 బృందాలుగా..

ప్రారంభ వేడుకల్లో 109 దేశాల సుందరీమణులు పాల్గొన్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. వీరిని ఖండాల వారీగా నాలుగు బృందాలుగా విభజించారు. తొలుత తెలంగాణకు చెందిన ఒక్కో సంప్రదాయ కళా బృందం ప్రదర్శన ఇవ్వగా, ఆ వెంటనే ఒక్కో బృందం చొప్పున సుందరీమణులు స్టేడియంలోకి వచ్చి పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రామకృష్ణ ఆధ్వర్యంలో కొమ్ము కోయ బృందం కోయ డప్పు నృత్యం ప్రదర్శించారు. ఆ వెంటనే అమెరికా-కరేబియన్ దేశాలకు చెందిన తొలి సుందరీమణుల బృందం వచ్చింది. నిర్వాహకులు దేశాల వారీగా పిలవగానే ఆయా దేశాల ప్రతినిధులు ఒక్కొక్కరు పాశ్చాత్య బీట్‌కు తగ్గట్టుగా నర్తిస్తూ అభివాదం చేసుకుంటూ పరిచయం చేసుకున్నారు. తొలుత అర్జెంటీనా సుందరీమణి రాగా, చివరగా వెనిజువెలా అందెగత్తె వచ్చింది.

గొప్ప నగరంలో ఉన్నందుకు పులకిస్తున్నాం: మిస్ వరల్డ్ పిస్కోవా

'నమస్తే హైదరాబాద్.. నమస్తే తెలంగాణ. ఈ అద్భుతమైన నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవంలో మీ అందరితో కలిసి పాల్గొనటం నాకు గర్వంగా ఉంది. ఈ అద్భుత దేశం, గొప్ప సాంస్కృతిక కేంద్రంలో మేము 'బ్యూటీ విత్ పర్పస్' అనే అద్భుత కార్యక్రమంలో ఐక్యతను చాటుతూ పాల్గొంటున్నాం. 109 దేశాల నుంచి వచ్చిన మహిళలు గొప్ప లక్ష్యంతో ఒక్కటిగా ఈ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకు ఇప్పుడు హైదరాబాద్ సరైన వేదికగా నిలిచింది. ఈ నగరంలో సంప్రదాయం-ఆధునికత ఒకదానికొకటి పెనవేసుకుని ఉన్నాయి. ఇక్కడి ఆతిథ్యానికి, ,హృదయపూర్వక స్వాగతానికి ధన్యవాదాలు..' అని మిస్ వరల్డ్ క్రిస్టీనా పిస్కోవా అన్నారు.

బిక్కుబిక్కుమంటూ గడిపాం..

కశ్మీర్, పంజాబ్‌లోని తెలుగు విద్యార్థుల వెల్లడి

- డ్రోన్లు, కాల్పులతో ఏం జరుగుతుందో తెలియక భయపడ్డాం
- మా హాస్టల్ రూమ్‌ల పైనుంచి పాకిస్తాన్ డ్రోన్‌లు వెళ్లాయి
- సురక్షితంగా ఢిల్లీ చేరుకున్న ఏపీ, తెలంగాణ విద్యార్థులు
- ఏపీ, తెలంగాణ భవన్‌లలో భోజనం, బస కల్పించిన అధికారులు



ఢిల్లీ విమానాశ్రయంలో తెలుగు విద్యార్థులు

సాక్షి, న్యూఢిల్లీ/సంగారెడ్డి క్రైం: 'భీకరమైన శబ్దాలు, మెరుపుల్లా డ్రోన్లు, ఆకాశం వైపు చూస్తే చాలు.. గుండె ఆగేంత భయం. భారత్-పాకిస్తాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడిపాము'అని తెలుగు రాష్ట్రాల విద్యార్థులు తమ ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధ పరిస్థితుల నుంచి తాము సురక్షితంగా బయటపడటం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. జమ్మూ, కశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 51 మంది, తెలంగాణకు చెందిన 17 మంది విద్యార్థులు సురక్షితంగా ఢిల్లీలోని ఉమ్మడి భవన్‌కు చేరుకున్నారు. ఇక్కడ రెండు రాష్ట్రాల అధికారులు విద్యార్థులకు వేర్వేరుగా బస, భోజన ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు దఫదఫాలుగా విద్యార్థులను విమానాలు, రైళ్ల ద్వారా వారి స్వస్థలాలకు పంపారు. వీరిలో కొందరు విద్యార్థులను 'సాక్షి' పలకరించగా.. ఆయా ప్రాంతాల్లో వారు ఎదుర్కొన్న భయానక పరిస్థితులను వివరించారు.

ఓ పక్క భయం.. ఇంకో పక్క రైల్వే దోపిడీ

రెండు రాత్రులు డ్రోన్‌లు, కాల్పుల శబ్దాలతో గజగజలాడాము. యుద్ధ ప్రాంతం నుంచి తప్పించుకుని ఢిల్లీ చేరుకోవడానికి పంజాబ్‌లోని పగ్వారా రైల్వే స్టేషన్‌కు వచ్చాం. అక్కడ ముందుగానే రిజర్వేషన్ చేసుకున్న ట్రెయిన్ ఎక్కాము. అయితే ఖాళీ లేకపోవడంతో వాష్‌రూమ్ బయట నిలబడ్డాం. టీసీ మమ్మల్ని తర్వాతి స్టేషన్ లుధియానాలో దించేశారు. రిజర్వేషన్ ఉన్నా ఏసీ కోచ్‌లో ఉన్నాం అనే కారణంతో ఐదుగురు నుంచి టీసీ రూ.4,500 వసూలు చేశారు. తర్వాత వచ్చిన ఇంటర్ సిటీ ఎక్కితే దానిలో రిజర్వేషన్ లేదు.. అని వాళ్లు మరో రూ.200 చొప్పున డబ్బులు వసూలు చేశారు.

–ఎస్.మధువర్షిత, బీటెక్,
లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, పంజాబ్

డ్రోన్ల శబ్దాలకు భయం వేసింది

8వ తేదీ రాత్రి చదువుకుంటున్నాం. ఒక్కసారిగా పైనుంచి భారీ శబ్దాలు.. అవి ఏమిటో మొదట మాకు అర్థం కాలేదు. హాస్టల్ యాజమాన్యం మా అందరినీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఓ రూమ్‌లో కూర్చోబెట్టింది. అర్ధరాత్రి దాటాక పాకిస్తాన్ డ్రోన్ల శబ్దాలు ఆగిపోవడంతో పడుకోవడానికి రూమ్‌లలోకి వెళ్లాము. పడుకున్న రెండు గంటల్లోనే మళ్లీ భీకరమైన శబ్దాలు వినిపించాయి.

–ఎస్.జీవన జ్యోతి, ఐఐటీ జగతి (జమ్మూ)

హాస్టల్ చుట్టూ.. డ్రోన్లు



పదుల సంఖ్యలో పాకిస్తాన్ డ్రోన్లు మా యూనివర్సిటీలోని హాస్టల్ చుట్టూ తిరిగాయి. ఆ శబ్దాలకు చెవులు గింగురుమనడమే కాదు, ఏం జరుగుతుందోనని భయపడిపోయా. ఉదయం రైల్వేస్టేషన్‌కు వచ్చేందుకు బస్సు దగ్గరకు వెళుతుండగా అప్పుడు కూడా మాపై నుంచి డ్రోన్లు వెళ్లాయి.

–సీహెచ్ భానుకిరణ్, బీటెక్,
లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, పంజాబ్

ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి

మేము చదువుకునే యూనివర్సిటీ సమీపంలో శుక్రవారం రాత్రంతా బాంబుల శబ్దం రావడంతో ఏమి జరుగుతుందోనని భయం భయంగా గడిపాం. గత రెండు రోజులుగా ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేవు. యుద్ధం గురించి తెలుసుకున్న తర్వాత ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అని ఎదురుచూశాం. పంజాబ్ ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో స్వస్థలాలకు బయలుదేరాం.

– రంజిత్‌రెడ్డి, బీటెక్, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, పంజాబ్

ఒక్కసారిగా భయంకర శబ్దాలు..

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే వర్సిటీ సమీపంలో ఒక్కసారిగా భయంకర శబ్దాలు రావడంతో భయం వేసింది. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత పడుకునే సమయంలో భారీ శబ్దాలు వినిపించడంతో యుద్ధం జరుగుతోందని అర్థమైంది. సోషల్ మీడియా మాకు అందుబాటులో లేదు.

–కూచ వెంకట బాలాజీ,
బీటెక్, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, పంజాబ్

పేదల 'ఉపాధి'పై దెబ్బ

శ్రామికులకు కూలీ డబ్బుల్లేవ్.. ఉద్యోగులకు జీతాల్లేవ్

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలు అస్తవ్యస్తంగా మారింది. 27 లక్షల శ్రామికుల కుటుంబాలకు రూ.800 కోట్ల మేర కూలీ డబ్బులు బకాయిలుండటంతో పేదలు ఆకలితో అలమటిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పథకం కింద పని చేసే దాదాపు 15 వేల మంది ఉద్యోగులు, సిబ్బంది మూడు నెలలుగా వేతనాలు అందక విలవిల్లాడిపోతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు దొరకని ప్రస్తుత వేసవి రోజుల్లో ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవించే పేదల పరిస్థితి దయనీయంగా తయారైంది. నిబంధనల ప్రకారం.. ఉపాధి హామీ పథకం పనుల్లో పనిచేసే శ్రామికులకు గరిష్ఠంగా 15 రోజుల లోపే వారి పనికి సంబంధించిన కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 27 లక్షల పేద కుటుంబాలకు సంబంధించిన 39 లక్షల మంది పేదలకు నెల రోజులుగా చేసిన పనులకు కూలీ డబ్బులు చెల్లించ లేదు. ఇలాగైతే ఎలా అంటూ వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. మరోవైపు.. మెటీరియల్ కేటగిరిలో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, తదితర పనులు చేసిన వారికి రూ.2,500 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.



మరోవైపు ఉపాధి హామీ పథకం కార్యక్రమాల పర్యవేక్షణకు మండల కంప్యూటర్ సెంటర్ల(ఎంసీసీ)లో పని చేసే టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏ) మొదలు రాష్ట్ర స్థాయి కార్యాలయంలో పనిచేసే దాదాపు ఏడు వేల మంది వివిధ స్థాయిల ఎఫ్‌టీఈ ఉద్యోగుల వరకు ఫిబ్రవరి నెల వేతనం ఇప్పటి వరకు చెల్లించలేదని ఆయా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకం పనులను నిత్యం పర్యవేక్షించే ఫీల్డు అసిస్టెంట్లకు, రాష్ట్ర స్థాయి గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో పనిచేసే కొన్ని కేటగిరీల ఉద్యోగులు 8 వేల మందికి మార్చి నెల నుంచి వేతనం ఇవ్వలేదు. మొత్తంగా 15 వేల మందికి జీతాలు ఇవ్వక పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.


మితిమీరిన అధికార పార్టీ నేతల ఆగడాలు

గత ఏడాది జూన్‌లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు పనులు కల్పించే ఉపాధి హామీ పథకం అమలులో రాజకీయ జోక్యం మితిమీరిపోతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే అప్పటిదాకా గ్రామాల్లో ఉపాధి పథకం ఫీల్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిలో అత్యధికులను ఏకపక్షంగా తొలగించి, ఆ స్థానాల్లో కూటమి పార్టీల సానుభూతిపరులను నియమించారు. గ్రామాల్లో పార్టీల వారీగా పనులు కేటాయిస్తున్నారని ఎన్నో ఘటనలు రుజువు చేశాయి. కేవలం అధికార పార్టీకి అనుకూలంగా ఉండే వారికి మాత్రమే పనులు కల్పించాలని ఒత్తిళ్లు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు, ప్రభుత్వం సైతం కొత్తగా గ్రూపుల వారీగా మాత్రమే పనులు కల్పించాలని నిర్ణయం తీసుకోవడంతో కొన్ని గ్రూపులకు పనులు కేటాయించడం లేదని విమర్శలున్నాయి. కొద్ది రోజుల క్రితం.. అనకాపల్లి జిల్లా మామిడపాలెం గ్రామంలో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని దాదాపు 350 మంది కూలీలకు స్థానిక సిబ్బంది పనులు కల్పించకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎల్ఎల్ పురం గ్రామానికి చెందిన 300 మంది కూలీలు తమకు పనుల కల్పనలో రాజకీయ పక్షపాతం చూపుతున్నారని ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చాలా చోట్ల ఇలాంటి పరిస్థితులే కొనసాగుతున్నాయి.

పనుల కల్పనలో ఘోరంగా విఫలం

- 2024 ఏప్రిల్ నెలలో అప్పటి ప్రభుత్వం పేదలకు 5.98 కోట్ల పని దినాల్లో పనులు కల్పించింది. ఈ ఏడాది ఏప్రిల్ నెల 30 రోజులతో పాటు మే నెలలో పది రోజులు కలుపుకుని.. మొత్తం 40 రోజుల్లో కూటమి ప్రభుత్వం కేటాయించిన పని దినాలు కేవలం 4.41 కోట్లు మాత్రమే. ఎక్కువ డిమాండ్ ఉండే మే నెలలో రోజుకు 25 లక్షల పని దినాలకు మించి పనులు కల్పించడం లేదు. శనివారం దాదాపు 30 లక్షల మంది పేదలు ఉపాధి హామీ పథకం పనులకు డిమాండ్ పెట్టుకుంటే కేవలం 23 లక్షల మందికి మాత్రమే పనులు కల్పించారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం శ్రామికుల ఆదాయం సైతం పడిపోయినట్టు స్వచ్ఛంద సంస్థ 'లిబ్‌టెక్ ఇండియా' ఓ నివేదిక విడుదల చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులకు హాజరైన ఒక్కో పేద కుటుంబం ఏడాది మొత్తంలో రూ.13,484 చొప్పున ఆదాయం పొందింది. అదే 2024-25 ఆర్థిక ఏడాదిలో రోజు వేతన రేటు రూ.272 నుంచి రూ.300కు పెరిగినప్పటికీ సగటున ఓ కుటుంబానికి రూ.13,190 మాత్రమే పొందినట్లు ఆ సంస్థ పేర్కొంది. పెరిగిన ధరల ప్రకారం చూస్తే.. ఒక్కో కుటుంబం సగటున రూ.1531 చొప్పున నష్టపోయిందని వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 25.55 కోట్ల పేదలు పనులు పొందగా, 2024-25లో ఆ సంఖ్య 24.22 కోట్లకు పరిమితమైంది.
- రాష్ట్రంలో పూర్తి స్థాయిలో వంద పని దినాల పాటు పనులు పొందిన కుటుంబాల సంఖ్య కూడా భారీగా తగ్గింది. 2023-24 ఏడాదిలో 6.87 లక్షల కుటుంబాలు వంద పని దినాల్లో పనులు పొందగా, 2024-25లో 5.1 లక్షల కుటుంబాలు మాత్రమే ఆ మేరకు పనులు పొందాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



ప్రాణదాతా ప్రణామం

అప్పుడే వచ్చిన లేలేత చిగుర్లు ఉగ్ర భానుడి ధాటికి విలవిల్లాడాయి. సాయంసంధ్య వేళ పశ్చిమాన కనుమరుగవుతూ లోలార్కుడు వెదజల్లే అరుణ కిరణ స్పర్శకు కిలకిలా నవ్వాయి. తెరలు తెరలుగా తాకుతూ పోయే పిల్లగాలికి వళ్లు విదిల్చి సవ్వడి చేశాయి. ఇదంతా నిశ్చలంగా నిల్చొని గమనిస్తున్న ఆ వృక్షరాజం ప్రాణదాతా ప్రణామం అంటూ ఆదిత్యునికి ప్రణమిల్లింది. విశాఖ శివారులో ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఎండ నుంచి ఉపశమనం

ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం పూట రోడ్డుపైకి రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. అలాంటిది ఆ సమయంలో రైల్వేగేట్ దాటాలంటే.. బాబోయ్.. గేటు తీసేవరకూ నరకమే. దీన్ని దృష్టిలో ఉంచుకుని నెల్లూరులోని బీవీనగర్ రైల్వేగేట్ వద్ద మున్సిపల్ అధికారులు ఇలా గ్రీన్ మ్యాట్‌లో పందిరి ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు రైలు వెళ్లే వరకూ హాయిగా నీడలో సేదతీరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు




హాయి హాయిగా సాగిపోదామిలా

మే నెలలో ఎండలు మాడుపగలగొడుతున్నాయి. ప్రయాణమంటేనే ప్రజలు భయపడే పరిస్థితి. దీంతో వినూత్నంగా ఆలోచించిన ఈ ఆటో డ్రైవర్ తన ఆటోపై తడి గడ్డి వేసి కట్టాడు. దీంతో లోపల కూర్చున్న ప్రయాణికులకు ఎండ నుంచి కాస్త ఉపశమనం కలుగుతోంది. విజయనగరం జిల్లా కేంద్రంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

మన వెలుగులు భద్రం

భారత్‌-పాకిస్తాన్‌ ఉద్రిక్తతల నేపథ్యంలో మన దేశ పవర్‌ గ్రిడ్ల భద్రతపై చర్చ

- భారత విద్యుత్‌ గ్రిడ్‌పై పాకిస్తాన్‌ సైబర్‌ దాడి చేసి 70 శాతం నిలిపివేసిందంటూ ప్రచారం
- సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం
- ఆ సమాచారం ఫేక్‌ అంటూ పీఐబీ ఫ్యాక్ట్‌-చెక్‌ ట్వీట్‌



సాక్షి, అమరావతి: యుద్ధంలో సైబర్‌ దాడులు ప్రధాన భూమిక పోషిస్తున్నాయనేది రష్యా-ఉక్రెయిన్‌ యుద్ధం రుజువు చేసింది. ఒక దేశాన్ని చావుదెబ్బ కొట్టాలంటే ఆయుధాలతో కాకుండా సైన్స్‌, టెక్నాలజీతో సాధ్యమవుతుందని అనేక దేశాల్లో జరుగుతున్న పరిణామాలతో నిరూపితమైంది. మన దేశంలోనూ పవర్‌ గ్రిడ్‌లకు సైబర్‌ దాడుల నుంచి ముప్పు పొంచి ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా పాకిస్తాన్‌ సైబర్‌ దాడికి పాల్పడి భారతదేశ విద్యుత్‌ గ్రిడ్‌లో 70 శాతం నిలిపివేసిందంటూ సోషల్‌ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. దానిని ప్రెస్‌ ఇన్ఫర్మేషన్‌ బ్యూరో (పీఐబీ) ఖండించింది. సైబర్‌ దాడి అనేది పూర్తిగా అవాస్తవమంటూ పీఐబీ ఫ్యాక్ట్‌-చెక్‌లో ట్వీట్‌ చేసింది. అయితే విద్యుత్‌ వ్యవస్థను సైబర్‌ దాడుల నుంచి కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఇంధనరంగ నిపుణులు అంటున్నారు.



పవర్‌ ఐలాండ్‌ సిస్టమ్‌తో పరిష్కారం

పవర్‌ ఐలాండ్‌ సిస్టమ్‌ ఏర్పాటు చేయాలని మూడేళ్ల క్రితం కేంద్రం నిర్ణయించింది. సెక్యూరిటీ ఇన్సిడెంట్‌ రెస్పాన్స్‌ టీమ్‌(సీఎస్‌ఐఆర్‌టీ)ను కూడా ఏర్పాటు చేయాలని భావించింది. సెంట్రల్‌ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఆధ్వర్యంలో వివిధ ప్రైవేటు సంస్థల్లో శిక్షణ పొందిన సైబర్‌ (ఇంటలిజెంట్‌) నిపుణులు ఈ బృందంలో ఉంటారు. సీఈఏ గతేడాది విద్యుత్‌ రంగంలో సైబర్‌ సెక్యూరిటీపై కొత్త నిబంధనల్ని తెచ్చింది. మన దేశంలో నార్తరన్‌, వెస్ట్రన్‌, సదరన్‌, ఈస్ట్రన్‌, నార్త్‌ ఈస్ట్రన్‌ అనే ఐదు ప్రాంతీయ పవర్‌ గ్రిడ్‌లు ఉన్నాయి. వీటన్నిటినీ 'వన్‌ నేషన్‌.. వన్‌ గ్రిడ్‌' కార్యక్రమంలో భాగంగా సెంట్రల్‌ గ్రిడ్‌కు అనుసంధానించారు. ఈ గ్రిడ్‌ల కార్యకలాపాలన్నీ పవర్‌ గ్రిడ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ పరిధిలో జరుగుతుంటాయి. ఇంత పెద్ద గ్రిడ్‌కు సంబంధించిన సమాచార వ్యవస్థను శత్రువులు చేజిక్కుంచుకుంటే దేశం మొత్తం చీకటైపోతుంది. ఈ నేపథ్యంలో పవర్‌ గ్రిడ్‌ వంటి మౌలిక సదుపాయాలపై సైబర్‌, ఉగ్ర దాడులను ఎదుర్కోవటానికి పవర్‌ ఐలాండ్‌ సిస్టమ్‌ ఏర్పాటు చేయాలని సీఈఏ ప్రతిపాదించింది. పవర్‌ ఐలాండ్‌ సిస్టమ్‌ అనేది విద్యుత్‌ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం. గ్రిడ్‌లో ఏదైనా అంతరాయం ఏర్పడితే విద్యుత్‌ వ్యవస్థను వెంటనే దాని నుంచి వేరుచేయడాన్ని పవర్‌ ఐలాండింగ్‌ సిస్టమ్‌ అంటారు. దీని వల్ల పవర్‌ గ్రిడ్‌లు కుప్పకూలకుండా నియంత్రించవచ్చు.

గత ప్రభుత్వం పటిష్ట చర్యలు

కేవలం పవర్‌ గ్రిడ్‌లే కాకుండా విద్యుత్‌ ఉత్పత్తి, పంపిణీ సంస్థలు కూడా అంతర్గత సమాచార రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన ఆవశ్యకత ఉందనే విషయాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుగానే గుర్తించింది. అప్పటి ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్ర ఇంధనశాఖ అనుసరించిన జియోగ్రాఫికల్‌ ఇన్ఫర్మేషన్‌ సిస్టమ్‌ (జీఐఎస్‌) వల్ల ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంల మొత్తం ట్రాన్స్‌మిషన్‌, డి్‌స్ట్రిబ్యూషన్‌ నెట్‌వర్క్‌లను జియో ట్యాగింగ్‌ చేయడం తేలికైంది. దీంతో భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన పవర్‌ సిస్టమ్‌ ఆపరేషన్‌ కార్పొరేషన్‌లో భాగమైన సదరన్‌ రీజినల్‌ లోడ్‌ డిస్పాచ్‌ సెంటర్‌ (ఎస్‌ఆర్‌ఎల్‌డీసీ), మొత్తం దక్షిణాది రాష్ట్రాల్లో పవర్‌ గ్రిడ్‌ను పర్యవేక్షించడానికి ఏపీ ట్రాన్స్‌కో జీఐఎస్‌ మోడల్‌ను తీసుకుంది. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్‌, డిస్ట్రిబ్యూషన్‌ లైన్లు, ఫిజికల్‌ పొజిషన్‌ ఎలా ఉందనేది ఈ జీఐఎస్‌లో సులభంగా తెలుసుకోవచ్చు. తద్వారా గ్రిడ్‌ భద్రతకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది.

రాష్ట్రాల్లో ప్రత్యేక ఏర్పాటు

రాష్ట్ర విద్యుత్‌ రంగంలో కచ్చితంగా చీఫ్‌ ఇన్ఫర్మేషన్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌(సీఐఎస్‌ఓ)ను నియమించాలి. భారత పౌరసత్వం కలిగిన సీనియర్‌ మేనేజ్‌మెంట్‌ ఉద్యోగులను సీఐఎస్‌ఓగా నియమించాలి. వారు సంస్థ ఉన్నతాధికారికి మాత్రమే జవాబుదారీగా ఉండాలి. అలాగే ప్రతి విద్యుత్‌ సంస్థ సైబర్‌ క్రైసిస్‌ మేనేజ్‌మెంట్‌ ప్లాన్‌(సీసీఎంపీ)ని అభివృద్ధి చేసుకోవాలి. విద్యుత్‌ రంగంలోని కంప్యూటర్లలో సాఫ్ట్‌వేర్‌లు హ్యాకింగ్‌కు గురికాకుండా అడ్వాన్స్‌ ఫైర్‌వాల్స్‌, డిటెక్షన్‌ సిస్టమ్‌(డీఎస్‌), ప్రివెన్షన్‌ సిస్టమ్‌(పీఎస్‌)ను తయారు చేయాలి. ట్రస్టెడ్‌ వెండర్‌ సిస్టమ్‌ను కూడా కచ్చితంగా పెట్టుకోవాలి. ఇది థర్డ్‌ పార్టీ అప్లికేషన్స్‌ ద్వారా మాల్‌వేర్‌ కంప్యూటర్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకుంటుంది. వీటన్నిటిపైనా ఐటీ, టెక్నాలజీ విభాగాల్లో ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సీఈఏ వెల్లడించింది. కానీ ఇవన్నీ ఇంకా పూర్తి ఆచరణలోకి రాలేదు.

ఈనెల 8న సత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లో ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ పేరుతో ఆశాబీ అనే మహిళ హంగామా చేసింది. బేకరీ, హోటల్‌, చికెన్‌ పకోడా దుకాణాల దారుల నుంచి రూ.1,500 చొప్పున వసూలు చేసింది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చి ఫుడ్‌ సేఫ్టీ కార్యాలయానికి ఫోన్‌ చేయగా...ఆశాబీ పేరుతో ఎవరూ లేరని చెప్పారు. అప్పటికే ఆమె అక్కడి నుంచి ఉడాయించింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూటు మార్చిన కేటుగాళ్లు

- అధికారుల పేరుతో డబ్బు వసూలు
- సత్యసాయి జిల్లాలో నకిలీ అధికారుల హల్‌చల్‌
- పన్నుల పేరిట ఆన్‌లైన్‌లో దందా
- ఫుడ్‌ సేఫ్టీ అధికారుల పేరుతో చిల్లర రాబడుతున్న వైనం



సాక్షి, పుట్టపర్తి : ప్రభుత్వ అధికారుల పేరుతో కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. మొబైల్‌ కాల్స్‌ ద్వారా నిమిషాల్లో డబ్బులు కొల్లగొడుతున్నారు. మోసపోయామని బాధితులు తెలుసుకునేలోపే అక్కడి నుంచి పరారవుతున్నారు. అనంతరం మొబైల్స్‌ స్విచాఫ్‌ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో సత్యసాయి జిల్లాలో వరుసగా వెలుగు చూస్తున్నాయి.

పెరిగిన సైబర్‌ నేరాలు

హిందూపురం, పుట్టపర్తి, కొత్తచెరువు, ధర్మవరం, కదిరి తదితర ప్రాంతాల్లో సైబర్‌ మోసాలు పెరిగిపోయాయి. అమాయక ప్రజలను టార్గెట్‌ చేసి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సమూహంగా ఏర్పడి.. కొత్త కొత్త మొబైల్‌ నంబర్ల నుంచి కాల్‌ చేసి మాయమాటలు చెప్పి.. నిమిషాల వ్యవధిలో డబ్బులు లాగుతున్నారు. లాటరీ తగిలిందని.. పర్సనల్‌ లోన్‌ అప్రూవల్‌ అయిందని.. ట్యాక్స్‌ ఆన్‌లైన్‌లో కడితే రాయితీ వస్తుందని.. ఇలా పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు.

నకిలీ కార్డులతో గుంపుగా వచ్చి..

రెండు నెలల క్రితం నల్లమాడ, బుక్కపట్నం, ఓడీ చెరువు, కొత్తచెరువు, గోరంట్ల, తనకల్లు తదితర ప్రాంతాల్లో ఫుడ్‌ సేఫ్టీ అధికారుల పేరుతో దుకాణాలు, షాపింగ్‌ కాంప్లెక్స్‌లలో దుండగులు చొరబడ్డారు. తమ వాహనాలను ప్రభుత్వ స్టిక్కర్లు వేసుకుని.. నకిలీ కార్డులు మెడలో వేసుకుని ఆయా దుకాణదారులను భయపెట్టి భారీగా వసూళ్లు చేశారు. ఓ దుకాణదారుడికి వీరి వ్యవహారంపై అనుమానం రావడంతో అతను ఫుడ్‌ సేఫ్టీలో తమకు తెలిసిన వాళ్లు ఉన్నారని చెప్పాడు. దీంతో ఆగంతకులు అక్కడి నుంచి పరారయ్యారు.

అధికారులపైనే ఆరోపణలు

కొందరు ప్రభుత్వ అధికారులు తమ పరిధిలో అక్కడక్కడా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని నకిలీ ఐడీ కార్డులు అందజేసి వసూళ్లు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై కొందరిని ప్రశ్నించగా.. తమకు సంబంధం లేదని దాటవేశారు.

అప్రమత్తత అవసరం



సైబర్‌ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మొబైల్‌ ద్వారా వచ్చే ఓటీపీలను తెలియని వ్యక్తులు అడిగితే షేర్‌ చేయరాదు. పన్ను వసూళ్ల పేరుతో వచ్చే ఫోన్‌ కాల్స్‌కు స్పందించాల్సిన అవసరం లేదు. అధికారులపై ఎలాంటి అనుమానం వచ్చినా.. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. ప్రజల సహకారంతోనే సైబర్‌ నేరాల కట్టడి సాధ్యం.
– వి.రత్న, జిల్లా ఎస్పీ

కొనేవారేరీ..!


దేవరపల్లి మండలం పల్లంట్లలో పెండలం చేను

పెండలం ధర ప్రస్తుతం పూర్తిగా పతనమై, కిలో రూ.4 పలుకుతోంది. దుంపను తవ్వడానికి కిలోకు రూ.3 వరకూ ఖర్చవుతోందని, ప్రస్తుత పరిస్థితిలో దుంప తవ్వితే కూలి ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.2 లక్షల వరకూ నష్టం వస్తోందని చెబుతున్నారు. ధర బాగుంటే ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల ఆదాయం వస్తుందని అంటున్నారు.

- దండిగా పెండలం దిగుబడి
- వ్యాపారులు రాక రైతుల దిగాలు
- ఎండిపోతున్న పంట
- తీత కూలి కూడా రాదని ఆవేదన
- ఎకరాకు రూ.2 లక్షల నష్టం

దేవరపల్లి: భూమి నుంచి తవ్వి తీసే సమయం దాటిపోతున్నా.. కొనే నాథుడు లేక పెండలం దుంపలు చేలల్లోనే ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత రెండేళ్లు మార్కెట్లో పెండలం దుంపలకు మంచి గిరాకీ ఉండేది. గణనీయంగా దిగుబడులు వచ్చేవి. మార్కెట్లో గిట్టుబాటు ధర పలికేది. దీంతో రైతులకు నాలుగు డబ్బులు మిగిలేవి. దీంతో చిన్న, సన్నకారు రైతులు ఉన్న కొద్దిపాటి భూములతో పాటు కౌలుకు తీసుకుని ఈ ఏడాది పెండలం సాగు చేశారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల, కురుకూరుతో పాటు కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో సుమారు 1,200 ఎకరాల్లో పెండలం సాగు జరుగుతోంది. పల్లంట్ల, కురుకూరు, లక్ష్మీపురం గ్రామాల్లోని రైతులు సుమారు 30 ఏళ్లుగా పెండలం సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోనూ సుమారు 600 ఎకరాల నల్లరేగడి భూముల్లో వాణిజ్య పంటగా పెండలం సాగు జరుగుతోంది.

పల్లంట్ల దుంపకు డిమాండ్‌

పల్లంట్ల, కురుకూరు గ్రామాల్లో పండే పెండలం దుంపకు మార్కెట్లో మంచి డిమాండ్‌ ఉంటుంది. ఇక్కడి దుంప మంచి సైజుతో పాటు నాణ్యత ఉంటుంది. 2 నుంచి 5 కిలోల దుంప తయారవుతుంది. కోనసీమ జిల్లా రావులపాలెం ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి పెండలం దుంప కొనుగోలు చేసి, ఒడిశాకు ఎగుమతి చేస్తారు. ఒడిశాలో పెండలాన్ని వివాహాలకు ఎక్కువగా వినియోగిస్తారని, ప్రతి ఇంటికీ 10 నుంచి 20 కిలోల దుంపలు సారెగా పంచి పెడతారని రైతులు చెప్పారు. ఈ ప్రాంతంలో పండిన ప్రతి కిలో దుంప అక్కడికే వెళ్తుందని తెలిపారు. అయితే, ఈ ఏడాది ఒడిశాలో రైతులు పెండలం సాగు చేయడంతో పాటు అక్కడ వినియోగం తగ్గడం వల్ల డిమాండ్‌ తగ్గినట్లు సమాచారం.

చేలల్లోనే ఎండిపోతూ..

తీగ జాతి పంట అయిన పెండలం దుంప భూమిలోనే తయారవుతుంది. ఏటా జూన్‌, జూలై నెలల్లో పెండలం సాగు ఆరంభిస్తూండగా.. జనవరి నుంచి మే నెలాఖరు వరకూ దిగుబడి వస్తుంది. ఒక్కో దుంప 2 నుంచి 5 కిలోల వరకూ బరువుంటుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది దిగుబడులు బాగున్నాయని, ధర 10 టన్నులకు రూ.40 వేలకు పడిపోయిందని, అయినప్పటికీ అడుగుతున్న నాథుడే లేడని రైతులు వాపోతున్నారు. దీంతో, దుంప చేలల్లోనే ఎండిపోతోందని ఆవేదన చెందుతున్నారు. ఇటీవలి వర్షాలకు దుంప చివర కుళ్లిపోతోందని, అక్కడక్కడ మొలకలు వస్తున్నాయని, దీనివలన ధర మరింత పతనమవుతుందని చెబుతున్నారు. కుళ్లిన దుంపలను శుభ్రం చేయడానికి దుంపకు రూ.2 ఖర్చవుతుంది. మరో రెండు నెలల్లో కొత్త పంట వేసే సమయం వస్తోంది. ఈ తరుణంలో భూమిలో ఉన్న పంటను చూసి రైతులు దిగులు చెందుతున్నారు.


దుంప భూమిలోనే ఉండిపోయి, ఎండిన పంటను చూపిస్తున్న రైతులు

కౌలు రైతులకు కోలుకోలేని దెబ్బ

పెండలం ధరల పతనంతో కౌలు రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఒక్కో రైతు 5 నుంచి 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పెండలం దుంప సాగు చేశారు. ఎకరా కౌలు రూ.50 వేలు కాగా, పెట్టుబడి మరో రూ.లక్ష వరకూ అయ్యింది. ప్రస్తుత పరిస్థితిలో కౌలు డబ్బులు కూడా రాని పరిస్థితి ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ధర.. దారుణంగా పతనం

సంవత్సరం	ధర (10 టన్నులకు రూ.)
2021–22	1,50,000
2022–23	5,00,000
2023–24	45,000
2024–25	40,000

భూమిలోనే ఉండిపోతోంది



నేను 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పెండలం సాగు చేశాను. కౌలు రూ.5 లక్షలు, పెట్టుబడి రూ.10 లక్షలు అయ్యింది. సాధారణంగా తయారైన దుంపను ఫిబ్రవరి నుంచి మే నెలలోగా భూమి నుంచి తవ్వి, మార్కెట్‌కు పంపాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకూ కిలో దుంప కూడా తీయలేదు. తయారైన దుంప భూమిలోనే ఉండిపోతోంది. ఇటీవలి వర్షాలకు దుంప కుళ్లిపోయి, మొలకలు వస్తున్నాయి. పరిస్థితి అర్థం కావడం లేదు. గత రెండేళ్లు పెండలం ధర లాభదాయకంగా ఉంది. 2023 పంట కాలంలో 10 టన్నుల దుంప రూ.5 లక్షలు పలికింది. గత ఏడాది రూ.45 వేలు పలికినప్పటికీ కొద్దిపాటి లాభంతో ఒడ్డున పడ్డాం.
– నూతలపాటి వెంకట రమణ, రైతు, పల్లంట్ల

నిండా మునిగిపోయాం



దుంప ధర దారుణంగా పతనమైంది. గత ఏడాది 10 టన్నుల ధర రూ.45 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.40 వేలు పలుకుతోంది. అయినప్పటికీ అమ్మదామంటే కొనే వారే కనిపించడం లేదు. వ్యాపారులు రావడం లేదు. ఎక్కడి దుంపలు అక్కడే భూమిలో ఉండిపోయాయి. రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. నేను 4 ఎకరాల్లో పెండలం సాగు చేశాను. ఇప్పటి వరకూ కేజీ దుంప కూడా బోణీ కాలేదు. పెండలం రైతు నిండా మునిగిపోయాడు.
– కూచిపూడి గంగాధర్‌, రైతు, పల్లంట్ల

జోడు పిక్క



సాధారణంగా జీడిపండుకు ఒక పిక్క మాత్రమే ఉంటుంది. అయితే శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చినరావుపల్లిలోని బొడ్డేపల్లి గణేష్‌కు చెందిన జీడితోటలో మాత్రం ఒక జీడిపండుకు రెండు పిక్కలు కనిపించాయి. ఈ విషయమై వ్యవసాయాధికారి సురేష్‌ మాట్లాడుతూ జన్యుపరంగా రెండు పిక్కలు కాసే అవకాశం ఉందని చెప్పారు.
– ఎచ్చెర్ల క్యాంపస్‌

సీతాకేకచిలుక!

అందానికే అందం అన్నట్లుగా సీతాకోక చిలుకలు పలు రంగుల్లో ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తుంటాయి. నల్లంచు తెల్లచీర..అంటూ ఓ సినీ కవి కోక అందాన్ని వర్ణిస్తే..తెల్లంచు నల్లచీర అన్నట్లుగా సాధారణ సీతాకోక చిలుకలకు భిన్నంగా ఈ సీతాకోక చిలుక దర్శనమిచ్చింది. నలుపు చీరపై ఎరుపు రంగు డిజైన్‌ వేసినట్లుగా ఉండడంతో పాటు రెక్కల ఆకృతి కూడా సరికొత్తగా ఉండి చూడగానే మనసు దోచిన ఈ సీతా'కేక'చిలుక తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో 'సాక్షి' కెమెరాకు చిక్కింది.
– రాయవరం



ఐడియా అదిరింది



ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ సోడా బండి వ్యాపారి ఆలోచన ఆకర్షిస్తోంది. పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన శివ వివిధ కాలనీల్లో తిరిగి సోడాలు విక్రయించడం భారంగా మారడంతో వినూత్నంగా ఆలోచించాడు. సోడాబండిని ఒక రాడ్డుతో మోటార్‌బైక్‌కు కట్టి తీసుకెళ్తున్నాడు. దీంతో శ్రమపడాల్సిన అవసరం లేకుండా.. బండి నడుపుతూ.. వ్యాపారం హాయిగా సాగిస్తున్నాడు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

దేశం యూనిట్‌గా నేరస్తుల చిట్టా!



'సీసీటీఎన్‌ఎస్'ద్వారానే సాధ్యం.. మరింత కట్టుదిట్టంగా అమలు

- ఇప్పటికే నేరాల వారీగా నిందితుల జాబితా..
- ఫొటోలు సహా వివరాల కంప్యూటరీకరణ
- దేశంలోని 17,082 పోలీసుస్టేషన్లకు లింకు
- ఎన్‌సీఆర్‌బీ పర్యవేక్షణలో సీసీటీఎన్‌ఎస్..
- మూడు నెలలకో నివేదిక.. అమల్లో తెలంగాణ పోలీసు భేష్..

సాక్షి ప్రతినిధి, వరంగల్: పెచ్చరిల్లుతున్న తీవ్రవాదం.. హద్దుమీరుతున్న ఉగ్రవాదం.. పెట్రేగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు.. దోపిడీలు, దొమ్మీలు.. వీటన్నింటినీ అరికట్టేందుకు హోంశాఖ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని నూటికి నూరు శాతం వినియోగంలోకి తెస్తోంది. గతంలో ఇంట్రానెట్, ఈ–కాప్స్‌ల ద్వారా పోలీసు వ్యవస్థ ఆధునికీకరణ, నేరపరిశోధనలను సరళీకృతం చేసిన హోంశాఖ.. దేశం యూనిట్‌గా నేరస్తుల చిట్టాను రూపొందించడంపై దృష్టి సారించింది. ఇప్పటికే క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్, సిస్టమ్స్ (సీసీటీఎన్‌ఎస్) ద్వారా నేరాల వారీగా నిందితుల జాబితాను సిద్ధం చేసి ఏ మూలన నేరం జరిగినా వివరాలు కనుక్కునే విధంగా నెట్‌వర్క్ రూపొందించింది. రాష్ట్రాల వారీగా ఇంటెలిజెన్స్, ఎస్‌ఐబీ, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ తదితర నిఘా విభాగాలు సంయుక్తంగా కార్యాచరణను అమలు చేస్తున్నాయి. కాగా ఇటీవలి సంఘటనల నేపథ్యంలో కరడుగట్టిన నేరస్తుల జాబితా దేశం యూనిట్‌గా రూపొందించడంపైనా కేంద్ర హోంశాఖ కసరత్తు చేస్తోంది. అయితే సీసీటీఎన్‌ఎస్ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తేనే ఇది సాధ్యమవుతుందని భావిస్తున్నారు.

సీసీటీఎన్‌ఎస్ ఎప్పటి నుంచి..?

క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ అమలుపై మొదటి సమావేశం 2009 జూన్ 19న అప్పటి నేషనల్ క్రైం రికార్డు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) జాయింట్ డైరెక్టర్ పి.ఆర్.కె. నాయుడు ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగింది. సీసీటీఎన్‌ఎస్ ఏర్పాటుకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) స్పందించి ఆమోదించగా అప్పటి కేంద్ర ప్రభుత్వం రూ.2,000 కోట్లు కేటాయించింది. వెంటనే సీసీటీఎన్‌ఎస్ ప్రాజెక్ట్ అన్ని స్థాయిల్లో .. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్ స్థాయిలో ఒక సమగ్ర వ్యవస్థను సృష్టించి పోలీసింగ్ సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా పని చేస్తోంది. దశల వారీగా 2021 జూలై 1 నాటికి, దేశవ్యాప్తంగా 16,276 పోలీస్‌స్టేషన్లలో (పీఎస్‌లలో)15,735 (97 శాతం) పోలీస్‌స్టేషన్లలో కనెక్టివిటీ అందించారు. 2019 జూన్ 30 నుంచి 2021 జూన్ 30 వరకు నేషనల్ డేటాబేస్ దాదాపు 28 కోట్ల రికార్డులకు పెరగ్గా, డిజిటల్ పోలీస్ పోర్టల్‌ను మాస్టర్ పోలీస్ పోర్టల్‌గా మార్చారు. వేలిముద్రల నిల్వ, సామర్థ్యాన్ని మెరుగుపరచి పోలీసు దర్యాప్తుల్లో సీసీటీఎన్‌ఎస్ సిస్టమ్ గేమ్ ఛేంజర్‌గా మారింది.

సీసీటీఎన్‌ఎస్‌లో తెలంగాణ భేష్

నేషనల్ క్రైం బ్యూరో రికార్డ్స్(ఎన్‌సీఆర్‌బీ)–2022 ప్రకారం దేశంలోని 17,535 పోలీస్‌స్టేషన్లకు 17,082 (97.41 శాతం) పీఎస్‌లలో క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్, సిస్టమ్స్ (సీసీటీఎన్‌ఎస్) అమలవుతోంది. దేశంలోని 36 రాష్ట్రాలు/యూటీలలో 14 రాష్ట్రాలలో 90 శాతానికి పైగా విజయవంతంగా సీసీటీఎన్‌ఎస్ అమలవుతున్న 16 రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉంది. సీసీటీఎన్‌ఎస్ విధానం అమలుపై కేంద్ర హోంశాఖ ప్రతి మూడునెలలకోసారి సమీక్ష జరిపి నివేదిక రూపొందిస్తోంది. నేరం ఎక్కడ జరిగినా, ఎంతపెద్ద నేరమైనా, ఆ నేరస్తుడు పాతవాడే అయినా ఆ విషయాన్ని తెలుసుకోవడం గతంలో కష్టంగా ఉండేది. ఇప్పుడలా కాకుండా ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ఆధారంగా నేరస్తులను పోల్చుకునే విధంగా వివిధ రకాల నేరస్తుల వివరాలు, ఫొటోలతో సహా డేటాబేస్ సిస్టంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇలాచేస్తే సీసీటీఎన్‌ఎస్ సిస్టం, ఊహాచిత్రాల ద్వారా నేరస్తుల కోసం వెతకకుండా నేరుగా డేటాబేస్‌లో పొందుపరచిన ఫొటోలలోనే గుర్తించి దేశంలో ఎక్కడున్నా పట్టుకునే అవకాశం ఏర్పడిందని ఒక పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. కొత్త నేరస్తుల వివరాలు కూడా వెంటవెంటనే పొందుపరిచే అవకాశం ఉందని, తొలిసారిగా నేరస్తుల వివరాలు వేలి ముద్రలతో పాటు ఫొటో కూడా ఉండే సమాచార నిధిని (డేటాబేస్) పొందుపరుస్తున్నామన్నారు. సీసీటీఎన్‌ఎస్ సిస్టం వినియోగం ఇంకా పూర్తి స్థాయిలో ఉంటే నేర పరిశోధన తీరుతెన్నులు మరింత మారిపోతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)- 2022 డేటా ప్రకారం

- దేశంలో మొత్తం కేసుల సంఖ్య : 58,24,946
- ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) కేసులు: 35,61,379
- స్పెషల్, లోకల్ లాస్ (ఎస్ఎల్ఎల్) కేసులు: 22,63,567
- క్రైం రేటు (ప్రతి లక్ష మంది జనాభాకు..): 422.2
- దేశవ్యాప్తంగా కిడ్నాప్ కేసులు : 1,07,588
- కిడ్నాపైన వారిలో మహిళలు : 88,861
- మహిళలపై జరిగిన అకృత్యాలపై నమోదైన కేసులు: 4,45,256
- చిన్నారులపై దౌర్జన్యం కేసులు : 1,62,449
- ఆర్థిక నేరాల కేసులు : 1,93,385
- నమోదైన సైబర్ నేరాలు : 65,893

బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్, డెవలప్‌మెంట్ - 2022 డేటా ప్రకారం

- దేశంలో పోలీసుస్టేషన్ల సంఖ్య: 17,535
- గ్రామీణ ప్రాంతాల్లో పీఎస్‌లు: 9,192
- పట్టణ ప్రాంతాల్లో పీఎస్‌లు: 5,057
- స్పెషల్ పర్పస్ పోలీసుస్టేషన్‌లు (అదనంగా) : 3,286

ఎంబీఎస్ జ్యువెల్లర్స్‌కు హైకోర్టులో ఊరట

బ్యాంకు షోకాజ్ నోటీసులను నిలిపివేస్తూ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ఎంబీఎస్ జ్యువెల్లర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ జారీ చేసిన షోకాజ్ నోటీసును తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదా వేసింది. ఎంబీఎస్ జ్యువెల్లర్స్ 2008లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ నుంచి నగదు క్రెడిట్ పరిమితులు సహా కొన్ని ఇతర సౌకర్యాలను పొందింది. 2013లో ఎంబీఎస్ జ్యువెల్లర్స్ రుణ ఖాతాను ఎన్‌పీఏగా పేర్కొనగా, రికవరీ ట్రిబ్యునల్ ముందు సమస్య పెండింగ్‌లో ఉంది. హఫీజ్‌పేటలో తనఖా పెట్టిన ఆస్తిపై వివాదం ఉందని, ఈ అంశం సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నందున ఎంబీఎస్ జ్యువెల్లర్స్ రుణ ఖాతాను మోసపూరితంగా ప్రకటించాలని బ్యాంక్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆస్తులకు సంబంధించి ఫిబ్రవరి 24న, ఏప్రిల్ 4న బ్యాంక్ షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ ఎంబీఎస్ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. షోకాజ్ నోటీసులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

కళ తప్పిన గాంధీగంజ్ !

- ఒకప్పుడు బెల్లం వ్యాపారంతో గుర్తింపు
- ఇక్కడి నుంచే పలు రాష్ట్రాలకు సరఫరా
- బెల్లంతో పాటే గంజ్ ఉనికి కోల్పోయింది



వెలవెలబోతున్న కామారెడ్డి గాంధీ గంజ్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఒకప్పుడు కామారెడ్డి గంజ్ (గాంధీ గంజ్) అంటే.. పేరున్న మార్కెట్. ఏటా రూ.వందల కోట్ల విలువైన బెల్లం వ్యాపారంతో ఘనకీర్తి సాధించింది. కామారెడ్డి పట్టణానికి చుట్టుపక్కల ఉన్న మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన రైతులు కూడా ఇదే మార్కెట్‌కు వచ్చేవారు. ఎడ్ల బండ్లపై బెల్లం ముద్దలు తీసుకొచ్చి ఇక్కడి వ్యాపారులకు విక్రయించేవారు. బెల్లం వ్యాపారంతో మార్కెట్‌కు మంచి ఆదాయం సమకూరేది. అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ బీఎస్ రామన్ ఆధ్వర్యంలో.. స్థానిక గంజ్ వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యావేత్తలు అందరూ కలిసి విద్యారంగ అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించారు. గంజ్‌లో జరిగే క్రయ విక్రయాలపై కొంత సెస్సును విద్యారంగం కోసం వసూలు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగానే అప్పట్లో 267 ఎకరాల మేర భూమిని సేకరించి.. అందులో భారీ భవనాన్ని నిర్మించారు. ఆ భవనమే ప్రస్తుత ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల. గంజ్ ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహించేవారు. ఇదంతా గతం. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం.. బెల్లంపై విధించిన ఆంక్షలతో బెల్లం వ్యాపారం దెబ్బతింది. నల్లబెల్లం అంటూ కేసులు పెట్టడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. బెల్లం కొనుగోళ్లు లేకుండా పోయాయి. రైతులు బెల్లం వండలేని పరిస్థితి ఏర్పడింది. తరువాత దివంగత సీఎం వైఎస్సార్ బెల్లంపై ఆంక్షలు ఎత్తివేసి రైతులకు అండగా నిలిచారు. ఆయన హయాంలో బెల్లం తయారీతో పాటు వ్యాపారం పుంజుకుంది. కానీ వైఎస్సార్ మరణంతో మళ్లీ బెల్లానికి కష్టాలొచ్చాయి. తరువాత బెల్లంపై ఆంక్షలు మరింత పెరిగి బెల్లం తయారీ లేకుండా పోయింది. దీంతో గంజ్ ఉనికి కోల్పోయింది.

ఉనికి కోల్పోయిన గంజ్

బెల్లంతో పాటు ఇతర పంటల కొనుగోళ్లు పెద్ద ఎత్తున జరిగేవి. ఏటా రూ.వందల కోట్ల వ్యాపారం నడిచేది. అప్పుడు గంజ్ కళకళలాడుతూ ఉండేది. బెల్లంపై ఆంక్షలతో గంజ్ వ్యాపారం దెబ్బతినిపోయింది. బెల్లం దందా నడిచిన అడ్తి దుకాణాల్లో ఇతర వ్యాపారాలు వచ్చాయి. గంజ్‌కు సంబంధించి బెల్లం కొనుగోళ్లు చేసిన షెడ్లు కూడా కనుమరుగయ్యాయి. మూడేళ్ల కిందట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసమంటూ షెడ్లను తొలగించడంతో గంజ్ రూపు కోల్పోయింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం కూడా పిల్లర్ల వద్దే నిలిచిపోయింది. గంజ్‌లో మిగిలిందల్లా మార్కెట్ కమిటీ కార్యాలయం, కొన్ని షెడ్లు మాత్రమే. దీంతో గంజ్ ఉనికి లేకుండా పోయిందనే చెప్పాలి. అప్పట్లో నిత్యం గంజ్‌కు వేలాది మంది రైతులు వచ్చేవారు. పంటల సీజన్‌లో అయితే ఎడ్ల బళ్లు వరుస కట్టేవి. పంట ఉత్పత్తులను తీసుకువచ్చి వ్యాపారుల వద్ద అమ్మేవారు.

వ్యాపారులు, రైతుల మధ్య మంచి అనుబంధం

బెల్లం దందా నడిచిన కాలంలో రైతులు, వ్యాపారులకు మధ్యన మంచి అనుబంధం ఉండేది. రైతులు పంట పెట్టుబడి కోసం వ్యాపారుల వద్దే అప్పు తీసుకునేవారు. పంట చేతికందిన తరువాత ఆ పంటను అదే వ్యాపారులకు అమ్మేసి, అప్పు పోను మిగతా డబ్బులు తీసుకునేవారు. రైతు ఇంట్లో పెళ్లిళ్లు ఉన్నా, ఇళ్లు కట్టుకున్నా సరే వ్యాపారులు అండగా నిలిచేవారు. వ్యాపారులు, రైతుల ఇళ్లలో పండుగలు, ఫంక్షన్లు, పెళ్లిళ్లకు ఒకరినొకరు ఆహ్వానించుకునేవారు. రైతులు, వ్యాపారుల మధ్య మంచి అనుబంధం ఉండేది. గంజ్ వ్యాపారాలు దెబ్బతిన్న తరువాత రైతులు రావడమే నిలిచిపోయింది. వ్యాపారులు కూడా ఇతర దందాల వైపు మళ్లారు.



గంజ్‌లోని దుకాణాలు



గంజ్ ముఖ ద్వారం



గంజ్ వెనుకద్వారం

'రక్షణ నిధి'కి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ విరాళం

సాక్షి, హైదరాబాద్: జాతీయ రక్షణ నిధికి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తన నెలజీతాన్ని విరాళంగా ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడిలో అమాయకులను వారి కుటుంబాల ముందే దారుణంగా హత్య చేసిన దృశ్యాలు చూస్తుంటే దేశం మొత్తం కన్నీటితో దిగ్భ్రాంతి చెందిందన్నారు. ప్రతి దాడితో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని నిరంజన్ పేర్కొన్నారు. దేశ ప్రజలంతా ఒక్కతాటిపైకి వచ్చి సైన్యానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాలి

బీజేపీ నేత పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: పహల్గాంలో అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను పాకిస్తాన్ అప్పగించాలని బీజేపీ నేత, తమిళనాడు, కర్ణాటక సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకరరెడ్డి డిమాండ్ చేశారు. భారత్‌పై దాడికి ప్రయత్నిస్తే ఆపరేషన్ సిందూర్ లాంటివే చూడాల్సి ఉంటుందని ఒక ప్రకటనలో హెచ్చరించారు. పాకిస్తాన్ ఇప్పటికైనా ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం నిలిపివేయాలని, దానిని కొనసాగిస్తే ఆ దేశానికే నష్టమని హితవు పలికారు. ఆపరేషన్ సిందూర్‌లో వీరోచిత పోరాటం చేసిన సైనికులకు వందనాలు తెలిపారు. ప్రధాని మోదీ ప్రదర్శించిన రాజనీతి, యుద్ధనీతిని 'పొంగులేటి' అభినందించారు.

కాల్పుల విరమణ శుభపరిణామం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: భారత్–పాకిస్తాన్ దేశాలు కాల్పులను విరమించడం శుభపరిణామమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నెల 12న జరగనున్న ఇరుదేశాల శాంతి చర్చలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాల్పుల విరమణ శాంతికి నాంది

సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: యుద్ధం దిశగా కాకుండా భారత్, పాకిస్తాన్ మధ్య తక్షణమే అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ప్రకటన రెండు దేశాల మధ్య శాంతికి నాంది అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు దేశాల ప్రజలు శాంతి కోసం చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ తన సరిహద్దులలో ఉగ్రవాద కార్యకలాపాలను అంతం చేయాలని, ఎలాంటి ఘర్షణలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం కోరుకుంటోందని తెలిపారు.

ఎండకు తాళలేక..

భానుడి ప్రతాపానికి వాహనదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండవేడి తాళలేక మధ్యాహ్న సమయంలో వాహనాలు నిలుపుకొని చెట్లనీడలో సేదదీరుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దూర ప్రయాణాలు సాగిస్తున్న లారీ డ్రైవర్లు.. పెద్దపల్లి శివారులో రాజీవ్ రహదారి వెంట చెట్లకింద లారీలు నిలుపుకొని సేదదీరుతూ 'సాక్షి'కెమెరాకు ఇలా కనిపించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



మధ్యాహ్నం వేళ కునుకు తీస్తున్న లారీ డ్రైవర్





చెట్ల కింద నిలిపిన లారీలు


చిరంజీవి · వెంకటేశ్ · నాగార్జున · మహేశ్ బాబు · ప్రభాస్ · పవన్ కల్యాణ్ · ఎన్టీఆర్ · రామ్‌చరణ్ · అల్లు అర్జున్

వేసవొచ్చింది... సెలవులు తెచ్చింది

- షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చిన స్టార్ హీరోలు
- విదేశాల్లో తెలుగు హీరోలు

వేసవి వచ్చిందంటే చాలు... స్కూల్స్, కాలేజీలు క్లోజ్ అవుతాయి. స్టూడెంట్స్‌కు సెలవులొచ్చేస్తాయి. అలాగే ప్రతి ఏడాది సినిమా స్కూల్స్‌కు కూడా వేసవి సెలవులు వస్తుంటాయి. ఈ సెలవుల్లో మెజారిటీ స్టార్ హీరోలు షూటింగ్ నుంచి బ్రేక్స్ తీసుకుంటుంటారు. అలా ఈ ఏడాది షూటింగ్స్‌కు బ్రేక్ ఇచ్చిన కొందరు తెలుగు హీరోలపై ఓ లుక్ వేయండి.

లండన్‌లో ల్యాండ్

నిన్న మొన్నటివరకు 'విశ్వంభర' సినిమాతో బిజీగా ఉన్న చిరంజీవి ఇటీవలే లండన్‌లో ల్యాండ్ అయ్యారు. ఆయన తనయుడు, హీరో- నిర్మాత రామ్‌చరణ్ మైనపు విగ్రహం లండన్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమం కోసం చిరంజీవి ఫ్యామిలీతో కలిసి లండన్ వెళ్లారు. ప్రస్తుతం అక్కడే ఉన్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో తాను హీరోగా నటించనున్న సినిమా చిత్రీకరణలో పాల్గొంటారు చిరంజీవి. ఈ నెల మూడో వారంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుందని తెలిసింది. ఈ మూవీలో నయనతార, కేథరీన్ హీరోయిన్లుగా నటించనున్నారనే ప్రచారం సాగుతోంది. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ సినిమాను నిర్మించనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాను రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు 'విశ్వంభర' సినిమాకు చిన్న పాటి ప్యాచ్ వర్క్, ఓ స్పెషల్ సాంగ్ బ్యాలెన్స్ ఉన్నాయట. వీలు చూసుకుని, 'విశ్వంభర' సినిమా షూటింగ్‌కు గుమ్మడి కాయ కొట్టే ఆలోచనలో ఉన్నారు చిరంజీవి. ఈ సినిమాకు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా, యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, విక్రమ్, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిషా, ఆషికా రంగనాథన్ హీరోయిన్లుగా నటిస్తారు. ఇక 'విశ్వంభర' సినిమా కొత్త విడుదల తేదీపై అతి త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

ఓవర్ టు ఓజీ

కొంతకాలంగా రాజకీయాలతో బిజీగా ఉంటూ, సినిమా షూటింగ్‌లకు దూరంగా ఉంటున్న పవన్ కల్యాణ్ ఇటీవలే 'హరిహర వీరమల్లు' సినిమా చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ సినిమా చివరి షెడ్యూల్ ఇది. దీంతో 'హరిహర వీరమల్లు' సినిమాలో పవన్ కల్యాణ్ వంతు షూటింగ్ పూర్తయింది. జాగర్లమూడి రాధాకృష్ణ, జ్యోతికృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఏయం రత్నం సమర్పణలో అద్దంకి దయాకర్ నిర్మించారు. అయితే ఈ సినిమాను తొలుత మే 30న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ... పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కాని నేపథ్యంలో రిలీజ్‌ను వాయిదా వేశారని, అతి త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీపై ఓ స్పష్టత రానుందని తెలిసింది. రెండు భాగాలుగా 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల కానుంది. తొలి భాగంగా 'హరిహర వీరమల్లు: స్పిరిట్ వర్సెస్ స్వార్డ్' విడుదలవుతుంది. ఇలా 'హరిహర వీరమల్లు' చిత్రీకరణ పూర్తి కావడంతో, ఇక పవన్ ఫోకస్ అంతా 'ఓజీ' సినిమాపైనే. అయితే 'హరిహర వీరమల్లు' సినిమా చిత్రీకరణను పూర్తి చేసిన పవన్ కల్యాణ్ షూటింగ్‌కు చిన్న విరామం ఇచ్చారు. అతి త్వరలోనే ఆయన 'ఓజీ' సినిమా చిత్రీకరణలో పాల్గొంటారు. సుజిత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదలయ్యే అవకాశం ఉంది.

ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాబీ డియోల్, నాజర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తారు.

ఫారిన్ వెకేషన్

ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో ఫ్యామిలీతో కలిసి ఫారిన్ ట్రిప్ వెళ్తుంటారు హీరో మహేశ్‌బాబు. అయితే ఈ ఏడాది రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు సినిమా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబుకు ఈ ఏడాది ఫారిన్ హాలిడే బ్రేక్ దొరక్కపోవచ్చని కొందరు అనుకున్నారు. కానీ మహేశ్‌బాబుకు ఆ అవకాశం లభించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా లాంగ్ షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసిన తర్వాత ఫారిన్ ఫ్లైట్ ఎక్కారు మహేశ్‌బాబు. ప్రస్తుతం ఆయన ఫ్యామిలీతో కలిసి యూఎస్‌లో ఉన్నారని సమాచారం. ఇంకా రెండు వారాలు మహేశ్‌బాబు అక్కడే ఉంటారట. వచ్చిన తర్వాత రాజమౌళి సినిమా షూటింగ్‌ను మళ్లీ షురూ చేస్తారు.

ప్రచారం సాగుతోంది.

ఇటలీలో...

'ది రాజా సాబ్, ఫౌజీ' సినిమాల చిత్రీకరణలతో కొన్ని రోజులు క్రితం బిజీ బిజీగా గడిపారు ప్రభాస్. దాంతో ఈ సినిమా చిత్రీకరణలకు బ్రేక్ ఇచ్చి, ఇటీవల ఫారిన్ వెళ్లారు ప్రభాస్. దాదాపు ఇరవై రోజుల నుంచి ప్రభాస్ ఇటలీలోనే ఉంటున్నారని తెలిసింది. అతి త్వరలోనే ప్రభాస్ ఇండియాకు తిరిగి రానున్నారు. వచ్చిన తర్వాత 'ది రాజా సాబ్, ఫౌజీ' సినిమాల చిత్రీకరణలను ప్రారంభిస్తారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ కామెడీ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. మరో నటి రిద్ధీ కుమార్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం రిలీజ్ డేట్‌పై త్వరలోనే ఓ స్పష్టత రానుంది. అలాగే హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ చేస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ 'ఫౌజి' (వర్కింగ్ టైటిల్). ఈ సినిమాలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్లు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 2026లో 'ఫౌజి' సినిమా విడుదల కానుంది.

లండన్‌లో...

లండన్ వెళ్లారు ఎన్టీఆర్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే హై ఓల్టేజ్ యాక్షన్ ఫిల్మ్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమా లాంగ్ షెడ్యూల్ చిత్రకరణ కర్ణాటకలో జరిగింది. ఎన్టీఆర్ పాల్గొనగా, యాక్షన్ సీక్వెన్స్‌లు, కొంత టాకీ పార్టును చిత్రీకరించారు ప్రశాంత్ నీల్. కాగా ఈ కర్ణాటక షూటింగ్ షెడ్యూల్ తర్వాత ఎన్టీఆర్ లండన్ వెళ్లారని తెలిసింది. లండన్‌లోని ప్రముఖ రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో 'ఆర్ఆర్ఆర్' సినిమా స్క్రీనింగ్ జరగనుందని తెలిసింది. అలాగే ఈ చిత్రం సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి లైవ్ కాన్సెర్ట్ కూడా ఉంది. ఈ కార్యక్రమం కోసం ఎన్టీఆర్ లండన్ వెళ్తున్నారని తెలిసింది. ఈ వేడుకలో 'ఆర్ఆర్ఆర్'లో హీరోలుగా నటించిన ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఈ చిత్రదర్శకుడు రాజమౌళిలతో పాటు 'ఆర్ఆర్ఆర్' యూనిట్‌లోని మరికొందరు పాల్గొంటారట. తిరిగొచ్చిన తర్వాత మళ్లీ 'డ్రాగన్' సినిమా చిత్రీకరణలో పాల్గొంటారు ఎన్టీఆర్. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'డ్రాగన్' సినిమాను 2026 జూన్ 25న రిలీజ్ చేయనున్నట్లుగా ఆల్రెడీ మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

విదేశాల్లో వెరీ బిజీ

'పెద్ది' సినిమా చిత్రీకరణకు బ్రేక్ ఇచ్చి, లండన్ వెళ్లారు రామ్‌చరణ్. లండన్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో తన మైనపు విగ్రహావిష్కరణ, 'ఆర్ఆర్ఆర్' వేడుకల్లో పాల్గొనేందుకు రామ్‌చరణ్ ఆల్రెడీ లండన్‌లోనే ఉన్నారు. ఈ రెండు కార్యక్రమాలతో ప్రస్తుతం రామ్‌చరణ్ బిజీగా ఉన్నారు. తిరిగి ఇండియాకు వచ్చిన తర్వాత 'పెద్ది' సినిమా చిత్రీకరణలో ఆరంభిస్తారు రామ్‌చరణ్. బుచ్చిబాబు దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్‌ల సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ 'పెద్ది' చిత్రం వచ్చే ఏడాది రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా మార్చి 27న రిలీజ్ కానుంది. ఈ మల్టీ స్పోర్ట్స్ డ్రామా మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, దివ్యేందు, శివ రాజ్‌కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

వీరితో పాటు మరికొందరు హీరోలు ఈ వేసవికి షూటింగ్ బ్రేక్స్ ఇచ్చారు.

కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రియాంకా చోప్రా, మలయాళ నటుడు పృథ్వీ రాజ్ సుకుమారన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 2027 వేసవిలో ఈ చిత్రం విడుదలవుతుందనే

- ముసిమి శివాంజనేయులు

వేసవి తర్వాతే...

ఈ వేసవికి కొందరు హీరోలు షూటింగ్స్‌కు బ్రేక్ ఇవ్వగా, ఈ వేసవి తర్వాతనే కొత్త సినిమా షూటింగ్‌లను ప్రారంభించాలని మరి కొందరు హీరోలు ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత వెంకటేశ్ నెక్ట్స్ సినిమాపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. వెంకటేశ్ కూడా చాలా కథలు వింటున్నారు. కాగా వెంకటేశ్ నెక్ట్స్ మూవీ దర్శకుడు త్రివిక్రమ్‌తో ఉంటుందని, హారిక అండ్ హాసినీ క్రియేషన్స్‌పై ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మించనున్నారని, వేసవి తర్వాత అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయట. ఇక మరో సీనియర్ హీరో నాగార్జున సోలో హీరోగా కొత్త సినిమాపై ఇంకా సరైన స్పష్టత రాలేదు. అయితే తమిళ దర్శకుడు ఆర్. కార్తీక్ చెప్పిన ఓ కథ నాగార్జునకు నచ్చిందని, త్వరలోనే ఈ మూవీ గురించిన అధికారిక ప్రకటన రానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. వేసవి తర్వాతనే ఈ సినిమా చిత్రీకరణను ఆరంభించాలని నాగార్జున భావిస్తున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరోవైపు అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ మూవీ రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. వేసవి తర్వాతే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలని అట్లీ అండ్ టీమ్ ప్లాన్ చేసిందట. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఇలా మరికొంతమంది తెలుగు హీరోలు ఈ వేసవి సెలవుల తర్వాత తమ కొత్త సినిమాల సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారని తెలిసింది.



మా జోలికి వస్తే వదిలిపెట్టం

- రణ్‌వీర్ సింగ్

'ఆపరేషన్ సిందూర్' పై హీరో రణ్‌వీర్ సింగ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఓ పోస్ట్ షేర్ చేశారు. ''ఎవరి పనులు వాళ్లు చేసుకునే వారిని మేం(భారతీయులు) ఇబ్బంది పెట్టం. ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని మా జోలికి వస్తే మాత్రం వదిలిపెట్టం. మన సాయుధ దళాల ధైర్యానికి సెల్యూట్. ఈ ఆపరేషన్‌లో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీగారికి ధన్యవాదాలు'' అంటూ రాసుకొచ్చారు.

ఉగ్రవాదులు భూమ్మీద ఉండకూడదు

- జాన్వీ కపూర్

''ఇన్ని రోజులు మనం యుద్ధం రాకూడదనే కోరుకున్నాం. కానీ, ఉగ్రవాదులు మన ప్రజలను చంపుతుంటే సహించేది లేదు. భారత్ ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వలేదు. ఇన్ని రోజులు మన మీద జరిగిన దాడుల తర్వాత ఆ బాధను తీర్చుకోవడానికే ఇప్పుడు మన ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. వారి దుశ్చర్యలను తిప్పి కొడుతున్నాం. మనది దూకుడు కాదు... దశాబ్దాల బాధకు సమాధానం. అసలు ఉగ్రవాదులు భూమ్మీద ఉండకూడదు'' అని హీరోయిన్ జాన్వీ కపూర్ పేర్కొన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు సినీ ప్రముఖులు ఇండియన్ ఆర్మీపై ప్రశంసలు కురుపిస్తూ, వారికి మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. జాన్వీ కపూర్ కూడా ఇప్పటికే పలు పోస్టులు పెట్టిన ప్పటికీ, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ''ఇండియా-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో జమ్మూపై దాడుల విజువల్స్ చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. పాకిస్తాన్ చేసిన డ్రోన్ దాడులు నన్ను ఎంతో బాధించాయి. ఇది నేను ఇప్పటివరకూ ఎప్పుడూ అనుభవించని బాధ. ఇన్ని రోజులు విదేశాల్లో ఇలాంటి దాడులు జరుగుతుంటే శాంతిని పాటించాలని కోరుకున్నాం. కానీ ఇప్పుడు అదే పరిస్థితి మనవరకు వచ్చింది. మన సైనికులు సరిహద్దు దగ్గర పోరాడుతూ మనల్ని కాపాడుతున్నారు. మన దేశ సార్వభౌమత్వాన్ని రక్షిస్తున్న సైనికులకు ఎప్పటికీ రుణపడి ఉండాలి. వాళ్ల వల్లే మనం సురక్షితంగా ఉంటున్నాం. ఇలాంటి సమయంలో దేశం మొత్తం మన భారతీయ జవానులకు మద్దతుగా నిలవాలి. ఈ యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం నన్ను బాధిస్తోంది. త్వరలోనే ఈ సమస్యకు శాశ్విత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాను. మన సైనికుల కోసం ప్రార్థిస్తుంటాను. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి పుకార్లను ఇతరులతో పంచుకోవద్దు'' అంటూ జాన్వీ కపూర్ పోస్ట్ చేశారు. ఆమె పోస్ట్‌పై పలువురు నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దేవగా ధనుష్


ధనుష్

ధనుష్, నాగార్జున హీరోలుగా నటించిన చిత్రం 'కుబేర'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించగా, బాలీవుడ్ నటుడు జిమ్ సర్బ్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌వీసీఎల్ఎల్‌పీ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాలో దేవ అనే పాత్రలో ధనుష్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, 'కుబేర' సినిమా కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ధనుష్ యాక్టర్‌గా కెరీర్‌ని మొదలు పెట్టి, శనివారం (మే 10)కి 23 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 'కుబేర' కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో 'కుబేర' చిత్రం జూన్ 20న విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.

ర్యాంప్ ఆరంభం


కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కె-ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తున్నారు. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్స్‌పై రాజేష్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓ పోస్టర్ రిలీజ్ చేసింది మూవీ టీమ్. ''కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 11వ చిత్రమిది. త్వరలో ఫస్ట్ లుక్‌ని విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమేరా: సతీష్ రెడ్డి మాసం, సంగీతం: చేతన్ భరద్వాజ్, కో ప్రొడ్యూసర్: బాలాజీ గుట్ట.

బిజినెస్ రీల్

పెరగనున్న మెర్సిడెస్ బెంజ్ కార్ల రేట్లు

రెండు దఫాలుగా 3 శాతం వరకు పెంపు



ఢిల్లీ: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఇండియా తమ కార్ల ధరలను ఈ ఏడాది రెండు దఫాల్లో మూడు శాతం వరకు పెంచనుంది. విదేశీ మారక ద్రవ్య విలువల్లో తీవ్ర హెచ్చుతగ్గుల ప్రభావాలను అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. దీని ప్రకారం వివిధ మోడల్స్‌ను బట్టి (సి 200 నుంచి మేబ్యాక్ ఎస్ 680 వరకు) జూన్ నుంచి రేట్లు రూ. 90,000 నుంచి రూ. 12.2 లక్షల వరకు పెరగనున్నాయి. తదుపరి సెప్టెంబర్ నుంచి 1.5 శాతం వరకు రేట్లు పెరుగుతాయి. గత నాలుగు నెలల్లో యూరోతో పోలిస్తే రూపాయి విలువ దాదాపు పది శాతం తగ్గిందని, ఫలితంగా వ్యయాలపరమైన ఒత్తిళ్లు పెరిగాయని అయ్యర్ పేర్కొన్నారు. దీంతో స్వల్ప భారాన్ని కొనుగోలుదారులకు బదలాయించక తప్పని పరిస్థితి ఏర్పడిందని వివరించారు.

టైటాన్ నుంచి కొత్త ఆటోమేటిక్స్ కలెక్షన్ వాచీలు



ముంబై: వాచీల తయారీ సంస్థ టైటాన్ సరికొత్త ఆటోమేటిక్స్ కలెక్షన్ శ్రేణిని ప్రవేశపెట్టింది. ఫీనిక్స్, నెక్సస్, గోల్డెన్ హార్ట్ తదితర వాచీల్లో ఆకర్షణీయమైన స్కెలిటల్ డయల్స్ ఉంటాయని సంస్థ తెలిపింది. అలాగే, డ్యుయల్ ఫినిష్ సాలిడ్ లింక్ స్ట్రాప్‌లు, 21 జ్యుయల్ బేరింగ్‌లు మొదలైన ప్రత్యేకతలతో వీటిని రూపొందించినట్లు టైటాన్ వాచెస్ మార్కెటింగ్ హెడ్ అపర్ణ రవి తెలిపారు. వీటి ధర శ్రేణి రూ. 18,325 నుంచి రూ. 22,150 వరకు ఉంటుంది.

ఎస్‌బీఐ జనరల్ ఫ్లెక్సీ హోమ్ ఇన్సూరెన్స్



ముంబై: ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కొత్తగా ఎస్‌బీఐ జనరల్ ఫ్లెక్సీ హోమ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. సొంతిల్లు లేదా అద్దె ఇంటికి సంబంధించి సమగ్రమైన బీమా రక్షణను ఈ ప్లాన్ అందిస్తుందని ఎస్‌బీఐ జనరల్ తెలిపింది. కస్టమర్లు తమ అవసరాలకు అనుకూలంగా దీన్ని తీసుకోవచ్చని పేర్కొంది. ఇంట్లోని విలువైన వస్తువులతోపాటు.. ప్రత్యామ్నాయ వసతి కోసం అయ్యే వ్యయాలు, ఇంట్లో చోరీల నుంచి రక్షణ ఇలా అన్ని రకాల రక్షణలు ఈ ప్లాన్‌లో అందుబాటులో ఉంటాయి. ఫైర్ కవర్ ఒక్కటి తప్పనిసరిగా ఉంటుంది. మిగిలినవి పాలసీదారులు తమ అవసరాలకు అనుగుణంగా ఎంపిక చేసుకోవచ్చు. ఒక్కసారి ప్రీమియంతో 20 ఏళ్లకు రక్షణ పొందొచ్చని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ వెల్లడించింది.

కెనరా బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేట్లు తగ్గింపు



ముంబై: ప్రభుత్వరంగ కెనరా బ్యాంక్ రుణ రేట్లను తగ్గించింది. ఏడాది కాలపరిమితికి మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్ఆర్) 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 9% చేసినట్లు బ్యాంకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీనితో వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేటు భారం తగ్గనుంది. ఇక, ఒకరోజు ఎంసీఎల్ఆర్ 8.20%, ఒక నెల, మూడు, ఆరు నెలల కాలవ్యవధి ఎంసీఎల్ఆర్ 8.25% - 8.80 శాతం శ్రేణిలో ఉండనున్నాయి. కొత్త రేట్లు మే 12 నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంకు తెలిపింది. ఆర్‌బీఐ గత నెల రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి ఆరుశాతానికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

బరోడా బీఎన్‌పీ పారిబా గిల్ట్ ఫండ్ రాబడి 4 రెట్లు



ముంబై: బరోడా బీఎన్‌పీ పారిబా గిల్ట్ ఫండ్ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రూ. 1,500 కోట్ల మైలురాయిని దాటింది. దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులపై ఇన్వెస్టర్లలో పెరుగుతున్న నమ్మకాన్ని ఇది సూచిస్తోందని బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ తెలిపింది. గిల్ట్ ఫండ్‌ను ప్రారంభించి 23 ఏళ్లయినట్లు పేర్కొంది. ప్రారంభం నుంచి చూస్తే ఇది నాలుగు రెట్లు రాబడులు అందించినట్లు వివరించింది. తొలినాళ్లలో చేసిన రూ. 10,000 పెట్టుబడి, 2025 మార్చి 31 నాటికి రూ. 41,919 అయ్యిందని సంస్థ పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-5-2025

విశాఖ	505-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

పిట్ట కొంచెం.. కూత ఘనం..

- పెద్ద సంస్థలను మించి చిన్న కంపెనీల పనితీరు
- ఐటీలో 32 శాతం వరకు ఆదాయ వృద్ధి
- బడా కంపెనీలు 4 శాతానికి పరిమితం



గత ఆర్థిక సంవత్సరంలో ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లోని పలు స్మాల్, మిడ్ క్యాప్ కంపెనీలు గణనీయంగా రాణించాయి. పెద్ద సంస్థలను మించిన పనితీరును కనపర్చాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసుల సంస్థలు అటు క్యూ4లోను ఇటు పూర్తి ఆర్థిక సంవత్సరంలోనూ అదరగొట్టాయి. కోఫోర్జ్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, హెక్సావేర్ టెక్నాలజీస్, ఎంఫసిస్ వంటి సంస్థలు 2025 ఆర్థిక సంవత్సరంలో 7 శాతం నుంచి 32 శాతం వరకు ఆదాయ వృద్ధి సాధించాయి. మరోవైపు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్‌టెక్‌లాంటి కంపెనీల ఆదాయ వృద్ధి మాత్రం సుమారు 4 శాతానికే పరిమితమైంది. పైపెచ్చు విప్రో ఆదాయం రెండు శాతం క్షీణించింది. జనవరి-మార్చి త్రైమాసికంలోను ఇదే తరహా ఫలితాలు కనిపించాయి. సీక్వెన్షియల్‌గా కోఫోర్జ్ ఆదాయం 4.7 శాతం పెరిగి రూ. 3,410 కోట్లకు, ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ ఆదాయం 12.4 శాతం వృద్ధితో రూ. 2,982 కోట్లకు చేరాయి. భారీ డీల్స్‌ను దక్కించుకున్నప్పటికీ పెద్ద కంపెనీలు మిశ్రమ ఫలితాలు కనపర్చాయి. ఇదే ధోరణి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

కొత్త టెక్నాలజీలు, నాయకత్వం దన్ను..

చిన్న కంపెనీలు మెరుగ్గా రాణించడానికి పలు కారణాలున్నాయని విశ్లేషకులు తెలిపారు. జెన్‌ఏఐలాంటి కొత్త టెక్నాలజీలను వేగవంతంగా అందిపుచ్చుకోవడం, ప్రాజెక్టులను సత్వరం ఎగ్జిక్యూట్ చేయగలగడం, స్థిరమైన నాయకత్వం మొదలైన అంశాలు ఇందుకు దోహదపడినట్లు పేర్కొన్నారు. జెన్‌ఏఐ లాంటి విప్లవాత్మకమైన టెక్నాలజీలనేవి, పరిస్థితులకు తగ్గట్లుగా వేగంగా తమను తాము మల్చుకోగలిగే చిన్న సంస్థలకు అవకాశంగా, ప్రస్తుతమున్న భారీ సంస్థలకు కొంత సవాలుగా మారొచ్చని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ (కేఐఈ) ఒక నివేదికలో తెలిపింది. వ్యయాలను తగ్గించే కొత్త టెక్నాలజీలను వెనువెంటనే అందించేలా తమ సరీ్వస్ పోర్ట్‌ఫోలియోలను పునర్‌వ్యవస్థీకరించుకోవడమనేది పెద్ద సంస్థలకు కాస్త సవాలుగా ఉంటుందని పేర్కొంది. వాటి భారీ పరిమాణమే ఇందుకు కారణమని వివరించింది. అదే మధ్య స్థాయి కంపెనీలు, దీర్ఘకాలికంగా వ్యూహాత్మక ప్రయోజనాలు పొందేందుకు స్వల్పకాలికంగా ఆదాయాన్ని పణంగా పెట్టేందుకు సాహసం చేయడానికి వీలుంటుందని వివరించింది. స్థిరమైన నాయకత్వం కూడా కంపెనీల పనితీరులో కీలక పాత్ర పోషిస్తోంది. చాలా మటుకు మధ్య స్థాయి కంపెనీల సీఈవోలు అయిదేళ్లకు పైగా కొనసాగుతుండటం వల్ల విజన్, ఎగ్జిక్యూషన్ నిలకడగా ఉంటోంది. పెద్ద కంపెనీల లీడర్‌షిప్‌లలో మాత్రం మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. 2023 జూన్‌లో టీసీఎస్ సీఈవోగా కె. కృతివాసన్ నియమితులు కాగా, 2023 డిసెంబర్‌లో టెక్ మహీంద్రాకు మోహిత్ జోషి, 2024 ఏప్రిల్‌లో విప్రోకు కొత్త సీఈవోగా శ్రీనివాస్ పల్లియా నియమితులయ్యారు.

ఈసారీ జోరు ..

గత ఆర్థిక సంవత్సరం తరహాలోనే ఈ ఆర్థిక సంవత్సరంలోనూ చిన్న, మధ్య స్థాయి సంస్థల జోరు కొనసాగవచ్చని అంచనాలు నెలకొన్నాయి. స్థిర కరెన్సీ ప్రాతిపదికన కోఫోర్జ్‌లాంటి కంపెనీల ఆదాయ వృద్ధి 16.4 శాతం స్థాయి నుంచి 20.8 శాతానికి పెరగొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఆర్డర్లు పెద్ద సంఖ్యలో లభిస్తుండటం, అలాగే డీల్స్ పరిమాణం కూడా భారీ స్థాయిలో ఉండటం ఇందుకు దోహదపడొచ్చని పేర్కొన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 1.56 బిలియన్ డాలర్ల మెగా డీల్ కుదుర్చుకున్న ఏకైక దేశీ కంపెనీగా కోఫోర్జ్ నిల్చిందని వివరించాయి. అమెరికాకు చెందిన సేబర్‌కు 13 ఏళ్ల పాటు సర్వీసులు అందించేందుకు ఈ కాంట్రాక్టు ఉపయోగపడనుంది. మరోవైపు, పెద్ద కంపెనీలే కాస్త అనిశ్చితి ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. డీల్స్ బాగానే ఉంటున్నా, అమెరికాలో టారిఫ్‌లపరమైన అనిశ్చితులు, డిస్క్రిషనరీ వ్యయాల విషయంలో క్లయింట్లు ఆచితూచి వ్యవహరిస్తుండటం వంటి అంశాలతో స్థూలఆర్థిక పరిస్థితులపై ఆందోళన నెలకొనడం ఇందుకు కారణం.

ఎఫ్ఎంసీజీలోనూ అదే తీరు..

నీల్సన్‌ఐక్యూ నివేదిక ప్రకారం వినియోగదారుల బడ్జెట్‌కి అనుగుణమైన ఉత్పత్తులను అందించడంలో పెద్ద బ్రాండ్లకు చిన్న బ్రాండ్లు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి. మార్చి త్రైమాసికంలో ఇవి 17.8 శాతం మేర వృద్ధి సాధించాయి. మిడ్ సైజ్ సంస్థలు 14.6 శాతం మేర పెరిగాయి. దాదాపు రూ. 5 లక్షల కోట్ల దేశీ ఎఫ్ఎంసీజీ మార్కెట్లో చిన్న, మధ్య స్థాయి సంస్థల వాటా సుమారు 35 శాతం ఉంటుంది. లోబేస్, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ కాస్త మెరుగుపడటం, ద్రవ్యోల్బణం నెమ్మదించడం తదితర అంశాలు వీటికి సానుకూలంగా నిల్చాయి. మరోవైపు, రూ. 5,000 కోట్లకు పైగా రెవెన్యూ ఉండే దిగ్గజాలు క్యూ4లో 6.4 శాతం మాత్రమే వృద్ధి కనపర్చాయి. బడా కంపెనీల ఉత్పత్తుల ధరలు 4.7 శాతం పెరగ్గా, అమ్మకాల పరిమాణం 1.7 శాతంగా నమోదైంది. అంతక్రితం క్యూ4లో ధరలు 0.3 శాతం తగ్గగా అమ్మకాల పరిమాణం ఏకంగా 8.1 శాతంగా నమోదైంది. నివేదిక ప్రకారం.. చిన్న ప్యాక్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం దన్నుతో జనవరి-మార్చి త్రైమాసికంలో ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) రంగం 11 శాతం వృద్ధి చెందింది.

ఐటీలో మళ్లీ నియామకాల జోరు

- ఏప్రిల్‌లో 16 శాతం అధికం
- ఫౌండిట్ నివేదిక వెల్లడి

ముంబై: కొంత కాలంగా స్తబ్దత కనిపించిన ఐటీ రంగంలో మళ్లీ నియామకాలు జోరందుకున్నాయి. ఏప్రిల్ నెలలో నియామకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 16 శాతం పెరిగినట్లు జాబ్స్ ప్లాట్‌ఫామ్ 'ఫౌండిట్' వెల్లడించింది. అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాల (జీసీసీలు) విస్తరణ నియామకాల వృద్ధికి దోహదం చేసినట్లు తెలిపింది. 2024-25లో జీసీసీలు కొత్తగా 1,10,000 టెక్ ఉద్యోగాలకు నియామకాలు చేసిన విషయాన్ని ప్రస్తావించింది.



డేటా ఇంజనీరింగ్, ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్ తదితర ఉద్యోగాలకు డిమాండ్ నెలకొన్నట్లు తెలిపింది. ఫౌండిట్ డాట్ ఇన్ సైట్‌పై నమోదైన జాబ్ పోస్టింగ్‌ల డేటా ఆధారంగా నెలవారీ ఈ నివేదికను ఫౌండిట్ విడుదల చేస్తుంటుంది. నైపుణ్యాలతో కూడిన ఉద్యోగ నియామకాల ఆధిపత్యం ఏప్రిల్‌లో స్పష్టంగా కనిపించింది. విద్యార్హతల కంటే కూడా ప్రత్యక్ష అనుభవానికి 62 శాతం ఐటీ కంపెనీలు ప్రాధాన్యమిస్తున్నాయి. ఏఐ/ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలైటిక్స్ విభాగాల్లో ఉద్యోగాలకు ఎక్కువ డిమాండ్ నెలకొంది. ఐటీ రంగం ఉద్యోగ ప్రకటనల్లో వీటి వాటాయే 95 శాతంగా ఉండడం గమనార్హం. ఏప్రిల్‌లో నియామకాల పరంగా కోయింబత్తూర్‌లో 40 శాతం, అహ్మదాబాద్‌లో 17 శాతం, బరోడాలో 15 శాతం చొప్పున వృద్ధి నమోదైంది. ఇక బెంగళూరులో 9 శాతం, ముంబైలో 9 శాతం, ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో 7 శాతం చొప్పున నియామకాలు పెరిగాయి.

మార్చి త్రైమాసిక ఫలితాలు

బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రికవరీల దన్ను

- క్యూ4లో లాభం 82 శాతం అప్
- రూ. 2,626 కోట్లు



ముంబై: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా నికర లాభం 82 శాతం ఎగిసి రూ. 2,626 కోట్లకు పెరిగింది. రైటాఫ్ చేసిన ఖాతాల నుంచి రికవరీలు, ట్రెజరీ లాభాలు ఇందుకు దోహదపడ్డాయి. ప్రధానమైన నికర వడ్డీ ఆదాయం 2 శాతం పెరిగి రూ. 6,063 కోట్లకు చేరగా, ఇతర ఆదాయం 96 శాతం ఎగిసి రూ. 3,428 కోట్లుగా నమోదైంది. రైటాఫ్ చేసిన ఖాతాల నుంచి రికవరీలు 195 శాతం పెరిగి రూ. 1,193 కోట్లకు, ట్రెజరీ లాభాలు 87 శాతం వృద్ధి చెంది రూ. 711 కోట్లకు చేరడమనేది ఇతర ఆదాయం పెరగడానికి దోహదపడింది. మరోవైపు నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.92 శాతం నుంచి 2.61 శాతానికి తగ్గింది. రుణాల వృద్ధి 13.74 శాతంగా ఉన్నప్పటికీ వడ్డీ ఆదాయం నెమ్మదించడానికి ఇది కారణంగా నిల్చింది. అటు సమీక్షాకాలంలో మొత్తం డిపాజిట్లు 10.65 శాతం పెరగ్గా, కాసా (కరెంటు అకౌంటు, సేవింగ్స్ అకౌంట్) వాటా 40.28 శాతానికి తగ్గింది. బ్యాంక్ క్యాపిటల్ అడెక్వసీ నిష్పత్తి 17.77 శాతంగా ఉంది.

12 శాతం రుణ వృద్ధి లక్ష్యం ..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12-13 శాతం రుణ వృద్ధి, 11-12 శాతం డిపాజిట్ల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ ఎండీ రజనీష్ కర్ణాటక్ తెలిపారు. ప్రస్తుతం బ్యాంక్ కార్పొరేట్ రుణాల పైప్‌లైన్ సుమారు రూ. 60,000 కోట్లుగా ఉన్నట్లు వివరించారు. రిజర్వ్ బ్యాంక్ పాలసీ రెపో రేట్లను మరింతగా తగ్గించే అవకాశాలు ఉన్నందున నికర వడ్డీ మార్జిన్లపై ఒత్తిడి కొనసాగవచ్చని రజనీష్ చెప్పారు.

హెచ్‌సీసీ లాభం రూ.90 కోట్లు

ఆదాయం రూ.1,392 కోట్లు

న్యూఢిల్లీ: హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (హెచ్‌సీసీ) మార్చి త్రైమాసికంలో పనితీరు పరంగా ఇన్వెస్టర్లను నిరాశపరించింది. కన్సాలిడేటెడ్ లాభం రూ.90 కోట్లకు తగ్గిపోయింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.245 కోట్లతో పోల్చితే 63 శాతం క్షీణించింది. మొత్తం ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.1,813 కోట్ల నుంచి రూ.1,392 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు రూ.1,077 కోట్ల నుంచి రెట్టింపై రూ.2,073 కోట్లకు చేరడం లాభం గణనీయంగా తగ్గడానికి దారితీసినట్టు తెలుస్తోంది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి కన్సాలిడేటెడ్ లాభం రూ.113 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.478 కోట్లుగా ఉండడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో జాయింట్ వెంచర్ భాగస్వాములతో కలసి రూ.5,693 కోట్ల విలువైన కాంట్రాక్టులను సొంతం చేసుకున్నట్టు కంపెనీ తెలిపింది. రూ.3,513 కోట్ల విలువ చేసే ప్రాజెక్టులకు కనిష్ట బిడ్డర్‌గా ఎంపికైనట్టు, వీటికి సంబంధించి కాంట్రాక్టులపై సంతకాలు చేయాల్సి ఉందని పేర్కొంది. మరో రూ.30,950 కోట్ల విలువ చేసే ప్రాజెక్టులకు బిడ్లు సమర్పించినట్టు తెలిపింది.



స్విగ్గీ నష్టాలు రెట్టింపు

క్యూ4లో రూ. 1,081 కోట్లు



న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నష్టం రెట్టింపై రూ. 1,081 కోట్లను తాకింది. క్విక్‌కామర్స్‌పై భారీ పెట్టుబడులు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 555 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 3,046 కోట్ల నుంచి రూ. 4,410 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు మరింత అధికంగా రూ. 3,668 కోట్ల నుంచి రూ. 5,610 కోట్లకు పెరిగాయి. ఫుడ్ డెలివరీ విభాగంలో స్థూల ఆర్డర్ విలువ 18 శాతం అధికమై రూ. 7,347 కోట్లకు చేరినట్లు స్విగ్గీ వెల్లడించింది. నిర్వహణ లాభం(ఇబిటా) ఐదు రెట్లు ఎగసి రూ. 212 కోట్లను తాకింది. స్విగ్గీ స్మార్ట్ సగటు ఆర్డర్ విలువ 13 శాతం మెరుగుపడి రూ. 527కు చేరగా.. 316 డార్క్ స్టోర్లను జత కలుపుకుంది.

సీజీ పవర్ లాభం ప్లస్

క్యూ4లో రూ. 274 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 17 శాతం ఎగసి రూ. 274 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 234 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 2,240 కోట్ల నుంచి రూ. 2,824 కోట్లకు మెరుగుపడింది. అయితే మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,428 కోట్ల నుంచి రూ. 973 కోట్లకు భారీగా క్షీణించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 8,152 కోట్ల నుంచి రూ. 10,071 కోట్లకు బలపడింది. ఈ కాలంలో ఆర్డర్లు 40% పెరిగి రూ. 14,684 కోట్లకు చేరాయి.

డీబీ కార్ప్ లాభం 57 శాతం డౌన్

క్యూ4లో రూ.52 కోట్లు

న్యూఢిల్లీ: మీడియా సంస్థ డీబీ కార్ప్ (దైనిక్ భాస్కరస్) కన్సాలిడేటెడ్ లాభం మార్చి త్రైమాసికంలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 57 శాతం క్షీణించి రూ.52 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.122 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం 11 శాతం క్షీణించి రూ.548 కోట్లుగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి డీబీ కార్ప్ రూ.371 కోట్ల లాభాన్ని ప్రకటించింది. 2023-24లో నమోదైన రూ.425 కోట్లతో పోల్చితే 13 శాతం క్షీణించింది. కన్సాలిడేటెడ్ ఆదాయం 2.45 శాతం తగ్గి రూ.2,421 కోట్లుగా ఉంది. దైనిక్ భాస్కర్, దివ్య భాష్కర్ తదితర పత్రికలతోపాటు ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఈ గ్రూప్ కింద నడుస్తున్నాయి.

వీసీ పెట్టుబడుల జోరు...

- 2024లో 9 శాతం అప్
- 43 బిలియన్ డాలర్లు; 1,600 డీల్స్
- నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: రెండేళ్ల పాటు నెమ్మదించిన ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ (పీఈ-వీసీ) పెట్టుబడులు గతేడాది మళ్లీ జోరందుకున్నాయి. 9 శాతం పెరిగి 43 బిలియన్ డాలర్లకు చేరాయి. సుమారు 1,600 డీల్స్ నమోదయ్యాయి. ఇండియన్ వెంచర్ అండ్ ఆల్టర్నేట్ క్యాపిటల్ అసోసియేషన్ (ఐవీసీఏ), బెయిన్ అండ్ కంపెనీ రూపొందించిన 'ఇండియా ప్రైవేట్ ఈక్విటీ రిపోర్ట్ 2025' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆసియా-పసిఫిక్‌లోకి వచ్చిన మొత్తం పీఈ-వీసీ పెట్టుబడుల్లో దాదాపు ఇరవై శాతం భారత్‌లోకి ప్రవహించాయని రిపోర్ట్ వివరించింది. తద్వారా ఈ ప్రాంతంలో పీఈ-వీసీ ఇన్వెస్ట్‌మెంట్లకు రెండో అతి పెద్ద గమ్యస్థానంగా భారత్ స్థానం మరింత పటిష్టమైందని తెలిపింది. దేశీయంగా స్థూల ఆర్థిక పరిస్థితుల స్థిరత్వంపై ఇన్వెస్టర్లలో నమ్మకం పెరుగుతుండటాన్ని ఇది సూచిస్తోందని పేర్కొంది.

నివేదికలోని మరిన్ని అంశాలు..

- ఇన్వెస్టర్లు పెట్టుబడుల ద్వారా స్వల్ప వాటాలతో సరిపెట్టుకోకుండా సంస్థలను పూర్తిగా కొనుగోలు చేసే ధోరణి పెరిగింది. 2022లో నమోదైన పీఈ డీల్స్ విలువలో సంస్థల కొనుగోళ్ల ఒప్పందాల వాటా 37 శాతంగా ఉండగా 2024లో 51 శాతానికి పెరిగింది. వివిధ రంగాలవ్యాప్తంగా అత్యంత నాణ్యమైన అసెట్స్‌లో నియంత్రణాధికారాలను చేజిక్కించుకోవడంపై ఇన్వెస్టర్లు మరింతగా దృష్టి పెడుతుండటాన్ని ఇది సూచిస్తోంది.
- గతేడాది వచ్చిన మొత్తం పీఈ-వీసీ పెట్టుబడుల్లో రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలు 16 శాతం వాటా దక్కించుకున్నాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే డీల్ విలువ 70 శాతం పెరిగింది.
- ఆర్థిక సేవల విభాగం 25 శాతం వృద్ధి చెందింది. 14 డీల్స్ నమోదయ్యాయి. వీటిలో 100 మిలియన్ డాలర్ల పైగా విలువ చేసే డీల్స్ ఏడు ఉన్నాయి. హెల్త్‌కేర్ విభాగంలోకి కూడా గణనీయంగా నిధులు వచ్చాయి. హెల్తియం వంటి భారీ మెడ్‌టెక్ లావాదేవీల దన్నుతో ఒప్పందాల పరిమాణం 80 శాతం పెరిగింది. ఫార్మా సీడీఎంవోల్లోకి పెట్టుబడులు పెరిగాయి.
- పెర్ఫిషియంట్ (3 బిలియన్ డాలర్లు), ఆల్టిమెట్రిక్ (900 మిలియన్ డాలర్లు), జీఈబీటీఎస్ (865 మిలియన్ డాలర్లు) లాంటి భారీ డీల్స్ ఊతంతో ఐటీ ఆధారిత సర్వీసులు, ఐటీ రంగం 300 శాతం మేర అసాధారణ వృద్ధి కనపర్చింది.
- ఇన్వెస్టర్లు పలు సంస్థల నుంచి నిష్క్రమించడంలోనూ ఆసియా-పసిఫిక్‌లోని ఇతర మార్కెట్లను భారత్ అధిగమించింది. ఇలాంటి డీల్స్ విలువ 33 బిలియన్ డాలర్లుగా నమోదైంది. మెరుగ్గా ఉన్న ఈక్విటీ మార్కెట్లలో తమ వాటాలను విక్రయించడం ద్వారా వైదొలగడం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపారు.
- దేశీయంగా నిధుల సమీకరణ 2024లో కొత్త గరిష్టాలకు చేరింది. కేదార క్యాపిటల్ 1.7 బిలియన్ డాలర్ల నిధులు, క్రిస్‌క్యాపిటల్ 2.1 బిలియన్ డాలర్లు సమీకరించాయి.
- పటిష్టమైన జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, ప్రైవేట్ వినియోగం పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ మెరుగుపడటం, పాలసీలపరంగా సానుకూల చర్యలు మొదలైన అంశాల తోడ్పాటుతో 2025పై అప్రమత్తతతో కూడుకున్న ఆశావహ అంచనాలు నెలకొన్నాయి.

ఆల్‌టైమ్ కనిష్టానికి ప్రమోటర్ల వాటాలు

టాప్ 500 కంపెనీల్లో 49.5 శాతానికి డౌన్



ముంబై: ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో దేశీయంగా టాప్ 500 కంపెనీల్లో ప్రమోటర్ల వాటా ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి అయిన 49.5 శాతానికి తగ్గింది. గత ఏడాది కాలంగా షేర్ల వేల్యుయేషన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి బాగుండటంతో పలువురు ప్రమోటర్లు తమ వాటాల్లో కొంత భాగాన్ని విక్రయించడం ఇందుకు కారణం. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు, టెలికం, ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల కంపెనీలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు మొదలైన విభాగాల్లో నాలుగో త్రైమాసికంలో ప్రమోటర్ల వాటాలు తగ్గాయి. డిసెంబర్ క్వార్టర్‌తో పోలిస్తే ప్రమోటర్ల షేర్‌హోల్డింగ్ 49.8 శాతం నుంచి 30 బేసిస్ పాయింట్లు తగ్గగా, వార్షికంగా చూస్తే 50.9 శాతం నుంచి 140 బేసిస్ పాయింట్లు తగ్గింది. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నివేదిక ప్రకారం ప్రైమరీ మార్కెట్లో సానుకూల పరిస్థితులు ఉండటంతో క్విప్‌లు (క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్), ఇతరత్రా మార్గాల్లో ప్రమోటర్లు తమ వాటాల్లో కొంత భాగాన్ని విక్రయించారు. గత రెండు దశాబ్దాల్లో దేశీ కంపెనీల్లో అత్యధిక వాటా ప్రమోటర్లదే కొనసాగుతూ వచ్చింది. ఆ తర్వాత స్థానాల్లో విదేశీ సంస్థలు, దేశీ సంస్థలు నిల్చాయి. కానీ కొన్నాళ్లుగా టాప్ 500 కంపెనీల్లో మొత్తం ఈక్విటీల్లో 50% పైగా కొనసాగిన ప్రమోటర్ల వాటా క్రమంగా తగ్గుముఖం పట్టింది.

డీఐఐలు అప్:

2015లో దేశీయ టాప్ కంపెనీల్లో ప్రమోటర్ల వాటా 52.1 శాతంగా ఉండగా, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు 22.8%, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లకు 10.8% వాటా ఉండేది. దశాబ్దం తిరిగే సరికి దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటాలు 19.2 శాతానికి ఎగియగా, ప్రమోటర్ల వాటాలు 49.5 శాతానికి, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల వాటా 18.8 శాతానికి తగ్గింది. గత అయిదేళ్లుగా దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీ ఐఐ) ఆధిపత్యం క్రమంగా పెరుగుతోంది. స్టాక్ మార్కెట్లపై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరిగి, ఈక్విటీ మ్యుచువల్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌లోకి అసాధారణ స్థాయిలో పెట్టుబడులు ప్రవహిస్తుండటం ఇందుకు దోహదపడుతోంది.

బ్యాటర్ల వైఫల్యం... బౌలర్ల నిస్సహాయత

చేజేతులా పరాజయాలను ఆహ్వానించిన సన్‌రైజర్స్ హైదరాబాద్

అంచనాలను అందుకోలేకపోయిన స్టార్ ప్లేయర్లు ● అడపాదడపా మెరుపులు తప్ప నిలకడలేమితో సతమతం

ఐపీఎల్‌లో గత ఏడాది రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్... ఈ సీజన్‌లో ఆడిన మొదటి మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్‌పై సునామీలా విరుచుకుపడింది. 20 ఓవర్లలో 286 పరుగులతో ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపుతూ... గత సీజన్ జోరును కొనసాగించింది. ఇప్పటికే హిట్టర్లతో బలంగా ఉన్న రైజర్స్‌కు ప్యాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ తోడవడంతో... ఆ దూకుడు మరింత పెరిగింది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్ అనికేత్ వర్మ ఇలా ఒకటి నుంచి ఏడో స్థానం వరకు అందరూ దంచే వాళ్లే ఉండటంతో... ఈ సీజన్‌లో ఆరెంజ్ ఆర్మీ కప్పు కొట్టడం ఖాయమనే అంచనాలు పెరిగిపోయాయి! అయితే వాటిని అందుకోవడంలో పూర్తిగా విఫలమైన సన్‌రైజర్స్ అంతకంతకూ నాసిరకమైన ఆటతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానం కోసం పోటీ పడటం ప్రారంభించింది. తొలి పోరు అనంతరం ఆడిన 7 మ్యాచ్‌ల్లో కేవలం ఒక్కదాంట్లోనే గెలిచి... ప్లే ఆఫ్స్ రేసుకు దూరమైంది. భారీ ఆశలు పెట్టుకున్న హిట్టర్లు ఘోరంగా విఫలమవగా... కెప్టెన్ కమిన్స్ సహా బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేక పోయారు. ఫలితంగా జట్టు పరిస్థితి మరింత దిగజారింది. ఇప్పటి వరకు ఐపీఎల్ ట్రోఫీ నెగ్గని జట్లు ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తుంటే... మాజీ చాంపియన్ రైజర్స్ మాత్రం తిరోగమనం బాటపట్టింది. ఈ సీజన్‌లో రైజర్స్ వైఫల్యానికి కారణాలు పరిశీలిస్తే...

–సాక్షి, క్రీడావిభాగం



'మా ఆటగాళ్లు మంచి టచ్‌లో ఉన్నారు. వాళ్లకు బౌలింగ్ చేయాలంటే నాకే భయంగా ఉంది. బంతి మీద ఏమాత్రం దయ లేకుండా విరుచుకుపడుతున్నారు. నెట్స్‌లో వాళ్లకు బంతులేయడం కూడా కష్టమే'... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ తొలి మ్యాచ్ ఆడిన అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) కెప్టెన్ కమిన్స్ అన్న మాటలివి. అప్పటికే '300 లోడింగ్' అనే మాట విస్తృత ప్రచారం కాగా... రైజర్స్ జోరు చూస్తే అదేమంత కష్టం కాదనిపించింది. క్రీజులోకి అడుగుపెట్టిన ప్రతి ఆటగాడు ధనాధన్ బాదుడే లక్ష్యంగా దూసుకెళ్తుంటే ఆరెంజ్ ఆర్మీ చరిత్ర సృష్టించడం ఖాయమనిపించింది. మార్చి 23న హైదరాబాద్ వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో ఆడిన తొలి మ్యాచ్‌లో రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. ముంబై నుంచి రైజర్స్ గూటికి చేరిన ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 106; 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) తొలి పోరులోనే సెంచరీతో ఆకట్టుకున్నాడు. హెడ్ హాఫ్ సెంచరీ బాదగా... టాప్-5 ఆటగాళ్లంతా 200 పైచిలుకు స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబట్టారు. ఛేదనలో రాయల్స్ పోరాడినా రైజర్స్ సునాయాసంగా గెలుపొందింది. దీంతో ఆరెంజ్ ఆర్మీ హాట్ ఫేవరెట్‌గా మారిపోయింది.

నిలకడ కొనసాగించలేక...

ఉప్పల్ వేదికగానే జరిగిన రెండో మ్యాచ్‌లో హైదరాబాద్‌కు ఓటమి ఎదురైంది. గత సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై రికార్డు విజయం సాధించిన రైజర్స్... ఈ సారి 190 పరుగులు చేసినా దాన్ని కాపాడుకోలేకపోయింది. అయినా ఒక్క ఓటమే కదా అని అభిమానులు పెద్దగా ఆలోచించలేదు. విశాఖపట్నం వేదికగా ఢిల్లీతో జరిగిన మూడో పోరులో మనవాళ్ల డొల్లతనం బయట పడింది. హిట్టర్లంతా విఫలమవడంతో ఒక దశలో 37 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. కొత్త కుర్రాడు అనికేత్ సిక్సర్లతో రెచ్చిపోవడంతో కాస్త పరువు నిలబెట్టుకున్నా... మ్యాచ్‌లో మాత్రం పరాజయం తప్పలేదు. ఇక కోల్‌కతాతో పోరులో అయితే 201 పరుగుల లక్ష్యఛేదనలో 16.4 ఓవర్లలో 120 పరుగులకే జట్టు ఆలౌటైంది. ఒక్కరంటే ఒక్కరూ కాస్త పోరాడే ప్రయత్నం చేయలేదు. ఈ పరంపర ఇలాగే కొనసాగుతూ గుజరాత్ చేతిలోనూ చెత్తగా ఓడింది. దీంతో పెంచుకున్న ఆశలన్నీ పేకమేడలా కూలిపోగా... వాస్తవ పరిస్థితి అభిమానులకు సైతం అర్థం అయింది.

అభిషేక్ సెంచరీతో ఊపు...

జట్టంతా నిరాశలో కూరుకుపోయిన దశలో అభిషేక్ శర్మ తిరిగి ఆరెంజ్ ఆర్మీలో జవసత్వాలు నింపాడు. ఇక ముందంజ వేయడం కష్టమే అనుకుంటున్న సమయంలో ఉప్పల్ వేదికగా పంజాబ్‌తో జరిగిన పోరులో అభి 'షేక్' ఆడించాడు. మొదట పంజాబ్ 245 పరుగులు చేయగా... భారీ లక్ష్యఛేదనలో హైదరాబాద్ అదరక బెదరక ఎదురు నిలిచింది. వరుస వైఫల్యాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్‌లో 55 బంతుల్లోనే 141 పరుగులతో ఉప్పల్ స్టేడియాన్ని హోరెత్తించాడు. సెంచరీ అనంతరం అతడు జేబులో నుంచి ఓ కాగితం తీసి చూపడం హైలైట్‌గా నిలిచింది. 'ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం' అనే ఆ అక్షరాలతో ఒక్కసారిగా జట్టులో నూతనోత్తేజం కనిపించింది. అభిషేక్‌తో పాటు హెడ్ కూడా ధడధడ లాడించడంతో సన్‌రైజర్స్ మరో 9 బంతులు మిగిలుండగానే కొండంత లక్ష్యాన్ని ఛేదించింది. సమస్యలన్నీ తీరినట్లే... తిరిగి విజయాల బాటపడతాం అని కెప్టెన్ విశ్వాసం వ్యక్తం చేయగా... ఇదే దూకుడు కొనసాగించాలని అభిమానులు ఆశించారు.

మళ్లీ అదే తీరు...

పంజాబ్‌పై గెలుపుతో వచ్చిన ఉత్సాహాన్ని రైజర్స్ కొనసాగించలేకపోయింది. తదుపరి ముంబైతో వరుసగా జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ రైజర్స్ పరాజయం పాలైంది. వాంఖడేలో ఓ మాదిరి పోరాటం అయినా కనబర్చిన కమిన్స్ సేన... ఉప్పల్‌లో అయితే అప్పనంగా మ్యాచ్‌ను ప్రత్యర్థి చేతుల్లో పెట్టింది. ఈ సీజన్‌లో చెత్త ప్రదర్శన చేస్తున్న చెన్నైపై గెలిచిన హైదరాబాద్... గుజరాత్ చేతిలో రెండో సారి కూడా ఓడింది. ఉప్పల్‌లో ఢిల్లీతో మ్యాచ్ వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దు కావడంతో రైజర్స్ ప్లే ఆఫ్స్ ఆశలు గల్లంతు కాగా... ఇక మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో ఆరెంజ్ ఆర్మీ ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. గతేడాది భారీ హిట్టింగ్‌తో అదరి దృష్టి ఆకర్శించిన రైజర్స్... వేలంలోనే అనేక తప్పులు చేసింది. సుదీర్ఘకాలంగా ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న భువనేశ్వర్ కుమార్ వంటి తెలివైన బౌలర్‌తో పాటు... యార్కర్ కింగ్ నటరాజన్‌ను వదిలేసుకున్న హైదరాబాద్ జట్టు... భారీ ధరపెట్టి టీమిండియా పేసర్లు మొహమ్మద్ షమీ, హర్షల్ పటేల్‌ను కొనుగోలు చేసుకుంది. వీరిద్దరూ ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడం జట్టుకు భారం కాగా... కమిన్స్, హెడ్, క్లాసెన్ కాకుండా... నాణ్యమైన నాలుగో విదేశీ ప్లేయర్ కూడా అందుబాటులో లేకపోవడం ఫలితాలపై పడింది.



పదే పదే అవే తప్పలు...

భారీ షాట్లు ఆడటమే తమ లక్ష్యం అన్నట్లు ఆడుతున్న సన్‌రైజర్స్ ప్లేయర్లు ప్రాథమిక సూత్రాలను సైతం మరుస్తున్నారు అనేది సుస్పష్టం. జట్టు పరిస్థితి స్కోరుబోర్డుపై గణాంకాలు చూసి షాట్ల ఎంపిక అనేది ఆటలో ప్రాథమిక నియమం. కానీ ఈ సీజన్‌లో రైజర్స్ ఓడిన మ్యాచ్‌లను పరిశీలిస్తే... వారు దీన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని అర్థం అవుతోంది. ఢిల్లీతో మ్యాచ్‌లో 20 పరుగులకే 2 ప్రధాన వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి రెండో బంతికే ఓ పేలవ షాట్ ఆడి వెనుదిరిగాడు. ఏమాత్రం ఆసక్తి లేనట్టు నేరుగా ఫీల్డర్ చేతుల్లోకి బంతిని అందించి పెవిలియన్ బాట పట్టాడు. ఈ ఒక్క మ్యాచ్ అనే కాదు... చాలా సార్లు ఇదే తరహా ఆటతీరు కనిపించింది. కోల్‌కతాతో పోరులో 9 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన సమయంలో కాస్త సంయమనం చూపిన మిడిలార్డర్... దాన్ని ఎక్కువసేపు కొనసాగించలేక పోయింది. ఈ కోవలో ఒకటా రెండో ఎన్నో ఉదాహరణలు. ప్రయత్నించి విఫలం కావడం ఒక తీరు అయితే... ప్రతీసారి ఒకే విధంగా విఫలం కావడం మరో తీరు. ఈ సీజన్‌లో రైజర్స్ రెండో దాన్నే కొనసాగించింది. పదే పదే చెత్త షాట్ సెలెక్షన్‌తో మూల్యం చెల్లించుకుంది. రైజర్స్ తరఫున అరంగేట్ర మ్యాచ్ తర్వాత ఇషాన్ కిషన్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోగా... గత సీజన్‌లో 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్'గా నిలిచిన తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి... ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సెంచరీ బాది చరిత్ర సృష్టించిన ఈ యువ ఆల్‌రౌండర్... ధాటిగా ఆడాలనే తపనలో బంతిని నేల మీద నుంచి కొట్టడమే మరిచినట్లు పదే పదే గాల్లోకి షాట్లు ఆడి ఔటయ్యాడు. దీంతో అతడికి తుది జట్టులో స్థానం కూడా గగనం కాగా... అభిషేక్ అప్పుడప్పుడు తప్ప నిలకడ లేని ఆటగాడు అనే ముద్ర వేసుకున్నాడు. హెడ్, క్లాసెన్ రాణించినా... వారు కూడా ప్రతీ మ్యాచ్‌లోనూ సత్తాచాటకపోవడంతో రైజర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఇక బౌలింగ్ వైఫల్యాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే ఈ సీజన్‌లో అత్యంత చెత్త బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన వారిలో రైజర్స్ బౌలర్లు ముందు వరుసలో నిలుస్తారు. షమీ, కమిన్స్, హర్షల్ పటేల్, ఉనాద్కట్, సిమర్‌జీత్ సింగ్ ఇలా ఒకరిని మించి ఒకరు పరుగులు ఇచ్చుకోవడంలో పోటీ పడ్డారు. దీంతో వికెట్లు పడగొట్టడం పక్కన పెడితే... కనీసం ప్రత్యర్థులపై ఒత్తిడి కూడా పెంచలేకపోయారు. కెప్టెన్ కమిన్స్ సైతం భారీగా పరుగులు ఇచ్చుకుంటుండగా... మిగిలిన జట్ల మాదిరిగా ఓ ప్రధాన స్పిన్నర్ లేకపోవడం రైజర్స్‌ను దెబ్బకొట్టింది. మరి ఇక ఈ సీజన్‌లో మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో అయినా రైజర్స్ ఈ తప్పిదాలను సరిదిద్దుకొని సమష్టిగా కదంతొక్కితే కాస్త పరువైనా నిలుస్తుంది. లేదంటే గత ఏడాది పట్టికలో పై నుంచి రెండో స్థానంలో నిలిచిన హైదరాబాద్... ఈసారి కింది నుంచి రెండో స్థానంలో నిలవాల్సి ఉంటుంది.

సెమీస్‌లో ఉన్నతి, ఆయుశ్ ఓటమి

న్యూఢిల్లీ: చైనీస్ తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు ఉన్నతి హుడా, ఆయుశ్ శెట్టికి నిరాశ తప్పలేదు. సింగిల్స్ విభాగాల్లో చక్కటి విజయాలతో సెమీఫైనల్‌కు చేరుకున్న ఈ రైజింగ్ స్టార్స్ టాప్ సీడ్‌ల చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 53వ ర్యాంకర్ 17 ఏళ్ల ఉన్నతి హుడా 19–21, 11–21తో టాప్ సీడ్ టొమోకా మియజకి (జపాన్) చేతిలో ఓడింది. 43 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌లో చక్కటి పోరాట పటిమ కనబర్చిన ఉన్నతి... రెండో గేమ్‌లో ప్రపంచ 8వ ర్యాంకర్ టొమోకాకు ఎదురు నిలవలేకపోయింది. తొలి గేమ్‌లో ఒక దశలో 7–3, 11–6తో లీడ్‌లో ఉన్న ఉన్నతి దాన్ని చివరి వరకు కొనసాగించలేకపోయింది. బ్రేక్ తర్వాత పుంజుకున్న జపాన్ షట్లర్ 12–10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇక రెండో గేమ్ ప్రారంభం నుంచే చక్కటి ఆటతీరు కనబర్చిన జపాన్ షట్లర్ 4–0, 8–2, 15–6 ఇలా... అంతకంతకూ ఆధిక్యం పెంచుకుంటూ వెళ్లి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 20 ఏళ్ల ఆయుశ్ 18–21, 17–21తో టాప్ సీడ్ చౌ టియెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు.

10 మంది రిటైర్డ్ అవుట్

మహిళల టి20 మ్యాచ్‌లో అరుదైన ఫీట్ ● ఖతార్‌పై యూఏఈ ఘనవిజయం

బ్యాంకాక్: మహిళల టి20 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో అరుదైన ఫీట్ నమోదైంది. బ్యాంకాక్ వేదికగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఖతార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో యూఏఈకి చెందిన 10 మంది ప్లేయర్లు రిటైర్డ్ అవుట్‌గా వెనుదిరిగారు. మహిళల, పురుషుల క్రికెట్‌లో కలిపి ఒక జట్టులో ఇద్దరికి మించి ఎక్కువ మంది ఆటగాళ్లు రిటైర్డ్ అవుట్ కావడం ఇదే తొలిసారి. మొదట బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 16 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్, కెప్టెన్ ఈషా ఓజా (55 బంతుల్లో 113; 14 ఫోర్లు, 5 సిక్స్‌లు), తీర్థ సతీశ్ (42 బంతుల్లో 74; 11 ఫోర్లు) దంచి కొట్టారు. ఈ ఇద్దరు తొలి వికెట్‌కు 16 ఓవర్లలోనే 192 పరుగులు జోడించారు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో డిక్లరేషన్ సౌలభ్యం లేకపోవడంతో... వీరిద్దరితో పాటు మిగిలిన ప్లేయర్లంతా రిటైర్డ్ అవుట్‌గా ప్రకటించుకొని ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించారు. లక్ష్యఛేదనకు దిగిన ఖతార్ 11.1 ఓవర్లలో 29 పరుగులకే ఆలౌటైంది.



ఫలితంగా యూఏఈ జట్టు 163 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఓపెనర్ రిజ్వా బానో ఇమ్మాన్యుయేల్ (20; 2 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. 8 మంది ప్లేయర్లు డకౌటయ్యారు. దీంతో ఇరు జట్లలో కలిపి 15 మంది ప్లేయర్లు డకౌటయ్యారు. మహిళల టి20 క్రికెట్‌లో ఇదే అత్యధికం. యూఏఈ బౌలర్లలో మిచెల్ బోథా 3, కేటీ థామ్సన్ 2 వికెట్లు పడగొట్టారు.



అనాహత్ శుభారంభం

చికాగో: భారత యువ స్క్వాష్ ప్లేయర్ అనాహత్ సింగ్ అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శనతో సత్తా చాటుతోంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 17 ఏళ్ల అనాహత్ శుభారంభం చేసింది. అమెరికా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ తొలి రౌండ్‌లో ప్రపంచ 62వ ర్యాంకర్ అనాహత్... 28వ ర్యాంకర్ మరీనా స్టెఫనోని (అమెరికా)పై విజయం సాధించింది. శనివారం మొదటి రౌండ్‌లో అనాహత్ 10–12, 11–9, 6–11, 11–6, 11–6తో స్టెఫనోనిపై గెలుపొందింది. తదుపరి రౌండ్‌లో అనాహత్‌కు మరింత కఠిన ప్రత్యర్థి ఎదురుకానుంది. రెండో రౌండ్‌లో ప్రపంచ 15వ ర్యాంకర్ ఫెరోజ్ అబోల్‌ఖైర్ (ఈజిప్ట్)తో అనాహత్ తలపడుతుంది. ఇక పురుషుల విభాగంలో అభయ్ సింగ్ బోణీ కొట్టాడు. తొలి రౌండ్‌లో 38వ ర్యాంకర్ అభయ్ సింగ్ 11–7, 2–11, 11–7, 11–6తో 25వ ర్యాంకర్ నికోలస్ ములెర్ (స్విట్జర్లాండ్)పై గెలిచాడు. రెండో రౌండ్‌లో 13వ ర్యాంకర్ యూసుఫ్ ఇబ్రహీం (ఈజిప్ట్)తో అభయ్ ఆడనున్నాడు.

భారత్ X శ్రీలంక

నేడు మహిళల ముక్కోణపు టోర్నీ ఫైనల్

● ఉదయం 10 గంటల నుంచి ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



కొలంబో: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటుతున్న భారత మహిళల క్రికెట్ జట్టు... ఆదివారం ముక్కోణపు వన్డే టోర్నమెంట్ ఫైనల్ బరిలోకి దిగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా... ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. భారత్, శ్రీలంకతో పాటు దక్షిణాఫ్రికా పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఆడిన 4 మ్యాచ్‌ల్లో మూడింట గెలిచిన భారత్... 6 పాయింట్లతో పట్టిక అగ్ర స్థానంలో నిలిచింది. 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 2 పరాజయాలతో 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి లంక ఫైనల్‌కు చేరింది. ఈ టోర్నీలో ఒకే ఒక్క మ్యాచ్‌లో శ్రీలంక చేతిలోనే భారత జట్టు ఓడింది. ఇరు జట్ల మధ్య ఫలితం తేలిన 33 మ్యాచ్‌ల్లో భారత్ 30 విజయాలు సాధించగా... లంక మూడు మ్యాచ్‌ల్లో మాత్రమే గెలిచింది. ఈ గణాంకాలే టీమిండియాను ఫేవరెట్‌గా నిలుపుతున్నాయి. ఈ టోర్నీలో భారత జట్టు అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్‌లో సత్తా చాటుతుంటే... శ్రీలంక జట్టు నిలకడలేమితో సతమతమవుతోంది. ఈ ఏడాది ఆఖర్లో స్వదేశంలో జరగనున్న వన్డే ప్రపంచకప్‌నకు ముందు ఈ టోర్నీని సన్నాహకంగా భావించిన టీమిండియా చక్కటి ప్రదర్శన కనబర్చింది. చివరి పోరులోనూ అదే కొనసాగిస్తూ ట్రోఫీ కైవసం చేసుకోవాలని హర్మన్‌ప్రీత్ బృందం భావిస్తోంది.

సమష్టిగా సత్తా చాటాలని...

టోర్నీలో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్న జెమీమా రోడ్రిగ్స్ 67 సగటుతో 201 పరుగులు చేసింది. అందులో దక్షిణాఫ్రికాపై చేసిన సెంచరీ కూడా ఉంది. ఓపెనర్లు ప్రతీక రావల్ 164, స్మృతి మంధాన 148 పరుగులు చేయగా... ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 126 పరుగులు సాధించింది. సఫారీలతో మ్యాచ్‌లో దీప్తి 93 పరుగులతో సత్తాచాటడంతోనే టీమిండియా సునాయాసంగా విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ భారీ ఇన్నింగ్స్‌లు ఆడకున్నా... 41 నాటౌట్, 30, 28 పరుగులతో ఫర్వాలేదనిపించింది. తుది పోరులో హర్మన్ తన బ్యాట్‌కు పనిచెప్తే భారీ స్కోరు ఖయామే. హర్లీన్ డియోల్, రిచాఘోష్ కూడా మంచి టచ్‌లో ఉండటం టీమిండియాకు కలిసిరానుంది. ఇక బౌలింగ్‌లో స్పిన్నర్ స్నేహ్ రాణా 11 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టిపడేసింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో స్నేహ్ 5 వికెట్ల ప్రదర్శన చేసింది. ఆమెకు దీప్తి శర్మ, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీ చరణి చక్కటి సహకారం అందిస్తున్నారు. ఈ ముగ్గురు స్పిన్నర్లను ఎదుర్కొని పరుగులు సాధించడం లంక జట్టుకు శక్తికి మించిన పనే. ఆతిథ్య జట్టు కెప్టెన్ చమరి ఆటపట్టుపై అతిగా ఆధారపడుతోంది. ఆమెతో పాటు హర్షిత సమరవిక్రమ రాణిస్తే భారత్‌కు పోటీ ఎదురవొచ్చు. మూడు, అంతకంటే ఎక్కువ దేశాలు పాల్గొంటున్న టోర్నీలో శ్రీలంక జట్టు ఫైనల్‌కు చేరడం 2009 తర్వాత ఇదే తొలిసారి.

తుది జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), ప్రతీక రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్, అమన్‌జ్యోత్ కౌర్, శ్రీ చరణి, స్నేహ్ రాణా, శుచి ఉపాధ్యాయ్.

శ్రీలంక: చమరి ఆటపట్టు (కెప్టెన్), హాసిని, విష్మి, హర్షిత, నిలాక్షిక, మానుడి, అనుష్క, దేవ్మి, సుగంధిక, మల్కి, ప్రియదర్శిని.

సాక్షి ప్లస్
ఆదివారం । 11-5-2025

కాల్పుల విరమణ పాటిద్దాం

- రష్యాకు ఉక్రెయిన్, మిత్ర దేశాల పిలుపు
- కీవ్‌లో ఫ్రాన్స్, జర్మనీ, పోలెండ్, యూకే నేతలు

కీవ్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు తేవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో యూరప్ ప్రధాన దేశాల నేతలు రంగంలోకి దిగారు. ఫ్రాన్స్, జర్మనీ, పోలెండ్, యూకే దేశాల నేతలు శనివారం కీవ్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రష్యా ప్రకటించిన మూడు రోజుల కాల్పుల విరమణ శనివారంతో ముగియనుండటం గమనార్హం. ఈ సందర్భంగా నేతలు కీవ్‌లోని ప్రధాన ఇండిపెండెన్స్ స్క్వేర్‌లో జరిగిన 80వ విక్టరీ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన పౌరులకు, నేలకొరిగిన సైనికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను రష్యా ముందుంచారు. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలికేలా చర్చలకు ముందుకు రావాలని అధ్యక్షుడు పుతిన్‌కు పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిలుపునిచ్చిన శాంతి ఒప్పందానికి మద్దతు ప్రకటించారు. సోమవారం మొదలుకొని నెల రోజులపాటు అమలయ్యే పూర్తిస్థాయి, బేషరతు కాల్పుల విరమణకు అంగీకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోపాటు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్, జర్మనీ ఫ్రెడరిక్ మెర్జ్, పోలెండ్ ప్రధాని టస్క్, యూకే ప్రధాని కెయిర్ స్టార్మర్ పాల్గొన్నారు. కాగా, నాలుగు దేశాల నేతలు కలిసి ఉక్రెయిన్ రావడం ఇదే మొదటిసారి. వీరిలో జర్మనీ ఛాన్స్‌లర్ మెర్జ్‌కు ఇదే మొట్టమొదటి ఉక్రెయిన్ పర్యటన. ఈ సందర్భంగా జెలెన్‌స్కీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో చర్చలు జరిపినట్లు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహా వెల్లడించారు. ఇలా ఉండగా, సుమారు 1,600 కిలోమీటర్ల పొడవైన ఫ్రంట్ లైన్‌లో రష్యా ఆర్మీ శనివారం కూడా పలు చోట్ల దాడులు కొనసాగించింది. ఉక్రెయిన్‌లోని సుమీ ప్రాంతంపై శుక్రవారం జరిగిన దాడిలో ముగ్గురు పౌరులు మరణించగా నలుగురు గాయపడ్డారు.



శనివారం కీవ్‌లో అధ్యక్ష భవనం వద్ద బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, జర్మనీ ఛాన్స్‌లర్ మెర్జ్, పోలెండ్ ప్రధాని టస్క్

భూమి దిశగా దూసుకొస్తున్న 'కాస్మోస్'

సోవియట్ హయాంలో ప్రయోగించిన అంతరిక్ష నౌక

కేప్ కనవెరాల్(యూఎస్ఏ): సోవియట్ కాలం నాటి అంతరిక్ష నౌక కాస్మోస్ భూమిపైకి దూసుకొస్తోంది. శుక్ర గ్రహంపైకి ప్రయోగించిన 'కాస్మోస్ 482'విఫలమైంది. అర్ధ శతాబ్దానికి పైగా వివిధ కక్ష్యల్లో తిరుగుతున్న ఈ అంతరిక్ష నౌక తదుపరి కక్ష్యల్లో కనిపించడం లేదని జర్మనీ రాడార్ స్టేషన్ ఇటీవల గుర్తించినట్లు యూరోపియన్ యూనియన్ స్పేస్ సర్వైలెన్స్ అండ్ ట్రాకింగ్ విభాగం తెలిపింది. ఈ అనియంత్రిత కాస్మోస్ భూమిపైకి తిరిగి మళ్లిందని ఈ సంస్థ తాజాగా ధ్రువీకరించింది. 1972లో సోవియట్ యూనియన్ శుక్రగ్రహంపై చేపట్టిన మిషన్‌లలో 'కాస్మోస్ 482'ప్రయోగం ఒకటి. రాకెట్ విఫలం కావడంతో సుమారు 500 కిలోల బరువున్న ఈ అంతరిక్ష నౌక భూ కక్ష్యలోనే ఉండిపోయింది. అనంతరం సుమారు దశాబ్దం కాలంపాటు కాస్మోస్ విడి భాగాల్లో చాలా వరకు విడిపోయి, భూమిపై పడ్డాయి. అయితే, సౌర కుటుంబంలోని అత్యంత వేడిగా ఉండే శుక్ర గ్రహం లక్ష్యంగా ప్రయోగించిన కాస్మోస్‌కు టిటానియం రేకు రక్షణగా ఉండటంతో చెక్కుచెదరలేదని నిపుణులు అంటున్నారు. సుదీర్ఘకాలం అంతరిక్షంలో ఉన్న కాస్మోస్ కచ్చితంగా ఎక్కడ, ఎప్పుడు భూమిపై పడుతుందో ఇప్పుడే చెప్పడం కష్టమని సైంటిస్టులు, సైనిక నిపుణులు చెబుతున్నారు.

నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ: జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ(నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి కేంద్ర లా అండ్ జస్టిస్ శాఖ ఈ నెల 9న నోటిఫికేషన్ విడుదల చేసింది. నియామకం 14వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. జస్టిస్ సూర్య కాంత్ ప్రస్తుతం సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. సుప్రీంకోర్టులో రెండో అత్యంత సీనియర్ న్యాయమూర్తి నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవిని చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటి వరకు జస్టిస్ బీఆర్ గవాయ్ ఈ పదవిలో కొనసాగారు. ఈ నెల 14న ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనుండటం తెల్సిందే.

ఆలస్యమైనా కాల్పుల విరమణ మంచిదే: ఒమర్

శ్రీనగర్: భారత్, పాకిస్తాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా హృదయ పూర్వకంగా స్వాగతించారు. కాల్పుల విరమణ రెండు మూడు రోజుల ముందే వచ్చి ఉంటే, మనం రక్తపాతం చూడాల్సిన అవసరముండేది కాదు. కోల్పోయిన విలువైన జీవితాలు సురక్షితంగా ఉండేవని ఆయన అన్నారు. కాస్తంత ఆలస్యమైనా మంచి పరిణామమేనని పేర్కొన్నారు. తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. వివిధ ఘటనల్లో గాయపడిన వారికీ సాయమందిస్తామని ప్రకటించారు. హజ్ విమానాల రాకపోకలకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. కాగా, భారత్, పాక్ ప్రకటించిన కాల్పుల విరమణను నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా స్వాగతించారు. సీమాంతర ఉగ్రవాదంతో భారత్ కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి తిరిగి పొందేందుకు పాకిస్తాన్ చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ఆయన వ్యాఖ్యానించారు. కశ్మీర్ ప్రతిపక్షం పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ కూడా కాల్పుల విరమణను స్వాగతించారు. ఇరు దేశాలు తమ విభేదాలను పరిష్కరించుకుని, శాశ్వత శాంతిని నెలకొల్పాలని కోరారు.

సానుకూలమైన ముందడుగు: గుటెరస్

ఐక్యరాజ్యసమితి: భారత్, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ స్వాగతించారు. ఉద్రిక్తతలు చల్లారేందుకు, శత్రుత్వానికి ముగింపు పలికేందుకు ఇది సానుకూలమైన అడుగని ఆయన అభివర్ణించారు. 'ఈ ఒప్పందం శాశ్వత శాంతికి దోహదపడుతుంది. రెండు దేశాల మధ్య విస్తృతమైన, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అనుకూలమైన వాతావరణాన్ని నెలకొల్పుతుందని ఆశిస్తున్నా'అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను పెంపొందించే లక్ష్యంతో జరిగే ప్రయత్నాలకు మద్దతిచ్చేందుకు ఐక్యరాజ్యసమితి సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు.

వేర్పాటువాదుల దాడిలో 30 మంది మృతి

అబుజా: నైజీరియాలోని ఇమో రాష్ట్రంలో వేర్పాటువాదుల దాడిలో కనీసం 30 మంది చనిపోయారు. ఈస్టర్న్ సెక్యూరిటీ నెట్‌వర్క్ అనే బియాఫ్రా తెగకు చెందిన సాయుధులు గురువారం ఒకిగ్వే-ఒవెర్రి జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను అడ్డుకున్నారు. సుమారు 20 వాహనాలకు నిప్పుపెట్టిన వేర్పాటు వాదులు 30 మంది ప్రయాణికులను కాల్చి చంపారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. అనంతరం ఒక సాయుధుడిని కాల్చి చంపామనీ, మిగతా వారి కోసం గాలింపు చేపట్టామని పోలీసులు తెలిపారు. ఆఫ్రికాలో అత్యధికంగా 21 కోట్ల మంది జనాభా కలిగిన నైజీరియా సాయుధ అతివాద ముఠాల హింసాత్మక చర్యలతో అట్టుడుకుతోంది.

జైలుపై డ్రోన్ దాడి.. 20 మంది మృతి

కైరో: సూడాన్‌లోని ఉత్తర కొర్డొఫాన్ ప్రాంత ఒబైడ్ ప్రధాన జైలుపై శనివారం రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్(ఆర్ఎస్ఎఫ్) చేపట్టిన డ్రోన్ దాడిలో 20 మంది ఖైదీలు చనిపోయారు. మరో 50 మంది వరకు గాయపడ్డారు. రెండేళ్లుగా కొనసాగుతున్న అంతర్యుద్ధంలో ఇదే అతిపెద్ద దాడి అని అధికారులు అంటున్నారు. ఘటనపై ఆర్ఎస్ఎఫ్ స్పందించలేదు. దేశంలోని మిలటరీ, ఆర్ఎస్ఎఫ్ మధ్య విభేదాల ఫలితంగా 2023 ఏప్రిల్ నుంచి అంతర్యుద్ధం కొనసాగుతోంది. అప్పటి నుంచి జరుగుతున్న ఘర్షణల్లో కనీసం 24 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెబుతున్నారు. వాస్తవ సంఖ్య ఇంతకుమించి ఉండొచ్చని అంచనాలున్నాయి. యుద్ధం కారణంగా 1.30 కోట్ల మంది ఇళ్లు వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. వీరిలో 40 లక్షల మంది వరకు పొరుగు దేశాల్లో ఆశ్రయం పొందుతున్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 23 మంది మృత్యువాత

డెయిర్ అల్-బలాహ్: గాజాను మూడు నెలలుగా దిగ్బంధించి, పాలస్తీనియన్లకు కనీస ఆహారం, నీళ్లు సైతం అందకుండా చేయడంపై అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నా ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు. పైపెచ్చు హమాస్ సాయుధ శ్రేణులే లక్ష్యమని చెబుతూ అమాయకులను బలి తీసుకుంటోంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు 24 గంటల వ్యవధిలో జరిపిన దాడుల్లో గాజా సిటీలో దంపతులు, వారి ముగ్గురు పిల్లలు సహా 23 మంది ప్రాణాలు కోల్పోయారు.జబాలియాలోని ఐరాస శరణార్థి విభాగానికి చెందిన గోదాముపై జరిగిన మరో దాడిలో నలుగురు చనిపోయారని ఇండోనేసియన్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ సైన్యం పలుమార్లు చేసిన దాడుల్లో ఈ భవనం ఇప్పటికే ధ్వంసమైందని స్థానికులు తెలిపారు. తుఫ్ఫాహ్ ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో ఆరుగురు, షేక్ రద్వాన్ వద్ద జరిగిన ఘటనలో ఒకరు చనిపోయారు. కాగా, గాజా సిటీ శివారులోని షిజైయాహ్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి మందుపాతర పేలిన ఘటనలో 9 మంది ఇజ్రాయెల్ సైనికులు గాయపడ్డారు. వీరంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు.

హసీనా పార్టీని నిషేధించిన బంగ్లాదేశ్

ఢాకా/న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో ముహమ్మద్ యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం మాజీ మహిళా ప్రధానమంత్రి షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీని నిషేధించింది. ఉగ్రవ్యతిరేక చట్టం నిబంధనల ప్రకారం అవామీ లీగ్‌ను నిషేధించినట్లు శనివారం సాయంత్రం అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. సలహాదారుల మండలి(కేబినెట్) నిర్ణయం మేరకే నిషేధం విధించామని, నిషేధానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను త్వరలోనే ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. అవామీ లీగ్, ఆ పార్టీ అగ్ర నేతలపై అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న కేసుల విచారణ ముగిసేదాకా ఈ రాజకీయ పార్టీపై నిషేధం అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టంచేసింది. షేక్‌హసీనా సారథ్యంలోని ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు 2024 జూలైలో ఉద్యమించిన విద్యార్థి సంఘాలు, నేతలు, సాక్షుల భద్రత, పరిరక్షణ కోసం అవామీ పార్టీపై నిషేధాజ్ఞలు అమలుచేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 1949లో అవామీ లీగ్ పార్టీ ఏర్పడింది. తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీలకు స్వయంప్రతిపత్తి హక్కులు దఖలుపడాలన్న లక్ష్యంతో అప్పట్లో అవామీ లీగ్ ఉద్యమం చేసింది.

పాక్ ఫేక్ ప్రచార సారథి... ఓ ఉగ్రవాది కొడుకు

లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధురి. భారత్‌పై పాకిస్తాన్ సాగిస్తున్న గోబెల్స్ ప్రచారానికి సారథి. పాక్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డైరెక్టర్ జనరల్. పహల్గాం ఉగ్ర దాడి నుంచీ భారత్‌పై పథకం ప్రచారం దాయాది తలపెట్టిన తప్పుడు ప్రచారానికి కర్త, కర్మ, క్రియ అన్నీ చౌధురే. అతను ఓ ఉగ్రవాది కుమారుడు కావడం విశేషం. ఉగ్రవాదంతో విడదీయలేని రీతిలో పెనవేసుకుపోయిన పాకిస్తాన్ బంధానికి నిలువెత్తు నిదర్శనం.

లెఫ్టినెంట్ జనరల్ షరీఫ్ చీకటి వారసత్వం
- ఆర్మీ చీఫ్ మునీర్ స్వయానా ఓ జిహాదీ
- పాక్ 'ఉగ్ర'బంధానికి నిలువెత్తు నిదర్శనాలు



దారితప్పిన సైంటిస్టు

చౌధురి తండ్రి సుల్తాన్ బషీరుద్దీన్ మెహమూద్. అవడానికి అణు శాస్త్రవేత్త. పాక్ అణ్వాయుధ పిత అబ్దుల్ ఖదీర్‌ఖాన్‌తో కలిసి అణుబాంబు తయారీలో కీలక పాత్ర పోషించాడు. యురేనియం శుద్ధి తదితరాల్లో చురుగ్గా వ్యవహరించాడు. అందుకోసం గ్యాస్ సెంట్రిఫ్యూజ్ టెక్నాలజీని నెదర్లాండ్స్ నుంచి తస్కరించాడు. కానీ నిజానికి అతనో కరడుగట్టిన మతోన్మాది. అంతకుమించి పేరుమోసిన ఉగ్రవాది. నరనరానా భారత విద్వేషాన్ని నింపుకున్న వ్యక్తి. ఐరాస భద్రతా మండలి ప్రకటిత అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో ఉన్నాడు. పాక్ అణ్వాయుధ పరిజ్ఞానాన్ని దాదాపుగా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్‌కాయిదా చేతిలో పెట్టిన ధూర్తుడు. అప్పటి అల్‌కాయిదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌కు అత్యంత సన్నిహితుడు. బషీర్ చేసిన ఈ నిర్వాకం అప్పట్లో పాశ్చాత్య దేశాలకు పెద్ద సంకటంగా మారింది. అలాంటి వ్యక్తి కొడుకైన చౌధురి భారత్‌తో సైనిక సంఘర్షణ గురించి పాక్ తరఫున నాలుగు రోజులుగా అధికారికంగా బయటి ప్రపంచానికి చెబుతున్నాడు! ఓ అంతర్జాతీయ ఉగ్రవాది కొడుకే పాక్‌కు అంతర్జాతీయ గొంతుకగా మారాడు. 'మాది ఉగ్రవాద బాధిత దేశం'అంటూ మొసలి కన్నీరు కారుస్తున్నాడు. అంతేగాక అధికారికంగానూ, ఆన్‌లైన్‌లోనూ భారత్‌పై ఇబ్బడిముబ్బడిగా ఫేక్ న్యూస్ ప్రచారం వ్యాప్తి చేస్తున్నాడు. చౌధురి తీరును పాక్ ప్రజలు కూడా ఛీదరించుకుంటున్నారు. భారత సైన్యం చేతిలో పాక్ రోజూ చావుదెబ్బలు తింటున్నా అతను మాత్రం ఆ వాస్తవాలను పూర్తిగా కప్పిపుచ్చి లేనిపోని గొప్పలకు పోతున్నాడంటూ మండిపడుతున్నారు.

డీఎస్పీలోనే ఉగ్రవాదం

లెఫ్టినెంట్ జనరల్ చౌధురి తండ్రి బషీర్‌ను 2001లో ఐరాస అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. బిన్‌లాడెన్ ఉగ్ర కార్యకలాపాలకు ఆర్థికంగా, వ్యూహాత్మకంగా దన్నుగా నిలుస్తున్నాడని స్పష్టంగా పేర్కొంది. అంతర్జాతీయ ఒత్తిడితో మరో దారిలేక అదే ఏడాది పాక్ ఐఎస్ఐ అతన్ని అరెస్టు చేసింది. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ బషీర్‌ను స్వయంగా విచారించింది. బిన్‌లాడెన్‌ను కలిసినట్టు దర్యాప్తులో అతను అంగీకరించాడు. 2009లో ప్రభుత్వ విధుల నుంచి తప్పించింది. ముసుగు తొలగిపోవడంతో బషీర్ మరింత రెచ్చిపోయాడు. ఉమ్మా తమీర్ నౌ (యూటీఎన్) అనే స్వచ్ఛంద సంస్థ ముసుగులో ఓ ఉగ్ర సంస్థను స్థాపించాడు. రసాయన, జీవాయుధాలతో పాటు ఏకంగా అణ్వాయుధాలను గురించి లాడెన్‌కు, తాలిబన్లకు కావాల్సిన సమాచారం అందించడం మొదలుపెట్టాడు. తాలిబన్ల నాటి చీఫ్ ముల్లా ఒమర్‌తో తరచూ భేటీ అయ్యేవాడు.

మునీర్.. ఓ మతోన్మాది

పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీం మునీర్‌ది కూడా పూర్తిగా జిహాదీ నేపథ్యమే. ఆయన తండ్రి సయ్యర్ సర్వర్ మునీర్ ఓ మదర్సాలో ఇస్లాం బోధకుడు. ఆ ఛాయల్లో పెరిగిన మునీర్ కూడా కరడుగట్టిన మతోన్మాదిగా మారాడు. నరనరానా భారత వ్యతిరేకతను నింపుకున్నాడు. 2019లో జమ్మూలోని పుల్వామాలో 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బందిని పొట్టన పెట్టుకున్న ఆత్మాహుతి ఉగ్ర దాడికి మునీరే వ్యూహకర్త. అప్పట్లో పాక్ నిఘా విభాగం ఐఎస్ఐ చీఫ్‌గా ఆ దాడిని దగ్గరుండి పర్యవేక్షించాడు.

– సాక్షి, నేషనల్ డెస్క్





కార్డినల్స్‌తో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పోప్ లియో 14

ఏఐ మానవాళికి ప్రధాన సవాల్

- తన లక్ష్యాలను వివరించిన పోప్ లియో 14
- ఫ్రాన్సిస్ ప్రాథమ్యాలను కొనసాగిస్తానని వెల్లడి

వాటికన్ సిటీ: మానవాళి ఎదుర్కొంటున్న అత్యంత సంక్లిష్టమైన సవాళ్లలో కృత్రిమ మేధ(ఏఐ)ఒకటని నూతన పోప్ లియో 14 పేర్కొన్నారు. దివంగత పోప్ ఫ్రాన్సిస్ అనుసరించిన ప్రాథమ్యాల్లో కొన్నిటిని తానూ కొనసాగిస్తానని ప్రకటించారు. శనివారం వాటికన్ సిటీలోని సినోడ్ హాల్‌లో కార్డినల్స్‌ను ఉద్దేశించి ఆయన ఇటాలియన్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్రాన్సిస్ పేరును పదేపదే తలచుకుంటూ నివాళులర్పించారు. 2013లో పోప్‌గా బాధ్యతలు చేపట్టే సమయంలో ఫ్రాన్సిస్ చేసిన ప్రకటనను ఉదహరిస్తూ అయన అడుగుజాడల్లోనే నడుస్తానన్నారు. కేథలిక్ చర్చిని మరింత సమ్మిళితంగా మార్చేందుకు విశ్వాసులకు దగ్గరయ్యేందుకు, తిరస్కృతులను అక్కున చేర్చుకునేలా తయారు చేసేందుకు కట్టుబడి ఉంటానన్నారు. చర్చిని ఆధునీకరించేందుకు 1960ల్లో వాటికన్ రెండో కౌన్సిల్ ప్రకటించిన సంస్కరణలను అమలు చేస్తానని స్పష్టం చేశారు. 'మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఏఐ ఒకటి. ఇది మనిషి గౌరవం, న్యాయం, శ్రమను రక్షించడంలో సవాళ్లు విసురుతోంది'అని అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ సైతం ఏఐతో తలెత్తనున్న సవాళ్లపై ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అడ్డుకునేందుకు చట్టాలు చేయాలని ప్రపంచ దేశాలను సైతం ఆయన కోరారన్నారు. లియో 14గా తన పేరును ఎంపిక చేయడంలో ఏఐ పాత్రను ఆయన వివరించారు. 1878–1903 వరకు పోప్‌గా లియో 13 కొనసాగారు. ఆధునిక కేథలిక్ సామాజిక ఆలోచనకు పునాది వేసిందీయనే. పారిశ్రామికీకరణ ప్రారంభంలో కార్మికుల హక్కులు, పెట్టుబడిదారీ విధానాన్ని ఉద్దేశించి 1891లో ఈయన రోమన్ కేథలిక్ చర్చి బిషప్‌లకు రాసిన లేఖ ప్రముఖంగా మారింది. లియో 13 పేర్కొన్న విధంగా 'క్రైస్తవులం మనం అనేకులమైనప్పటికీ, ఒకే క్రీస్తులో మనమంతా ఒక్కటే'అన్న సెయింట్ ఆగస్టిన్ మాటలను ఈ సందర్భంగా ఉటంకించారు. అంతకుముందు, ప్రసంగించేందుకు వస్తున్న లియో 14కు కార్డినల్స్ అంతా లేచి నిలబడి చప్పట్లతో ఆహ్వానం పలికారు. పోప్ తయారు చేసిన ప్రసంగ పాఠాన్ని చదువుతూ మధ్యమధ్యలో తలెత్తి చూశారు. సెయింట్ పీటర్స్ బసిలికా వేదిక నుంచి గురువారం రాత్రి మొట్టమొదటి సారిగా కనిపించిన సమయంలో కూడా ప్రసంగ పాఠాన్నే చదివి వినిపించారు.


భారత్‌పై సైబర్ దాడికి పాక్ హ్యాకర్ల యత్నాలు

'డ్యాన్స్ ఆఫ్ హిల్లరీ'తో జాగ్రత్త..!

వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రాం ద్వారా వైరస్ వ్యాప్తికి అవకాశం

అనవసర లింక్‌లు తెరవొద్దని నిఘా వర్గాల హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: పాకిస్తాన్ సోషల్ మీడియా వేదికల ద్వారా భారత్‌పై సైబర్ దాడికి ప్రయత్నిస్తోందని నిఘా వర్గాలు గుర్తించాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రాం, ఈమెయిల్‌ల ద్వారా 'డ్యాన్స్ ఆఫ్ హిల్లరీ'అనే ప్రమాదకరమైన వైరస్‌ను వ్యాప్తి చేయాలని చూస్తోందని కేంద్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశాయి. ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించాయి. పాక్ హ్యాకర్లు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ వైరస్‌ను అభివృద్ధి చేసినట్లు సమాచారం. సున్నితమైన సమాచారం, ఆర్థిక డేటాను దొంగిలించేందుకు ఈ మాల్‌వేర్‌ను వీడియోలు, పీడీఎఫ్ ఫైల్స్ రూపంలో పంపిస్తోంది. ఈ వైరస్ ఒక్కసారి యాక్టివేట్ అయిందంటే మొబైల్ పరికరాలను, కంప్యూటర్‌లను తీవ్రంగా దెబ్బతీస్తుంది. బ్యాంక్ సమాచారం, పాస్‌వర్డ్ సహా రహస్య డేటాను హ్యాకర్లు చేజిక్కించుకునే ప్రమాదముందని ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.



'.exe', 'tasksche.exe' వంటి అనుమానాస్పద పేర్లతో ఉన్న ఫైళ్లలో ఈ వైరస్ ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఫైళ్లు సాధారణమైనవిగానే కనిపించినా, చాలా హానికరమైనవని, ఒకసారి క్లిక్ చేసిన తర్వాత, అవి హ్యాకర్లకు రిమోట్ యాక్సెస్‌ను ఇచ్చే స్థాయని చెబుతున్నారు. డిజిటల్ అవాంతరాలను కల్పించడమే ఈ దాడుల లక్ష్యమని అంటున్నారు. ఈ నేపథ్యంలో హానికరమైన కంటెంట్, సోషల్ మీడియా ట్రెండ్‌లను నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్రాల సైబర్ సెల్‌లను కేంద్రం అప్రమత్తం చేసింది.

మదర్సా విద్యార్థులే రక్షణ కవచాలు!

పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ ● అవసరమైతే యుద్ధరంగంలోకి

వారిని కచ్చితంగా వాడుకుంటాం ● పార్లమెంటు సాక్షిగా ప్రకటన

అతివాద నెట్‌వర్క్‌లతో పాక్ సైన్యానిది విడదీయరాని బంధమని మరోసారి రుజువైంది. దాయాది యుద్ధోన్మాదం చివరికి మత శిక్షణ సంస్థలను కూడా వదలడం లేదు. భారత్‌తో పోరులో సైన్యం చేతులెత్తేసే పరిస్థితి నెలకొనడంతో పాక్ ముసుగులన్నీ ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. అవసరమైతే మదర్సా విద్యార్థులను కూడా యుద్ధ రంగంలోకి పంపుతామని బాహాటంగా ప్రకటించేసింది. మతిలేని, వివాదాస్పద వ్యాఖ్యలకు ప్రసిద్ధుడైన రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ శనివారం సాక్షాత్తూ పాక్ పార్లమెంటులోనే ఈ మేరకు ప్రకటన చేశారు. వారిని 'సెకండ్ లైన్ ఆఫ్ డిఫెన్స్'గా ఆయన అభివర్ణించారు. అవసరమైనప్పుడు మదర్సా విద్యార్థులను యుద్ధ విధుల్లో 100 శాతం వాడుకుని తీరతామని కుండబద్దలు కొట్టారు. భారత డ్రోన్లన్నింటినీ ఎక్కడికక్కడ అడ్డుకుని కూల్చేశామని ఒకవైపు పాక్ సైన్యం ప్రకటించగా, అలాంటిదేమీ లేదంటూ ఆసిఫ్ కొట్టిపారేయడం తెలిసిందే. ''భారత డ్రోన్లను కూల్చకపోవడానికి కారణముంది. మా సైనిక స్థావరాలకు సంబంధించిన సున్నితమైన సమాచారం లీక్ కావద్దనే అలా చేశాం'' అంటూ విచిత్రమైన వివరణ ఇచ్చి ఇంటాబయటా నవ్వులపాలయ్యారు. భారత ఫైటర్ జెట్లను కూల్చేశామని సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో చెప్పుకుని, రుజువులడిగితే, 'అలాగని భారత సోషల్ మీడియాలోనే వస్తోందిగా' అని చెప్పి అభాసుపాలయ్యారు. రక్షణ మంత్రి అయ్యుండి సోషల్ మీడియా వార్తల ఆధారంగా ప్రకటనలు చేస్తారా అంటూ సీఎన్ఎన్ విలేకరి ఆండర్సన్ నిలదీయడంతో నీళ్లు నమిలారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



పుణెలో అధునాతన రోబోటిక్స్‌పై ఏర్పాటుచేసిన జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో శుక్రవారం రోబోలను ప్రదర్శనకు ఉంచిన దృశ్యం. బాంబుల నిర్వీర్యం, తదితర సందర్భాల్లో సాయుధ బలగాల ప్రాణాపాయ ముప్పును తగ్గించేందుకు వీలుగా హ్యూమనాయిడ్ రోబోట్ తయారీలో నిమగ్నమైనట్లు రక్షణ పరిశోధనాభివృద్ధి(డీఆర్‌డీఓ) సంస్థ శాస్త్రవేత్తలు శనివారం చెప్పారు. సంబంధిత కొన్ని ఉపకరణాలను ఇప్పటికే తయారుచేసి పుణెలో ప్రదర్శించామని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(ఆర్-డీఈ ఇంజనీర్స్) విభాగంలోని సెంటర్ ఫర్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ గ్రూప్ డైరెక్టర్ ఎస్ఈ తలోలే ప్రకటించారు.

శివుడికి 1000 ఆలయాలను నిర్మించిన రాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

తొలి మధ్యయుగం

పాలవంశం

దేవపాల: ఇతడిని పాలరాజులందరిలోకి గొప్పవాడిగా పరిగణిస్తారు. ఇతడు ఒరిస్సా, అస్సాంలను జయించడమే కాకుండా ప్రతీహార మిహిరభోజుడి దాడులను విజయవంతంగా తిప్పి కొట్టాడు. దేవపాలుడు నలందలో ఇండోనేషియా రాజు బలపుత్ర దేవుడు నిర్మించిన బౌద్ధ విహారానికి ఐదు గ్రామాలను దానంగా ఇచ్చాడు. ఇతడి ఆస్థాన బౌద్ధ పండితుడు వజ్రదత్తుడు లోకేశ్వర శతకం అనే గ్రంథాన్ని రచించాడు. ఈ కాలంలో భారతదేశాన్ని సందర్శించిన అరబ్ యాత్రికుడు సులేమాన్ పాల రాజ్యాన్ని రూహ్మి అని పేర్కొన్నాడు.

నారాయణపాల: దేవపాలుడి తర్వాత రాజ్యానికి వచ్చిన రాజుల్లో ఇతడు ముఖ్యమైనవాడు. ఇతడిని రాష్ట్రకూట రాజు అమోఘ వర్షుడు ఓడించాడు. నారాయణ పాలుడు మాంఘీర్ ప్రాంతంలో ఒక గ్రామాన్ని శైవాలయానికి దానంగా ఇచ్చాడు.

మహీపాల 1: నారాయణపాలుడి అనంతరం పాలించిన పాలరాజుల్లో ముఖ్యమైనవాడు మొదటి మహీపాలుడు. చోళరాజు మొదటి రాజేంద్రుడు ఇతడి కాలంలోనే ఉత్తర భారతదేశంపై దండెత్తి మహీపాలుడిని ఓడించి గంగై కొండ అనే బిరుదును పొందాడు.

మదనపాల: ఇతడు పాలవంశంలో చివరిరాజు. ఇతడి తర్వాత పాల రాజ్యాన్ని సేన వంశ రాజులు ఆక్రమించి సేన వంశ రాజ్యాన్ని స్థాపించారు.

సేన వంశం:

తొలి మధ్యయుగంలో తూర్పు భారతదేశాన్ని పాలించిన రెండు రాజవంశాల్లో ముఖ్యమైనది సేన వంశం. పాలవంశం పతనమైన తర్వాత సేన వంశ రాజులు బెంగాల్, బీహార్ ప్రాంతాలను పాలించారు. లక్నోతిని రాజధానిగా చేసుకొని వీరు దాదాపు 100 సంవత్సరాలపాటు పాలించారు. వీరు తాము కర్ణాటక బ్రాహ్మణులమని పేర్కొన్నారు.

సామంత సేన: సేన వంశస్థాపకుడు. ఇతడు బ్రహ్మక్షత్రియుడిగా పేరుగాంచాడు.

విజయ సేన: మొత్తం బెంగాల్‌ను జయించడం ద్వారా ఇతడు సేన రాజ్య వాస్తవ స్థాపకునిగా ఖ్యాతిగాంచాడు. ఇతడు అస్సాం, నేపాల్ మొదలైన ప్రాంతాలను జయించాడు. విజయసేనుడు తన విజయాలను గురించి తెలియజేస్తూ దేవపార ప్రశస్తిని జారీ చేశాడు. ఈ శాసనాన్ని రచించిన కవి ధోయి. విజయసేనుడు విజయపురి, విక్రమపుర అనే రెండు రాజధానులను నిర్మించి అక్కడి నుంచి పరిపాలించాడు. గహద్వాల జయచంద్రుడి ఆస్థాన కవి శ్రీహర్షుడు విజయసేనుడి గొప్పతనాన్ని, విజయాలను గురించి తెలుపుతూ విజయ ప్రశస్తి అనే గ్రంథాన్ని రచించాడు.

బల్లాల సేన: ఇతడు స్వయంగా నాలుగు గ్రంథాలను రచించాడు. ఇతడి గ్రంథాల్లో ముఖ్యమైనవి దాన సాగర, అద్భుత సాగర.

లక్ష్మణ సేన: ఇతడు 60 ఏళ్ల వయస్సులో రాజ్యానికి వచ్చాడు. ఇతడి పాలనకు రాజకీయ ప్రాధాన్యత లేకపోయినప్పటికీ సాహిత్యపరంగా ఇతడి పాలనాకాలం ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఇతడి ఆస్థానంలో ప్రముఖ వైష్ణవ కవి జయదేవుడు గీతగోవిందం అనే గ్రంథాన్ని రచించాడు. మరో కవి ధోయి పవన దూతం అనే గ్రంథాన్ని రాశాడు. గోవర్ధనుడు అనే కవి ఆర్య సప్తశతి అనే గ్రంథాన్ని రచించాడు. లక్ష్మణ సేనుడు తన తండ్రి బల్లాల సేనుడు ప్రారంభించిన అద్భుతసాగర గ్రంథాన్ని తానే స్వయంగా పూర్తి చేశాడు.

లక్ష్మణ సేనుడి కాలంలో ఘోరీ మహ్మద్ సేనాని భక్తియార్ ఖిల్జీ బెంగాల్‌పై దాడి చేయగా, ఇతడు యుద్ధం చేయకుండా పారిపోయాడు. దీంతో సేన రాజ్యం ముస్లింల వశమైంది. ఈ సంఘటన గురించి మినహాజుద్దీన్ సిరాజ్ తన తబాకత్-ఇ-నాసిరి అనే గ్రంథంలో వివరించాడు. భక్తియార్ ఖిల్జీ కేవలం 18 మంది అశ్వికుల ద్వారా ఈ విజయం సాధించాడని తెలిపాడు.

రాష్ట్రకూటులు:

ఉత్తరాన వింధ్య పర్వతాలు, నర్మద నది నుంచి దక్షిణాన కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న ప్రాంతాన్ని సాధారణంగా దక్కన్ ప్రాంతంగా వ్యవహరిస్తారు. తొలి మధ్య యుగంలో ఈ ప్రాంతాన్ని రెండు రాజవంశాలు ప్రముఖంగా పాలించాయి. అందులో ఒకరు రాష్ట్రకూటులు. మొదట వీరు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఉంటూ (రాష్ట్ర పాలకులుగా) పరిస్థితులు అనుకూలించిన వెంటనే స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. వీరి రాజధానులు ఎల్లోరా, మాన్యఖేట్. రాష్ట్రకూటులు సమకాలీన దక్షిణ భారతదేశ రాజులతో, ఉత్తర భారతదేశ పాలకులతో తరచూ యుద్ధాల్లో పాల్గొంటూ తమ రాజ్యాన్ని ఒక బలమైన రాజ్యంగా రూపొందించారు. ఉత్తర భారతదేశంలో ప్రతీహారులు, పాలరాజులు, దక్షిణ భారతదేశంలో వేంగీ చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు వీరి సమకాలీన రాజులు.

దంతి దుర్గుడు: చివరి బాదామి చాళుక్యరాజు రెండో కీర్తివర్మను క్రీ.శ.753లో తొలగించి ఇతడు స్వతంత్ర్య రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. తన రాజ్యానికి ఇరువైపులా ఉన్న అనేక ప్రాంతాలను ఆక్రమించాడు. ఇందుకు గుర్తుగా హిరణ్య గర్భదాన యజ్ఞాన్ని నిర్వహించాడు. తన రాజధాని ఎల్లోరాలో దశావతార ఆలయాన్ని నిర్మించాడు.

మొదటి కృష్ణుడు: బాదామి చాళుక్యులను అంతం చేసి పశ్చిమ గాంగులను తన సామంతులుగా చేసుకున్నాడు. ఇతడి కాలంలో వేంగీ చాళుక్యులపై తొలి దాడి యువరాజు గోవిందుడి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఇతడు రాజధాని ఎల్లోరాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన కైలాసనాథ గుహాలయాన్ని నిర్మించాడు.



ధ్రువుడు: తన సోదరుడు రెండో గోవిందుడిని తొలగించి ఇతడు సింహాసనాన్ని ఆక్రమించాడు. కనౌజ్ కోసం జరిగిన త్రిరాజ్య యుద్ధాల్లో తలదూర్చిన మొదటి రాష్ట్రకూట రాజు ఇతడే. ప్రతీహార వత్సరాజును, పాలరాజు ధర్మపాలుడిని ఓడించాడు. వేంగీ, మైసూర్, కంచి రాజ్యాలపై దాడులు చేసి విజయం సాధించాడు.

మూడో గోవిందుడు: ఇతడు కూడా పాలరాజు ధర్మపాలుడిని, ప్రతీహార రెండో నాగభటుడిని ఓడించాడు. దక్షిణ రాజ్యాల కూటమిపై కూడా విజయం సాధించాడు.

మొదటి అమోఘవర్ష: ఇతడు 64 సంవత్సరాల సుదీర్ఘకాలంపాటు... క్రీ.శ. 814-878 వరకు పరిపాలించాడు. ఇతడి కాలంలో రాష్ట్ర కూటులు వేంగిని ఆక్రమించి 12 సంవత్సరాలపాటు దీన్ని పరిపాలించారు. అమోఘవర్షుడు యుద్ధాల కంటే లలిత కళలకు అధిక ప్రాధాన్యతనిచ్చాడు. ఇతడు స్వయంగా కవి. కవిరాజ అనే బిరుదును పొందాడు. కన్నడ భాషలో తొలి గ్రంథమైన కవిరాజ మార్గను రచించాడు. ఇతడి ఆస్థానంలో ఉన్న పలువురు కవులు పలు గ్రంథాలను రచించారు. ఇతడి ఆస్థానంలోని ప్రముఖ కవులు... జనసేనుడు, మహావీరాచార్యుడు, శాక్తాయణుడు. రాష్ట్రకూట రాజుల్లో ఎక్కువ మంది శైవ, వైష్ణవ మతాలను ఆదరిస్తే ఇతడు జైన మతాన్ని ఆదరించాడు.

రెండో కృష్ణుడు: ఇతడు కూడా తనతండ్రిలాగే జైన మతాన్ని ఆదరించాడు.

మూడో ఇంద్రుడు: ఇతడి కాలంలోనే అరబ్ యాత్రికుడు అల్ మసూదీ భారతదేశాన్ని సందర్శించాడు. మూడో ఇంద్రుడిని భారతదేశంలోనే గొప్ప రాజుగా వర్ణించాడు. మూడో ఇంద్రుడు ప్రతీహార మహీపాలుడిని ఓడించి కనౌజ్‌ను ధ్వంసం చేశాడు.

నాలుగో గోవిందుడు: ఇతడి దుష్పరిపాలనకు వ్యతిరేకంగా నాయకులు, ప్రజలు తిరుగుబాటు చేయడంతో అధికారాన్ని కోల్పోయాడు.

మూడో కృష్ణుడు: ఇతడు ఉత్తర, దక్షిణ భారత దేశంపై విజయవంతంగా దాడులను నిర్వహించాడు. ఇతడు చోళరాజ్యంపై దాడిచేసి కంచి, తంజావూర్‌లను ఆక్రమించాడు. క్రీ.శ.949లో తక్కోలం యుద్ధంలో మొదటి పరాంతక చోళుడిని ఓడించి తంజావూర్ కొండ అనే బిరుదు పొందాడు. చేర, పాండ్య రాజులను ఓడించాడు. ఈ విజయాలన్నింటికీ గుర్తుగా రామేశ్వరంలో విజయ స్తంభాన్ని వేయించాడు. అక్కడ కృష్ణేశ్వర, గండమార్తాండ తీయ అనే దేవాలయాలను నిర్మించాడు. మూడో కృష్ణుడి నిరంతర యుద్ధాల వల్ల సమకాలీన పొరుగు రాజ్యాలన్నింటితో శత్రుత్వం ఏర్పడింది. ఇతడి కాలంలోనే హలాయుధుడు కవి రహస్యం అనే గ్రంథాన్ని రచించాడు.

ఖొట్టిగ: ఇతడి కాలంలో పరమార రాజులు మాన్యఖేట్‌పై దాడిచేసి విధ్వంసం సృష్టించారు.

రెండో కర్క: ఇతని పాలనాకాలంలో రాష్ట్రకూట సామంతుడు రెండో తైలపుడు క్రీ.శ.974-75లో ఇతడిని తొలగించి స్వతంత్ర కల్యాణి చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు.

కల్యాణి చాళుక్యులు:

తొలి మధ్యయుగ భారతదేశ చరిత్రలో రాష్ట్రకూటుల తర్వాత దక్కన్‌ను పాలించిన మరో రాజ వంశం కల్యాణి చాళుక్యులు. కర్ణాటకలోని కల్యాణి రాజధానిగా వీరు పాలించారు. కాబట్టి వీరిని కల్యాణి చాళుక్యులని, చాళుక్యుల తర్వాత పాలించారు కాబట్టి కడపటి చాళుక్యులు అని పిలుస్తారు.

రెండో తైలపుడు: ఇతడు కల్యాణి చాళుక్య వంశ స్థాపకుడు. రాష్ట్రకూట మూడో కృష్ణుడికి సామంతుడిగా ఉంటూ చివరి రాష్ట్ర కూటరాజు రెండో కర్కను తొలగించి తన రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు మాన్యఖేట్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలించాడు. చోళరాజు ఉత్తమ చోళుడిపై దాడి చేయడం ద్వారా చోళ-చాళుక్య శత్రుత్వానికి నాంది పలికాడు. ఇతడి వారసుల కాలంలో చాళుక్యులు చోళులతో అనేక యుద్ధాలు చేయాల్సి వచ్చింది.

సత్యాశ్రయ: ఇతడి మరొక పేరు సొల్లిగ. ఇతడి కాలంలో మాన్యఖేట్‌పై రాజేంద్రచోళుడు దాడి చేశాడు.

రెండో జయసింహ: వేంగీ వారసత్వ యుద్ధాల్లో తలదూర్చి ఇతడు ఏడో విజయాదిత్యుడికి మద్దతుగా తన సైన్యాన్ని పంపాడు. కానీ రాజేంద్రచోళుడి సహాయంతో వేంగీలో రాజరాజ నరేంద్రుడు రాజ్యానికి వచ్చాడు.

మొదటి సోమేశ్వరుడు: ఇతడు తన రాజధానిని మాన్యఖేట్ నుంచి కల్యాణికి మార్చాడు. కొప్పం యుద్ధంలో చోళ రాజాధిరాజును వధించాడు. పరమార భోజుడిని ఓడించి తన సామంతుడిగా చేసుకున్నాడు.

ఆరో విక్రమాదిత్యుడు: తన సోదరుడు రెండో సోమేశ్వరుడిని వధించి ఇతడు క్రీ.శ.1076లో రాజ్యానికి వచ్చాడు. తాను రాజ్యానికి వచ్చిన సంవత్సరాన్ని పురస్కరించుకుని చాళుక్య విక్రమ శకాన్ని ప్రారంభించాడు. కల్యాణి చాళుక్య రాజులందరిలోకి ఇతడు అత్యంత గొప్పవాడు. ఇతడి రాజ్యం నర్మద నుంచి రాయలసీమ వరకు విస్తరించింది. ఆరో విక్రమాదిత్యుడు తన సామంతులైన హోయసలలు, కాకతీయులు, యాదవులు, కాదంబులతో నిరంతరం యుద్ధాలు చేసి వారిని అణచివేశాడు. ఇతడి ఆస్థానంలోని ఇద్దరు ప్రముఖ కవులు బిల్హణుడు విక్రమాంక దేవచరితం, విజ్ఞానేశ్వరుడు మితాక్షర అనే గ్రంథాలను రచించారు.

మూడో సోమేశ్వరుడు: ఇతడి కాలంలో ద్వార సముద్ర సామంతుడు విష్ణువర్ధనుడు స్వతంత్ర హోయసల రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. సోమేశ్వరుడు పరిపాలన కంటే సాహిత్యంపై ఎక్కువ మక్కువ చూపాడు. ఇతడికి సర్వజ్ఞ అనే బిరుదు ఉంది. ఈ బిరుదుకు కారణం ఇతడు రచించిన అభిలషితార్థ చింతామణి అనే గ్రంథం.

నాలుగో సోమేశ్వరుడు: మూడో సోమేశ్వరుడి తర్వాత జగదేక మల్ల, మూడో తైలప అనే రాజులు పాలించారు. ఈ వంశంలో చివరివాడు నాలుగో సోమేశ్వరుడు. ఇతడి కాలంలో దేవగిరిని పాలిస్తున్న సామంత రాజు యాదవ బిల్లముడు ఇతడిని ఓడించి కల్యాణి చాళుక్య రాజ్యాన్ని అంతం చేశాడు. స్వతంత్ర యాదవ రాజ్యాన్ని స్థాపించాడు.

మాదిరి ప్రశ్నలు

1. ప్రయాగ వద్ద త్రివేణి సంగమంలో మునిగి ఆత్మత్యాగం చేసిన చందేల రాజు?
   1) హర్ష 2) విద్యాధర
   3) ధంగ 4) యశోవర్మన్
2. భారతదేశంలో బౌద్ధ మతాన్ని ఆదరించిన చివరి రాజవంశం?
   1) పుష్యభూతి వంశం 2) కుషాణులు
   3) పాల వంశం 4) సేన వంశం
3. ప్రజల ద్వారా ఎన్నికైన రాజు?
   1) ధర్మపాల 2) గోపాల
   3) హర్షవర్ధన 4) నన్నుక
4. ఓదంతపురి బౌద్ధ విహారాన్ని నిర్మించింది?
   1) అశోకుడు 2) అమోఘవర్షుడు
   3) గోపాలుడు 4) కనిష్కుడు
5. బౌద్ధ పండితుడు హరిభద్రుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
   1) ధర్మపాలుడు 2) మొదటి నాగభటుడు
   3) గోపాలుడు 4) దేవపాలుడు
6. పాలరాజుల కాలంలో టిబెట్‌లో బౌద్ధమత ప్రచారం చేసిన బౌద్ధ భిక్షువులు?
   1) అతిష దీపాంకర, సంతరక్షిత
   2) ఆచార్య నాగార్జున 3) శ్రీవర, శ్రీజ్ఞాన
   4) పద్మసాంభవ, పూజ్యపాద
7. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కైలాసనాథ గుహాలయ నిర్మాత?
   1) నందివర్మ 2) నరసింహవర్మ
   3) మొదటి కృష్ణుడు 4) మూడో గోవిందుడు
8. రాజ్య వ్యవహారాల్లో స్త్రీలు ప్రముఖ పాత్ర పోషించిన ఉత్తరభారతదేశ రాజవంశం?
   1) గహద్వాలులు 2) కాశ్మీర్ ఉత్పల వంశం
   3) చౌహాన్‌లు 4) చందేలులు
9. నలంద బౌద్ధ విహారాన్ని నిర్మించిన విదేశీ రాజు?
   1) సంగ్రామ విజయోత్తుంగ వర్మన్
   2) విజయబాహు 3) బలపుత్రదేవ
   4) మహేంద్రవర్మన్
10. శివుడికి 1000 ఆలయాలను నిర్మించిన రాజు?
    1) నారాయణ పాలుడు
    2) విగ్రహ పాలుడు
    3) గౌడ శశాంకుడు 4) హర్షుడు
11. చోళరాజు మొదటి రాజేంద్రుడి చేతిలో ఓడిపోయిన పాలరాజు?
    1) మహేంద్రపాలుడు
    2) మదనపాలుడు
    3) మొదటి మహీపాలుడు
    4) ధర్మపాలుడు
12. గీతగోవిందం గ్రంథకర్త జయదేవుడు ఎవరి ఆస్థాన కవి?
    1) బల్లాల సేన 2) లక్ష్మణ సేన
    3) విజయ సేన 4) సంగ్రామ సేన
13. సేన రాజ్యాన్ని అంతం చేసినవారు?
    1) కుతుబుద్దీన్ ఐబక్
    2) ఇల్‌టుల్‌మిష్
    3) భక్తియార్ ఖిల్జీ 4) అల్లావుద్దీన్ ఖిల్జీ
14. రాష్ట్రకూటుల రాజధాని?
    1) ఎల్లోరా 2) మాన్యఖేట్
    3) 1,2 4) వాతాపి
15. దంతిదుర్గుడు నిర్మించిన ఆలయం?
    1) ఎల్లోరా-దశావతారాలయం
    2) ఎల్లోరా- కైలాసనాథాలయం
    3) కంచి- కైలాసనాథాలయం
    4) మహాబలిపురం-తీర దేవాలయం

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 3	5) 1
6) 1	7) 3	8) 2	9) 3	10) 1
11) 3	12) 2	13) 3	14) 3	15) 1

సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

మన విశ్వం

- నక్షత్ర వీధుల్లో చిన్న, చిన్న గుంపుల్లో ఉన్న నక్షత్ర సముదాయాలను తారాగణం లేదా నక్షత్ర రాశి అంటారు.
- నక్షత్రరాశుల్లో కొన్నింటిని ఉత్తరార్ధగోళం నుంచి చూడగలిగితే, మరికొన్నింటిని దక్షిణార్ధ గోళం నుంచి మాత్రమే చూడగలం. ఇప్పటి వరకు మొత్తం 88 నక్షత్ర రాశులను శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు.
- సూర్యుడు తిరిగే దారిని సంవత్సర కాలం మొత్తం 12 భాగాలుగా విభజించి, వాటి ఆకారాలను బట్టి నక్షత్ర సముదాయాలను 12పేర్లతో పిలుస్తున్నారు. ఈ పన్నెండు రాశులను కలిపి రాశిచక్రం అంటారు.
- జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ రాశుల తేదీలను బట్టి కాలాలను, రుతువులను, పంచాంగాలను గణిస్తారు.
- రాకెట్లు రెండు రకాలు అవి..
  1. యుద్ధ రాకెట్లు, 2. రోదసీ రాకెట్లు.
- కృత్రిమ ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశించేందుకు సెకనుకు 11.2 కి.మీల. వేగం అవసరం.
- కృత్రిమ ఉపగ్రహాలు భూమికి ఉపగ్రహాలుగా పనిచేస్తే, స్పేస్ ప్రోబ్స్ అనేవి ఇతర గ్రహాలను శోధించేందుకు తోడ్పడతాయి.
- ప్రప్రథమంగా రష్యా.. 1957 అక్టోబర్ 4న మానవుడు లేని స్పుత్నిక్-1 అనే అంతరిక్ష నౌకను రోదసీలోకి పంపింది.
- 1961 ఏప్రిల్ 12న రష్యాకు చెందిన కల్నల్ యూరీ గగారిన్.. వస్తోక్ అనే అంతరిక్ష నౌక ద్వారా 83.34 నిమిషాల్లో మొట్టమొదటిసారిగా భూ ప్రదక్షిణం చేశాడు.
- 1963లో వస్తోక్-6 అనే అంతరిక్ష నౌకలో రష్యా మహిళ లెఫ్టినెంట్ కల్నల్ వాలెంటీనా టెరిస్కోవా అంతరిక్ష యానం చేసింది.
- 1969 జూలై 21న అమెరికాకు చెందిన అపోలో -11 అనే అంతరిక్ష నౌక ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్ట్రిన్‌లు ప్రప్రథమంగా చంద్రుడిపై కాలు మోపారు.
- 1984 ఏప్రిల్ 3న భారతదేశానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ రాకేష్‌శర్మ.. సోయూజ్-టి-11 అనే రోదసీ నౌక ద్వారా అంతరిక్షయానం చేశాడు.
- భారతదేశం కూడా రోదసీ పరిశోధనల్లో ఎంతో ప్రగతిని సాధించింది. ఆర్యభట్ట, భాస్కర-1, 2, రోహిణి, ఐఆర్ఎస్, ఇన్‌శాట్ - 1ఎ, 1బి, 1సి, 1డి, 2ఎ, 2బి; పీఎస్ఎల్‌వీ - డి2 మొదలైన ఉపగ్రహాలను ప్రయోగించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోట వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్ (షార్) ఉంది.
- మన విశ్వం వేలకొద్దీ గెలాక్సీలను కలిగి ఉంది. ప్రతి గెలాక్సీలోనూ మిలియన్‌ల నక్షత్రాలు ఉన్నాయి.
- నక్షత్రాలకు వాటి చుట్టూ తిరిగే గ్రహ కూటములు ఉన్నాయి.
- గ్రహాలకు వాటి చుట్టూ తిరుగుతూ ఉండే ఉపగ్రహాలుంటాయి. అందువల్ల మన విశ్వం చాలా విశాలమైంది.
- సూర్యుడు పాలపుంత అనే గెలాక్సీకి చెందిన ఒక సామాన్య నక్షత్రం. సూర్యుడు, గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్స్ అన్నింటినీ కలిపి సూర్య కుటుంబం అంటారు.
- గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ వివిధ దీర్ఘ వృత్తాకార మార్గాల్లో తిరుగుతున్నాయి.
- భూమికి సహజ ఉపగ్రహం చంద్రుడు.
- భూమి సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి ఒక సంవత్సరం పడుతుంది. అంటే 365 1/4 రోజులు. భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు పడుతుంది.
- సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఖగోళ ప్రమాణం అంటారు.
  $1AU = 1.496\times10^{11}$మీ.
- కాంతి ఒక సంవత్సర కాలంలో శూన్యంలో ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- ఒక కాంతి సంవత్సరం = 9.3×10^{15} మీ. = 6.33×10^{4} AU
- పార్‌సెక్ అనేది దూరం ప్రమాణాలన్నింటిలోనూ పెద్దది. ఇది 3.26కాంతి సంవత్సరాలకు సమానం
- బుధ గ్రహం పరిభ్రమణ కాలం - 88 రోజులు.
- అత్యధిక పరిభ్రమణ కాలం కలిగిన గ్రహం ప్లూటో (248 సంవత్సరాలు).
- గ్రహాలన్నింటిలో పెద్ద గ్రహం-గురుడు(బృహస్పతి).
- గ్రహాలన్నింటిలో చిన్న గ్రహం - బుధుడు.
- సూర్యుడి నుంచి కనిష్ఠ దూరంలో బుధుడు, గరిష్ఠ దూరంలో ప్లూటో ఉన్నాయి.
- అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం-శని (30)
- ఉపగ్రహాలు లేని గ్రహాలు - బుధుడు, శుక్రుడు.
- భూమి మీద మినహా మిగతా గ్రహాలపై ప్రాణులు నివసించడానికి అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు.
- బుధ గ్రహం సూర్యుడికి అతి సమీపంలో ఉండటం వల్ల దాని మీద పగలు అతి వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది.
- శుక్ర గ్రహం అతి దట్టమైన మేఘాలతో కప్పి ఉండటం వల్ల సూర్యకాంతి దాని తలాన్ని చేరలేదు.
- శని గ్రహం కిలోమీటర్ల మందం ఉన్న మంచు పొరలతో కప్పి ఉండటం వల్ల అతి చల్లగా ఉంటుంది. కాబట్టి ప్రాణులుండేందుకు అవకాశం లేదు.
- కుజ గ్రహం మాత్రం ఆక్సిజన్, నీటి ఆవిరిలతో కూడిన వాతావరణం కలిగి ఉంది. దాని ఉష్ణోగ్రత 25^{0} సెంటీగ్రేడ్ నుంచి 40^{0} సెంటీగ్రేడ్‌కి మధ్యలో ఉంటుంది.
- ధ్రువ నక్షత్రాన్ని ఆంగ్లంలో పోలారిస్ అంటారు. ఇది భూమి ఉత్తర ధ్రువానికి ఎదురుగా ఉంది.
- ధ్రువ నక్షత్ర స్థానాన్ని సప్తర్షి మండలం సహాయంతో తెలుసుకోవచ్చు.
- సప్తర్షి మండలాన్ని ఇంగ్లిష్‌లో గ్రేట్‌బేర్ అంటారు.
- గ్రేట్‌బేర్ అనేది నాగలి లేదా గాలిపటం ఆకారంలో ఉంటుంది.
- సూర్యుడు తన చుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 25 రోజులు పడుతుంది.
- లీప్ సంవత్సరంలో 366 రోజులుంటాయి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.
- సూర్యుడి తర్వాత భూమికి అత్యంత సమీపంలోని నక్షత్రం- ప్రాక్సిమాసెంటౌరి
- హేలీ తోకచుక్క 76 సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది.
- రాశులన్నింటిలో పెద్ద తారాగణం - హైడ్రా
- చంద్రుడిపై వస్తువుల బరువు భూమిపై బరువులో ఆరో వంతు ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశం మొదటగా భూకక్ష్యలోకి ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం?
   1) ఆర్యభట్ట 2) భాస్కర-1
   3) ఇన్‌శాట్-1బి 4) భాస్కర-2
2. అన్నింటికంటే ప్రకాశంగా కనిపించే గ్రహం?
   1) శని 2) భూమి
   3) శుక్రుడు 4) బుధుడు
3. పగలు, రాత్రి ఏర్పడడానికి కారణం?
   1) భూ పరిభ్రమణం 2) భూ భ్రమణం
   3) ఉల్కాపాతం 4) ఏదీకాదు
4. చంద్ర గ్రహణం ఏ సందర్భంలో ఏర్పడుతుంది?
   1) భూమి.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   2) చంద్రుడు.. భూమికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   3) సూర్యుడు భూమి, చంద్రుడి మధ్య వచ్చినప్పుడు
   4) అన్నీ
5. రాశుల్లో అన్నింటికంటే పెద్ద తారాగణం?
   1) సెరస్ 2) ఇంకారస్
   3) హైడ్రా 4) హేలీ
6. రష్యా సహకారంతో భారతదేశంలో రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లు ఏర్పర్చిన ప్రదేశాలు?
   1) తుంబా 2) శ్రీహరికోట
   3) ఢిల్లీ 4) 1, 2
7. అత్యధిక ఉపగ్రహాలు కలిగిన గ్రహం?
   1) శని 2) బృహస్పతి
   3) బుధుడు 4) శుక్రుడు
8. ఇప్పటివరకు గుర్తించిన నక్షత్రాల్లో అతిపెద్దది?
   1) సెరస్ 2) ఎప్సిలాన్ అరిగ
   3) హైడ్రా 4) ఇంకారస్
9. మొట్టమొదటి స్పేస్ షటిల్?
   1) అపోలో 2) స్పుత్నిక్
   3) కొలంబియా 4) వస్తోక్
10. స్కైలాబ్ అనే ప్రయోగాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏ దేశం ఏర్పాటు చేసింది?
    1) రష్యా 2) అమెరికా
    3) ఇండియా 4) సింగపూర్

సమాధానాలు

1) 1	2) 3	3) 2	4) 1	5) 3
6) 4	7) 1	8) 2	9) 3	10) 2

గతంలో అడిగిన ప్రశ్నలు

1. చంద్రుడు తన చుట్టూ తాను, అలాగే భూమి చుట్టూ తిరగడానికి పట్టే రోజులు? (డీఎస్సీ-2000)
   1) 30 రోజులు 2) 29 1/2 రోజులు
   3) 92 1/2 రోజులు 4) 29 రోజులు
2. ధ్రువ నక్షత్రం నావికులకు దేన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది? (డీఎస్సీ - 2000)
   1) గెలాక్సీ 2) గాలి
   3) దిక్కు 4) వాతావరణం
3. ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)?(డీఎస్సీ-2001)
   1) $3\times10^{4}\times60\times60\times24\times365.25$
   2) $3\times10^{2}\times60\times60\times24\times365.25$
   3) $3\times10^{5}\times60\times60\times24\times365.25$
   4) $3\times10^{3}\times60\times60\times24\times365.25$
4. నక్షత్రాలు కాంతిని నలుదిశలకు వెదజల్లాలంటే వాటిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత? (డీఎస్సీ-2002)
   1) 10 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   2) 5 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
   3) 5 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   4) 10 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
5. 1994లో విజయవంతంగా ప్రయోగించిన భారతీయ ఉపగ్రహ నౌక? (డీఎస్సీ-2002)
   1) ఇన్‌శాట్-1బి 2) పీఎస్ఎల్‌వీడీ-2
   3) భాస్కర-2 4) ఆర్యభట్ట
6. సూర్యుడికి,భూమికి మధ్య ఉన్న సగటు దూరం?
   1) 149,000,000 కి.మీ.
   2) 149,598,500 కి.మీ.
   3) 149,593,300 కి.మీ
   4) 149,895,500 కి.మీ.
7. ఏ అంతరిక్ష నౌకల ద్వారా అంగారక గ్రహంపై జీవరాశి లేదని నిరూపించారు? (డీఎస్సీ-2003)
   1) స్కాటర్న్ - 5, స్కాటర్న్ - 6
   2) అపోలో - 11, సోయూజ్-టీ-11
   3) వైకింగ్-1, వైకింగ్-2
   4) సోయూజ్ -టీ-11, శాల్యూట్
8. బుధ గ్రహం పరిభ్రమణ కాలం?(డీఎస్సీ-2006)
   1) 88 రోజులు 2) 248 రోజులు
   3) 365 రోజులు 4) 243 రోజులు
9. స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్ష యానం చేసిన రోజు? (డీఎస్సీ-2006)
   1) 3-6-1984 2) 3-4-1984
   3) 3-4-1985 4) 3-6-1985
10. భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం కి.మీ.లలో? (డీఎస్సీ - 2008)
    1) 12,576 2) 12,657
    3) 12,756 4) 12,765
11. సూర్యుడి చుట్టూ పరిభ్రమించే గ్రహాల్లో ద్రవ్యరాశిలో రెండో స్థానంలో ఉన్న గ్రహం, ఆత్మభ్రమణ కాలం అన్నింటి కంటే ఎక్కువ ఉన్న గ్రహం వరుసగా? (డీఎస్సీ - 2008)
    1) బృహస్పతి, భూమి
    2) బుధుడు, అంగారకుడు
    3) శని, శుక్రుడు 4) నెప్ట్యూన్, యురేనస్
12. స్పేస్ ప్రోబ్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)
    1) పయనీర్ 2) ఆర్యభట్ట
    3) భాస్కర - 2 4) అట్లాంటిస్
13. ఏ గ్రహం మీద ఆక్సిజన్, నీటి ఆవిరితో కూడిన వాతావరణం ఉంది? (డీఎస్సీ-2012)
    1) కుజుడు 2) బుధుడు
    3) బృహస్పతి 4) యురేనస్
14. సూర్యగ్రహణం సంభవించడానికి కారణం? (ఏపీ టెట్ - 2017)
    1) చంద్రుడి నీడ భూమిపై పడటం వల్ల
    2) సూర్యుడి నీడ భూమిపై పడటం వల్ల
    3) చంద్రుడి నీడ సూర్యుడిపై పడటం వల్ల
    4) సూర్యుడి నీడ చంద్రుడిపై పడటం వల్ల
15. సాధారణంగా పిలిచే 'తెగిపడిన చుక్కలు' ఏమిటి? (ఏపీ టెట్ - 2017)
    1) ఆస్టరాయిడ్లు 2) తోక చుక్కలు
    3) ఉల్కలు 4) ఉపగ్రహాలు
16. తన కక్ష్యలో తాను దొర్లుతున్నట్లు కనిపించే గ్రహం? (ఏపీ టెట్ - 2017)
    1) నెప్ట్యూన్ 2) బృహస్పతి/ గురుడు
    3) బుధుడు 4) యురెనస్
17. సూర్య, చంద్రులకు ఆకాశంలో ఒక పూర్తి భ్రమణానికి పట్టే కాలంలో తేడా? (ఏపీ టెట్ - 2017)
    1) 2 నిమిషాలు 2) 50 నిమిషాలు
    3) 24 నిమిషాలు 4) 10 నిమిషాలు
18. 'హేలీ తోక చుక్క' కనిపించనున్న సంవత్సరం? (ఏపీ టెట్ - 2017)
    1) 2061 2) 2062 3) 2063 4) 2064
19. ధృవ నక్షత్రానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది? (ఏపీ టెట్ - 2017)
    1) ఇది భూమికి దగ్గరగా ఉన్న నక్షత్రం
    2) ఇది భూభ్రమణం అక్షానికి సూటిగా పై వైపున ఉంటుంది
    3) ఇది నిలకడగా ఉన్నట్లు కనిపిస్తుంది
    4) దీని స్థానాన్ని సప్తర్షి మండల రాశి ద్వారా కనుగొనవచ్చు
20. 'అరుణగ్రహం' అని కూడా పిలిచే గ్రహం? (ఏపీ టెట్ - 2018)
    1) సూర్యుడు 2) శుక్రుడు
    3) కుజుడు 4) బృహస్పతి

సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 4	5) 2
6) 2	7) 3	8) 1	9) 2	10) 3
11) 3	12) 1	13) 1	14) 1	15) 3
16) 4	17) 2	18) 1	19) 1	20) 3

భారత పౌరులు కానివారికి కూడా లభించే హక్కు?

మాదిరి ప్రశ్నలు

1. వ్యక్తి స్వేచ్ఛపై సహేతుకమైన పరిమితులు ఎవరు విధించవచ్చు?
   1) కేబినేట్ 2) పార్లమెంట్
   3) భారత రాష్ట్రపతి 4) సుప్రీంకోర్టు
2. సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛపై కింది వాటిలో పరిమితి కానిది ఏది?
   1) శాంతి భద్రతల దృష్ట్యా
   2) భారతదేశ సార్వభౌమాధికారం దృష్ట్యా
   3) భారతదేశ సమగ్రతా దృష్ట్యా
   4) వ్యక్తి స్వేచ్ఛ దృష్ట్యా
3. కింది వాటిలో సరికానిది ఏది?
   1) చట్టాన్ని ధిక్కరించి నేరం చేసిన సందర్భంలో మాత్రమే నేరస్తుణ్ని శిక్షించాలి
   2) నేరం జరిగినప్పుడు ఆ చట్టం అమల్లో ఉండాలి
   3) చట్టంలో నిర్దేశించిన దానికంటే ఎక్కువ శిక్ష విధించకూడదు
   4) నేరం జరిగినప్పుడు చట్టం అమల్లో ఉండనవసరం లేదు
4. ఎమ్మెల్యే, ఎంపీలకు ఏదైనా ఒక కేసులో ఎంతకాలం శిక్ష పడితే తమ పదవులకు అనర్హులవుతారు?
   1) రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
   2) మూడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
   3) ఆరేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
   4) నాలుగేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
5. బలవంతంగా నేరాన్ని అంగీకరించడం ఏ అధికరణకు వ్యతిరేకం?
   1) 20(2) 2) 20(3) 3) 20(1) 4) 20(4)
6. భారత పౌరులు కాని వారికి కూడా లభించే హక్కు?
   1) ఉద్యోగాల్లో సమాన హక్కు
   2) విద్యా సాంస్కృతిక హక్కు
   3) స్వేచ్ఛగా సమావేశమయ్యే హక్కు
   4) వ్యక్తిగత స్వేచ్ఛ
7. స్త్రీలు, బాలికల అవినీతి వ్యాపార నిరోధక చట్టం ఎప్పుడు చేశారు?
   1) 1976 2) 1956
   3) 1978 4) 1965
8. పార్లమెంటు ప్రధాన కర్తవ్యం?
   1) చట్టాలు అమలు చేయడం
   2) చట్టాలు రూపొందించడం
   3) చట్టాలపై అవగాహన కలిగించడం
   4) దేశాన్ని పరిపాలించడం
9. ఆదేశిక సూత్రాలకు సంబంధించి కింది వాటిలో సరికాని అంశం ఏది?
   1) సమసమాజ స్థాపన వాటి లక్ష్యం
   2) ఆర్థిక వనరుల లభ్యత మేరకు అమలు చేస్తారు
   3) న్యాయస్థానాల రక్షణ ఉంది
   4) దేశ పాలనకు ప్రధానమైన సూత్రాలు
10. కింది వాటిలో రాష్ట్రపతి పదవికి ఉండాల్సిన అర్హత కానిది ఏది?
    1) స్పీకర్‌గా ఎన్నిక కావాలి
    2) 35 ఏళ్ల వయస్సు ఉండాలి
    3) భారతదేశ పౌరుడై ఉండాలి
    4) లాభసాటి పదవుల్లో ఉండరాదు
11. ఉప రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పేర్కొన్నారు?
    1) 5వ భాగం 2) 4వ భాగం
    3) 6వ భాగం 4) 7వ భాగం
12. సాధారణంగా ఉపరాష్ట్రపతి పదవీకాలం?
    1) 5 ఏళ్లు 2) 6 ఏళ్లు
    3) రాజ్యాంగం నిర్ధారించలేదు
    4) పైవేవీ కావు
13. ప్రధానమంత్రి పదవీ కాలం ఎంత?
    1) 5 సంవత్సరాలు
    2) ఎన్నికలు జరిగే వరకు
    3) రాజ్యాంగం నిర్ణయించలేదు
    4) రాష్ట్రపతి సంతృప్తి మేరకు
14. కింది వారిలో ఎవరిని జాతి నాయకుడు అంటారు?
    1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి
    3) లోక్‌సభ స్పీకర్ 4) ఉప రాష్ట్రపతి
15. 'సమష్టి బాధ్యత' అనేది ఏ ప్రభుత్వ ప్రధాన లక్షణం?
    1) అధ్యక్ష తరహా ప్రభుత్వం
    2) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
    3) రాచరిక ప్రభుత్వం
    4) గణతంత్ర ప్రభుత్వం
16. రాజ్యాంగాన్ని ప్రజల తరఫున ఎవరు ఆమోదించారు?
    1) బ్రిటిష్ ప్రభుత్వం
    2) కేంద్ర ప్రభుత్వం 3) రాజ్యాంగ పరిషత్
    4) రాజ్యాంగ ముసాయిదా కమిటీ
17. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత మొదటగా రాజ్యాంగంలో చేర్చిన షెడ్యూలు ఏది?
    1) 10 2) 11 3) 9 4) 12
18. 'రాజ్యాంగం వైఫల్యం చెందితే రాజ్యాంగాన్ని నిందించరాదు. అమలుపరిచే వారిని నిందించాలి' అని వ్యాఖ్యానించింది ఎవరు?
    1) గ్రాన్‌విల్లే ఆస్టిన్ 2) బి.ఆర్. అంబేద్కర్
    3) హెచ్.వి. కామత్ 4) ఐవర్ జెన్నింగ్స్
19. కింది వాటిలో ఏకకేంద్ర లక్షణం కానిదేది?
    1) లిఖిత రాజ్యాంగం
    2) అదృఢ రాజ్యాంగం
    3) సమగ్ర న్యాయ వ్యవస్థ
    4) ఏక పౌరసత్వం
20. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు రాజ్యాంగంలో చేర్చని అంశమేది?
    1) ఆదేశ సూత్రాలు 2) ప్రాథమిక విధులు
    3) ప్రాథమిక హక్కులు
    4) అత్యవసర పరిస్థితులు
21. పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
    1) 1988 2) 1986 3) 1980 4) 1989
22. స్థానిక ప్రభుత్వాలు అనే పదం ఆధునికంగా ఏ



దేశంలో తొలిసారి ఉపయోగించారు?
    1) బ్రిటన్ 2) న్యూజిలాండ్
    3) ఫ్రాన్స్ 4) స్వీడన్
23. భారతదేశంలో మండలాలను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఏది?
    1) కర్ణాటక 2) ఆంధ్రప్రదేశ్
    3) పశ్చిమ బెంగాల్ 4) ఉత్తర ప్రదేశ్
24. 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తింపజేయాలంటే ఎవరి అనుమతి తీసుకోవాలి?
    1) కేంద్ర ప్రభుత్వం 2) లెఫ్టినెంట్ గవర్నర్
    3) రాష్ట్రపతి 4) కేబినెట్
25. అశోక్ మెహతా కమిటీ సిఫారసులకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    a) జిల్లాస్థాయిలో ఆడిట్ జరగాలి
    b) ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రకారం సీట్లు రిజర్వ్ చేయాలి
    c) న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి
    d) పంచాయతీరాజ్ సంస్థలకు ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి
    1) a, b, c 2) a, b, c, d
    3) c, d 4) b, c, d
26. రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం?
    1) ఐదేళ్లు 2) ఐదేళ్లు లేదా 70 ఏళ్ల వరకు
    3) ఆరేళ్లు 4) మూడేళ్లు
27. కింది వాటిలో సరైంది ఏది?
    1) వన్య ప్రాణుల సంరక్షణ చట్టం- 1970
    2) పర్యావరణ పరిరక్షణ చట్టం- 1984
    3) అటవీ సంరక్షణ చట్టం- 1980
    4) జాతీయ అటవీ విధానం- 1989
28. ఏ కేసులో సుప్రీంకోర్టు నిర్బంధంలో ఉన్న వ్యక్తులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని ప్రకటించింది?
    1)కిశోర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్(1981)
    2) డి.కె.బసు వర్సెస్ పశ్చిమ బెంగాల్- (1997)
    3) లోకేంద్రసింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ (1996)
    4) కమలాదేవి వర్సెస్ ముంబాయి (1984)
29. నిర్దేశిక నియమాలైన 39(బి), 39(సి) అధికరణలు, ప్రాథమిక హక్కులైన 14, 19, 31పై ఆధిక్యత కలిగి ఉంటాయని ఏ కేసులో సుప్రీం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

కోర్టు తీర్పు ఇచ్చింది?
    1) మినర్వామిల్స్ వర్సెస్ మద్రాస్ ప్రభుత్వం - 1980
    2) కేశవానంద భారతి కేసు - 1973
    3) గోలక్‌నాథ్ కేసు - 1967
    4) బెల్లా బెనర్జీ కేసు - 1954
30. మొదటి రాజ్యాంగ సవరణ చట్టం - 1951 ద్వారా చేర్చిన అంశాలు ఏవి?
    1) 9వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు
    2) 15(4) అధికరణ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్యావిషయాల్లో కొన్ని సీట్ల రిజర్వేషన్ కల్పించడం
    3) 31(ఎ) అధికరణను కొత్తగా చేర్చారు
    4) పైవన్నీ
31. 368వ అధికరణ ప్రకారం పార్లమెంటుకు రాజ్యాంగంలోని అన్ని అంశాలను మార్చే అధికారం ఉందని ఏ సవరణ ద్వారా నిర్ణయించారు?
    1) 24వ రాజ్యాంగ సవరణ చట్టం
    2) 42వ రాజ్యాంగ సవరణ చట్టం
    3) 25వ రాజ్యాంగ సవరణ చట్టం
    4) 44వ రాజ్యాంగ సవరణ చట్టం
32. ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సుప్రీంకోర్టు,హైకోర్టులకు న్యాయసమీక్షను తగ్గించారు?
    1) 42వ 2) 24వ 3) 44వ 4) 25వ
33. 'మాండమస్' రిట్ వర్తించని వారు?
    1) రాష్ట్రపతి, గవర్నర్
    2) వ్యక్తుల మధ్య ఒప్పందాలు జరిగినప్పుడు
    3) ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు
    4) పైవన్నీ సరైనవే
34. 'హెబియస్ కార్పస్' రిట్ ద్వారా పౌరులను మాత్రమే కాకుండా భారత భూభాగంలో నివసించే వారందరినీ రక్షించాలని సుప్రీం కోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?
    1) వినీత్ నారాయణ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (1998)
    2) ఉమ్మ సబీనా వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (2011)
    3) కిశోర్ సామ్రాట్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ (2013)
    4) విశ్వాస్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం(1983)
35. కింది వాటిలో ఏ అధికరణ సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పిస్తుంది?
    1) 326 2) 336 3) 316 4) 324
36. 'సైనిక శాసనం'కు సంబంధించి సరికాని అంశం ఏది?
    1) శాంతి భద్రతలకు భంగం కలిగితే విధిస్తారు
    2) ఇది ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపుతుంది
    3) దేశం మొత్తం లేదా దేశంలోని కొంత భాగంలో విధిస్తారు
    4) దేశంలో ఒక నిర్దిష్ట ప్రాంతంలో దీనిని విధిస్తారు
37. 'ఆదేశిక సూత్రాల అంతిమ లక్ష్యం అజ్ఞానం, దౌర్జన్యాల నుంచి భారత ప్రజల్ని విముక్తి చేయడం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
    1) గజేంద్ర గడ్కర్ 2) బి.ఆర్. అంబేడ్కర్
    3) బి.ఎన్. రావు 4) కె.సి. వేర్
38. కింది వాటిలో హెబియస్ కార్పస్ రిట్‌కు సంబంధించి సరికానిది ఏది?
    1) ఇది అత్యంత పురాతనమైన రిట్
    2) ఈ రిట్‌ను 1679లో ఇంగ్లండ్ గుర్తించింది
    3)'యు మే హావ్ ది బాడీ' అని అర్థాన్నిస్తుంది
    4) నివారక నిర్బంధం కింద అరెస్ట్ అయితే రక్షణ కల్పిస్తుంది
39. బలవంతపు మతమార్పిడిలను నిషేధిస్తూ చట్టం చేసిన తొలి రాష్ట్రం?
    1) ఒడిశా 2) మధ్యప్రదేశ్
    3) తమిళనాడు 4) కేరళ
40. రాజ్యానికి అధికార మతం ఉండరాదని సుప్రీం కోర్టు ఏ కేసులో తీర్పు ఇచ్చింది?
    1) ఎస్.ఆర్. బొమ్మై కేసు (1994)
    2) బాల్‌పాటిల్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (2005)
    3) డి.ఎస్.నకారా వర్సెస్ కేంద్రప్రభుత్వం(1982)
    4) కేశవానంద భారతి కేసు(1973)
41. కింది వాటిలో ఉమ్మడి జాబితాలో లేని అంశం ఏది?
    1) జనాభా నియంత్రణ 2) వార్తాపత్రికలు
    3) కార్మిక సంక్షేమం 4) ప్రజారోగ్యం
42. హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపులో రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని తీసుకోవాలని ఏ కమిటీ సిఫార్సు చేసింది?
    1) రాజమన్నార్ కమిటీ
    2) సర్కారియా కమిషన్
    3) పూంఛీ కమిషన్ 4) ఏదీ కాదు
43. యూపీఎస్సీ చైర్మన్, సభ్యుల పదవీకాలం ఎంత?
    1) ఐదేళ్లు లేదా అరవై ఐదేళ్లు (ఏది ముందైతే అది)
    2) ఆరేళ్లు లేదా అరవై ఐదేళ్లు (ఏది ముందైతే అది)
    3) ఆరేళ్లు 4) ఐదేళ్లు
44. యూపీఎస్సీ సభ్యుల సంఖ్యను ఎవరు నిర్ణయిస్తారు?
    1) పార్లమెంటు 2) రాష్ట్రపతి
    3) కేబినెట్ 4) ప్రధానమంత్రి
45. జాయింట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏ విధంగా ఏర్పడుతుంది?
    1) పార్లమెంటు చట్టం ద్వారా
    2) భారత రాష్ట్రపతి నిర్ణయం మేరకు
    3) కేబినెట్ నిర్ణయం మేరకు
    4) యూపీఎస్సీ నిర్ణయం మేరకు
46. 'అభిశంసన తీర్మానానికి' సంబంధించి సరికాని అంశాన్ని గుర్తించండి.
    1) అభిశంసనకు కారణం చెప్పాలి
    2) మంత్రి మీద కానీ, మంత్రుల మీద కాని పెట్టవచ్చు
    3) ఆమోదిస్తే మంత్రి మండలి రాజీనామా చేయాలి
    4) విధానాలను విమర్శించడం దీని ఉద్దేశం
47. 'కార్పెట్ క్రాసింగ్ ' అంటే ఏమిటి?
    1) ప్రతిపక్షం నుంచి అధికారపక్షంలోకి మారడం
    2) అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి మారడం
    3) ఒక రాజకీయ పార్టీ నుంచి మరో పార్టీలోకి మారడం
    4) ఏదీకాదు
48. కేబినెట్ లిఖిత పూర్వక ఉత్తర్వుల మేరకు మాత్రమే విధించవలసిన అత్యవసర పరిస్థితి ఏమిటి?
    1) జాతీయ అత్యవసర పరిస్థితి
    2) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి
    3) ఆర్థిక అత్యవసర పరిస్థితి
    4) సైనిక అత్యవసర పరిస్థితి
49. ఉపరాష్ట్రపతి పదవికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) 35 ఏళ్లు నిండి ఉండాలి
    2) పార్లమెంటుకు ఎన్నికవరాదు
    3) రాజ్యసభకు ఎన్నిక కావడానికి అర్హతలు ఉండాలి
    4) భారతీయ పౌరుడై ఉండాలి
50. కింది వారిలో ఉపరాష్ట్రపతి కాకుండా నేరుగా రాష్ట్రపతి అయినవారు ఎవరు?
    1) రాజేంద్ర ప్రసాద్
    2) అబ్దుల్ కలాం
    3) నీలం సంజీవరెడ్డి
    4) పై వారందరూ

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 1	5) 2
6) 4	7) 2	8) 2	9) 3	10) 1
11) 1	12) 1	13) 4	14) 2	15) 2
16) 3	17) 3	18) 2	19) 1	20) 2
21) 2	22) 1	23) 1	24) 3	25) 2
26) 2	27) 3	28) 1	29) 2	30) 4
31) 2	32) 1	33) 4	34) 2	35) 1
36) 3	37) 1	38) 4	39) 1	40) 2
41) 4	42) 1	43) 2	44) 2	45) 1
46) 3	47) 2	48) 1	49) 2	50) 4

How many even numbers are there?



Bank Exams

Reasoning

Model Questions

Directions: (Q.No.1-5) Study the following information carefully and answer the questions given below.

8 persons Amit, Prasad, Suman, Firoz, Gopi, Seenu, Magbul and Khaleel have different weights and different heights

Amit is taller than 2 persons and heavier than 4 persons. Suman is heavier than Amit but not heaviest. Number of persons heavier than Suman is same as the number of persons shorter than Suman. Prasad is not the tallest. Three persons are taller than Firoz but shorter than Prasad. Number of persons taller than Khaleel is same as the number of persons heavier than Khaleel and at least one person is taller than Khaleel. Number of persons shorter than Magbul is same as the number of persons lighter than Magbul and at least one person is lighter than Magbul. Khaleel is taller than Amit but not heavier than Amit. The lightest person is tallest. Gopi is lighter than Seenu, who is heavier than Firoz. Seenu is not heaviest

1. Who is the heaviest person?
   a) Amit b) Prasad c) Firoz
   d) Seenu e) Suman
2. Gopi is _____.
   a) Tallest b) Lightest
   c) Heaviest
   d) Both option (a) and option (b)
   e) Both option (b) and option (c)
3. How many people are there who are taller than Amit and also lighter in weight than Magbul?
   a) 2 b) 3 c) 4
   d) 5 e) More than 5
4. Who among the followings is/are heavier as well as shorter than Khaleel?
   a) Amit b) Firoz c) Suman
   d) Both option (a) and option (c)
   e) More than persons mentioned above
5. Amit is ______.
   a) 3rd tallest and 5th heaviest
   b) 6th tallest and 4th heaviest
   c) Heavier than at - least 6 persons
   d) Lighter than 6 persons
   e) None of these

Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.

L1, L2, L3, L4, L5, L6, L7, L8, L9, L10, L11 and L12 were seated around a square table facing the centre. There were 2 persons along each side and one person on each of the corner.

L7 was 2nd to the left of L12 who was seated at one of the sides. L6 was next to L12 and was seated opposite to L11. L11 was 2nd to the left of L2 who faced L10. L8 was to the immediate left of L5 who faced L4's neighbor. L1 was 2nd to the left of L9. L9 and L12 were seated at a gap of 3 persons. L3 was not next to L1.

6. Four of the following bear a similar relationship and hence form a group, who among the following is not a part of that group?
   a) L3 b) L8 c) L7
   d) L11 e) L6
7. What was the position of L3 with respect to L6?
   a) Immediate right
   b) Immediate left c) Opposite
   d) Second to the right
   e) Second to the left
8. Who among the following was seated opposite to L8?
   a) L9 b) L4 c) L7 d) L1
   e) Cannot be determined
9. In which of the following groups was the 1st person seated next to the 2nd and 3rd persons?
   a) L11, L1, L5 b) L5, L8, L1
   c) L8, L10, L3 d) L4, L12, L3
   e) L2, L4, L7
10. ____ was 2nd to the right of ____
    a) L2, L4 b) L9, L2
    c) L8, L10 d) L6, L1
    e) L5, L6

Directions (Q.No.11-15): In the following question assuming the given statements to be true, find which of the conclusion among given conclusions is/are definitely true and then give your answer accordingly.

11. *Statements:*
    $A > D = B; C \geq B > M;$
    $L = N; M > N > O$
    Conclusions:
    I. $D > C$ II. $D > M$
    III. $B > L$ IV. $A \geq C$
    a) Only III is true.
    b) Only I is true.
    c) Only II and III are true.
    d) Only I and III are true.
    e) Only IV is true.
12. *Statements:*
    $C < P > M; O \leq L < B;$
    $A = C; B < D \leq N$
    Conclusions:
    I. $D > M$ II. $O < D$
    III. $C > M$ IV. $O = C$
    a) Only II is true.
    b) Only IV is true c) All are true
    d) I, III and IV are true
    e) None is true
13. *Statements:*
    $J > I \geq O > L; I < S < J \leq T;$
    $K = O; L > N < M$
    Conclusions:
    I. $S < M$ II. $I \leq K$
    III. $M > L$ IV. $T < J$
    a) Only III is true
    b) Only IV is true
    c) Only I and IV are true
    d) None is true e) Only I is true
14. *Statements:*
    $E < H = I > P; P > E > D;$
    $E < K < H; G \geq I$
    Conclusions:
    I. $K > P$ II. $E < P$
    III. $D \leq P$ IV. $G > H$
    a) II, III, IV are true
    b) I, II, III are true
    c) Only II is true d) All are true
    e) Only III is true
15. *Statements:*
    $H < A \leq D = G; B < F < C;$
    $C = A; G > E > C$
    Conclusions:
    I. $A \geq F$ II. $A \leq E$
    III. $H < C$ IV. $B < D$
    a) Only III and IV are true.
    b) Only I and II are true.
    c) All are true.
    d) II, III, and IV are true.
    e) None is true.

Directions (Q.No.16-20): Study the following series of sets of numbers. Carefully answer the question given below.

5340, 2468, 8369, 9622, 5370, 7494

16. If in each number second and fourth digits are interchanged, then how many even numbers are there?
    a) 2 b) 3 c) 4 d) 5 e) 1
17. If the digits in each number are arranged in descending order, which of the following will be the lowest?
    a) 8642 b) 9863 c) 9622
    d) 7530 e) 5340
18. What will be the number obtained if third digit of the smallest number is multiplied with second digit of the largest number?
    a) 20 b) 21 c) 14
    d) 36 e) None of these.
19. If in the above set of numbers 1 is added to the second digit and 2 is subtracted from first digit, then which number will be third if arranged in descending order?
    a) 5340 b) 9622 c) 2468
    d) 7494 e) None of these.
20. If 525 is subtracted from each number, then what is the multiplication of 1st digit of the lowest and last digit of the largest number?
    a) 7 b) 6 c) 5
    d) 2 e) None of these

Directions (Q.No.21-23): Study the following information carefully and answer the questions given below:

In a certain code 'SMART LOGIC' is written as '0252 3052', 'BASE MATERIAL IS AVAILABLE' is written as '5061 9140 5018 2146', 'ALMOST ALL QUESTIONS' is written as '2190 0263 9118' and 'PEOPLE ARE EATING MONEY' is written as '5063 5090 7063 5252'.

21. Which of the following is the code for 'MATERIAL'?
    a) 2146 b) 5061 c) 2140
    d) 2118 e) None of these
22. Which of the following can be coded as '5252'?
    a) PEOPLE b) ARE
    c) EATING d) MONEY
    e) None of these
23. Which of the following is the code for 'basic good enough'?
    a) 3052 4061 8063
    b) 0316 0425 0836
    c) 0352 0466 0864
    d) 0425 0516 0836
    e) None of these

Key with Solutions


(1-5):

Height:
Gopi > Seenu > Magbul > Prasad > Khaleel > Amit > Suman > Firoz

Weight:
Prasad > Suman > Magbul > Amit > Khaleel > Seenu > Firoz > Gopi

1) b; 2) d; 3) d
4) d; 5) b

(6-10):



6) a; 7) d 8) c;
9) b 10) c

11) c;
(I) $D = B \leq C$ (×)
(II) $D = B > M$ (✔)
(III) $B > M > N = L$ (✔)
(IV) $A > D = B \leq C$ (×)

12) a;
(I) No relation
(II) $O \leq L < B < D$ (✔)
(III) $C < P > M$ (×)
(IV) No relation

13) d;
(I) $S < J > I \geq O > L > N < M$ (×)
(II) $I \geq O = K$ (×)
(III) $L > N < M$ (×)
(IV) $J \leq T$ (×)

14) c;
(I) $P > E < K$ (×)
(II) $P > E$ (✔)
(III) $P > E > D$ (×)
(IV) $G \geq I = H$ (×)

15) a;
(I) $F < C = A$ (×)
(II) $E > C = A$ (×)
(III) $H < A = C$ (✔)
(IV) $B < F < C = A \leq D$ (✔)

16) b;
5340, 2468, 8369, 9622, 5370, 7494
5043, **2864**, 8963, **9226**, 5073, **7494**

17) e;
5340, 2468, 8369, 9622, 5370, 7494
5430, 8642, 9863, 9622, 7530, 9744

18) d;
5340, 2468, 8369, 9622, 5370, 7494
$\Rightarrow 6 \times 6 = 36$

19) d;
5340, 2468, 8369, 9622, 5370, 7494
3440, 0568, 6469, 7722, 3470, **5594**

20) a;
5340 - 525, 2468- 525, 8369- 525, 9622- 525, 5370- 525, 7494 - 525
4815, 1968, 7844, 9097, 4845, 6969
$\Rightarrow 1 \times 7 = 7$

(21-23)
In the code there are four digits in which the first two indicates the numerical value of the last letter of the given word and last two digits indicate the square of the number of letters in the given word.
Ex: SMART
Last letter T = 20 ⇒ 02
Number of letters $5 \Rightarrow 5^2 = 25 \Rightarrow$ 52, so the code is 0252.
21) a; 22) d; 23) a